


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 16
సంచిక: 304

బుధవారం 17-7-2024


SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ఒలింపిక్ పతకాల వేటలో..
క్రీడాకారులకు రూ.470 కోట్లు ఖర్చు చేసిన భారత ప్రభుత్వం - 12లో




ఆంధ్రా టు పారిస్
ఒలింపిక్స్‌కు ఆంధ్రప్రదేశ్ నుంచి ఏడుగురు క్రీడాకారులు - 14లో



ఐరాసలో మోదీ ప్రసంగం
సెప్టెంబర్‌లో జరిగే ఐరాస 79వ సర్వ ప్రతినిధి సభ అత్యున్నత స్థాయి సమావేశంలో ప్రధాని మోదీ ప్రసంగించనున్నారు.
వివరాలు 6లో ▸



రత్న భండార్‌ను రేపు తెరుస్తాం
పూరీ జగన్నాథుని ఆలయానికి చెందిన రత్న భండార్‌ను గురువారం మళ్లీ తెరిచి.. సంపదను ట్రెజరీకి తరలించనున్నారు.
వివరాలు 6లో ▸



సుప్రీంకోర్టులోకి ఇద్దరు జడ్జీలు
సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా జస్టిస్ నాంగ్మేకపామ్ కొటీశ్వర్ సింగ్, జస్టిస్ ఆర్.మహదేవన్‌లు నియమితులయ్యారు.
వివరాలు 6లో ▸



కవితకు అస్వస్థత
ఢిల్లీ మద్యం కేసులో తీహార్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అస్వస్థతకు గురవ్వడంతో అధికారులు ఆస్పత్రికి తరలించారు.
వివరాలు 10లో ▸

'గ్యారెంటీ' అప్పు రూ.5,200 కోట్లు

పౌరసరఫరాల సంస్థ, మార్క్‌ఫెడ్ ద్వారా రుణాలకు కూటమి సర్కారు హామీ

ధాన్యం బకాయిలతోపాటు ఖరీఫ్‌లో సేకరణ కోసమే ఈ అప్పులని ప్రకటన

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్, ఇసుక, గనుల విధానాలు రద్దు.. మెరుగైన పంటల బీమాపై ముగ్గురు మంత్రులతో కమిటీ

'ఉచిత' ఇసుకపై జారీ చేసిన జీవో–43కి ఆమోదం.. 22 నుంచి ఐదు రోజుల పాటు అసెంబ్లీ సమావేశాల నిర్వహణ



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ గ్యారెంటీతో రూ.5,200 కోట్ల రుణం పొందేందుకు పౌరసరఫరాల సంస్థ, ఏపీ మార్క్‌ఫెడ్‌లకు అనుమతినిస్తూ మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. రైతుల మేలు కోసమే అప్పులు చేయాల్సి వస్తోందని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. గత రబీలో ధాన్యం కొనుగోలు బకాయిల చెల్లింపులతో పాటు 2024–25 సీజన్‌లో
మిగతా 2వ పేజీలో ▶

మంగళవారం అప్పుల బాంబు

- మరో రూ.2,000 కోట్లు అప్పు చేసిన కూటమి సర్కారు
- సెక్యూరిటీల వేలం ద్వారా రుణ సమీకరణ
- 22 రోజులు.. మూడు మంగళవారాల్లో రూ.9,000 కోట్ల అప్పుల మంట
- నాడు గుండెలు బాదుకుని నేడు కిక్కురుమనని ఎల్లో మీడియా

2 లో


రిపబ్లిక్ పార్టీ కన్వెన్షన్‌లో భర్త జేడీ వాన్స్‌తో ఉషా చిలుకూరి

ట్రంప్ ఉపాధ్యక్ష అభ్యర్థి ఉషా'పతి'

ఆంధ్రా అమ్మాయి ఉషా చిలుకూరిని పెళ్లి చేసుకున్న జేమ్స్ డేవిడ్ వాన్స్

దశాబ్దాల కిందటే యూఎస్‌లో స్థిరపడ్డ ఉష తల్లిదండ్రులు 2 లో

నాటి విమర్శకుడే.. నేటి వీరాభిమాని

ట్రంప్ రన్నింగ్ మేట్ వాన్స్‌ది ఆసక్తికర ప్రస్థానం

నిరుపేద కుటుంబ నేపథ్యం నుంచి ఎదిగిన వైనం 6 లో



ఆడబిడ్డలపై ఆగని అఘాయిత్యాలు

గుంటూరు జిల్లాలో ఒకే రోజు రెండు ఘటనలు

- ప్రత్తిపాడు మండలంలో దళిత విద్యార్థినిపై ఆటో డ్రైవర్ లైంగికదాడి
- ఫిరంగిపురం మండలంలో యువకుడి వేధింపులు తాళలేక బాలిక ఆత్మహత్య
- విశాఖ హోటల్‌లో బంధించి ఏలూరుకు చెందిన దళిత బాలికపై లైంగిక దాడి

- వివరాలు 5లో

5 రోజులు వానలే


రెండు రోజులు కోస్తాకు భారీ వర్ష సూచన

ఒడిశాలో అల్పపీడనంతో ఉత్తరాంధ్రలో వర్షాలు 2 లో

19న బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే చాన్స్

అల్పపీడనం ఏర్పడితే భారీ వర్షాలే

కశ్మీర్‌లో ఉగ్రకాల్పులు.. నలుగురు సైనికుల వీరమరణం

మృతుల్లో ఒక కెప్టెన్

ఏపీలోని శ్రీకాకుళానికి చెందిన నాయక్ డి.రాజేశ్ కూడా..

రక్షణ మంత్రి, ఆర్మీ సంతాపం 6 లో


రాజేశ్

విశాఖపట్నం జిల్లా భీమిలి వద్ద ఉన్న భౌగోళిక వారసత్వ సంపదైన ఎర్రమట్టి దిబ్బలను తవ్వేసి లారీల్లో తరలిస్తున్న టీడీపీ నేతలు





మట్టి దిబ్బలు మటాష్!

విశాఖ జిల్లాలో ఎల్లోగ్యాంగ్ బరితెగింపు

భౌగోళిక వారసత్వ సంపదైన ఎర్రమట్టి దిబ్బలపై 'పచ్చ' గద్దలు

యథేచ్ఛగా ఎర్రమట్టి తవ్వకాలు.. నాడు తప్పు నేడు ఒప్పైంది!

- గత ప్రభుత్వం అక్కడ లేఅవుట్ల అభివృద్ధి చేస్తోందంటూ నానా యాగీ
- జియో హెరిటేజ్ సైట్‌గా గుర్తింపు పొందిన వాటిని నాశనం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ సర్కారుపై పవన్, చంద్రబాబు ఆరోపణలు
- అధికారంలోకి వస్తే వాటిని కాపాడతామంటూ ప్రగల్భాలు
- వాస్తవానికి.. బఫర్ జోన్ ఏర్పాటుచేసి పనులు చేపట్టిన వైఎస్సార్‌సీపీ సర్కార్
- అధికారంలోకి రాగానే అడ్డగోలుగా మట్టి తవ్వకాలు చేపడుతున్న టీడీపీ–జనసేన
- నాడు గగ్గోలు పెట్టి నేడు నోరు మెదపని పర్యావరణ శాఖ మంత్రి పవన్

3 లో

తమ్ముళ్లే ఇసుకాసురులై..!

స్టాక్ యార్డుల్లో టీడీపీ శ్రేణులదే పెత్తనం

ఒకే బిల్లుపై రెండు, మూడు ట్రిప్పులు.. తెలంగాణకు భారీగా ఇసుక తరలింపు

యార్డుల్లో పనిచేసే సిబ్బందికి బెదిరింపులు.. పట్టనట్టు వ్యవహరిస్తున్న అధికారులు 10 లో


ఎన్టీఆర్ జిల్లా హనుమంచపల్లి వద్ద ఇసుక కోసం బారులు తీరిన ట్రాక్టర్లు

ఇంతంజేసుకో (cartoon)



కేసు మెరిట్స్‌లోకి ఎలా వెళ్తారు?

ఇది విచారణ కమిషన్.. న్యాయం జరిగేలా చూడాలి

- విచారణ పూర్తి కాకుండా అలా చేస్తే ఓ వ్యక్తి ఇమేజ్ దెబ్బ తింటుంది
- విద్యుత్ కమిషన్ చైర్మన్ వ్యవహారంపై చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్
- చైర్మన్‌ను మార్చాలని తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశం
- కమిషన్‌లో మరో న్యాయమూర్తిని నియమించేందుకు అవకాశం ఇచ్చిన కోర్టు
- చైర్మన్ మార్పు కోసం సోమవారం పేర్లు ఇస్తామన్న తెలంగాణ సర్కారు
- చైర్మన్ బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్టు జస్టిస్ నరసింహారెడ్డి సుప్రీంకోర్టుకు లేఖ



సాక్షి, న్యూఢిల్లీ: ''మాజీ సీఎం ఎలాంటి సమాధానం ఇవ్వకుండానే.. కమిషన్ చైర్మన్ మీడియా సమావేశం నిర్వహించడం, కేసు మెరిట్స్‌లోకి వెళ్లడం సబబు కాదు.. నోటీసుల జారీ వరకే చైర్మన్ ప్రెస్‌మీట్ పెట్టి ఉంటే ఓకే. కేసు మెరిట్స్‌పై వ్యాఖ్యలు చేయకుంటే మేం జోక్యం చేసుకునే వాళ్లమే కాదు. కానీ జరిగింది వేరు. ఇది ఓ వ్యక్తి రెప్యుటేషన్‌పై ప్రభావం చూపుతుంది. మేం ప్రభుత్వానికి ఓ అవకాశం ఇస్తున్నాం. కమిషన్‌లో
మిగతా 14వ పేజీలో ▶



పవన్ శాఖలో చీలికలుపీలికలు ఎందుకో!

- గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో ఉండే సెర్ప్ 'కొండపల్లి'కి కేటాయింపు
- నిధులు కూడా సెర్ప్‌కే ఎక్కువ ఉండే అవకాశం
- దీనిద్వారానే పింఛన్ల పంపిణీ, పొదుపు సంఘాల సంక్షేమం
- ఇంతటి కీలక విభాగాన్ని పవన్ శాఖల నుంచి వేరు చేయడంపై జనసేనలో చర్చ
- 2 శాఖలకు ముఖ్య కార్యదర్శి ఒక్కరే
- పట్టణాభివృద్ధి శాఖ పరిధిలోనే మెప్మా.. రెండూ నారాయణకే

10 లో

హెల్త్‌డెస్క్

కేరళలో బ్రెయిన్ ఈటింగ్ అమీబా కారణంగా ఇటీవల ముగ్గురు చిన్నారులు మృతి చెందారు. ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించడంతో పాటు అన్ని రాష్ట్రాలనూ అప్రమత్తం చేసింది. తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ఈ తరహా అమీబా ఆనవాళ్లు లేకపోయినా వైద్య ఆరోగ్య శాఖలు అప్రమత్తం కావాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కలుషితమైన చెరువులు, నీటివనరులతో పాటు సరైన నిర్వహణ లేని స్విమ్మింగ్ పూల్‌లలో చిన్నారులు ఈదడం వల్ల ఈ తరహా అమీబా వ్యాపించే అవకాశం ఉంది. చిన్నారుల్లో రోగ నిరోధకత తక్కువ కాబట్టి వారిపై ఇది ఎక్కువగా ప్రభావం చూపిస్తుంది.

ముక్కు రంధ్రాల్లోంచి మెదడుకు..

నెగ్లేరియా ఫౌలేరీ అని పిలిచే ఈ అమీబా ప్రపంచవ్యాప్తంగా లోతు తక్కువ ఉండే చెరువులు, సరస్సులు, కాల్వలతో పాటు పంటపొలాలు, నేలల్లోనూ నివసిస్తుంది. బాగా వేడిగా ఉండే నీటి బుగ్గల్లో (హాట్ స్ప్రింగ్స్) కూడా ఇది మనుగడ సాగించగలుగుతుంది. ఇది మెదడులో 'ప్రైమరీ అమీబిక్ మెనింగో ఎన్‌కెఫలైటిస్ – (పామ్)' అనే తీవ్రమైన ఇన్ఫెక్షన్‌ను కలుగజేస్తుంది. (ఈ కారణంగానే దీనిని బ్రెయిన్ ఈటింగ్ అమీబాగా పేర్కొంటున్నారు) నాడీ వ్యవస్థను దెబ్బతీయడం వల్ల మరణించే అవకాశమూ ఉంది. చిన్నారులు చెరువులు, ఈత కొలనుల్లాంటి వాటిల్లో ఈదుతున్నప్పుడు ఈ అమీబా వాళ్ల ముక్కు రంధ్రాల్లోంచి మెదడుకు చేరి 'పామ్'ఇన్ఫెక్షన్‌కు కారణమవుతుంది.

లక్షణాలు
- తీవ్రమైన జ్వరం
- తీవ్రమైన తలనొప్పి
- వికారం, వాంతులు
- వణుకు
- అయోమయం
- మెదడువాపులో కనిపించే అన్ని లక్షణాలతో పాటు మెడ కదలించలేకపోవడం (స్టిఫ్ నెక్), వెలుతురు చూడలేకపోవడం.

చివరగా కోమాలోకి వెళ్లే ప్రమాదం



జాగ్రత్త సుమా!

నిర్ధారణ
- లంబార్ పంక్చర్ ప్రక్రియ ద్వారా వెన్నుపాము చివరి భాగం నుంచి నీరు (సెరిబ్రో స్పైనల్ ఫ్లూయిడ్) తీసి పరీక్షించాల్సి ఉంటుంది.
- కొన్నిసార్లు మెదడు బయాప్సీ నిర్వహించి అక్కడ అమీబా ఉనికిని గుర్తించాల్సి ఉంటుంది.

నివారణ
- కలుషిత నీటితో కూడిన చెరువులు, కాల్వలు, సరస్సుల వంటి వాటిల్లోకి పిల్లలు వెళ్లకుండా చూసుకోవాలి. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండే పిల్లల విషయంలో ఇది మరీ ప్రమాదం.
- నగరాల్లోని స్విమ్మింగ్ పూల్స్‌లో వాటి నిర్వహణ సరిగా (క్లోరినేషన్ చేయడం, పరిశుభ్రమైన నీటినే వాడటం) ఉందా లేదా? అనే విషయాలను పరిశీలించాకే పిల్లలను పంపాలి.
- కొందరు యోగా నిపుణులు ఓ కొమ్ము చెంబు నుంచి నేరుగా ముక్కు రంధ్రం ద్వారా నీటిని బయటకు ప్రవించేలా చేసే 'నేతి' ప్రక్రియ చేయిస్తుంటారు. అయితే మామూలు నల్లా / కొళాయి నీళ్లతో చేసేవారు బాగా మరగబెట్టి చల్లార్చిన నీటితోనే దీన్ని చేయాలి. కలుషితమైన నీళ్లతో చేస్తే పెద్దవారిలోనూ బ్రెయిన్ ఈటింగ్ అమీబా తాలూకు 'పామ్'ఇన్ఫెక్షన్ సోకే ప్రమాదం ఉంది.

ఎంత వేగంగా చికిత్స చేస్తే అంత మేలు

దీనికి నిర్దిష్ట చికిత్స అంటూ ఏదీ లేదు. కరోనా కేసుల్లో మెదడుకు బ్లాక్ ఫంగస్ వచ్చినప్పుడు ఉపయోగించిన యాంఫోటెరిసిన్‌–బి వంటి మందులతో పాటు రిఫాపిన్, ఫ్లుకోనాజోల్, మిల్టెఫొసైన్ వంటి మందులను ఉపయోగిస్తారు. (మిల్టెఫొసైన్‌ను.. శాండ్‌ఫ్లై అనే కీటకాల్లో ఉంటూ లీష్మానియాసిస్ అనే వ్యాధిని కలిగించే పరాన్నజీవి సంబంధిత ఇన్ఫెక్షన్‌కు ఉపయోగించడానికి 'ఎఫ్‌డీఏ'అనుమతించింది). త్వరగా వ్యాధిని గుర్తించి చికిత్స అందిస్తే అంత మేలు. చిన్నారులకు చల్లటి నీళ్లతో (మరీ చల్లటివి కాదు) స్పాంజింగ్ చేస్తూ జ్వరం తగ్గేలా చేయడం వల్ల వేగంగా కోలుకుంటారు.



డా. విజయ్, న్యూరాలజిస్ట్, కిమ్స్ ఐకాన్, వైజాగ్

కేరళలో ముగ్గురు చిన్నారుల మృతితో సంచలనం..
అన్ని రాష్ట్రాలూ అప్రమత్తం
తెలుగు రాష్ట్రాల్లో లేని 'నెగ్లేరియా ఫౌలేరీ' ఆనవాళ్లు

కలుషిత చెరువులు, సరైన నిర్వహణ లేని స్విమ్మింగ్ పూల్‌ల వల్ల వ్యాపించే చాన్స్..
జాగ్రత్త అవసరమంటున్న వైద్య నిపుణులు

మొహర్రం..త్యాగానికి, ధర్మ పరిరక్షణకు ప్రతీక

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్

సాక్షి,అమరావతి: ముస్లిం సోదరులు పాటించే మొహర్రం..త్యాగానికి, ధర్మ పరిరక్షణకు ప్రతీక అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మహ్మద్ ప్రవక్త మనవడు హజ్రత్ ఇమామ్ హుస్సేన్ బలిదానానికి మొహర్రం ప్రతీక అని పేర్కొన్నారు. ఇస్లామిక్ కేలండర్‌లో మొదటి నెల కూడా మొహర్రం అని చెప్పారు. ఈ పవిత్ర సంతాప దినాలు రాష్ట్రంలో మత సామరస్యానికి, సమైక్యతకు ప్రతిబింబంలా నిలుస్తాయని తన సందేశంలో వైఎస్ జగన్ పేర్కొన్నారు.

సైనికుల కుటుంబాలను ఆదుకోవాలి

ప్రభుత్వానికి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ విజ్ఞప్తి

సాక్షి,అమరావతి: జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రవాదులు, భద్రతా బలగాలకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో వీర మరణం పొందిన సైనికుల కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ కోరారు. జమ్మూ కశ్మీర్‌లో జరిగిన ఎదురుకాల్పుల్లో సైనికులు ప్రాణాలు కోల్పోవడంపై ఆయన దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఇద్దరు సైనికులు వీరమరణం పొందడంపై తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గానికి చెందిన సనపల జగదీశ్వరరావు, డొక్కరి రాజేష్ కుటుంబాలకు తన సంతాపాన్ని తెలిపారు. దేశ రక్షణలో వీరి సేవలు చిరస్మరణీయమని, వారి త్యాగాలు మరువలేనివని అన్నారు.

మంగళవారం అప్పుల బాంబు

- మరో రూ.2,000 కోట్లు అప్పు చేసిన కూటమి సర్కారు
- సెక్యూరిటీల వేలం ద్వారా రుణ సమీకరణ
- 22 రోజులు.. మూడు మంగళవారాల్లో రూ.9,000 కోట్ల అప్పుల మంట
- నాడు గుండెలు బాదుకుని నేడు కిక్కురుమనని ఎల్లో మీడియా

22 రోజుల వ్యవధిలో కూటమి ప్రభుత్వం అప్పులు ఇలా (రూ.కోట్లలో)

తేదీ	అప్పు
25-06-2024 (మంగళవారం)	2,000
02-07-2024 (మంగళవారం)	5,000
16-07-2024 (మంగళవారం)	2,000

సాక్షి, అమరావతి: సీఎం చంద్రబాబు మంగళవారాల అప్పుల ముఖ్యమంత్రిగా మారిపోయారు! కేవలం 22 రోజుల వ్యవధిలో మూడు మంగళవారాల్లో ఏకంగా రూ.9,000 కోట్లు అప్పు చేశారు. గతంలో వైఎస్ జగన్ ప్రభుత్వం మంగళవారం అప్పులు చేస్తోందంటూ ఎల్లో మీడియాతో పాటు చంద్రబాబు బృందం పదేపదే ఆరోపణలు చేయడంతోపాటు రాష్ట్రాన్ని శ్రీలంకలా మారుస్తున్నారంటూ బురద చల్లేందుకు ప్రయత్నించాయి. గత సర్కారు పరిమితికి లోబడి నిబంధనల ప్రకారం కేంద్ర ప్రభుత్వ అనుమతితో ఆచితూచి అప్పులు చేసినా మహా ఘోరం చేసినట్లు చిత్రీకరించాయి. ఇప్పుడు చంద్రబాబు మంగళవారాన్ని అప్పుల వారంగా మార్చుకున్నా కిక్కురుమనకపోవడం గమనార్హం. తాజాగా ఈ నెల 16న మంగళవారం నాడు రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీల వేలం ద్వారా చంద్రబాబు ప్రభుత్వానికి ఆర్‌బీఐ రూ.2,000 కోట్ల రుణాన్ని సమీకరించింది. 16 ఏళ్ల కాల వ్యవధితో రూ.1,000 కోట్లు, 19 ఏళ్ల కాల వ్యవధితో మరో రూ.1000 కోట్లు చొప్పున 7.33 శాతం వడ్డీకి రాష్ట్ర ప్రభుత్వం అప్పు చేసింది. దీంతో ఇప్పటి వరకు కూటమి ప్రభుత్వం చేసిన అప్పులు రూ.9,000 కోట్లకు చేరుకున్నాయి. ఇదంతా ఎల్లో మీడియాకు సంపద సృష్టిలా కనిపిస్తోందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 22 రోజుల్లో రూ.9,000 కోట్ల అప్పుల భారం మోపిన కూటమి సర్కారు అదంతా ఏ దేనికి వ్యయం చేసిందో చెబితే బాగుంటుందని పరిశీలకులు సూచిస్తున్నారు. జగన్ ప్రభుత్వం అప్పులు చేయడాన్ని తప్పుబట్టిన ఎల్లో మీడియా ఇప్పుడు బాబు సర్కారు అప్పులపై ఎందుకు నోరు మెదపడం లేదో ప్రజలు గమనిస్తున్నారని ఓ అధికారి అన్నారు.

బడ్జెట్ బయట గ్యారెంటీ అప్పు రూ.5,200 కోట్లు

రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లకు పౌరసరఫరాల శాఖతో పాటు మార్క్‌ఫెడ్‌లు బ్యాంకుల నుంచి తీసుకునే అప్పులకు గతంలో వైఎస్ జగన్ ప్రభుత్వం గ్యారెంటీ ఇవ్వడంపై ఎల్లో మీడియాతో పాటు టీడీపీ నేతలు రభస చేశారు. తాజాగా సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో పౌరసరఫరాల సంస్థ, మార్క్‌ఫెడ్‌లు బ్యాంకుల నుంచి చేసే రూ.5,200 కోట్ల అప్పులకు ప్రభుత్వ గ్యారెంటీ ఇస్తూ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. నాడు తప్పులుగా తోచినవన్నీ నేడు ఒప్పులుగా కనిపిస్తున్నాయా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రభుత్వ గ్యారెంటీలు ఇచ్చి బడ్జెట్ బయట అప్పులు తేవడాన్ని, ఆర్థిక సంస్థల నుంచి ప్రభుత్వ గ్యారెంటీలతో రుణాలు తీసుకోవడం ప్రారంభించిందీ గతంలో చంద్రబాబు అధికారంలో ఉండగానే అనే విషయం గుర్తుంచుకోవాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.

5 రోజులు వానలే



సాక్షి, అమరావతి/విశాఖపట్నం: దక్షిణ ఒడిశా ప్రాంతంలో ఏర్పడిన అల్పపీడనం దక్షిణ ఛత్తీస్‌గఢ్ వైపుగా కదులుతోంది. దీనికి అనుబంధంగా ఉన్న ఉపరితల ఆవర్తనం సముద్ర మట్టానికి 5.8 కి.మీ. ఎత్తు వరకూ విస్తరించి ఉంది. మరోవైపు రుతుపవన ద్రోణి విదర్భ, గోపాల్‌పూర్ మీదుగా ఆగ్నేయ దిశగా మధ్య బంగాళాఖాతం వరకూ విస్తరించి ఉంది. వీటి ప్రభావంతో బుధ, గురువారాల్లో ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని పేర్కొన్నారు. తీరం వెంబడి గంటకు 30 నుంచి 40 కి.మీ. వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని.. మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాగా.. మరో అల్పపీడనం ఆగ్నేయ మధ్య బంగాళాఖాతం వరకు సగటు సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉంది.

19న మరో అల్పపీడనం!

ఈ నెల 19 నాటికి వాయువ్య బంగాళాఖాతంలో ఇంకో అల్పపీడనం ఏర్పడే అవకాశం కనిపిస్తోంది. ఇది ఏర్పడితే రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. అనేకచోట్ల తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు, కొన్నిచోట్ల ఉరుములతో కూడిన జల్లులు పడతాయని పేర్కొంది. పలు ప్రాంతాల్లో భారీ వర్షాలకు అవకాశం ఉందని తెలిపింది. విజయనగరం జిల్లా మెరకముడిదంలో మంగళవారం మధ్యాహ్నం 3.30 సెంటీమీటర్ల వర్షం కురిసింది. గజపతినగరం మండలం ముచ్చర్లలో 2.8 సెం.మీ., అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లిలో 2.6 సెం.మీ. వర్షం పడింది. సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు కృష్ణా జిల్లా నాగాయలంక మండలం భావదేవరపల్లిలో 6.8 సెం.మీ. వర్షం కురిసింది. అదే జిల్లా కృత్తివెన్ను మండల కేంద్రంలో 6.6, నంద్యాల జిల్లా ఆత్మకూరులో 5.9, కృష్ణా జిల్లా పెదఅవుటపల్లిలో 5.8, బాపట్ల జిల్లా రేపల్లె మండలం కామరాజుగడ్డలో 5.5 సెం.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది.

ట్రంప్ ఉపాధ్యక్ష అభ్యర్థి

ఉషా 'పతి'

ఉషా చిలుకూరి వాన్స్.. తెలుగు పేరులా ఉంది కదా! అవును.. అమెరికా అధ్యక్ష ఎన్నికల వేళ కొత్తగా చర్చనీయాంశమైన పేరు. రిపబ్లికన్ పార్టీ ఉపాధ్యక్ష అభ్యర్థి జేమ్స్ డేవిడ్ వాన్స్ భార్య. కాలిఫోర్నియాలో పుట్టి పెరిగిన ఆ తెలుగు ఆడబిడ్డ గురించి కొన్ని ముచ్చట్లు..

వాషింగ్టన్: సోమవారం మిల్వాకీలో జరిగిన పార్టీ జాతీయ సదస్సుకు ట్రంప్ హాజరయ్యారు. రిపబ్లికన్ పార్టీ ఉపాధ్యక్ష అభ్యర్థిగా ఓహియో సెనేటర్‌గా ఉన్న జేమ్స్ డేవిడ్ వాన్స్ (జేడీ వాన్స్)ను ప్రకటించారు. ఒకప్పుడు ట్రంప్ విమర్శకుడిగా ఉన్న జేడీ వాన్స్ తరువాత ఆయనకు అనుచరుడిగా మారిపోయారు. ట్రంప్‌పై హత్యాయత్నం జరిగిన వెంటనే.. దీని వెనుక అధ్యక్షుడు జో బైడెన్ పాత్ర ఉండొచ్చని మొట్టమొదటగా ట్వీట్ చేసింది కూడా జేడీనే. సోమవారం జరిగిన కన్వెన్షన్‌లో అభ్యర్థిత్వం ప్రకటించిన తరువాత ప్రసంగించిన ఆయన.. తన ప్రస్థానం వెనుక భార్య ఉషా చిలుకూరి వాన్స్ సహకారం ఎంతో ఉందన్నారు.

చరిత్ర విద్యార్థిగా..

ఉషా తల్లిదండ్రులు చాలా ఏళ్ల కిందట ఏపీ నుంచి వెళ్లి అమెరికాలో స్థిరపడ్డారు. ఆమె 1986 జనవరి 6న కాలిఫోర్నియాలోని శాండియాగోలో జన్మించారు. వృత్తిరీత్యా అడ్వకేట్ అయిన ఉషా.. యేల్ యూనివర్సిటీ నుంచి హిస్టరీలో బ్యాచిలర్ డిగ్రీ చదివారు. ఉష అక్కడి లా జర్నల్‌కు ఎగ్జిక్యూటివ్ డెవలప్‌మెంట్ ఎడిటర్‌గా, యేల్ జర్నల్ ఆఫ్ లా అండ్ టెక్నాలజీకి మేనేజింగ్ ఎడిటర్‌గా పనిచేశారు. కేంబ్రిడ్జిలో ఆమె లెఫ్ట్‌–వింగ్, లిబరల్ గ్రూప్స్‌తో కలిసి పనిచేశారు. 2014లో వామపక్ష డెమొక్రటిక్ పార్టీలో చేరిన ఉషా.. 2018లో రిపబ్లికన్ పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. 2015–2017 వరకు శాన్‌ఫ్రాన్సిస్కో వాషింగ్టన్ డీసీలోని వివిధ సంస్థల్లో పనిచేశారు. యేల్ వర్సిటీలో చదువుతుండగానే ఉషకు జేడీ వాన్స్ పరిచయం. ఇద్దరూ కలిసి పలు ప్రాజెక్టుల్లో పనిచేశారు. ఈ అనుబంధం ప్రేమగా మారి.. వారిద్దరూ 2014లో కెంటకీలో పెళ్లి చేసుకున్నారు. ఓ పక్క న్యాయవాదిగా తన విధులు నిర్వహిస్తూనే భర్త రాజకీయ ప్రయాణంలో అండగా ఉన్నారు. జేడీ వాన్స్, ఉష దంపతులకు ఇద్దరు కొడుకులు వివాన్, వివేక్, కూతురు మిరాబెల్ ఉన్నారు. వారిని హిందూ, క్రిస్టియన్ రెండు మత విశ్వాసాలతో పిల్లలను పెంచుతున్నారు.

వైఎస్సార్‌సీపీ నేతలపై కఠిన చర్యలొద్దన్న

ఉత్తర్వులు పొడిగింపు

తదుపరి విచారణ ఈ నెల 23కి వాయిదా



సాక్షి, అమరావతి: టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో పలువురు వైఎస్సార్‌సీపీ నేతలపై కఠిన చర్యలొద్దంటూ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు ఈ నెల 23 వరకు పొడిగించింది. తదుపరి విచారణను అదే రోజుకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్ ఉత్తర్వులు జారీ చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురాం, ప్రభుత్వ మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, విజయవాడ తూర్పు నియోజకవర్గ నేత దేవినేని అవినాష్ తదితరులు హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై జస్టిస్ కృపాసాగర్ గత వారం విచారణ జరిపారు. పిటిషనర్లపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దంటూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. ఈ వ్యాజ్యాలు మంగళవారం మరోసారి విచారణకు వచ్చాయి. పోలీసుల తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్దార్థ లూథ్రా, సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు స్పందిస్తూ.. ఈ వ్యాజ్యాల విచారణను గురువారం చేపట్టాలని కోరారు. టీడీపీ కార్యాలయంపై దాడి ఘటనలో పిటిషనర్ల పాత్రపై ఆధారాలను కోర్టు ముందుంచుతామన్నారు. పిటిషనర్లపై కఠిన చర్యలొద్దని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిన నేపథ్యంలో ఈ వ్యాజ్యాలపై అత్యవసర విచారణ జరపాల్సిన అవసరం ఉందన్నారు. ఇతర నిందితులకు మధ్యంతర ఉత్తర్వులను వర్తింప చేయవద్దని వారు కోర్టును కోరారు. ఈ సమయంలో పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, న్యాయవాది యర్రంరెడ్డి నాగిరెడ్డి స్పందిస్తూ.. గురువారం ఇతర కేసులున్నాయని, ఆ రోజు వాదనలకు వీలుపడదని తెలిపారు. విచారణను వచ్చే మంగళవారానికి వాయిదా వేయాలని కోరారు. ఇందుకు న్యాయమూర్తి అంగీకరిస్తూ తదుపరి విచారణను ఈ నెల 23కి వాయిదా వేశారు.

జోగి రమేష్ వ్యాజ్యంపై విచారణ 23కు వాయిదా

ఇదిలా ఉంటే, చంద్రబాబు ఇంటి వద్ద జరిగిన గొడవపై నమోదైన కేసులో ముందుస్తు బెయిల్ కోరుతూ మాజీ మంత్రి జోగి రమేష్ దాఖలు చేసిన వ్యాజ్యంలో తదుపరి విచారణ కూడా ఈ నెల 23కి వాయిదా పడింది. జోగి రమేష్‌పై కఠిన చర్యలొద్దంటూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను జస్టిస్ కృపాసాగర్ 23 వరకు పొడిగించారు.

'తప్పుడు' లెక్కలే బాబు భయం

- అందుకే చంద్రబాబు పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టడంలేదా?
- మేము గద్దెనెక్కినప్పుడు ఖజానాలో ఉన్నది రూ.100 కోట్లే
- అయినా పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టాం
- మాజీ మంత్రి పేర్ని నాని



సాక్షి, అమరావతి: పూర్తిస్థాయి బడ్జెట్ కూడా ప్రవేశపెట్టలేని దుస్థితిలో చంద్రబాబు అనుభవం ఉందని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) ఎద్దేవా చేశారు. రాష్ట్ర అప్పులపై వారు చేసిన విష ప్రచారం మొత్తం అవాస్తవమన్న విషయం బయటపడుతుందనే భయంతోనే పూర్తి స్థాయి బడ్జెట్ గురించి చంద్రబాబు ప్రభుత్వం ఆలోచన కూడా చేయడం లేదని అన్నారు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడే నాటికి రాష్ట్ర ఖజానాలో ఉన్నది రూ.100 కోట్లు మాత్రమేనని, అయినప్పటికీ తాము ఆ ఏడాది జూలై 12న పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టామని తెలిపారు. నాని మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. జూన్ 12న చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి 2 రోజుల ముందే కేంద్రం నుంచి డబుల్ డెవల్యూషన్ ద్వారా రూ.5,655.72 కోట్లు వచ్చాయని, అయినా అట్టహాసంగా ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలకు నిధులివ్వలేకే పూర్తి స్థాయి బడ్జెట్‌కు వెనకాడుతున్నారన్నారు. ఇప్పటికే ఉచిత ఇసుక కొండెక్కగా, తల్లికి వందనంలో కోత పెట్టే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. చిత్తశుద్ధి ఉంటే సూపర్ సిక్స్, పవన్ కళ్యాణ్ షణ్ముఖ వ్యూహానికి ఎంత బడ్జెట్ కేటాయిస్తారో ఎంత ఖర్చు చేస్తారో చెప్పాలన్నారు. రహస్యంగా బిల్స్ పాస్ చేసేందుకు, కేటాయింపులు, శాఖల డిమాండ్లు కూడా చూపించాల్సిన అవసరం ఉండదనే ఆర్డినెన్స్ లేదా ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌కు వెళ్తున్నారని దుయ్యబట్టారు. నాడు అప్పులపై అసత్యాలు ప్రచారం చేసిన టీడీపీ, కూటమి నేతలు ఇప్పుడు అప్పటికంటే ఎక్కువ తెస్తున్నారని, ఈ నెల రోజుల్లోనే పరిమితికి మించి అప్పు చేశారని చెప్పారు. హామీలు అమలు చేయలేక, వాటి నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు పర్యటనలు, శ్వేతపత్రాలతోనే బాబు కాలం వెళ్లదీస్తున్నారు. అప్పటికీ, ఇప్పటికీ రాష్ట్రంలో ఏం మారిందని నిలదీశారు. వైఎస్ జగన్‌పై దుర్భాషలాడటం, వ్యక్తిత్వ హననం చేయడం తప్ప చేసినదేముందని ప్రశ్నించారు. దమ్ముంటే వైఎస్సార్‌సీపీ నేతలపై చేసిన ఆరోపణల్లో ఒక్క దానినైనా నిరూపించాలని సవాల్ చేశారు. తమ ప్రభుత్వం రైతులు, నిరుపేదలకు మేలు చేస్తూ అనేక భూములను నిషేధిత జాబితాల నుంచి తొలగించి, హక్కులు కల్పించిందని తెలిపారు. తమ ప్రభుత్వం నెలకు రూ.30 నుంచి రూ.60 మాత్రమే చెత్త పన్ను వసూలు చేసిందన్నారు. ఇప్పుడు చెత్తకు రోజుకు రూ.3 పన్ను వసూలు చేయాలని పవన్ అంటున్నారని, ఇప్పుడు ఎవరు చెత్త సీఎం అని నిలదీశారు. అసెంబ్లీ సమావేశాలకు జగన్‌తో సహా పార్టీ ఎమ్మెల్యేలందరూ హాజరవుతారని తెలిపారు.

మీడియా ముసుగులో వ్యక్తిత్వ హననం నీచం

మీడియా ముసుగులో కొందరు దిగజారి ప్రవర్తిస్తున్నారని పేర్ని నాని మండిపడ్డారు. విజయసాయిరెడ్డి గానీ, చంద్రబాబు గానీ, పేర్ని నాని గానీ.. ఎవరైనా సరే.. ప్రజా జీవితంలో ఉన్న వారి మీద ఎవరైనా విమర్శలు చేసినప్పుడు మీడియా హుందాగా ప్రవర్తించాలన్నారు. ముందుగా వాటికి ఆధారాలున్నాయేమో చూడాలని, ఆధారాల్లేకపోతే ప్రచురించకూడదని, ప్రసారం చేయకూడదని, అయితే ఇప్పుడు మీడియాలో ఇది జరగడంలేదని ఆక్షేపించారు. మీడియా అంతా రాజకీయ రంగులు పులుముకుందన్నారు. అందుకే ఆరోపణల విషయంలో ఫలానా వ్యక్తి ఆరోపించారని చెప్పకుండా పూర్తి భిన్నంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఎంపీ వి.విజయసాయిపై ఒక వ్యక్తి ఆరోపణలు చేస్తే, ఆయన వివరణ తీసుకోకుండా, కనీసం మాట్లాడే ప్రయత్నం కూడా చేయకుండా, ఏకంగా ఒక ఛానల్ సీఈవోనే డిబేట్ పెట్టడం, అందులో నీచంగా మాట్లాడటం పూర్తిగా దిగజారి పోవడమే అని మండిపడ్డారు. ఛానల్‌ను హుందాగా నడపాల్సింది పోయి వ్యక్తిత్వ హననం చేస్తూ మనిషిని మానసికంగా చంపే ప్రయత్నం చేయడం హేయమన్నారు. ఓ మనిషిని రాజకీయంగా చంపటానికి, మానసికంగా పతనం చేయడానికి పైశాచికం ప్రదర్శించడం సరికాదన్నారు. పార్టీ మహిళా కార్యకర్తలతో టీవీలో తిట్టించడం దుర్మార్గమన్నారు. మీడియా ముసుగులో ఇంత అసహ్యంగా ప్రవర్తిస్తున్న వారిని, వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు.

'గ్యారెంటీ' అప్పు రూ.5,200 కోట్లు

▶ మొదటి పేజీ తరువాయి



ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేందుకు ఈ రుణాన్ని వినియోగిస్తామని తెలిపింది. సచివాలయంలో మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన మంత్రి మండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వెల్లడించారు.

అప్పులు మినహా మరో మార్గం లేదు..

రబీ ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులకు ఇటీవలే రూ.1,000 కోట్లు విడుదల చేశాం. మరో రూ.600 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఈ బకాయిల చెల్లింపు కోసం వాణిజ్య బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల నుంచి రూ.2 వేల కోట్ల రుణం పొందేందుకు పౌర సరఫరాల సంస్థను అనుమతిస్తూ గత నెల 28వ తేదీన ప్రభుత్వం జీవో నెం.6 జారీ చేసింది. ఈ రుణం కోసం ప్రభుత్వ హామీ కోరుతూ చేసిన ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. 2024–25లో ధాన్యం కొనుగోలు కోసం వర్కింగ్ క్యాపిటల్ అసిస్టెన్స్ కింద జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్‌సీడీసీ) నుంచి ప్రభుత్వ హామీతో రూ.3,200 కోట్ల కొత్త రుణం కోసం ఏపీ మార్క్‌ఫెడ్‌కు కేబినెట్ అనుమతి ఇచ్చింది. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో లోపాలను సవరించి మెరుగైన విధానం రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రైతులకు మేలు చేసేందుకు అప్పులు చేయడం మినహా మరో మార్గం లేదు. ఉచిత పంటల బీమా స్థానంలో మెరుగైన పంటల బీమా పథకాన్ని తేవాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై ఏర్పాటయ్యే కమిటీ నెల రోజుల్లోగా నివేదిక సమర్పిస్తుంది.

కౌన్సిల్‌లో బలం లేదు.. నిజమే

"కౌన్సిల్‌లో మాకు బలంలేని మాట వాస్తవమే. అయితే అసెంబ్లీలో చేసిన చట్టాలను కౌన్సిల్ అడ్డగించే అవకాశం లేదు కదా?" అని మంత్రి పార్థసారథి పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో అసెంబ్లీలో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌కి మద్దతిచ్చిన టీడీపీ ఇప్పుడెందుకు వ్యతిరేకిస్తోందని ప్రశ్నించగా నాడు విపక్ష సభ్యులకు మాట్లాడే అవకాశం ఎక్కడ ఇచ్చారని ఎదురు ప్రశ్నించారు. హౌసింగ్‌లో అక్రమాలపై విచారణకు ఆదేశాలు జారీ చేశామన్నారు. సంపద సృష్టి విషయంలో కట్టుబడి ఉన్నామని, తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత పాజిటివ్ వైబ్రేషన్ మొదలైందని చెప్పారు. నెలలోనే ఏపీలో ప్రజల ఆస్తులు, భూముల విలువ పెరిగిందన్నారు. భూముల ధరలు కనీసం రూ.ఐదారు లక్షలకు పైగా పెరిగాయన్నారు. ఎయిర్, రైల్ ట్రాఫిక్ 30 శాతం పెరిగిందన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్, ఇసుక, గనుల పాలసీలు రద్దు

ఏపీ ల్యాండ్ టైటిలింగ్ 2022 చట్టం రద్దు నిర్ణయానికి కేబినెట్ ఆమోదముద్ర వేసింది. ఇసుక, గనుల పాలసీ 2019, మరింత మెరుగైన ఇసుక విధానం 2021ని రద్దు చేయడంతో పాటు వివిధ సంస్థలతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. పర్యావరణ హితంగా సమగ్ర ఇసుక విధానం 2024 తెస్తాం. ప్రభుత్వానికి ఆదాయం లేకుండా, ప్రజలకు ఉచితంగా ఇసుకను అందిస్తూ ఈ నెల 8న జారీ చేసిన జీవో నెం.43 ర్యాటిఫై చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రకృతి వ్యవసాయంలో రాష్ట్రానికి గుల్బెంకియన్ అవార్డు రావటాన్ని స్వాగతిస్తున్నాం. ప్రస్తుతం 5 లక్షల హెక్టార్లలో అమలులో ఉన్న ప్రకృతి సాగును 2029 నాటికి కనీసం 20 లక్షల హెక్టార్లకు విస్తరించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం.

ఇసుకలో తలదూర్చొద్దు!

ఇసుక వ్యవహారాలకు కొద్ది రోజులు దూరంగా ఉండాలని మంత్రులకు సీఎం చంద్రబాబు సూచించారు. ఉచితంగా ఇస్తున్నాం కాబట్టి కొంతకాలం సజావుగా సాగనివ్వాలన్నారు. ఈమేరకు మంత్రివర్గ సమావేశం ముగిసిన తర్వాత మంత్రులతో వివిధ రాజకీయ అంశాలపై ఆయన మాట్లాడినట్లు తెలిసింది. ఎమ్మెల్యేలు ఇసుక విషయంలో జోక్యం చేసుకోకూడదన్నారు. ప్రస్తుతం 43 లక్షల టన్నుల ఇసుక స్టాక్ యార్డుల్లో ఉందని, వచ్చే 3 నెలలకు కోటి టన్నుల ఇసుక అవసరమని చెప్పారు. అక్టోబర్ తర్వాత ఇసుక రీచ్‌లు అందుబాటులోకి వస్తాయని, అప్పుడు కొత్త విధానాన్ని తెద్దామన్నారు. ఈ సందర్భంగా ఢిల్లీ పర్యటన విషయం ప్రస్తావనకు రావడంతో కొన్ని విషయాలు వాళ్లతో మాట్లాడాల్సి ఉందని, అవన్నీ బయటకు చెప్పలేనని చంద్రబాబు వ్యాఖ్యానించినట్లు సమాచారం. మంత్రుల పనితీరు ఇంకా మెరుగుపడాలని, ప్రభుత్వ కార్యక్రమాలను కొందరు సరిగా జనంలోకి తీసుకెళ్లలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. పింఛన్ల పంపిణీకి ఏడాదికి రూ.35 వేల కోట్లు ఖర్చు పెడుతున్నామని, ఆగస్టు ఒకటో తేదీన ఇళ్ల వద్ద పింఛన్ల పంపిణీలో అందరూ పాల్గొనాలని సూచించారు.

ఐదు రోజులు అసెంబ్లీ

ఈ నెల 22 నుంచి ఐదు రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు మంత్రులకు చంద్రబాబు తెలిపారు. శ్వేత పత్రాలపై అసెంబ్లీలో చర్చిద్దామని, ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు బిల్లును ఈ సమావేశాల్లోనే పెడదామని చెప్పారు. పంటల బీమా పథకం అమలు కోసం ముగ్గురు మంత్రులతో కమిటీ వేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం ప్రీమియం కట్టకుండా రైతుల్ని మోసం చేసిందని, రైతు భరోసా కేంద్రాల ద్వారా రూ.1,600 కోట్లు రుణం తెచ్చి రూ.వెయ్యి కోట్లు మాత్రమే రైతులకిచ్చారని, మిగతాది ఎక్కడుందో తెలుసుకోవాల్సి ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి రేషన్ బియ్యం ఎగుమతి చేసి అక్రమాలకు పాల్పడ్డారని నాదెండ్ల మనోహర్ ప్రస్తావించినట్లు తెలిసింది. కిలో రూ.43 చొప్పున విదేశాలకు ఎగుమతి చేశారని, దీనిపై సమగ్ర దర్యాప్తు జరగాలని ఆయన సూచించగా వచ్చే మంత్రివర్గం సమావేశం నాటికి దీంతోపాటు భూ అక్రమాలపైనా విచారణకు ఆదేశించడంపై నిర్ణయం తీసుకుందామని చంద్రబాబు చెప్పినట్లు తెలిసింది

మట్టి దిబ్బలు మటాష్!

విశాఖ జిల్లాలో ఎల్లోగ్యాంగ్ బరితెగింపు

భౌగోళిక వారసత్వ సంపదైన ఎర్రమట్టి దిబ్బలపై 'పచ్చ' గద్దలు


ఎర్రమట్టి తవ్వకాల ముందు..


ఎర్రమట్టి తవ్వకాల అనంతరం..

సాక్షి, విశాఖపట్నం: చంద్రబాబు, పవన్.. ఇద్దరూ కలిసి అప్పట్లో నోటికొచ్చిన అబద్ధాల్ని ప్రజలపై రుద్దేశారు. వారసత్వ సంపదకి ముప్పు వాటిల్లుతోందంటూ గగ్గోలు పెట్టేశారు. అంతా నిబంధనల ప్రకారం పనులు జరుగుతున్నా అక్కడేదో ఘోరం జరిగిపోతోందంటూ నానా యాగీ చేసి నిజాలను 'ఎర్రమట్టి'లో కప్పెట్టేశారు. సీన్ కట్ చేస్తే.. ఇప్పుడు వారే అధికారం చెలాయిస్తున్నారు. ఇంకేముంది.. నిబంధనల్ని గాలికొదిలేసి మట్టి తవ్వకాలు జరుగుతున్నా.. ఏమో సార్.. మాకు కనబడదు.. అన్నట్లుగా ఉంది ఇప్పుడు వారిద్దరి తీరు. దేశంలోని 29 భౌగోళిక వారసత్వ సంపదల్లో ఒకటిగా గుర్తింపు పొందిన విశాఖ జిల్లాలోని ఎర్రమట్టి దిబ్బల్ని 'పచ్చ' మాఫియా మటాష్ చేస్తూ చెప్పేటందుకే నీతులున్నాయనే సామెతను గుర్తుచేస్తున్నారు. ఈ దిబ్బల వెనుకదాగున్న కథాకమామిషు ఏంటంటే..

విశాఖ జిల్లా భీమిలి మండలం సర్వే నం 49లో నేరెళ్లవలస గ్రామం ఉంది. సర్వే నం.49/1లో మొత్తం 1,067 ఎకరాలు ఉంది. ఇందులో 550 ఎకరాల్లో ఐఎన్ఎస్ కళింగ విస్తరించి ఉంది. సుప్రీంకోర్టుకు వెళ్లి తమకు చెందిన స్థలమని కోర్టులో విజయం సాధించిన ఓ బిల్డింగ్ సొసైటీ పేరుతో 287 ఎకరాల భూములున్నాయి. ఈ రెండింటి మధ్యలో మొత్తం 262.92 ఎకరాల విస్తీర్ణంలో ఈ ఎర్రమట్టి దిబ్బలు విస్తరించి ఉన్నాయి. ఈ ప్రాంతాన్ని జియో హెరిటేజ్ సైట్‌గా గుర్తించారు. ఇవి కాకుండా.. పక్కనే ఉన్న కొత్తవలస గ్రామ పరిధిలోని సర్వే నం 75, సర్వే నం.86, 87లో సుమారు 80 ఎకరాల్లో 1982లో డీ–పట్టాలు ఇచ్చారు. ఈ ప్రాంతంలోనే లేఅవుట్ల అభివృద్ధిని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టింది. అయితే.. కొత్తవలసలోని సర్వే నం.86/1ని సబ్‌డివిజన్ చేసి.. 86/3లో ఉన్న దాదాపు 148 అడుగుల మేర బఫర్ జోన్‌గా గుర్తించి.. ఆ ప్రాంతాన్నీ గత ప్రభుత్వం భౌగోళిక వారసత్వ సంపదగా.. విశాఖ పర్యాటక ఖ్యాతిని ఇనుమడింపజేస్తున్న ఎర్రమట్టి దిబ్బలకు భవిష్యత్తులోనూ ఎలాంటి ముప్పు రాకుండా చేసింది. భౌగోళిక వారసత్వ సంపదగా ఉన్న 262.92 ఎకరాల్ని సంరక్షిస్తూ ఎర్రమట్టి దిబ్బలకు ప్రత్యేక బఫర్‌జోన్ ఏర్పాటుచేసి భూ సమీకరణ పూర్తిచేసింది. ల్యాండ్ డెవలప్‌మెంట్ ప్రక్రియ కూడా చేపట్టింది. కానీ, అప్పట్లో పవన్, చంద్రబాబు ఈ అభివృద్ధి పనులపై నానా యాగీచేసి ఎర్రమట్టి దిబ్బల్లో లేఅవుట్లు వేస్తున్నారని తెగ దుష్ప్రచారం చేశారు. తమ ప్రభుత్వం రాగానే ఈ పనులు ఆపేస్తామని చెప్పారు. కానీ, ఇప్పుడు టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి ప్రభుత్వం వచ్చీరాగానే బఫర్ జోన్‌లోకి చొరబడి మరీ మట్టిని అడ్డగోలుగా తవ్వేస్తున్నారు.

కనీస అవగాహన లేకుండా గగ్గోలు..

ఇక ఎర్రమట్టి దిబ్బల్ని ఆనుకుని 70–80 ఏళ్లుగా జీడితోటలు సాగు చేసుకుంటూ డీ–పట్టాలున్న రైతుల నుంచి మాత్రమే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పూలింగ్ చేపట్టింది. ఇలా అభివృద్ధి చేస్తున్న ప్రాంతం కూడా ఎర్రమట్టి నేలలే. వీటికి ప్రభుత్వం డీ–పట్టాల్ని ఎలా ఇస్తుందన్న కనీస అవగాహన లేకుండా టీడీపీ నేతలు అప్పట్లో హడావిడి చేశారు. అందుకు పవన్‌కళ్యాణ్ తందాన అంటూ గుడ్డిగా రోడ్డెక్కారు. నిజానికి.. నేరెళ్లవలసలో భూ సమీకరణకు 2016లోనే తెలుగుదేశం ప్రభుత్వం సిద్ధమైంది. అధికారంలో ఉన్నప్పుడు ఒప్పు అయిన అదే పూలింగ్.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాత్రం తప్పు అంటూ తప్పుడు ఆరోపణలు చేసింది. ఇప్పుడు మళ్లీ అధికారంలోకి రాగానే తూచ్ అనడం.. పవన్ కూడా సైలెంట్ అవడంపై పర్యావరణవేత్తలు విమర్శలు సంధిస్తున్నారు. పైగా.. అప్పట్లో పవన్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదుచేస్తా.. 48 గంటల అల్టిమేటం జారీ చేస్తున్నానంటూ గతేడాది ఆగస్టులో వ్యాఖ్యలు చేశారు. నిజానికి.. గత ప్రభుత్వం అభివృద్ధి పనులు మొదలుపెట్టిన లేఅవుట్‌కు హెరిటేజ్ సైట్‌కు అసలు ఏమాత్రం సంబంధమేలేదు. ఈ డీ–పట్టా భూముల్లో తోటలున్న ప్రాంతాన్ని మాత్రమే ప్రభుత్వం భూ సమీకరణ చేసిందే తప్ప.. ఎర్రమట్టి దిబ్బల్ని తొలగించడం లేదన్నది నూరు శాతం వాస్తవం.

బఫర్ జోన్ దాటి తవ్వకాలు..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతుల భూములు, ఎర్రమట్టి దిబ్బల మధ్య బఫర్ జోన్ ఏర్పాటుచేసి ఎర్రమట్టి దిబ్బల్ని సంరక్షిస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వం దిబ్బల్ని కూడా దోచుకళ్లే పర్వానికి తెరతీసింది. గత ప్రభుత్వంలో బఫర్ జోన్ ఇవతలే లే అవుట్ పనులు జరిగితే ప్రస్తుతం బఫర్ జోన్ దాటి మరీ.. కొందరు టీడీపీ, జనసేన నాయకులు కుమ్మక్కై మట్టిని తరలించేస్తున్నారు. అడ్డగోలుగా, అక్రమంగా మట్టి దందా సాగిస్తూ వారసత్వ సంపద ఉనికిని ప్రమాదకరంగా మార్చేస్తున్నారు. రెండ్రోజులుగా యథేచ్ఛగా తవ్వకాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు.

మళ్లీ సైలెంట్ మోడ్‌లో పవన్..

ఇకపోతే.. టీడీపీ హయాంలో భూసమీకరణ ప్రక్రియ జరిగినప్పుడు పవన్ మౌనం వహించారు. కానీ, వైఎస్సార్‌సీపీ హయాంలో పనులు జరుగుతున్నప్పుడు అబద్ధాలు ప్రచారం చేస్తూ హడావిడి చేశారు. ఇప్పుడు పర్యావరణ శాఖ మంత్రిగా ఉంటూ కూడా ఎర్రమట్టి దిబ్బల గురించి పట్టించుకోకుండా మరోసారి మౌనముద్రలోకి జారుకున్నారంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఎర్రమట్టి దిబ్బల ప్రత్యేకత ఇదీ..

విశాఖకు ప్రకృతి ప్రసాదించిన వరం ఈ ఎర్రమట్టి దిబ్బలు. దక్షిణాసియాలో మరోరెండు చోట్ల మాత్రమే ఇవి ఉన్నాయి. వైజాగ్‌లోని ఎర్రమట్టి దిబ్బలు విశాఖ నుంచి భీమిలీ వెళ్లే ప్రధాన రోడ్డులో సముద్రానికి ఆనుకుని ఉన్నాయి. రోడ్డుకు అటు సముద్రం.. ఇటు ఈ దిబ్బలు ఉంటాయి. 20 కిలోమీటర్ల మేర ఇవి విస్తరించి ఉన్నాయి. రోడ్డు దిగి వెళ్తే మరో ప్రపంచంలోకి వెళ్లిన అనుభూతి కలుగుతుంది. దిబ్బల మధ్య సందులు, పాయలుగా ఉంటుంది. దాదాపు 18వేల ఏళ్ల కిందట అంటే చివరి గ్లేషియర్ పీరియడ్ (భూతలం మంచుతో కప్పి ఉన్న కాలం)లో ఏర్పడినవే ఈ ఎర్రమట్టి దిబ్బలని చెబుతారు. అయితే, వీటిని ఎర్రమట్టి దిబ్బలని అంటున్నా నిజానికివి ఇసుక దిబ్బలు. సముద్రం పైనుంచి వీచిన గాలితో తీరం వద్ద మేటలు వేసిన ఇసుక దిబ్బలే ఇవి. ఈ ఇసుక మట్టి రంగులో ఉండడంవల్ల వీటిని మట్టి దిబ్బలు అని పిలుస్తారు. ఉపరితలంపై కనిపిస్తున్న దిబ్బల కింది భాగం (బేస్‌మెంట్) వయస్సు 18వేల నుంచి 20వేల ఏళ్లు ఉంటుంది. అదే మధ్య భాగం 6వేలు.. పైభాగం 3వేల సంవత్సరాల క్రితం ఏర్పడినట్లు పరిశోధనల్లో తేలింది. ఇది నిర్దిష్ట భౌగోళిక విలువలతో కూడిన భూవైవిధ్య మూలకాలతో ఏర్పడిన ప్రాంతం కాబట్టి ఈ ప్రాంతాన్ని జియో హెరిటేజ్ సైట్‌గా పిలుస్తారు. ప్రకృతి అందించిన సహజ వారసత్వం కాబట్టి భవిష్యత్తు తరాల ప్రయోజనం కోసం ఇవి రక్షణకు అర్హమైనవి.

మంత్రిగారూ విధ్వంసాన్ని ఆపండి..

ఎర్రమట్టి దిబ్బల్లో దోపిడీపై జనసేన సీనియర్ నేత బొలిశెట్టి సత్యనారాయణ స్పందించారు. ఇక్కడ జరుగుతున్న దోపిడీ పర్వాన్ని 'ఎక్స్' (ట్విటర్) వేదికగా పర్యావరణ శాఖ మంత్రి పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. ఎర్రమట్టి దిబ్బలు కేవలం పర్యాటక ప్రాంతం మాత్రమే కాదని.. దేశంలో ఉన్న 29 భౌగోళిక వారసత్వ సంపదల్లో ముఖ్యభాగమని ఆయన పేర్కొన్నారు. అలాంటి అరుదైన సంపదపై రెండ్రోజులుగా యథేచ్ఛగా దాడి జరుగుతోందని.. దీనిపై అధికారులు, సీఎం చంద్రబాబు, మంత్రి పవన్‌కళ్యాణ్ స్పందించాలని బొలిశెట్టి తన పోస్టులో డిమాండ్ చేశారు.

– 'ఎక్స్' వేదికపై జనసేన నేత 'బొలిశెట్టి' పోస్టు

అబ్బే.. అది ఇది కాదు..

ఎర్రమట్టి దిబ్బల్ని దోచేస్తుంటే అధికారులు మాత్రం మరో రకంగా స్పందిస్తున్నారు. అక్రమంగా తరలించడం లేదని.. అసలు ఆ పనులు వేరు ఈ పనులు వేరంటూ భీమిలి తహశీల్దార్ టి.గోవింద్ కొత్త భాష్యం చెప్పారు. ఎర్రమట్టి దిబ్బల్ని ఆనుకుని ఉన్న హౌస్ బిల్డింగ్ సొసైటీకి చెందిన 287 ఎకరాల్లో పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. సుప్రీంకోర్టుకు వెళ్లిన సొసైటీ ఈ స్థలాన్ని దక్కించుకుని.. అందులో పనులు చేస్తోందని.. ఆ భాగంలో ఎర్రమట్టి దిబ్బలు ఉంటే ఉండొచ్చని వ్యాఖ్యానించారు. అయినప్పటికీ.. విమర్శలు వస్తున్న నేపథ్యంలో పనుల్ని తక్షణమే నిలుపుదల చేశామని.. బుధవారం సమగ్ర సర్వే నిర్వహించి ప్రభుత్వానికి నివేదిక ఇస్తామంటూ తహసీల్దార్ చెప్పారు.

హామీలిచ్చాం.. నిధులివ్వండి


అమిత్‌షాతో సీఎం చంద్రబాబు

సాక్షి, న్యూఢిల్లీ: ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలకు ఎన్డీయే కూటమి హామీలు ఇచ్చిందని, ఇవి సాధ్యం చేయాలంటే కేంద్రం నిధులు సమకూర్చాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షాను ఏపీ సీఎం చంద్రబాబు కోరినట్లు తెలిసింది. అమరావతి అభివృద్ధికి నిధులు కావాలని చెప్పినట్లు సమాచారం. ఢిల్లీ పర్యటనలో భాగంగా చంద్రబాబు మంగళవారం రాత్రి కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో భేటీ అయ్యారు. అరగంటకు పైగా ఈ సమావేశం సాగింది. అనంతరం చంద్రబాబు మీడియాతో మాట్లాడకుండానే బసకు చేరుకున్నారు. ఎన్నికల హామీలు, వాటికి సమకూర్చాల్సిన నిధులపైనే ప్రధానంగా చర్చ జరిగినట్లు తెలిసింది. హామీల అమలు, అమరావతి అభివృద్ధి.. ఇలా అన్నీ పూర్తి కావాలంటే ఏటా కనీసం రూ.20 వేల కోట్లు అయినా అవసరం ఉంటుందని, ఆ మేరకు ప్యాకేజీ ప్రకటించాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిసింది. అలాగే విభజన హామీలకు సంబంధించి బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని బాబు కోరినట్లు సమాచారం. సీఎం బుధవారం కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తోపాటు పలువురు కేంద్రమంత్రులతో భేటీ కానున్నట్లు సమాచారం.

చంపేస్తామంటున్నారు.. రక్షణ కల్పించండి

పోలీసులకు ఎమ్మెల్సీ దువ్వాడ ఫిర్యాదు



టెక్కలి: ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున శ్రీకాకుళం జిల్లా టెక్కలి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన తనకు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత..చంపేస్తామని, తల నరికి ఊరేగిస్తామని ప్రతీ రోజూ బెదిరింపు కాల్స్ వస్తున్నాయని, దీనిపై విచారించి తనకు రక్షణ కల్పించాలని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో భాగంగా బెదిరింపు కాల్స్‌కు సంబంధించిన ఫోన్ నంబర్లను టెక్కలి సీఐ పైడయ్యకు మంగళవారం అందజేశారు. తన కారుతో సహా పెట్రోల్ పోసి తగలబెడతామని, బయటకు రాకపోతే ఇంటిపై దాడి చేస్తామని, మరికొద్ది రోజుల్లో చంపేస్తామని చేతనైతే ఆపుకోవాలంటూ నోటికి ఇష్టం వచ్చినట్లుగా దుర్భాషలాడుతున్నారని పోలీసులకు ఎమ్మెల్సీ తెలిపారు. ఇటీవల కొంతమంది వ్యక్తులు తన ఇంటి పరిసరాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్నారని, దీనికి తన వద్ద పనిచేస్తున్న సిబ్బంది సాక్ష్యమని చెప్పారు. తక్షణమే తనకు రక్షణ కల్పించి తనను బెదిరించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నెల్లూరు నేతలకు బాబు క్లాస్


సాక్షి, అమరావతి: నెల్లూరు జిల్లా టీడీపీ నేతల గొడవపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రివర్గ సమావేశం తర్వాత మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, నారాయణ, సీనియర్ నేత బీద రవిచంద్రలను కూర్చోబెట్టి క్లాస్ పీకినట్లు తెలిసింది. బీద రవిచంద్ర, మంత్రి ఆనం మధ్య ఆధిపత్య పోరు నెలకొని ఒక సమావేశం సందర్భంగా ఇటీవల ఇద్దరూ పరస్పరం ఆరోపణలు చేసుకున్నారు. దీనిపై ఇటీవల మంత్రులు, ఆనం, నారాయణ కలిసి జిల్లాలో తనను ఇబ్బంది పెడుతున్నారని రవిచంద్ర, చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు.

ఏసీబీ.. అవుటాఫ్ కవరేజ్!

అవినీతిపై ఫిర్యాదులకు టోల్‌ఫ్రీ నంబర్ 14400ను తెచ్చిన జగన్ సర్కార్

ఈ ప్రభుత్వంలో నిలిచిపోయిన సేవలు

నామమాత్రంగా ఒక సెల్ నంబర్‌ను ప్రకటించిన ఏసీబీ అదనపు డీజీ



ప్రభుత్వం మారగానే అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) అవుటాఫ్ కవరేజ్‌లోకి వెళ్లిపోయింది. ప్రభుత్వ అధికారులు, ఉద్యోగుల అవినీతిపై ఫిర్యాదు చేసేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 14400 ప్రస్తుతం మూగబోయింది. ఈ నంబర్ ద్వారా గతంలో ప్రజల నుంచి రోజుకు సగటున 30 వరకు ఫిర్యాదులు వస్తుండేవి. ప్రజలు 24/7 ఫిర్యాదులు చేసేందుకు అవకాశం ఉండేది. వాటిని పరిశీలించిన ఏసీబీ అధికారులు తగిన చర్యలు చేపడుతుండేవారు. కానీ ఇప్పుడు టోల్‌ఫ్రీ నంబర్ పనిచేయకపోవంతో ప్రజలు తాము ఎదుర్కొంటున్న అవినీతి సమస్యపై ఎవరికి, ఎలా ఫిర్యాదు చేయాలో అర్థమవ్వక ఆందోళన చెందుతున్నారు. మరోవైపు ఏసీబీ అదనపు డీజీ అతుల్‌సింగ్ నామమాత్రంగా సోమవారం ఒక సెల్‌ఫోన్ నంబర్‌ను ప్రకటించారు. 9440440057 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని.. అదీ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల మధ్యే ఫోన్ చేయాలని ఆయన ప్రకటించడం గమనార్హం.

– సాక్షి, అమరావతి

14400తో అవినీతికి చెక్

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 14400 టోల్‌ఫ్రీ నంబర్ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేసేది. దీనికి తోడు 14400 వాట్సాప్ నంబర్, 14400 మొబైల్ యాప్‌ను కూడా గత ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ఇవన్నీ అవినీతికి వ్యతిరేకంగా ప్రజల చేతుల్లో ఆయుధాలుగా మారాయి. ఫిర్యాదులే కాకుండా ప్రభుత్వ అధికారులు, ఉద్యోగుల అవినీతికి సంబంధించిన పత్రాలు, ఆడియో, వీడియోలను కూడా ఏసీబీకి పంపించే వెసులుబాటును గత ప్రభుత్వం కల్పించింది. అప్పటివరకు అధికారుల అవినీతిపై ఏసీబీకి ఫిర్యాదు చేసినా పెద్దగా ఫలితం ఉండదనే ప్రజల భావనను.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పూర్తిగా తుడిచేసింది. 2022లో ప్రవేశపెట్టిన 14400 మొబైల్ యాప్ ఏసీబీ పనితీరును కూడా సమూలంగా సంస్కరించింది. ప్రజలు ధైర్యంగా ఫిర్యాదుచేసేవారు. ఏసీబీ కూడా ఫిర్యాదులపై వేగంగా స్పందించి కఠిన చర్యలు తీసుకునేది. 2022లో 14400 యాప్‌కు 6,666 ఫిర్యాదులు, 2023లో 9,590 ఫిర్యాదులు వచ్చాయి. 2022లో 47 కేసుల్లోనూ, 2023లో 165 కేసుల్లోనూ అధికారులు లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

పచ్చిక బయళ్లు పశుపక్ష్యాదుల కోసమే!

కొండ ఆక్రమణలపై హైకోర్టును ఆశ్రయించిన గొర్రెల యజమానులు

పచ్చిక బయళ్లను పరిరక్షించాలని అధికారులకు కోర్టు ఆదేశాలు


పచ్చిక బయళ్లలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు (ఫైల్)

సి.బెళగల్: కర్నూలు జిల్లా సి.బెళగల్‌లో విస్తరించిన కొండల్లో పచ్చిక బయళ్లు కేవలం పశు పక్ష్యాదుల మేపుకోసమేనని, ఎవరికీ ఎలాంటి హక్కులు లేవని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. గ్రామంలోని కొండ ప్రాంతాల్లో పచ్చిక బయళ్లుగా ఉన్న భూములను కొందరు కబ్జా చేసి కొంతకాలంగా పంటల్ని సాగు చేసుకుంటున్నారు. కొందరు బడా నేతలు కొండపై గల ఎర్రమట్టిని (గ్రావెల్‌ను) పెద్ద ఎత్తున అక్రమంగా విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో కొన్నేళ్లుగా గ్రామానికి చెందిన గొర్రెల కాపరులు కొండ భూముల ఆక్రమణలు, ఎర్రమట్టి తవ్వకాలపై మండల, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. దీంతో వారంతా హైకోర్టును ఆశ్రయించారు. కేసు విచారణ చేపట్టిన జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ కొండ భూముల ఆక్రమణలు, తవ్వకాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొండల్లో విస్తరించిన పచ్చిక బయళ్ల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని, ఇకపై ఎలాంటి పంటలు సాగు చేయకుండా గట్టి చర్యలు చేపట్టాలని అధికారులకు మౌఖిక ఉత్తర్వులు జారీ చేశారు. కౌంటర్ దాఖలుకు ప్రభుత్వానికి ఆగస్టు 16 తేదీ వరకు గడువు ఇచ్చారు.

నాణ్యతలో మేటి భారతీ సిమెంట్

భారతీ సిమెంట్ మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ మల్లారెడ్డి



కర్నూలు(టౌన్): నాణ్యతలో మేటి భారతీ సిమెంట్ అని ఆ కంపెనీ మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ మల్లారెడ్డి తెలిపారు. మంగళవారం కర్నూలు నగర శివారులోని దిన్నెదేవరపాడు రోడ్డులో ఉన్న ఓ హోటల్‌లో భారతీ సిమెంట్ ఆధ్వర్యంలో డీలర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కట్టడాల దీర్ఘకాలిక మన్నికలో భారతీ సిమెంటు వినియోగదారుల మన్ననలు పొందిందని తెలిపారు. నిర్మాణ రంగంలో ఎక్కువ శాతం మంది ఇంజనీర్లు భారతీ సిమెంట్‌నే ఎంపిక చేసుకుంటున్నట్లు చెప్పారు. పర్యావరణానికి ఎలాంటి హాని కలగని విధంగా ఉత్పత్తి కొనసాగుతోందన్నారు. పూర్తి స్థాయి జర్మనీ టెక్నాలజీ రోబోటిక్ క్వాలిటీ కంట్రోల్ ల్యాబ్‌ను కలిగి ఉన్నట్లు వివరించారు. అనంతరం డీలర్లను ఘనంగా సత్కరించి పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో మార్కెటింగ్ అసిస్టెంట్ మేనేజర్ కొండల్ రెడ్డి, డిప్యూటీ మేనేజర్ ప్రతాప్‌రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ సుబ్బరాయుడు, టెక్నికల్ సర్వీస్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

రేపు, ఎల్లుండి గిరిజన సంక్షేమంపై ఢిల్లీలో వర్క్‌షాప్

రాష్ట్రాల గిరిజన సంక్షేమశాఖ కమిషనర్లు హాజరు కావాలని కేంద్రం ఆదేశం

సాక్షి, అమరావతి: దేశంలో అమలు జరుగుతున్న గిరిజన సంక్షేమ పథకాలను సమీక్షించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించేలా కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ ఈ నెల 18, 19 తేదీల్లో ఢిల్లీలో వర్క్‌షాప్ నిర్వహిస్తోంది. దీని కోసం అవసరమైన సమాచారంతో అన్ని రాష్ట్రాల గిరిజన సంక్షేమశాఖ కమిషనర్లు రావాలని ఆదేశాలు ఇచ్చింది. గిరిజనులకు సంబంధించిన అనేక అంశాలపై తీసుకోవాల్సిన చర్యలపై ఈ ఏడాది జనవరి 19న కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ అధికారులు రాష్ట్రాలకు లేఖ రాశారు. ఆ లేఖలో పీఎం జన్మన్, గతిశక్తి పోర్టల్, డేటా ధ్రువీకరణ, బహుళ ప్రయోజన కేంద్రాలు(ఎంపీసీ), వన్‌ధన్ వికాస్ కేంద్రాలు(వీడీవీకే), ఏకలవ్య స్కూల్స్(ఈఎంఆర్ఎస్) వంటి వాటిపై వివరాలను అందించడంతోపాటు వాటిలో ఎదురవుతున్న సమస్యలపై ఈ ఏడాది ఏప్రిల్ 5న నిర్వహించిన సమావేశంలో చర్చించారు. వాటిపై తీసుకున్న చర్యలను ఈ ఏడాది జూన్ 25న నిర్వహించిన సమావేశంలో చర్చించారు. ఈ నేపథ్యంలో తాజాగా నిర్వహిస్తున్న వర్క్‌షాప్ ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ వర్క్‌షాప్‌లో కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో కొనసాగుతున్న పథకాల పురోగతి సమీక్షించడంతోపాటు విజన్–2047, వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక వంటి కొత్త కార్యక్రమాలను చర్చిస్తారు.

రాష్ట్రానికి ఐఆర్ఎస్ అధికారి వెంకయ్యచౌదరి

టీటీడీ జేఈవోగా నియామకం


సాక్షి, అమరావతి: ఐఆర్ఎస్ అధికారి వెంకయ్య చౌదరిని రాష్ట్రానికి పంపించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. 2005 బ్యాచ్‌కు చెందిన వెంకయ్యచౌదరిని డిప్యుటేషన్‌పై ఏపీకి పంపించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కోరింది. దీనికి కేంద్ర ప్రభుత్వం మంగళవారం అంగీకరించింది. ఆయన్ను టీటీడీ జేఈవోగా నియమించింది. ఈ పదవిలో చౌదరి మూడేళ్లపాటు కొనసాగుతారు.

రాంసింగ్ వ్యాజ్యంపై విచారణ 1కి వాయిదా

ఆ రోజు తుది విచారణ జరుపుతామన్న హైకోర్టు

సాక్షి, అమరావతి: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అప్పటి సీబీఐ దర్యాప్తు అధికారి రాంసింగ్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై విచారణను హైకోర్టు ఆగస్టు 1న తుది విచారణ జరపనుంది. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వివేకానంద రెడ్డి హత్య కేసులో తప్పుడు సాక్ష్యం ఇవ్వాలని రాంసింగ్ బెదిరిస్తున్నారంటూ పులివెందులకు చెందిన గజ్జల ఉదయ్ కుమార్‌రెడ్డి కడప జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో ఫిర్యాదు దాఖలు చేశారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలన్న కోర్టు ఆదేశాల మేరకు కడప రిమ్స్ పోలీసులు రాంసింగ్‌పై 2022లో కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టేయాలని కోరుతూ రాంసింగ్ అదే ఏడాది ఫిబ్రవరిలో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు.. ఈ కేసులో తదుపరి చర్యలన్నీ నిలిపివేస్తూ 2022 ఫిబ్రవరి 23న మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. ఈ వ్యాజ్యం మంగళవారం మరోసారి విచారణకు వచ్చింది. ఉదయ్ కుమార్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది ప్రద్యుమ్న కుమార్ రెడ్డి వాదనలు వినిపిస్తూ.. రాంసింగ్ మరో వ్యక్తిని కూడా ఇదే విధంగా బెదిరించారని, ఆయనపై నమోదు చేయాలని కింది కోర్టు ఆదేశించిందని చెప్పారు. ఆ కేసును కొట్టేయాలంటూ రాంసింగ్ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసిందన్నారు. అదే తీర్పు ఈ కేసుకూ వర్తిస్తుందని, రాంసింగ్ వ్యాజ్యాన్ని కొట్టేయాలని కోరారు. ఆ కేసుతో దీనిని పోల్చడానికి వీల్లేదని సీబీఐ న్యాయవాది జూపూడి యజ్ఞదత్ అన్నారు. దర్యాప్తునకు ఆటంకం కలిగించేందుకే పిటిషనర్‌పై ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ కేసులో రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాల్సి ఉందన్నారు. దీనికి అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ స్పందిస్తూ.. తాము ఎలాంటి కౌంటర్ దాఖలు చేయడంలేదని తెలిపారు. అందరి వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిర్మయి ఈ వ్యాజ్యంపై ఆగస్టు 1కి వాయిదా వేశారు. ఆ రోజున తుది విచారణ జరుపుతామని చెప్పారు.

నాసిరకం నారుతో బొప్పాయి రైతుకు అపార నష్టం


బొప్పాయి తోటను పరిశీలిస్తున్న ఏపీ రైతు, కౌలు రైతు సంఘం నేతలు

సాక్షి, అమరావతి: నాసిరకం నారుతో సాగు చేసి నష్టపోయిన బొప్పాయి రైతులకు ఎకరాకు రూ.2 లక్షల చొప్పున పరిహారమివ్వాలని ఏపీ కౌలురైతు సంఘం డిమాండ్ చేసింది. చిత్తూరు జిల్లా కలికిరి, వాయల్పాడు, గుర్రంకొండ మండలాల్లోని పలు గ్రామాల్లో నాసిరకం నారుతో నష్టపోయిన బొప్పాయి రైతుల తోటలను ఏపీ కౌలురైతు సంఘం ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, ఏపీ రైతు సంఘం నాయకుడు పి.నరసింహులు, కార్మిక సంఘం నేతలు సాంబశివ, నరసింహులు మంగళవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ..చిత్తూరు జిల్లాలో కలికిరి, వాయల్పాడు, గుర్రంకొండ తదితర మండలాల్లో 200 ఎకరాల్లో 100 మంది కౌలు రైతులు ఎకరానికి రూ.35 వేల నుంచి 40,000 వరకు బొప్పాయి సాగు చేస్తున్నారని చెప్పారు. వీరు మదనపల్లి, కలికిరిలోని స్థానిక నర్సరీల నుంచి ఒక్కో మొక్క రూ.11 నుంచి రూ.12 చొప్పున కొనుగోలు చేసి ఎకరాకు వెయ్యి బొప్పాయి నాటి రూ.2 లక్షలపైగా పెట్టుబడి పెట్టారన్నారు. అన్ని రకాల సస్యరక్షణ చర్యలు కూడా తీసుకున్నారని అయినప్పటికీ సరైన దిగుబడి రాక తీవ్రంగా దెబ్బతిన్నారని ఆవేదన వ్యక్తం చేవారు. నాణ్యత, సైజు లేకపోవడం వల్ల దిగుబడి తగ్గి తీవ్రంగా నష్టపోయారన్నారు. ఎకరానికి 60 నుంచి 70 టన్నుల దిగుబడి రావాల్సి ఉండగా, కనీసం టన్ను కాయలు కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. నూటికి రెండు రూపాయలు చొప్పున వడ్డీకి తీసుకువచ్చి లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టారని, ఇంత నష్టం జరిగినప్పటికీ ఉద్యానవన శాఖాధికారులు కనీసం ఈ తోటలను పరిశీలించిన పాపానపోలేదన్నారు.

'సీపీఎస్'పై సెప్టెంబర్ 1న చలో విజయవాడ

ఏపీ సీపీఎస్ ఈఏ రాష్ట్ర అధ్యక్షుడు బాజీ పఠాన్



మాట్లాడుతున్న బాజీ పఠాన్

భవానీపురం (విజయవాడ పశ్చిమ): సీపీఎస్/జీపీఎస్ విధానాలపై ప్రతి ఏడాది జరిగే నిరసన కార్యక్రమాలకు కొనసాగింపుగా ఈ ఏడాది సెప్టెంబర్ 1న ఏపీ సీపీఎస్ ఈఏ ఆధ్వర్యంలో చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఏపీ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏపీ సీపీఎస్ ఈఏ) రాష్ట్ర అధ్యక్షుడు బాజీ పఠాన్ తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ విద్యాధరపురంలోని ఐక్యవేదిక రాష్ట్ర కార్యాలయంలో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏడాదిలోపు సీపీఎస్ ఉద్యోగులకు మేలు చేసే విధంగా, ఆ విధానాన్ని సమీక్షించి మంచి నిర్ణయం తీసుకుంటామని చంద్రబాబు, పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అయితే ఇటీవల విడుదలయిన గెజిట్‌లో జీపీఎస్ విధానమే అమలు జరుగుతుందని ప్రకటించడం ఉద్యోగులు, ఉపాధ్యాయులను విస్మయానికి గురి చేసిందన్నారు. సీఎం చంద్రబాబుకు తాము చేసిన విన్నపం మేరకు జీపీఎస్ గెజిట్‌ను నిలుపుదల చేస్తామని ప్రకటించడం హర్షణీయమన్నారు. జీపీఎస్ విధానాన్ని రద్దు చేస్తూ ఒక ప్రకటన విడుదల చేసి ఆందోళన చెందుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు సాంత్వన చేకూర్చాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరిమి రాజేశ్వరరావు, ఏపీసీపీఎస్ఈఏ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి జహీర్ అబ్బాస్, మహిళా అధ్యక్షురాలు శాంతి బాయి తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పాదన

- 5.7 టీఎంసీల నీటి విడుదలకు ఉమ్మడి రాష్ట్రాల అంగీకారం
- వరద ప్రవాహం లేకున్నా తాగునీటి అవసరాల దృష్ట్యా విడుదల

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయం నుంచి నాగార్జున సాగర్‌కు విద్యుత్ ఉత్పాదన ద్వారా 5.7 టీఎంసీల నీటిని విడుదల చేయాలని కృష్ణా బోర్డ్ త్రిసభ్య కమిటీ ఆదేశాలతో మంగళవారం శ్రీశైలంలో విద్యుత్ ఉత్పాదనను ప్రారంభించారు. ఏపీలోని గుంటూరు, ప్రకాశం, పల్నాడు, బాపట్ల జిల్లాల ప్రజల తాగునీటి అవసరాల కోసం విద్యుత్ ఉత్పాదన ద్వారా నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ఏపీలోని శ్రీశైలం కుడిగట్టు జలవిద్యుత్ కేంద్రంలో మంగళవారం తెల్లవారుజాము నుంచి ఉత్పాదన ప్రారంభించారు. 5 జనరేటర్ల ద్వారా సగటున 19,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు జెన్‌కో చీఫ్ ఇంజినీర్ కాంతారావు తెలిపారు. తెలంగాణలోని ఎడమగట్టు కేంద్రంలో 3 జనరేటర్లతో ఉత్పత్తి చేస్తూ సగటున 14,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయానికి ఈ ఏడాది వరద ప్రవాహం లేకపోవడం, 36 టీఎంసీల నీరు మాత్రమే ఉన్నప్పటికీ దిగువ ప్రాంతాల తాగునీటి అవసరాల దృష్ట్యా జలవిద్యుత్ ఉత్పాదన ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. కుడిగట్టు కేంద్రం నుంచి 3టీఎంసీలు, ఎడమగట్టు కేంద్రం నుంచి 2.7 టీఎంసీల నీటిని విద్యుత్ ఉత్పాదన ద్వారా సాగర్‌కు విడుదల చేయనున్నారు. 5.7 టీఎంసీల నీటిలో ఏపీకి సాగర్ కుడికాలువ ద్వారా 4 టీఎంసీలను విడుదల చేస్తారు.

సెబ్, ఎక్సైజ్ విభాగాలను విలీనం చేయండి

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): రాష్ట్రంలో విడివిడిగా ఉన్న ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్), ఎక్సైజ్ శాఖలను విలీనం చేయాలని ఏపీ ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహులు ప్రభుత్వాన్ని కోరారు. ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ గాంధీనగర్‌లోని ఎన్జీవో హోంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వం 'సెబ్' విభాగాన్ని ఎక్సైజ్ శాఖలోని సిబ్బందితో ఏర్పాటు చేసిందని తెలిపారు. రాష్ట్రంలో మద్యం, ఇసుక విధానాలను సక్రమంగా నిర్వహించేందుకే గత ప్రభుత్వం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోను ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. జేఏసీ చైర్మన్ బాబ్జీరావు మాట్లాడుతూ ఎక్సైజ్, సెబ్ విభాగాలను విలీన అవసరాన్ని తాము ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు ఇప్పటికే వివరించామన్నారు.



అకుశలమైన ఆరాటాన్ని వదిలెయ్యటం
బౌద్ధ ధర్మాచరణకు కీలకమైనది.
– బుద్ధదాన భిక్కు (బౌద్ధ ధర్మం)

సాక్షి

బుధవారం, 17 జూలై 2024

అంతులేని అనిశ్చితి!

అయిదేళ్ళలో అయిదో ప్రధానమంత్రి వచ్చారు. పొరుగున నేపాల్‌లో నెలకొన్న రాజకీయ అనిశ్చితికి ఇదే దర్పణం. అనుభవజ్ఞుడైన కమ్యూనిస్టు రాజకీయ నేత ఖడ్గ ప్రసాద్ (కె.పి) శర్మ ఓలీ నూతన ప్రధానిగా సోమవారం ప్రమాణస్వీకారం చేయడంతో... కష్టాల్లో ఉన్న తమ దేశానికి మంచి రోజులు రావచ్చేమో అని నేపాలీయులు ఆశగా చూస్తున్నారు. దేశంలోకి పెట్టుబడులు, దరిమిలా కొత్తగా ఉద్యోగాలొస్తాయని నిరీక్షిస్తున్నారు. అయితే ఓలీకి ఇది కత్తి మీద సామే. 2018లో లాగా ఆయనేమీ శక్తిమంతమైన కమ్యూనిస్ట్ ప్రభుత్వానికి సారథ్యం వహించట్లేదు. ఇప్పుడాయన సంకీర్ణ ప్రభుత్వ సారథి. పైగా, సంకీర్ణంలో ఆయన పార్టీ మైనారిటీ. అది మరో బలహీనత. సైద్ధాంతికంగా పరస్పర విరుద్ధ భావాలున్న నేపాలీ కాంగ్రెస్ (ఎన్సీ), కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ నేపాల్–యూనిఫైడ్ మార్క్సిస్ట్ లెనినిస్ట్ (సీపీఎన్–యూఎంఎల్)లు రెండూ 2027లో ఎన్నికల వరకు ప్రధాని పదవిని సమాన కాలం పంచుకోవాలన్న అవగాహనతో అనైతికంగా జట్టు కట్టాయి. ఇది ఏ మేరకు ఫలిస్తుందో తెలీదు. అది నేపాల్ సమస్యనుకున్నా, చైనా అనుకూల ఓలీ గద్దెనెక్కడం భారత్‌కు ఇబ్బందికరమే!

నేపాల్‌లో 239 ఏళ్ళ రాచరికాన్ని 2008లో రద్దు చేశారు. అదేమి శాపమో రాజరిక వ్యవస్థ రద్దయి రిపబ్లిక్‌గా మారినప్పటి నుంచి దేశం రాజకీయ అస్థిరతను ఎదుర్కొంటూనే ఉంది. ఇప్పటికి 13 ప్రభుత్వాలు మారాయి. ఏణ్ణర్థ కాలంలో నాలుగుసార్లు సభలో బలపరీక్షను తట్టుకొని బయట పడ్డ ప్రధాని, కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ నేపాల్ – మావోయిస్ట్ సెంటర్ (సీపీఎన్–ఎంసీ) నేత పుష్ప కమల్ దహల్ ప్రచండ శుక్రవారం జూలై 12న మాత్రం ఓడిపోయారు. అధికార సంకీర్ణ భాగస్వామి అయిన మితవాద సీపీఎన్– యూఎంఎల్ మద్దతు ఉపసంహరణతో ఆయనకు ఓటమి తప్పలేదు. 72 ఏళ్ళ ఓలీ నాయకత్వంలో కొత్త సంకీర్ణ సర్కార్ గద్దెనెక్కింది. ఇప్పుడొచ్చింది 14వ ప్రభుత్వం. ప్రధాని పదవి ఓలీకి కొత్త కాదు. ఆయన పగ్గాలు పట్టడం ఇది నాలుగోసారి. ఏ ప్రభుత్వం వచ్చినా నేపాల్‌లో వెంటాడే పాత సమస్యలు ఓలీకీ తప్పవు. మరో రెండు నెలల్లో పార్లమెంట్‌లో మెజారిటీ నిరూపించుకోవాల్సిన ఆయన పరస్పర విరుద్ధ సిద్ధాంతాలతో నిండిన కూటమితో ప్రభుత్వాన్ని ఎలా నడపగలరో చూడాలి. ప్రచండ ప్రభుత్వాన్ని కూల్చి, కొత్త కూటమి కట్టి దేశంలోని రెండు పెద్ద పార్టీలు ఎన్సీ, యూఎంఎల్ సాహసమే చేశాయి. సుపరిపాలన, రాజకీయ సుస్థిరతలో ఈ సంకీర్ణం విఫలమైతే అది మొత్తం రాజ్యాంగం, వ్యవస్థల వైఫల్యమేనని ప్రజలు భావించే ప్రమాదం ఉంది.

నిజానికి, ప్రపంచంలోని అత్యంత నిరుపేద దేశాల్లో నేపాల్ ఒకటి. రాజకీయ అనిశ్చితి కారణంగా అక్కడ పెట్టుబడులు పెట్టేవారు కరవయ్యారు. ఫలితంగా ఆర్థికాభివృద్ధి కుంటుపడింది. లక్షలాది యువకులు ఉద్యోగం, ఉపాధి నిమిత్తం మలేసియా, దక్షిణ కొరియా, మధ్యప్రాచ్యం దారి పట్టారు. పరిస్థితి ఎంతదాకా వెళ్ళిందంటే, గద్దెనెక్కిన ప్రభుత్వాలేవీ దేశాభివృద్ధికి ఇచ్చిన హామీలను నెరవేర్చలేదు గనక మళ్ళీ రాచరికాన్నే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ జనం అడపాదడపా నిరసన ప్రదర్శనలు కూడా చేశారు. భారత్‌తో పాటు పొరుగున ఉన్న మరో పెద్ద దేశం చైనా సైతం నేపాల్‌లోని రాజకీయ పరిణామాలను ఆది నుంచి ఆసక్తిగా గమనిస్తూ వస్తున్నాయి. ఈ హిమాలయ దేశాభివృద్ధికి ఆర్థిక సాయం అందించి, ప్రాథమిక వసతి సౌకర్యాలలో పెట్టుబడులు పెట్టడం ద్వారా ఈ ప్రాంత భౌగోళిక రాజకీయాల్లో ప్రాబల్యం సంపాదించాలని సహజంగానే ఢిల్లీ, బీజింగ్‌ల యత్నం.

భౌగోళికంగా భారత, చైనాల మధ్య చిక్కుకుపోయిన నేపాల్‌కు మొదటి నుంచి మనతో స్నేహ సంబంధాలు ఎక్కువే. కానీ గత దశాబ్ద కాలంలో ఆ పరిస్థితి మారుతూ వచ్చింది. కమ్యూనిస్ట్ నేత ఓలీ తొలివిడత నేపాల్ ప్రధానిగా వ్యవహరించినప్పుడు 2015–16లో చైనాతో ప్రయాణ, సరుకు రవాణామార్గ ఒప్పందం కుదుర్చుకున్నారు. ఫలితంగా, నేపాల్ విదేశీ వాణిజ్యంపై అప్పటి దాకా భారత్‌కు ఉన్న ఆధిపత్యానికి తెర పడింది. తాజాగా పడిపోయిన ప్రచండ సర్కార్ సైతం చైనా వైపు మొగ్గింది. నిన్న గాక మొన్న పార్లమెంట్‌లో అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కొనే ముందు ఆయన నేపాల్‌తో చైనాను కలిపే రైలు మార్గానికి పచ్చజెండా ఊపడం గమనార్హం. ఇది అనేక వందల కోట్ల డాలర్లతో డ్రాగన్ చేపట్టిన ప్రతిష్ఠాత్మక బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్ (బీఆర్ఐ) ప్రాజెక్ట్ కింద కొస్తుంది. దీంతో నేపాల్ – చైనా సరిహద్దు వెంట వసతులు పెరుగుతాయని పైకి అంటున్న మాట. నిజానికి సరిహద్దులో చైనాకు పట్టు పెంచే ఈ చర్య భారత్‌కు తలనొప్పి!

అసలు బీఆర్ఐ ప్రాజెక్టుల వెనక చైనా వ్యూహం వేరు. చిన్న చిన్న దేశాలకు పెద్దయెత్తున అప్పులిస్తూ, ఋణ దౌత్యం ద్వారా ఆ యా ప్రాంతాల్లో భౌగోళిక రాజకీయాల్లో పైచేయి సాధించడం డ్రాగన్ ఎత్తుగడ. అందుకే, ప్రపంచ దేశాలు దీనిపై ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. దీర్ఘకాలంలో ఈ ప్రాజెక్టులు సంబంధిత చిన్నదేశాలకు భరించలేని భారమవుతాయి. చివరకు ఆ దేశాలు చైనా మాటకు తలూపాల్సి వస్తుంది. గతంలో చైనా ఇలాగే శ్రీలంకలో హంబన్‌తోట పోర్ట్‌కు ఋణమిచ్చింది. బాకీలు తీర్చడంలో విఫలమైన సింహళం చివరకు బాకీకి బదులు ఈక్విటీలిచ్చి, 2017లో ఆ పోర్ట్‌ను 99 ఏళ్ళ లీజుకు చైనాకు అప్పగించింది. ఇలాంటి కారణాల వల్లే బీఆర్ఐ పట్ల ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలున్నాయి. అలాగే బీఆర్ఐ కింద చైనా–పాక్ ఆర్థిక నడవా ప్రాజెక్ట్ అంటూ పాక్ ఆక్రమిత కశ్మీర్ గుండా దాన్ని చేపట్టడాన్ని భారత్ నిరసించింది. ఇప్పుడు భారత్ కన్నా చైనాకు మరింత సన్నిహితుడైన ఓలీ వల్ల నేపాల్ కూడా చైనా గుప్పిట్లోకి జారిపోవచ్చు. మనం తక్షణమే అప్రమత్తం కావాలి. మనతో సన్నిహిత సంబంధాలు కీలకమని ఓలీ గుర్తించేలా చేయాలి. ఓలీ సంకీర్ణంలో అధిక సంఖ్యాబలమున్న ఎన్సీ చిరకాలంగా భారత అనుకూల పార్టీ కావడం ఉన్నంతలో కొంత ఊరట.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మ ఋతువు
ఆషాఢ మాసం, తిథి: శు.ఏకాదశి సా.5.54 వరకు
తదుపరి ద్వాదశి, నక్షత్రం: అనూరాధ రా.1.18 వరకు
తదుపరి జ్యేష్ఠ, వర్జ్యం: లేదు, దుర్ముహూర్తం: ఉ.11.39 నుండి 12.31 వరకు, అమృత ఘడియలు: ప.2.20 నుండి 4.01 వరకు, తొలి ఏకాదశి.

సూర్యోదయం : 5.37
సూర్యాస్తమయం: 6.34
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

అధ్యక్షుడిగా ట్రంప్ మళ్లీ గెలిస్తే?

అభిప్రాయం



ప్రశాంత్ రుహా

అగ్రరాజ్యం అమెరికాలో అధ్యక్ష ఎన్నికలు దగ్గరపడుతున్నాయి. ఊహించినట్టుగానే రిపబ్లికన్ పార్టీ తన అధికారిక అధ్యక్ష అభ్యర్థిగా డోనాల్డ్ ట్రంప్‌ను ఎంచుకుంది. ఇప్పటికే ట్రంప్‌కు సానుకూల పవనాలు వీస్తుండగా, ఆయన మీద జరిగిన హత్యాయత్నం ఆయన విజయావకాశాలను మరింతగా పెంచేవుంటుంది. అయితే ఇంకోసారి ట్రంప్‌కు అధికార పగ్గాలు చిక్కితే రకరకాలుగా నష్టం జరిగే అవకాశాలు మెండు! ప్రజాస్వామ్యం, వాతావరణ మార్పు అంశాల్లో ట్రంప్ నిర్ణయాలు అమెరికాను బలహీనపరచడమే కాకుండా... భారత దేశానికీ ఆందోళన కలిగించేవే. ట్రంప్ తన పాత వైఖరినే కొనసాగిస్తే చైనా ఆధిపత్యం పెరుగుతుంది. అమెరికా అంతర్గతంగా బలహీనపడితే కూడా లాభపడేది చైనా మాత్రమే అన్నది గుర్తుంచుకోవాలి.

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో భాగంగా జరిగిన తొలి ముఖాముఖి చర్చ జో బైడెన్‌కు ఓ దుస్వప్నంలా మిగిలిపోయింది. తడబాటు, తత్తరపాటు, మతిమరపులతో బైడెన్‌పై అమెరికాతోపాటు ప్రపంచవ్యాప్తంగానూ వ్యతిరేకులు పెరిగిపోయారు. బైడెన్ వైఫల్యం కాస్తా ట్రంప్‌కు వరంగా మారిందని చెప్పాలి. అధ్యక్షుడిగా బైడెన్ రికార్డు బాగానే ఉంది. కానీ చర్చ కార్యక్రమం మాత్రం అతడి వయసు, మానసిక ఆరోగ్యంపై అనేక సందేహాలు లేవనెత్తింది. డెమోక్రాట్ల విశ్వసనీయతతోపాటు వైట్‌హౌస్‌పై కూడా నమ్మకం సడలించే వ్యవహారమిది. డెమోక్రాట్లకు ఓటేయాల్సిందిగా మద్దతుదారులు కూడా అడిగేందుకు సందేహించే పరిస్థితి వచ్చింది. బైడెన్ ఇవేవీ పట్టించుకునే పరిస్థితిలో లేరు. పోటీ నుంచి తప్పుకొమ్మని చాలామంది సలహా ఇస్తున్నా... అధికారాన్ని వదులుకునేందుకు సిద్ధంగా లేరు. పైగా తాను మాత్రమే ట్రంప్‌ను ఓడించగలనని అంటున్నారు.



వాతావరణ మార్పును పట్టించుకోరు!

ఈ నేపథ్యంలోనే అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ఇంకోసారి ఎన్నికైతే ఏమిటి? అన్న ప్రశ్నకు సమాధానాలు వెతుక్కోవాల్సి వస్తోంది. చాలా రకాలుగా విధ్వంసం జరుగుతుందన్నది కచ్చితం. కాకపోతే భారతదేశం అంటే మనం ఆలోచించాల్సిన అంశాలు ప్రధానంగా రెండు ఉన్నాయి. శతాబ్దాలుగా... ఇప్పుడు కూడా అమెరికా వెలువరించే కర్బన ఉద్గారాలు భారీ స్థాయిలో ఉన్నాయన్నది తెలిసిందే. ఇందుకు బాధ్యత వహించే విషయంలో మాత్రం అగ్రరాజ్యం బాధ్యతారహితంగా వ్యవహరిస్తోంది. వాతావరణ మార్పుల ప్రభావాన్ని అడ్డుకునేందుకు జరుగుతున్న ప్రయత్నాలకు తన వంతు సాయం అందించేందుకు తిరస్కరిస్తోంది. వినియోగదారుల కేంద్రంగా నడిచే ఆర్థిక వ్యవస్థగానే మిగిలిపోయిన అమెరికా విచ్చలవిడి ఖర్చులు, వనరుల వృథాకు ప్రసిద్ధి. కపటత్వం కూడా ఎక్కువే. కోట్లాదిమందిని పేదరికం కోరల నుంచి తప్పించాల్సిన బాధ్యత ఉన్న దేశాలు అభివృద్ధి విషయంలో రాజీపడాల్సిందిగా కోరడం దీనికి నిదర్శనం. చారిత్రక బాధ్యతలను విస్మరించడం, తమ జీవనశైలిని మార్చుకునే ప్రయత్నాలు అస్సలు చేయకపోవడం అమెరికాకు మాత్రమే ప్రత్యేకం.

ఈ విషయమై అటు డెమోక్రాట్లనూ, ఇటు రిపబ్లికన్లనూ ఇద్దరినీ నిందించాల్సిందే. అయితే బైడెన్ గద్దెనెక్కిన తరువాత ప్యారిస్ ఒప్పందానికి ఊ కొట్టడం, వాతావరణ మార్పులకు సంబంధించి చట్టాన్ని ఆమోదించడం, స్థానికంగా కర్బన ఉద్గారాల తగ్గింపునకు లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవడం గమనార్హం. వాతావరణ సంక్షోభ నివారణ యత్నాలకు రుణసాయం ఇచ్చేలా బ్యాంకులను ప్రోత్సహించారు కూడా. ఈ చర్యలన్నీ నామమాత్రంగానైనా తానూ బాధ్యత తీసుకుంటున్న భావన కలిగించాయి. ఒకవేళ ట్రంప్ రెండోసారి పగ్గాలు చేపడితే ఇవేవీ కొనసాగించడన్నది కచ్చితం. తొలి దఫా గద్దెనెక్కినప్పటి చందంగానే వాతావరణ మార్పులన్నవి అసలు సమస్యే కాదన్నట్టుగా నటిస్తారు.

ట్రంప్ అధ్యక్షుడైతే పాశ్చాత్య దేశాల నుంచి భారత్‌పై వస్తున్న ఒత్తిడి తగ్గుతుందని అనుకునేందుకు బాగానే ఉంటుంది కానీ... అది స్వల్పకాలికం మాత్రమే. వాతావరణ మార్పులనేవి ప్రపంచం మొత్తం సమస్య. ఈ సమస్య ముదిరిపోవడంలో అమెరికా పాత్ర పెద్దది. పరిష్కారం కూడా అమెరికా ప్రమేయంతో మాత్రమే సాధ్యమవుతుంది. ట్రంప్ తన పాత వైఖరినే కొనసాగిస్తే ఈ విషయంలో చైనా ఆధిపత్యం పెరుగుతుంది. వాతావరణ పరిరక్షణకు సంబంధించి టెక్నాలజీల అభివృద్ధిలోనూ ముందుకు దూసుకెళుతుంది. ఫలితంగా ఇప్పటివరకూ వాతావరణ మార్పుల అంశంపై పని చేస్తున్న ప్రపంచ బ్యాంకు వంటి ఆర్థిక సంస్థలు నిర్వీర్యమవుతాయి. అమెరికాకు చెందిన ప్రైవేట్ కంపెనీలు వాతావరణ మార్పులకు సంబంధించి పెట్టుబడులు పెట్టడం నిలిచిపోతుంది. దీనివల్ల వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు ఆర్థిక సాయం కోసం ఎదురు చూస్తున్న దేశాలు నష్టపోవాల్సి వస్తుంది.

వ్యవస్థలు దెబ్బతింటాయి!

రెండో విషయానికి వద్దాం. అమెరికా ప్రజాస్వామ్య వ్యవస్థలో బోలెడన్ని లోటుపాట్లు ఉన్నాయి. న్యాయవ్యవస్థను ఉదాహరణగా తీసుకుంటే అక్కడ న్యాయమూర్తులు శాశ్వత ప్రాతిపదికన నియమితులవుతారు. ఫలితంగా వారికి బాధ్యత శూన్యం. పైగా న్యాయమూర్తుల నియామకాలు అధికార వర్గం ద్వారా జరుగుతాయి. ఫలితంగా వీరు పక్షపాతంగా ఉండేందుకూ, తాము నమ్మే భావజాలానికి అనుగుణంగా నడుచుకునేందుకూ అవకాశాలు ఎక్కువ. ఫలితంగా ప్రజాస్వామ్యంలో అతి కీలకమైన ఒక అంగం విపరీతమైన అధికారాలు కలిగి ఉండటమే కాకుండా... సైద్ధాంతిక అంశాలపై విభజితమై ఉంటుంది.

అంతెందుకు అమెరికా ఎన్నికల వ్యవస్థనే తీసుకుంటే... అధ్యక్ష తరహా ఎన్నికల వ్యవస్థ ఉంది. మెజారిటీ ప్రజల అభిప్రాయం, ఫలితాలతో నిమిత్తం లేదు. ఫలితంగా అవినీతిపరుడైన నేత... విరాళాలిచ్చే వారు కుమ్మక్కయ్యే అవకాశం ఉంటుంది. 2020 నాటి ఎన్నికలు ఎంతో మెరుగ్గానే జరిగాయని అనుకున్నా ఆ తరువాత అమెరికాలో సగం మంది ఎన్నికల ప్రక్రియను, అధికార మార్పిడి జరిగిన తీరును తప్పుపట్టడం గమనార్హం.

ఈ సమస్యలకు అమెరికా రాజ్యాంగ నిర్మాణం ఒక కారణమని చెప్పాలి. వ్యవస్థలు అధికారంలో ఎవరున్నారు అన్న అంశం ఆధారంగా ఒడుదొడుకులకు లోను కాకూడదు. ట్రంప్ అమెరికా సుప్రీం కోర్టుకు ముగ్గురు న్యాయమూర్తుల నియామకాలకు ప్రతిపాదించడం ఇప్పటికే మానవ, మహిళ హక్కుల విషయంలో ప్రతికూల పరిస్థితులు తెచ్చి పెట్టాయి. అబార్షన్ విషయంలో అధ్యక్షుడికి తిరుగులేని అధికారాలు దక్కిన విషయం ఇక్కడ చెప్పుకోవాలి. ఈ పరిస్థితుల్లో ట్రంప్ గద్దెనెక్కితే మరింత మంది న్యాయమూర్తులను ఆయన సుప్రీం కోర్టులో నియమించవచ్చు. ఎన్నికల ఫలితాలను సవాలు చేయడం మాత్రమే కాకుండా... నేరం రుజువైనా అధికారంలో కొనసాగేందుకు ప్రయత్నించడం వంటివి ఎక్కువ అవుతాయి. జాతి వివక్ష పెరగడం, క్రిస్టియన్ జాతీయతా భావజాలం పెరగడం ప్రజాస్వామ్యానికి మంచి చేసే అంశాలు కాదు. ట్రంప్ గెలుపుతోపాటు సెనేట్‌లో కూడా రిపబ్లికన్లకు ఆధిక్యం దక్కితే గోరుచుట్టుపై రోకటిపోటు చందం కాక తప్పదు.

భారత్ ఆలోచించాలి!

భారతదేశ అధికార వర్గాలు ట్రంప్ మరోసారి గెలిస్తే ఏమిటన్న అంశంపై ఆలోచన మొదలుపెట్టాల్సిన అవసరం ఉంది. ట్రంప్ రాకతో ప్రజాస్వామ్యంలో మన లోటుపాట్లు పక్కకు వెళ్లిపోతాయిలే అనుకుంటే అది తప్పే అవుతుంది. వాస్తవానికి సమస్య మరింత పెరుగుతుంది. అమెరికా వ్యవస్థలు, సంస్థల పనితీరుపై చర్చ ఎంత పెరిగితే ఆ దేశ రాజకీయం అంత అస్థిరమవుతుంది. సమాజం కూడా రకరకాల అంశాలపై ముక్కలు అవుతుంది. ఈ పరిణామాలన్నీ చివరకు అంతర్గత కుమ్ములాటలకూ, సంఘర్షణలకూ తావిస్తాయి. అంతర్జాతీయ, దేశీ రాజకీయాలపై అమెరికాను ఎంత కఠినంగానైనా విమర్శించవచ్చు కానీ... ఆ దేశం అంతర్గతంగా బలహీనపడితే లాభపడేది చైనా మాత్రమే అన్నది గుర్తుంచుకోవాలి. అంతేకాదు... అమెరికాకు వలస వెళ్లిన, ఉద్యోగాలు చేసుకుంటున్న భారతీయులకూ, ఇతర దేశస్థులకూ అంత మంచిది కాదు. ట్రంప్ తిరిగి అధ్యక్షుడు కావడం ప్రపంచ రాజకీయాలు, వాతావరణ మార్పుల సమస్యలకు నిర్ణయాత్మకం కానుందన్నది నిస్సందేహం!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ప్రదర్శన కోసమే!



రెండు వేల చదరపు అడుగుల ఇంటిలో మనం కేవలం 200 చదరపు అడుగుల స్థలంలోనే నివసిస్తాం. "మిగతా స్థలంలో మన అహం జీవిస్తుంది."

– ఎస్.వై. ఖురేషీ, కేంద్ర ఎన్నికల మాజీ కమిషనర్

ఇండియా అదుర్స్



తక్కువ జనాభే ఉన్నప్పటికీ అమెరికా రాజకీయాల్లో భారతీయులు అదరగొడుతున్నారు. మరో పక్క చైనీయులు ఎంతమాత్రమూ తమ ముద్రను వేయడం లేదు. దీన్ని ఎలా చూడాలి?

– డేనియల్, వ్యాఖ్యాత

ఆధునిక అమెరికా



ఉపాధ్యక్ష పదవికి తన అభ్యర్థిగా జేడీ వాన్స్‌ను ట్రంప్ ఎంచుకోవడం పట్ల ప్రగతిశీల లెఫ్ట్, స్థానిక రైట్ ఇద్దైపోతున్నారు. వాన్స్ భక్తిగల క్యాథలిక్కు. భారత మూలాలున్న ఆయన భార్య ఉష భక్తిగల హిందువు. ఇది అమెరికా ఆధునిక కుటుంబం. సంప్రదాయ అమెరికా ఎలా ఉంటుందని జనాలు అనుకుంటారో ఆ మూసలో వాళ్లు ఇమడరు. అదే లెఫ్ట్, రైటును అయోమయానికి గురిచేస్తోంది. గాడ్ బ్లెస్ అమెరికా!

– రూపా సుబ్రహ్మణ్య, ఆర్థికవేత్త

సామాజిక విచారణ



యూపీఎస్సీ (యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్) కుంభకోణాలను బహిర్గతం చేయడంలో ట్విట్టర్ వేదిక కొత్త సీబీఐలా అవతరించింది.

– జ్యోతి, కంటెంట్ క్రియేటర్

కాంగ్రెస్ వాటం



ప్రతిపక్ష పార్టీలను బీజేపీ చీల్చినప్పుడు దాన్ని మనం 'ఆపరేషన్ కమలం' అంటాం. మరి తెలంగాణలో బీఆర్ఎస్‌ను కాంగ్రెస్ చీలుస్తుంటే దాన్ని ఏమనాలి? గత కొన్ని వారాల్లో పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇంకొంతమంది వరుసలో ఉన్నారు. 'ఆపరేషన్ చేతివాటం'?

– రాజ్‌దీప్ సర్దేశాయి, జర్నలిస్ట్

తిప్పి కొడతారా?



జమ్ము ప్రాంతంలోని దోడా జిల్లాలో పాకిస్తాన్ ప్రాయోజిత తీవ్రవాదులతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు సైనికులు అమరులయ్యారు. ఇది పరోక్ష యుద్ధం కాదు. తన యుద్ధ చర్యలతో పాకిస్తాన్ మళ్లీ మళ్లీ ఇండియాను కవ్విస్తూనేవుంది. మరి దీనికి ఇండియా స్పందన ఏమిటి?

– ఆర్తీ టిక్కూ సింగ్, జర్నలిస్ట్

సాయానికి రారనా?



తర్వాతి ఉక్రెయిన్ శాంతి శిఖరాగ్ర సదస్సుకు రష్యాను తప్పకుండా ఆహ్వానించాలని (ఉక్రెయిన్ అధ్యక్షుడు) జెలెన్‌స్కీ అంటున్నారు. చూస్తుంటే ఆయన కూడా ట్రంప్ గెలుస్తారని అనుకుంటున్నట్టుగా ఉంది. (ఉక్రెయిన్‌కు అమెరికా సాయాన్ని ట్రంప్ వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో.)

– స్టాన్లీ జానీ, కాలమిస్ట్

మనం చేయాల్సిన యుద్ధం

యువత మాదక ద్రవ్యాల బారిన పడటం ఇవ్వాళ ఒక సామాజిక సమస్య. ఈ సమస్య అంతానికి అందరూ కృషిచేయాలి. అయితే డ్రగ్స్ సరఫరాదారుల సమాచారం తెలిసినా దాన్ని రహస్యంగా సంబంధిత వర్గాలకు అందజేయడానికి మార్గాలు తెలియకపోవడం, గోప్యత విషయంలో కొన్ని భయాల కారణంగా డ్రగ్స్‌పై యుద్ధంలో అందరూ పాల్గొనలేకపోతున్నారు. డ్రగ్స్ అక్రమ రవాణాపై '100' నంబర్‌కు సమాచారమివ్వమని ప్రభుత్వం ప్రజలను కోరుతోంది (తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో నంబర్ 8712671111; నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో 'మానస్ జాతీయ హెల్ప్ లైన్ 1933' ఇంకా ప్రతిపాదన దశలో ఉంది). ఉదాహరణకు ఒక విద్యార్థి తన కళాశాలలోని విద్యార్థులకు డ్రగ్స్ అక్రమ రవాణా జరుగుతున్నట్లు తెలిసి హెల్ప్ లైన్‌కు ఫోన్ చేయబోయే ముందు తన భద్రతపై సందేహాలు మనసులో మెదిలి ఆ ప్రయత్నం నుంచి విరమించుకుంటాడు. ఫోన్ చేస్తే తన నంబర్ ఎక్కడ గుర్తిస్తారో అనేది ప్రధానమైన భయం.

యువతను డ్రగ్స్ బారి నుంచి కాపాడే అవకాశం తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు, మిత్రులకు ఉంటుంది. తొలి దశలోనే గుర్తించడం వల్ల పిల్లలను కాపాడుకోవచ్చనీ, అందుకు కొంత నైపుణ్యం ఉండాలనే అవగాహన కల్పించడం అవసరం. పిల్లల ప్రవర్తనలో ఈ మార్పులు గమనించాలి: డ్రగ్స్ కోసం డబ్బు, సమయం వృథా చేయడం, అప్పు, దొంగతనం చేయడం (ఇంట్లో డబ్బు, వస్తువులు మాయమవటం); చదువుపై ఆసక్తి తగ్గి, కళాశాలకు హాజరు కాకపోవటం, మార్కులు తగ్గిపోవటం; దుస్తులు, అలంకరణపై శ్రద్ధ లేకపోవడం; స్నేహితులు, కుటుంబంతో దూరంగా ఉండటం; రహస్యంగా కొత్త స్నేహితులతో బయటికి వెళ్ళడం, ఏ అనారోగ్యం లేకున్నా మందులు వాడటం, పెద్ద శబ్దానికి అసహనం చెందడం, ఆత్రుత, చికాకు, నిరుత్సాహం, ఆందోళన, విపరీతమైన అనుమానం, హింసాత్మక ప్రవర్తన, భ్రాంతికి గురవ్వడం.

పిల్లల్లో ఈ భౌతిక మార్పులు గమనించాలి: బరువు తగ్గడం లేదా పెరగడం, కళ్ళు ఎరుపెక్కడం, పొడిబారిన నోరు, చేతుల తడబాటు, చేతివేళ్లు పసుపుగా మారడం (గంజాయి), దగ్గు, ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్లు, మగత, అస్పష్టమైన మాటలు, అసంకల్పిత కంటి కదలికలు, కనుపాపలు పెద్దగా మారడం, కళ్ల మధ్యలో నల్లటి వలయాలు (కొకైన్), వణుకు, పళ్ళు బిగించడం, కండరాల తిమ్మిరి, కనుపాపలు చిన్నగా మారడం (నల్లమందు), చర్మంపై సూది గుర్తులు. సాధ్యమైనంత త్వరగా డ్రగ్స్ ప్రభావాన్ని గుర్తించి తగిన వైద్య సహాయం, కౌన్సెలింగ్ అందించడం ద్వారా పిల్లలను సాధారణ స్థితికి తీసుకురావడానికి కుటుంబ సభ్యులు, మిత్రుల మద్దతు కీలకం.

– శ్రీనివాస్ మాధవ్, సమాచార హక్కు కార్యకర్త । హైదరాబాద్

చేసిన చట్టానికి... చేజేతులా తూట్లు!

భారతదేశం ప్రజాస్వామిక దేశం. ప్రజల హక్కులను కాపాడుతూ, ప్రజల కోణంలో పాలన సాగేందుకు దిక్సూచిగా రాజ్యాంగం ఉంది. అయితే ఇవాళ మహోన్నతమైన రాజ్యాంగ స్ఫూర్తి రాజకీయాల్లో కొరవడింది. రాజకీయ విమర్శలు, ప్రతి విమర్శలకు రాజ్యాంగాన్ని కేంద్ర బిందువుగా మార్చారు. అధికారమే పరమావధిగా ఎవరికి తోచిన విధంగా వారు 'మీరే రాజ్యాంగాన్ని కాలరాస్తున్నారంటే... కాదు మీరే రాజ్యాంగానికి సమాధి కడుతున్నారని' పరస్పరారోపణలు చేసుకుంటున్నారు. అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీతో పాటుగా కొన్ని ప్రాంతీయ పార్టీలు సైతం రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కుతూనే ఉన్నాయి. రాహుల్ గాంధీ రాజ్యాంగ ప్రతిని చేత బూని ఎన్నికల ప్రచారంలో, పార్లమెంటు సమావేశాల్లో చూపుతూ 'రాజ్యాంగాన్ని కాపాడాలి' అనే నినాదం ఇచ్చారు. తమ ఎన్నికల మేనిఫెస్టోలో 'న్యాయపత్ర'లోని 13వ న్యాయ సూత్రంగా 'ప్రజాప్రతినిధులు గెలిచిన సొంత పార్టీని వీడి మరొక పార్టీలో చేరితే వెనువెంటనే అనర్హత వేటు పడే విధంగా 10వ షెడ్యూలును సవరించి పార్టీ ఫిరాయింపులను నిరోధిస్తా'మని హామీ ఇచ్చారు. కానీ తెలంగాణలో కాంగ్రెస్ అందుకు విరుద్ధంగా ప్రవర్తిస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో 63 స్థానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రతీకార ధోరణితో 39 స్థానాలను గెలుచుకున్న భారత రాష్ట్ర సమితి శాసన సభ్యులను, శాసన మండలి సభ్యులను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకుని పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ రాజ్యాంగానికి తూట్లు పొడుస్తోంది. తాము ఎన్నికల హామీగా ఏమిచ్చారో దాన్నే వారు స్వయంగా అతిక్రమించడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి?

పార్టీ ఫిరాయింపులకు వ్యతిరేకంగా కేంద్రంలో కాంగ్రెస్ అగ్రనాయకత్వం రాజ్యాంగాన్ని చేతబూని ప్రకటనలు ఇస్తుంటే... మరోవైపు తెలంగాణ రాష్ట్ర నాయకత్వం



అందుకు పూర్తి భిన్నంగా బీఆర్ఎస్ శాసన సభ్యులు ఆరుగురిని దఫదఫాలుగా, శాసన మండలి సభ్యులు పదిమందిని ఒకేసారి చేర్చుకుంది. కాంగ్రెస్ ప్రధాని రాజీవ్ గాంధీ హయాంలో 1985లో 52వ రాజ్యాంగ సవరణ ద్వారా 10వ షెడ్యూల్‌లో 101, 102 (2), 190, 191 (2) అధికరణాల ద్వారా అమలులోకి తెచ్చిన పార్టీ ఫిరాయింపుల చట్టానికి ఈ చర్యతో కాంగ్రెస్ తూట్లు పొడిచినట్లే కదా!

బీజేపీ సైతం ఫిరాయింపులకు వ్యతిరేకం అంటూనే గతంలో దాదాపు ఎనిమిది నుండి పది రాష్ట్రాల ప్రజా ప్రభుత్వాలను పడగొట్టి, మిత్రపక్షాలతో కలిసి అనైతిక ప్రభుత్వాలను ఏర్పాటు చేసిన సంగతినీ మరువరాదు.

2014లో ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలో పదేండ్లు అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితి కూడా తొలుత బలం పెంచుకోవాలనే ఆలోచనతో కాంగ్రెస్, టీడీపీ శాసన సభ్యులను చేర్చుకున్నపటికీ న్యాయపరంగా చిక్కులు రావొచ్చనే ఆలోచనతో ఆ యా పార్టీల 'సభా పక్షాలను' విలీనం చేసుకుంది. అనాడు పలువురు రాజకీయ ప్రముఖులు, విశ్లేషకులు ఈ విలీనాలను తప్పు పట్టారు.

తెలంగాణలో పార్టీలు మారిన ప్రజాప్రతినిధులు అధికారమే పరమావధిగా వ్యవహరిస్తున్నారు. పదేండ్లు కారు పార్టీలో అధికారాన్ని అనుభవించి, ఆ పార్టీ అధికారం కోల్పోగానే రాజకీయ విలువలకు తిలోదకాలు ఇస్తూ గెలిచిన పార్టీ (కాంగ్రెస్)లోకి చేరడం ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నది. వారిని నమ్ముకుని భుజానికెత్తుకొని గెలిపించిన కార్యకర్తలకు అండగా ఉండాల్సిన వీరు ఎన్నికైన పదవికి రాజీనామా చేయకుండా పార్టీ మారడాన్ని ప్రజలు గర్హిస్తున్నారు. పార్టీ ఫిరాయింపుల పట్ల రెండు నాలుకల ధోరణితో ఉన్న కాంగ్రెస్ పార్టీ ముందు ముందు ప్రజాక్షేత్రంలో ఎదురుదెబ్బ తినక తప్పదు.

– పిన్నింటి విజయ్ కుమార్
పొలిటికల్ సైన్స్ విద్యార్థి । 90520 39109

విశ్వాసి కర్తవ్యం

ఇస్లాం చరిత్రలో 'మొహర్రం' నెలకు ఒక ప్రత్యేకత ఉంది. యావత్తు ముస్లిం జగత్తుకు ఇది కొత్త సంవత్సరం. ఇస్లామీయ క్యాలెండర్ మొహర్రం మాసంతో ప్రారంభమవుతుంది. ఈ మాసంలో ఒక విషాద సంఘటన జరిగినప్పటికీ, అది యాదృచ్ఛికమే తప్ప మరొకటి కాదు. అందుకని అపశకునంగా భావించి, ప్రత్యేకతలు ఆపాదించడం సరికాదు. ఈ నెల పదవ తేదీన ప్రవక్త (స) మనుమడు ఇమామె హుసైన్(ర) అమరులయ్యారు. ఆయన ప్రాణత్యాగం వెనుక ఒక మహోన్నత లక్ష్యం ఉంది. దాన్ని ఆదర్శంగా తీసుకోవాలి. అది అర్థం కావాలంటే, నేపథ్యాన్ని తెలుసు కోవాలి. ముహమ్మద్ ప్రవక్త (స) నిర్యాణం తరువాత ఖలీఫాల పాలన మొదలైంది. వారి పాలనలో ప్రజాస్వామ్యం పరిఢవిల్లింది. ఇస్లామీయ ప్రజాస్వామ్యంలో మొట్టమొదటి సూత్రం, 'దేశం దైవానిది, దేశవాసులు ఆయన పాలితులు'. అంతేకాని పాలకులు ప్రజలకు ప్రభువులు ఎంతమాత్రం కాదు.

ఇస్లామీయ రాజ్యానికి దైవభీతి, సత్ శీలత, జవాబుదారీతనం ప్రాణం లాంటివి. పాలకులు ఈ సుగుణాలకు ప్రతిరూపంగా ఉండేవారు. కాని ఖలీఫాల తదనంతర కాలంలో పరిస్థితులు మారిపోయాయి. దైవభీతి, జవాబుదారీతనం, ప్రజాస్వామ్య భావనలకు భంగం ఏర్పడింది. యజీద్ రాచరికం రూపంలో పురుడు పోసుకున్న దుష్పరిణామాలు ఇస్లామీయ ప్రజాస్వామ్య భావనను తుంగలో తొక్కాయి. కుటుంబ పాలన, చక్రవర్తుల పరంపర మొదలైంది. ఈ దురదృష్టకర పరిణామాల కారణంగా ముస్లిం సమాజం నేటి వరకూ ఇస్లామీయ ప్రజాస్వామ్య స్ఫూర్తికి దూరంగానే ఉండిపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో ఇస్లామీయ ప్రజాస్వామ్య పరిరక్షణకు కంకణ బద్ధులయ్యారు ఇమామె హుసైన్ (ర). లక్ష్యసాధన కోసం, విలువల పరిరక్షణ కోసం ఎలాంటి పరిణామాల నెదుర్కోడానికైనా, చివరికి ప్రాణత్యాగానికైనా వెనుకాడలేదు. ప్రజాకంటకమైన రాచరిక వ్యవస్థను ఎదుర్కొని వీరోచితంగా పోరాడి, ఇస్లామీయ ప్రజాస్వామ్య సంక్షేమ రాజ్యాన్నీ, దాని ప్రత్యేకతల్నీ కాపాడుకోడానికీ 'కర్బలా' సాక్షిగా ఒక విశ్వాసి పోషించవలసిన పాత్రను ఆచరణాత్మకంగా నిరూపించారు. అందుకే ఆ మహనీయుడు అమరుడై దాదాపు వేయిన్నర సంవత్సరాలు కావస్తున్నా నేటికీ కోట్లాదిమంది ప్రజలకు, ప్రజాస్వామ్య ప్రియులకు స్ఫూర్తిగా నిలిచారు. ఇందుకే ప్రతి యేటా 'మొహర్రం' పదవ తేదీన ఆయన త్యాగాన్ని స్మరించుకుంటారు.



– మదీహా అర్జుమంద్
(నేడు ఇమామె హుసైన్ వర్ధంతి 'మొహర్రం')

క్లుప్తంగా...

తిరునెల్వేలి-షాలీమార్ మధ్య ప్రత్యేక రైలు

రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా విజయవాడ మీదుగా తిరునెల్వేలి-షాలీమార్ మధ్య ప్రత్యేక రైలు నడపనున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18, 25 తేదీల్లో తిరునెల్వేలి-షాలీమార్ ప్రత్యేక రైలు (06087) గురువారం మధ్యరాత్రి 1.50 గంటలకు తిరునెల్వేలిలో బయలుదేరి, మరుసటి రోజు రాత్రి తొమ్మిది గంటలకు షాలీమార్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (06088) ఈ నెల 20, 27 తేదీల్లో శనివారం సాయంత్రం 5.10 గంటలకు షాలీమార్‌లో బయలుదేరి, మూడవ రోజు సోమవారం మధ్యాహ్నం 1.15 గంటలకు తిరునెల్వేలి చేరుతుంది.

7 నుంచి భీమేశ్వరుని మూలవిరాట్ దర్శనం



రామచంద్రపురం రూరల్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి మూలవిరాట్ దర్శనానికి ఆగస్టు 7వ తేదీ నుంచి భక్తులను అనుమతించనున్నట్లు ఆలయ ఈవో పితాని తారకేశ్వరరావు మంగళవారం ప్రకటించారు. ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆలయంలో మూల విరాట్ పరిరక్షణ పనులు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆర్కియాలజీ సీనియర్ కన్జర్వేషన్ అసిస్టెంట్ సూచనల మేరకు సంరక్షణ పనులు ఈ నెల 20 వరకు పొడిగించారు. దీంతో బాలాలయంలో భక్తులకు కల్పిస్తున్న దర్శనాలకు బదులుగా మూలవిరాట్ దర్శనానికి మరి కొంతకాలం వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఆర్కియాలజీ అధికారుల సూచనల అనంతరం ఆలయ వంశ పారంపర్య అర్చకులతో చర్చించగా.. శూన్యమాసం..శుభ ముహూర్తాలు లేని కారణంగా ఆగస్టు 5, 6 తేదీల్లో సంప్రోక్షణ నిర్వహించి 7వ తేదీ నుంచి మూలవిరాట్ దర్శనాలు ప్రారంభించనున్నట్లు ఈవో తెలిపారు. అంతవరకు బాలాలయం వద్దనే భీమేశ్వరస్వామి, మాణిక్యాంబ అమ్మవార్ల దర్శనాలు జరుగుతాయన్నారు.

కిడ్నీ రాకెట్ కేసులో ఇరువురు అరెస్ట్

- రిమాండ్‌కు తరలింపు

గుంటూరు ఈస్ట్: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన కిడ్నీ రాకెట్ కేసులో నగరంపాలెం పోలీసులు మంగళవారం ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వెస్ట్ డీఎస్పీ మహేష్, ఎస్‌హెచ్‌వో మధుసూదనరావు వివరాలు వెల్లడించారు. విజయవాడలోని ఏలూరు రోడ్డుకు చెందిన సయ్యద్ యూసఫ్ సోను బాషా, కృష్ణాజిల్లా బంటుమిల్లి మండలం నరసప్పచెరువుకు చెందిన నిమ్మకాయల సుబ్రమణ్యంను అరెస్టు చేశారు. పల్నాడు జిల్లా క్రోసూరు మండలం గరికపాడు గ్రామానికి చెందిన కె.మధుబాబు హానీ పేరుతో ఉన్న ఫేస్‌బుక్ అకౌంట్‌లోకిడ్నీ కావాలంటూ ఇచ్చిన ప్రకటన చూసి.. తన వివరాలు తెలియజేస్తూ కిడ్నీ ఇచ్చేందుకు ఇష్టపడుతున్నట్లు సమాచారం పెట్టాడు. అవతలి వ్యక్తులు మధుబాబును సంప్రదించి విజయవాడ రావాలని కోరారు. మధుబాబు విజయవాడ వెళ్లగా ఒక కిడ్నీ ఇస్తే రూ.30లక్షలు ఇస్తామని ఆశ చూపారు. జూన్ 15న వైద్యులు మధుకు ఆపరేషన్ చేసి అతని కిడ్నీని కేతినేని వెంకటస్వామి అనే వ్యక్తికి మార్పిడి చేశారు. అనంతరం నిందితుడు మధుబాబుకు రెండు దఫాలుగా లక్ష రూపాయలు మాత్రమే చెల్లించారు. మిగిలిన నగదు ఇవ్వకుండా మోసం చేశారు. దీంతో బాధితుడు మధుబాబు నగరపాలెం పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేసి పై ఇరువురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా, డీఎస్పీ మహేష్ మాట్లాడుతూ.. కేసు విచారణలో తమపై ఎటువంటి ఒత్తిడి లేదన్నారు.నిష్పక్షపాతంగా విచారణ చేస్తున్నామని వివరించారు.

పాకల తీరంలో సోనా బోట్ల హల్‌చల్



సింగరాయకొండ: ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలంలోని పాకల తీరంలో మంగళవారం సోనా బోట్లు హల్‌చల్ చేశాయి. సముద్ర తీర ప్రాంత నిబంధనల ప్రకారం సోనా బోట్లు తీరానికి ఎనిమిది నాటికల్ మైళ్లకు అవతల మాత్రమే చేపల వేట సాగించాలి. కానీ తీరానికి కేవలం 20 మీటర్ల దూరంలోకి వచ్చి వేట సాగించటంతో వేలాది రూపాయల వలలు తెగిపోతున్నాయని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 50 నుంచి 70 వరకు తమిళనాడు రాష్ట్రం కడలూరు ప్రాంతానికి చెందిన బోట్లు చేపల వేట సాగించాయని, అసలే మత్స్య సంపద లేక అల్లాడుతుంటే మధ్యలో సోనా బోట్ల కారణంగా దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నామని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం చేపల వేటకు వెళితే సుమారు 200 నుంచి 300 కేజీల వరకు రొయ్యలు పడ్డాయని, వాటిని కేజీ రూ.100 చొప్పున అమ్ముకుంటే ఒక్కొక్కరికి రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు వచ్చాయని అయితే సోనా బోట్లు తీరంలో వేటాడటంతో మంగళవారం వేటకు వెళితే కేవలం ఒక కేజీ రొయ్యలు మాత్రమే పడ్డాయని వాపోయారు. తమకు న్యాయం చేయాలని మత్స్యకారులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆడబిడ్డలపై ఆగని అఘాయిత్యాలు

గుంటూరు జిల్లాలో ఒకే రోజు రెండు ఘటనలు

ప్రత్తిపాడు/ఫిరంగిపురం/టి.నరసాపురం: బాలికలపై అఘాయిత్యాలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. గుంటూరు జిల్లాలో ఒకేరోజు రెండు కేసులు.. ఏలూరు జిల్లాలో ఓ కేసు నమోదైంది. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం చినకోండ్రుపాడు గ్రామానికి చెందిన దళిత బాలిక (13) నడింపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతుంది. ఈ నెల 12న అదే గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ గండికోట వెంకటేశ్వరరావు ఉరఫ్ వెంకట్ పాఠశాలకు సమీపంలోని పంట పొలాల్లోకి బాలికను తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. మంగళవారం బాలిక విషయాన్ని తన తల్లిదండ్రులకు తెలియజేయడంతో వారు ప్రత్తిపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రాథమిక విచారణ చేసిన ఎస్‌ఐ రవీంద్ర వెంకట్‌పై పోక్సో యాక్ట్‌తో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి వెంకట్‌ను అదుపులోకి తీసుకున్నారు.

వేధింపులతో బాలిక ఆత్మహత్య

ఫిరంగిపురం మండలంలో యువకుడి వేధింపులు భరించలేక బాలిక ఆత్మహత్య చేసుకుంది. సీఐ వీరేంద్ర బాబు తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక (17) ఇంటి వద్ద ఉంటుంది. ఈమెకు కొన్నాళ్ల కిందట బంధువుల అబ్బాయితో పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి ఆ యువకుడు ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. ఈ క్రమంలో బాలిక తన బంధువులతో ఫిరంగిపురం తిరునాళ్లకు వచ్చింది. ఆ సమయంలో ఆ యువకుడు తన మిత్రులతో వెళ్లి బాలిక గురించి అసభ్యంగా మాట్లాడటంతో బాలిక తండ్రి యువకుడిని మందలించాడు. ఆ యువకుడు మరికొంతమందితో ఆ గ్రామానికి వెళ్లి బాలిక తండ్రిపై దాడి చేశాడు. దీంతో మనస్తాపానికి గురైన బాలిక పురుగుమందు తాగింది. ఆమెను గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు బంధువులు తరలించగా..చికిత్సపొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందింది. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు యువకుడితో పాటు మరికొంతమందిపై మంగళవారం పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. కాగా, బాలికను వేధిస్తున్న యువకుడు ఆదివారం అర్ధరాత్రి ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా.. గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు.



హోటల్ గదిలో బంధించి లైంగిక దాడి

బాలికపై లైంగిక దాడికి పాల్పడిన ఘటనలో నిందితుడితో పాటు అతనికి సహకరించిన మరో ముగ్గురు యువకులపై టి.నరసాపురం పోలీసులు పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేశారు. ఈ కేసు వివరాలను ఎస్‌ఐ దుర్గా మహేశ్వరరావు మంగళవారం మీడియాకు తెలిపారు. ఏలూరు జిల్లా టి.నరసాపురం మండలంలోని బొర్రంపాలేనికి చెందిన బాలిక (16) జంగారెడ్డిగూడెంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. ఈ నెల 6న బాలిక అదృశ్యం కావడంతో ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అదృశ్యం కేసు దర్యాప్తు దర్యాప్తు జరుగుతుండగానే బాలిక ఈ నెల 15న టి.నరసాపురం పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తనపై లైంగిక దాడి జరిగిందని, దీనికి నలుగురు యువకులు బాధ్యులని చెప్పి ఫిర్యాదు చేసింది. దీంతో అదృశ్యం కేసును పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద మార్పు చేశారు. ఆమె ఫిర్యాదు వివరాలను పోలీసులు వెల్లడిస్తూ.. బాలిక హైస్కూల్‌లో చదువుతున్న సమయంలోనే గ్రామానికి చెందిన యువకుడు (20) ప్రేమిస్తున్నానని వెంటపడుతూ ఆమెను వేధించేవాడని తెలిపారు. దీంతో బాలిక తల్లిదండ్రులు ఆమెను జంగారెడ్డిగూడెంలోని ఓ హాస్టల్‌లో ఉంచి చదివిస్తున్నారు. ఆ హాస్టల్ నుంచే బాలిక ప్రైవేట్ కళాశాలలో విద్యను అభ్యసిస్తోంది. ఈ క్రమంలో ఇంటికి వచ్చిన బాలిక ఈ నెల 6 నుంచి కనిపించలేదు. ప్రేమిస్తున్నానన్న యువకుడికి మరో ముగ్గురు యువకులు సహకరించడంతో..వారంతా కలిసి బాలికను కిడ్నాప్ చేసి విశాఖకు తీసుకువెళ్లారు. అక్కడ ఓ హోటల్ గదిలో బాలికను బంధించిన యువకుడు ఆమెపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదైంది.

దళిత బాలిక కుటుంబానికి న్యాయం చేయండి

గుంటూరు జీజీహెచ్ మార్చురీ వద్ద ఎమ్మార్పీఎస్, బాలిక బంధువుల ఆందోళన


ఆందోళన చేస్తున్న నేతలు, బాలిక బంధువులు

గుంటూరు ఈస్ట్: గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెంలో లైంగిక దాడికి గురై హత్యచేయబడిన పేరుపోగు శైలజ (13) కుటుంబానికి న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు, బాలిక బంధువులు మంగళవారం జీజీహెచ్ మార్చురీ ఎదుట ధర్నా చేశారు. రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు వేమూరి సుధీర్ మాట్లాడుతూ..నిందితుడు నాగరాజు బాలికపై లైంగికదాడి చేసి హత్య చేశాడన్నారు. నిందితుడిని వెంటనే పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై సీఎం, హోం మంత్రి స్పందించాలని కోరారు. రాష్ట్రంలోని ఆడబిడ్డలకు స్వేచ్ఛను, ధైర్యాన్ని ప్రభుత్వం కల్పించాలన్నారు. శైలజ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. నిందితుడిని వెంటనే పట్టుకుంటామని తెనాలి డీఎస్పీ రమేష్ హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

మైనర్ బాలురపై గ్యాంగ్ రేప్ కేసు నమోదు

- మృతదేహానికి బండరాయి కట్టి కృష్ణా నదిలో పడేసిన నిందితుల బంధువులు
- బాలిక మృతదేహాన్ని మాయం చేసినందుకు వీరిపైనా కేసు


మాట్లాడుతున్న ఎస్పీ అధిరాజ్ సింగ్

నందికొట్కూరు: మైనర్ బాలురు ఇచ్చిన సాక్ష్యాధారాలతోనే గ్యాంగ్ రేప్ కేసు నమోదు చేసినట్లు నంద్యాల జిల్లా నూతన ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, బదిలీ అయిన జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం పట్టణంలోని పోలీసు స్టేషన్‌లో వీరు విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 7న ఆదివారం ఆడుకోవడానికి పార్కుకు వెళ్లిన తమ కుమార్తె తిరిగి రాలేదని బాలిక తండ్రి ముచ్చుమర్రి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. విచారణలో బాలికపై దేవాలయం సమీపంలో ముగ్గురు మైనర్ బాలురు అత్యాచారానికి పాల్పడినట్లు గుర్తించినట్లు చెప్పారు. ఆ తర్వాత బాలికకు చాక్లెట్ ఇచ్చి ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం వద్దకు తీసుకువెళ్లారని, అక్కడే గొంతు నులిమి చంపేశారని వివరించారు. మృతదేహాన్ని ఏమి చేయాలో తెలియక తల్లిదండ్రులకు జరిగిన విషయం చెప్పగా..నిందితుల్లో ఒకరి తండ్రి అయిన కాటం యోహాన్, మరొకరి పెదనాన్న అయిన బొల్లెద్దుల సద్గురుడు కలిసి బాలిక మృతదేహానికి బండరాయి కట్టి కృష్ణా నదిలో పడేసినట్లు తెలిపారు. డీఐజీ ఆదేశాల మేరకు ఎస్‌డీఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు, 6 స్పెషల్ పార్టీ బృందాలు, డాగ్ స్క్వాడ్, డ్రోన్ కెమెరాలు, టెక్నికల్ టీం, గజ ఈత గాళ్లను రంగంలోకి దింపి గాలింపు చర్యలు చేపట్టినా బాలిక ఆచూకీ లభించలేదని చెప్పారు. మైనర్ బాలురపై అత్యాచారం, హత్య కేసులు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని మాయం చేసిన వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నామని, కేసు దర్యాప్తులో నిర్లక్ష్యం వహించిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

శాస్త్రోక్తంగా ఆణివార ఆస్థానం

- ఈవో శ్యామలరావు కుడి చేతికి తాళపు చెవి గుత్తి
- శ్రీవారికి 'శ్రీరంగం' తరఫున పట్టువస్త్రాల సమర్పణ

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో సాలకట్ల ఆణివార ఆస్థానం మంగళవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం ఆనంద నిలయంలోని మూల విరాట్టుకు, బంగారు వాకిలి వద్ద ఆస్థానంలో వేంచేపు చేసిన శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం పెద్దజీయర్ స్వామి పెద్ద వెండితట్టలో ఆరు పెద్ద పట్టువస్త్రాలను తలపై పెట్టుకొని మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా విచ్చేశారు. చిన్నజీయర్‌స్వామి, ఈవో జె.శ్యామలరావు ఆయన వెంట వచ్చారు. నాలుగు పట్టు వస్త్రాలను మూలవిరాట్టుకు అలంకరించారు. మిగిలిన రెండు వస్త్రాల్లో ఒకటి మలయప్పస్వామికి, మరొకటి విష్వక్సేనులవారికి అలంకరించారు. తదనంతరం శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు తమ తలకు శ్రీవారి పాదవస్త్రంతో 'పరివట్టం'(చిన్న పట్టుగుడ్డ) కట్టుకొని స్వామివారి ద్వారా బియ్యపు దక్షిణ స్వీకరించి 'నిత్యైశ్వర్యోభవ' అని స్వామిని ఆశీర్వదించారు. ఆ తర్వాత అర్చకులు పెద్దజీయర్, చిన్న జీయర్, టీటీడీ తరఫున ఈవోకి 'లచ్చన' అను తాళపు చెవి గుత్తిని వరుస క్రమంలో కుడిచేతికి తగిలించారు. 'రూపాయి' హారతి, చందనం, తాంబూలం, తీర్థం, శఠారి మర్యాదలు చేసిన అనంతరం ఆ తాళపు చెవి గుత్తిని శ్రీవారి పాదాల చెంత ఉంచడంతో ఆణివార ఆస్థానం ముగిసింది. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ పూర్వం మహంతులు దేవస్థాన పరిపాలనను స్వీకరించిన రోజు అయిన ఈ ఆణివార ఆస్థానం పర్వదినం నాటి నుంచి టీటీడీ వారి ఆదాయ, వ్యయాలు, నిల్వలు తదితర వార్షిక లెక్కలు ప్రారంభమయ్యేవని తెలిపారు.


పుష్పపల్లకిపై ఊరేగుతున్న స్వామి, అమ్మవారు


పట్టువస్త్రాలు తీసుకొస్తున్న జీయర్ స్వాములు

టీటీడీ ధర్మకర్తల మండలి ఏర్పడిన తర్వాత వార్షిక బడ్జెట్‌ను మార్చి-ఏప్రిల్ నెలలకు మార్చినట్టు వివరించారు. సాయంత్రం పుష్పపల్లకీపై స్వామి, అమ్మవారు నాలుగు మాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఆణివార ఆస్థానం సందర్భంగా తమిళనాడులోని శ్రీరంగం శ్రీరంగనాథస్వామి ఆలయం తరఫున శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. తొలుత తమిళనాడు దేవాదాయ శాఖ మంత్రి శేఖర్ బాబు పట్టువస్త్రాలను మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా నాలుగు మాడ వీధుల గుండా ప్రదక్షిణగా ఆలయంలోకి తీసుకెళ్లారు. అనంతరం స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు దేవాదాయ శాఖ ప్రత్యేక కార్యదర్శి కుమార గురుబాలన్, శ్రీరంగం ఆలయ జాయింట్ కమిషనర్ మారియప్పన్ పాల్గొన్నారు.

అసెంబ్లీ సెక్రటరీ జనరల్ నియామకంలో వివాదం

- సూర్యదేవర ప్రసన్నకుమార్‌ను నియమించిన ప్రభుత్వం
- సుప్రీంకోర్టు రిజిస్ట్రార్‌గా నిబంధనలకు విరుద్ధమని తొలగించిన సుప్రీంకోర్టు
- అయినా పట్టించుకోకుండా సెక్రటరీ జనరల్‌గా నియామకం

సాక్షి, అమరావతి: కేంద్ర సర్వీసుల్లో పనిచేస్తూ అన్ని అర్హతలు ఉన్న అధికారులు వైఎస్సార్‌సీపీ హయాంలో రాష్ట్రానికి డిప్యుటేషన్‌పై వస్తే నానా రాద్ధాంతం చేసిన చంద్రబాబు ఇప్పుడు అసలు అర్హతలేని, వివాదాస్పద వ్యక్తిని శాసనసభ, శాసనమండలి సెక్రటరీ జనరల్‌గా నియమించారు. ఏపీ శాసనవ్యవస్థల సెక్రటరీ జనరల్‌గా సూర్యదేవర ప్రసన్నకుమార్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన అర్హతలపై అనేక అనుమానాలున్నాయి. ఈ కారణంగానే ప్రసన్నకుమార్‌ను సుప్రీంకోర్టు రిజిస్ట్రార్ పదవి నుంచి గతంలో తొలగించారు. అలాంటి వ్యక్తిని ఇప్పుడు చంద్రబాబు ఏపీకి తీసుకొచ్చి అందలం ఎక్కించారు. ఢిల్లీ ఆప్ ప్రభుత్వ హయాంలో ప్రసన్నకుమార్‌ను శాసనసభ కార్యదర్శిగా నియమించినప్పుడు తీవ్ర వివాదం ఏర్పడింది. అర్హతలేని వ్యక్తిని శాసనసభ కార్యదర్శిగా నియమించినట్లు సుప్రీంకోర్టు వ్యాఖ్యానించిన విషయం విదితమే. దీంతో ఆయన ఆ పోస్టు నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. ఆ తర్వాత జస్టిస్ ఎన్.వి.రమణ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులైనప్పుడు ప్రసన్నకుమార్‌ను తొలుత ఓఎస్డీగా నియమించుకున్నారు. ఆ తర్వాత సుప్రీంకోర్టు రిజిస్ట్రార్‌గా నియమించారు. ప్రసన్నకుమార్‌పై ఆరోపణలు ఉండడంతో జస్టిస్ ఎన్.వి. రమణ రిటైర్ అయిన తర్వాత వచ్చిన ప్రధాన న్యాయమూర్తి లలిత్‌కుమార్ వాటిపై విచారణ చేయించి ఆయన నియామకం చెల్లదని తొలగించారు. అనంతరం తెలంగాణ అసెంబ్లీలో కన్సల్టెంట్‌గా చేరి మొన్నటివరకు అక్కడే పనిచేశారు. ఆయన న్యాయశాస్త్రం చదవలేదనే ఆరోపణలున్నాయి. లోక్‌సభ, రాజ్యసభ సెక్రటేరియట్లలో పనిచేసినా అందుకు తగ్గ అర్హతలు లేవని సమాచారం. నిజానికి ఆయన మాతృసంస్థ ఆల్ ఇండియా రేడియో. మొదట్లో న్యూస్‌రీడర్‌గా పనిచేసి ఆ తర్వాత లాబీయింగ్ ద్వారా డిప్యుటేషన్‌పై కీలక పోస్టులు సంపాదించుకున్నారనే విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే ఢిల్లీ అసెంబ్లీ, సుప్రీంకోర్టు ఆయన్ని పక్కకు తప్పించాయి. టీడీపీ పెద్దలతో సన్నిహిత సంబంధాలున్న వ్యక్తి కావడం, ఎన్.వి.రమణకు బాగా కావల్సిన వ్యక్తి కావడంతో ఆయన్ని ఇప్పుడు ఏపీకి తీసుకొచ్చి కీలక బాధ్యతలు అప్పగించినట్లు తెలిసింది. అర్హతల విషయంలో వివాదాల్లో చిక్కుకుని ఉద్వాసనకు గురై, లాబీయిస్టుగా ముద్రపడిన వ్యక్తిని చంద్రబాబు ప్రభుత్వం కీలక పోస్టులో కూర్చోబెట్టడం చర్చనీయాంశమైంది.

వీడిన 'పెట్రోల్' హత్య మిస్టరీ..

- తనకు ఇష్టం లేకుండా తన కూతురు పెళ్లి జరిపించినందుకు ప్రతీకారంగానే..
- వియ్యపురాలిని హత్య చేసిన కేసులో వియ్యంకుడు అరెస్ట్



ప్రొద్దుటూరు క్రైం: వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులోని నేతాజీనగర్-శీలో సోమవారం సాయంత్రం ఓ మహిళపై పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటన మిస్టరీ వీడింది. ఈ ఘాతుకానికి పాల్పడిన నిందితుడిని సోమవారం రాత్రి పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రొద్దుటూరు డీఎస్పీ మురళీధర్ మంగళవారం తెలిపిన వివరాల మేరకు.. చాపాడు మండలంలోని కేతవరానికి చెందిన గడ్డమీది బాలనాగమ్మ కుటుంబం ప్రస్తుతం ప్రొద్దుటూరులోని నేతాజీనగర్‌లో నివాసం ఉంటుంది. ఆమె కుమారుడు సురేష్ మున్సిపాలిటీలో సర్వేయర్‌గా పనిచేస్తున్నాడు. రెండేళ్ల క్రితం సీకేదిన్నె మండలంలోని ఊటుకూరు గ్రామానికి చెందిన బనగాని జయచంద్రుడు తన కుమార్తె ఉషానాగమనీషాకు పెళ్లి సంబంధం మాట్లాడడానికి కేతవరంలోని సురేష్ వాళ్లింటికి వెళ్లాడు. తర్వాత సురేష్ కుటుంబ సభ్యులు కూడా జయచంద్రుడు ఇంటికి వెళ్లారు. అయితే ఈ సంబంధం జయచంద్రుడికి ఇష్టం లేదు. కానీ సురేష్, ఉషానాగమనీషాలు ఒకరికొకరు ఇష్టపడ్డారు. ఈ క్రమంలోనే వారు పెళ్లి చేసుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ ఏడాది మార్చి నెలలో సురేష్ కుటుంబ సభ్యుల సమక్షంలో వివాహం చేసుకున్నారు. అయితే తన ఇష్టం లేకుండా కుమార్తె పెళ్లి చేసిన బాలనాగమ్మ కుటుంబంపై జయచంద్రుడు పగ పెంచుకున్నాడు. ఈ క్రమంలో సోమవారం ప్రొద్దుటూరులోని నేతాజీనగర్‌కు వెళ్లాడు. తన కుమార్తె పెళ్లిని దగ్గరుండి జరిపించిన బాలనాగమ్మపై పెట్రోల్ పోసి నిప్పంటించి ఆమె మృతికి కారణమయ్యాడు. కాగా ఘటన జరిగిన వెంటనే వన్‌టౌన్ ఎస్‌ఐ మంజునాథ్, సిబ్బంది సోమవారం రాత్రి ఊటుకూరుకు వెళ్లి నిందితుడైన జయచంద్రుడును అరెస్ట్ చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. గంటల వ్యవధిలోనే ఈ కేసును ఛేదించిన సిబ్బందిని జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్, ప్రొద్దుటూరు డీఎస్పీ మురళీధర్ అభినందించారు.

కట్టుకున్నవాడే కాలయముడయ్యాడు

- రూ.50 వేల కోసం భార్య గొంతు కోసి హత్య చేసిన భర్త


సాయితేజ (ఫైల్)

గుంతకల్లు: నిండునూరేళ్లుగా తోడుగా నిలవాల్సిన భర్తే ఆమె పాలిట కాలయముడయ్యాడు. రూ.50వేల కోసం భార్య గొంతు కోసి హత్య చేశాడు. ఈ ఘటన అనంతపురం జిల్లా గుంతకల్లులో మంగళవారం చోటుచేసుకుంది. టూటౌన్ సీఐ గణేశ్, మృతురాలి బంధువుల వివరాల మేరకు... పాత గుంతకల్లుకు చెందిన సాయితేజ (26)కు రెండేళ్ల క్రితం పాతూరుకు చెందిన బేల్దారి పులికొండతో వివాహమైంది. వీరికి రెండేళ్ల కూతురు ఉంది. ఇటీవల పులికొండ తనవద్ద డబ్బులు లేకపోవడంతో అప్పులు చేశాడు. ఈ కారణంగా భార్యభర్తలకు తరచూ గొడవలు జరిగేవి. ఈక్రమంలోనే రూ.50వేల అత్యవసరం పడటంతో, సోమవారం రాత్రి భార్య సాయితేజతో గొడవ పడ్డాడు. పుట్టింటికి వెళ్లి రూ.50వేలు తేవాలని గట్టిగా కేకలు వేస్తూ ఆమెతో ఘర్షణ పడ్డాడు. దీంతో అలసిపోయిన సాయితేజ నిద్రలోకి జారుకుంది. గొడవతో మరింత కోపంలో ఉన్న పులికొండ నిద్రపోతున్న సాయితేజ గొంతుకు సెల్‌ఫోన్ చార్జింగ్ వైర్‌ను గట్టిగా బిగించి ఊపిరి ఆడకుండా చేశాడు. ఇంకా బతికే ఉందేమోనన్న అనుమానంతో మరోసారి కత్తి తీసుకుని గొంతు కోశాడు. తరువాత రెండేళ్ల కూతురిని తీసుకుని పారిపోవాలని యత్నించాడు. అప్పటికే ఈ గొడవను గమనించిన ఇరుగుపొరుగు అనుమానం వచ్చి ఇంట్లోకి వెళ్లి చూశారు. సాయితేజ విగతజీవిగా పడి ఉండటం, పులికొండ అక్కడే ఉండటాన్ని చూసి, అతడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అనంతరం సాయితేజ బంధువులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పులికొండను అదుపులోనికి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. సాయితేజ తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గణేష్ తెలిపారు.

12 మంది గంజాయి స్మగ్లర్ల అరెస్ట్

పెందుర్తి: గుట్టుచప్పుడు కాకుండా వేర్వేరు ప్రాంతాలనుంచి భారీ ఎత్తున అక్రమంగా గంజాయిని తరలిస్తున్న 12మంది స్మగ్లర్లను అరెస్ట్ చేసి 359 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి వెల్లడించిన వివరాల ప్రకారం.. అల్లూరి జిల్లా-ఒడిశా సరిహద్దు ప్రాంతం నుంచి ఏడుగురు స్మగ్లర్ల బృందం దాదాపు 284 కిలోల గంజాయిని నగరానికి తరలించేందుకు కారులో బయలుదేరారు. పెందుర్తి మండలం రాంపురం సాధుమఠం వద్ద పెందుర్తి పోలీస్ ప్రత్యేక బృందం, టాస్క్‌ఫోర్స్ బృందం మాటు వేసి వారిని పట్టుకుని అరెస్ట్ చేసి సరుకు స్వాధీనం చేసుకున్నారు. అలాగే పులగాలిపాలెం జనవాసాల మధ్య ఓ అధునాతన భవనంలో నిల్వ ఉంచిన 75 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశారు.

నర్సాపురం ఎంపీడీవో అదృశ్యం

- పని ఒత్తిడి, ఆర్థిక ఇబ్బందుల కారణంగానే..
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు


వెంకటరమణారావు (ఫైల్)

పెనమలూరు/నరసాపురం రూరల్: కృష్ణా జిల్లా పెనమలూరు మండలం కానూరులో నివాసముంటూ నర్సాపురంలో ఎంపీడీవోగా పనిచేస్తోన్న ఎం.వెంకటరమణారావు (61) అదృశ్యమయ్యారు. దీనిపై పెనమలూరు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. సీఐ రామారావు కథనం మేరకు..కానూరు మహదేవపురం కాలనీ ఐదో లైన్‌లో వెంకటరమణారావు కుటుంబీకులతో నివసిస్తున్నారు. ఎన్నికల సందర్భంగా 5 నెలల క్రితం పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురానికి ఆయన బదిలీ అయ్యారు. సెలవుల సమయంలో కానూరుకు వచ్చి మరల విధులకు వెళుతూ ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆయన ఈ నెల 3న సెలవు పెట్టి తిరుపతి వెళ్లారు. 8న మండల పరిషత్ కార్యాలయానికి వచ్చి అనారోగ్యంగా ఉందని చెప్పి సెలవును 20వ తేదీ వరకు కొనసాగించవలసిందిగా కోరుతూ జిల్లాపరిషత్ సీఈవోకు దరఖాస్తు చేసి విజయవాడకు వెళ్లారు. ఈ క్రమంలో 15న బందరులో పని ఉందని ఇంటి నుంచి వెళ్లి అదే రోజు భార్యకు ఫోన్ చేసి తాను ఇంటికి రావటం లేదని చెప్పాడు. రాత్రి వరకు ఆయన ఇంటికి రాకపోవటంతో కుటుంబీకులు ఫోన్ చేయగా కాల్ డైవర్షన్ అయ్యి నర్సాపురం ఎంపీడీవో కార్యాలయానికి ఫోన్ వెళ్లింది. కుటుంబ సభ్యులు వాకబు చేయగా..ఆయన వివరాలు తెలియరాలేదు. ఈ క్రమంలో ఆయన 15న అర్ధరాత్రి తన కుమారుడు మహిధర్‌కు 'ఈ రోజు నీ పుట్టినరోజు. నాకు చనిపోయే రోజు. ఇంటి వద్ద జాగ్రత్తగా ఉండు' అని మెసేజ్ చేశారు. వెంకటరమణారావు బైక్ మచిలీపట్నం రైల్వేస్టేషన్‌లో ఉన్నట్లు గుర్తించారు. ఆర్థిక పరమైన అంశాలు, పని ఒత్తిడి కారణంగానే ఆయన అదృశ్యమైనట్లు పోలీసులు విచారణలో తెలిసింది. కాగా, నరసాపురం పంటు రేవు పాటదారు మండల పరిషత్‌కు రూ.55 లక్షల వరకు బకాయి పడ్డారు. ఆ బకాయిల విషయమై ఎంపీడీవో ఒత్తిడికి గురవుతున్నట్లు పోలీసులకు ఇచ్చిన పిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. బకాయిదారుడిపై చర్యలు తీసుకోవడంలో భాగంగా జేపీసీ సభ్యులు పంటు నిర్వాహకుడికి నోటీసులు ఇచ్చారని, జిల్లా పరిషత్ అధికారులకు విషయం తెలియజేసి పంటును ఈ నెల 3 నుంచి తామే నడుపుతున్నామని ఇన్‌చార్జి ఎంపీడీవో వీకే వీరభద్రరావు చెబుతున్నారు. కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నట్లు పాటదారుడి బకాయి వసూళ్లలో జాప్యమే కాకుండా మరే ఇతర కారణాలేమైనా ఉన్నాయా అనే కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఇన్‌స్టాలో లైక్‌ల కోసం వన్యప్రాణుల వేట

జంతుప్రేమికుల ఫిర్యాదుతో యువకుడి అరెస్టు


యువకుడిని అరెస్టు చేసిన ఫారెస్టు అధికారి బాలసుబ్రహ్మణ్యం

వేంపల్లె: ఇన్‌స్టాగామ్‌లో లైక్‌ల కోసం ఓ యువకుడు పెంపుడు కుక్కలతో వేటకు వెళ్లి అడవిలో జంతువులను చంపి, ఆ వీడియోలను అప్‌లోడ్ చేయడం అలవాటుగా మార్చుకున్నాడు. దీన్ని గమనించిన తెలంగాణ జంతు ప్రేమికులు ఆ యువకుడికి అదిరిపోయే షాక్ ఇచ్చారు. కట్‌చేస్తే వేంపల్లి ఫారెస్ట్ అధికారులు అతడిని అరెస్టు చేసి కటకటాల వెనక్కి నెట్టారు. ఈ ఘటన ఉమ్మడి కడప జిల్లా గాలివీడు మండలం వడ్డేపల్లెలో చోటుచేసుకుంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉమ్మడి కడప జిల్లాలోని గాలివీడు మండలం, వడ్డేపల్లికి చెందిన బత్తల చిరంజీవి పెంపుడు కుక్కలతో సమీపంలోని కొండల్లోకి వెళ్లి, అడవి జంతువులను వేటాడి, వాటిని చంపి, లైకుల కోసం ఇన్‌స్టాగామ్‌లో పోస్టులు పెట్టడం అలవాటుగా మార్చుకున్నాడు. అతను చేసే వీడియోలు వైరల్‌గా మారాయి. వీటిని తెలంగాణ జంతు ప్రేమికులు గమనించి, వెంటనే కడప జిల్లా డీఎఫ్‌వో సందీప్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన వేంపల్లె ఫారెస్టు అధికారులకు సమాచారమిచ్చి అతడిని అరెస్టు చేయాలని ఆదేశించారు. వేంపల్లె ఫారెస్టు అధికారి బాలసుబ్రమణ్యం తన సిబ్బందితో వెళ్లి బత్తల చిరంజీవిని అరెస్టు చేసినట్లు మీడియాకు తెలిపారు.

నాటి విమర్శకుడే... నేటి వీరాభిమాని

ట్రంప్ రన్నింగ్ మేట్ వాన్స్‌ది ఆసక్తికర ప్రస్థానం

నిరుపేద కుటుంబ నేపథ్యం నుంచి ఎదిగిన వైనం



రిపబ్లికన్ కన్వెన్షన్‌లో భార్య ఉష చిలుకూరితో పార్టీ ఉపాధ్యక్ష అభ్యర్థి జె.డి.వాన్స్

"దేవుడా! ఈ ట్రంప్ ఎంతటి మూర్ఖుడో!"

"నేనెప్పుడూ ట్రంప్ మనిషిని కాలేను"

"ఆయనంటే నాకస్సలు ఇష్టం లేదు"

అమెరికా మాజీ అధ్యక్షుని గురించి ఆయన సొంత రిపబ్లికన్ పార్టీ నేత వాన్స్ గతంలో చేసిన వ్యాఖ్యలివి. ట్రంప్‌ను వాన్స్ ఎంతగా ద్వేషించారంటే, చివరికి ఆయనను అమెరికా హిట్లర్‌గా అభివర్ణించేదాకా వెళ్లారు! ట్రంప్‌ను బూతులు కూడా తిట్టేవారు. దేశ శ్రామిక వర్గానికి భవిష్యత్తుపై ఆశ, ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశాలు కల్పించకపోతే స్వప్రయోజనాల కోసం ప్రజలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకునే ట్రంప్ వంటి స్వార్థపూరిత నాయకులే పుట్టుకొస్తారంటూ రిపబ్లికన్ పార్టీ విధానాలపైనా విమర్శలు గుప్పించేవారు. అలాంటి వాన్స్ కొన్నేళ్లుగా రిపబ్లికన్ పార్టీలో ట్రంప్‌కు అత్యంత గట్టి మద్దతుదారుగా మారిపోయారు. అంతటితో ఆగకుండా తాజాగా ఏకంగా ట్రంప్‌కు రన్నింగ్ మేట్ కూడా అయిపోయారు! సోమవారం మొదలైన రిపబ్లికన్ల జాతీయ సదస్సులో పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా ట్రంప్, ఉపాధ్యక్ష అభ్యర్థిగా వాన్స్ ఖరారయ్యారు!! అంతేనా... అన్నీ కుదిరితే 2028లో రిపబ్లికన్ల అధ్యక్ష అభ్యర్థి వాన్సే అవుతారంటూ అమెరికా మీడియాలో ఇప్పటినుంచే విశ్లేషణలు వెల్లువెత్తుతున్నాయి...

నిరుపేద నేపథ్యం

ట్రంప్ రన్నింగ్ మేట్ అయిన 39 ఏళ్ల జె.డి.వాన్స్‌ది ఆసక్తికర నేపథ్యం. మాజీ సైనికుడు. విజయవంతమైన వెంచర్ క్యాపిటలిస్టు. బెస్ట్ సెల్లర్‌గా నిలిచిన పుస్తక రచయిత. రాజకీయ నాయకుడు. ఇలా ఆయన వ్యక్తిత్వానికి ఎన్నో పార్శ్వాలున్నాయి. వాన్స్ ఒహాయో మిడిల్ టౌన్లో అత్యంత సాధారణ కుటుంబంలో పుట్టారు వాన్స్. ఆయన అసలు పేరు జేమ్స్ డొనాల్డ్ బోమన్. తల్లి డ్రగ్స్‌కు బానిస. వాన్స్ పసిపిల్లాడిగా ఉండగానే తండ్రి కుటుంబాన్ని వదిలేసి వెళ్లిపోయారు. తాత, అమ్మమ్మే ఆయన్ను పెంచి పెద్ద చేశారు. దాంతో వాళ్లనే తల్లిదండ్రులుగా పిలిచేవారు. తన పుస్తకంలో కూడా వారి గురించి రాసుకున్నారు. ఆరేళ్ల వయసులో తల్లి మరొకతన్ని పెళ్లాడింది. ఆయన వాన్స్‌ను దత్తత తీసుకున్నారు. దాంతో తన పేరు నుంచి డొనాల్డ్‌ను తీసేసి మారు తండ్రి పేరులోని డేవిడ్‌ను కలుపుకున్నారు. ఇంటి పేరు కూడా హామెల్‌గా మారింది. పెళ్లయ్యాక తాత, అమ్మమ్మల గౌరవార్థం వారి ఇంటి పేరు వాన్స్‌ను స్వీకరించారు. అలా జేమ్స్ డేవిడ్ వాన్స్‌గా మారారు. తొలుత యూఎస్ మరైన్స్‌లో చేరి సైనికునిగా ఇరాక్‌లో విధులు నిర్వహించిన ఆయన తర్వాత

> మతిలేని వలస విధానాల కారణంగా బ్రిటన్ ఇప్పుడు ప్రపంచంలో మొట్టమొదటి అణ్వాయుధ ఇస్లామిక్ దేశంగా మారింది!
> \- జె.డి.వాన్స్

పట్టుదలతో ఉన్నత చదువులు చదివారు. ఒహాయో స్టేట్ వర్సిటీ, యేల్ లా స్కూల్‌కు వెళ్లారు. అనంతరం కాలిఫోర్నియాలో వెంచర్ క్యాపిటలిస్టుగా చేశారు. తన అనుభవాలు, జ్ఞాపకాలకు హిల్‌బిలీ ఎలిజీ పేరిట 2016లో పుస్తక రూపమిచ్చారు. అమెరికాలోకెల్లా అత్యంత పేదరికం తాండవించే కొండ ప్రాంతానికి చెందిన తన కుటుంబ మూలాలను అందులో ఉన్నదున్నట్టు రాశారు. తమ ఇంట్లో పెద్దవాళ్లు కష్టించి పని చేయకుండా కేవలం సంక్షేమ పథకాలపై ఆధారపడి సమాజానికి భారంగా మారారని విమర్శించారు. అది బెస్ట్ సెల్లర్‌గా నిలవడమే గాక అదే పేరుతో హాలీవుడ్ సినిమాగా కూడా రూపొందింది. దానిపై ప్రశంసలతో పాటు వివాదాలూ వెల్లువెత్తాయి. ఆ పుస్తకంతో అమెరికా అంతటా వాన్స్ పేరు మారుమోగింది.

సెనేటర్‌గా నెగ్గేందుకు...

2022లో వాన్స్ రాజకీయ రంగ ప్రవేశం చేశారు. ఒహాయో నుంచి తొలిసారి సెనేటర్‌గా గెలుపొందారు. అదంత సులువుగా జరగలేదు. ట్రంప్ విమర్శకునిగా ఉన్న ఇమేజీ ఆయనకు పెద్ద అడ్డంకిగా మారింది. దాంతో ఆయనపై గతంలో చేసిన వ్యాఖ్యలకు క్షమాపణలు చెప్పేందుకు వాన్స్ ఏమాత్రం వెనకాడలేదు. అలా ట్రంప్ ఆమోదముద్ర పొంది సెనేటర్ అయ్యారు. యేల్ వర్సిటీ సహాధ్యాయి అయిన తెలుగు మూలాలున్న ఉషా చిలుకూరిని 2014లో పెళ్లాడారు. వర్సిటీ రోజుల నుంచి తన ఎదుగుదల క్రమంలో ప్రతి దశలోనూ ఆమెది అత్యంత కీలక పాత్ర అని వాన్స్ తరచూ చెబుతారు.

అంతర్జాతీయ వ్యవహారాలపై...

ట్రంప్ మాదిరిగానే వాన్స్‌కు కూడా అంతర్జాతీయ వ్యవహారాలపై దృఢమైన సొంత అభిప్రాయాలున్నాయి. 'అమెరికా ఫస్ట్' అన్న ట్రంప్ నినాదానికి ఆయన గట్టి మద్దతుదారు. వలసలు, వామపక్షవాదులే అమెరికాకు అతి పెద్ద ముప్పంటారు. గాజాతో యుద్ధం కోసం ఇజ్రాయెల్‌కు సైనిక సాయాన్ని బేషరతుగా కొనసాగించాలన్నది వాన్స్ వైఖరి. వ్యాపారపరంగా, ఇతరత్రా చైనాను అమెరికాకు గట్టి ప్రత్యర్థి దేశంగానే చూస్తారాయన. అంతర్జాతీయ వర్తక నిబంధనలను పాటించకపోతే అమెరికా క్యాపిటల్ మార్కెట్ నుంచి చైనాను దూరం పెట్టాలంటూ సెనేట్‌లో ఏకంగా బిల్లే ప్రవేశపెట్టారు! గాజాకు మద్దతు గా విద్యార్థులు ఆందోళనకు దిగిన కాలేజీలకు ప్రభుత్వ ఆర్థిక సాయాన్ని నిలిపేయాలంటూ కూడా సెనేట్లో బిల్లులు పెట్టారు. అలాగే ఉక్రెయిన్‌కు అమెరికా భారీగా నిధులు, సైనిక సాయం చేయడాన్ని వాన్స్ తీవ్రంగా వ్యతిరేకిస్తారు.

\- సాక్షి, నేషనల్ డెస్క్



ట్రంప్‌కు అపూర్వ స్వాగతం

డొనాల్డ్ ట్రంప్‌కు రిపబ్లికన్ పార్టీ జాతీయ కన్వెన్షన్‌లో అపూర్వ స్వాగతం లభించింది. హత్యా యత్నంలో గాయమైన కుడి చెవికి బ్యాండేజీతో వచ్చిన 78 ఏళ్ల ట్రంప్‌ను చూసి పార్టీ ప్రతినిధులంతా భావోద్వేగానికి లోనయ్యారు. హత్యాయత్నం తర్వాత ఆయన బయటి ప్రపంచానికి కన్పించడం ఇదే తొలిసారి. సమావేశ మందిరం గుండా నడుస్తూ పిడికిలి బిగించి పైకెత్తి 'ఫైట్' అంటూ ట్రంప్ బిగ్గరగా నినాదాలు చేశారు. ప్రతినిధులంతా ఉత్సాహంగా ఆయనతో గొంతు కలిపారు. ట్రంప్ వేదికపైకి చేరుకోగానే ఆయన నామస్మరణతో హాలంతా మారుమోగిపోయింది. అనంతరం అధ్యక్ష అభ్యర్థిగా ట్రంప్‌ను లాంఛనంగా ఎన్నుకున్నారు. కన్వెన్షన్‌ను ఉద్దేశించి ఆయన గురువారం ప్రసంగించనున్నారు.

కశ్మీర్‌లో ఉగ్రకాల్పులు... నలుగురు సైనికుల వీరమరణం

మృతుల్లో ఒక కెప్టెన్ కూడా ● రక్షణ మంత్రి, ఆర్మీ సంతాపం ● ముష్కరుల కోసం భారీ వేట

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లో భద్రతా బలగాలపై ముష్కర మూకల దాడులు పెరిగిపోతున్నాయి. సోమవారం రాత్రి దోడా జిల్లాలో బలగాలపై భారీ ఆయుధాలతో ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో నలుగురు జవాన్లు వీరమరణం పొందారు. వారిని కెప్టెన్ బ్రిజేశ్ థాపా, నాయక్ డొక్కరి రాజేశ్, సిపాయిలు బిజేంద్రసింగ్, అజయ్‌కుమార్ సింగ్ నరుకాగా గుర్తించారు. గాయపడ్డ మరో సైనికున్ని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ఆయన పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. కథువా జిల్లా మారుమూల మఛేడీ అటవీప్రాంతంలో సైన్యంపై ఉగ్రవాదులు మెరుపుదాడికి దిగి ఐదుగురు జవాన్లను పొట్టన పెట్టుకున్న వారం రోజులకే తాజా ఘటన చోటుచేసుకుంది. దోడాలో బలగాలు, ఉగ్రవాదుల మధ్య గత మూడు వారాల్లో ఇది మూడో ఎన్‌కౌంటర్. ఇది తమ పనేనని పాక్ దన్నుతో చెలరేగిపోతున్న ఉగ్ర సంస్థ జైషే మహ్మద్‌కు చెందిన 'కశ్మీర్ టైగర్స్' ప్రకటించుకుంది. ఉగ్రవాదులు నక్కారన్న నిఘా సమాచారంతో రాష్ట్రీయ రైఫిల్స్, జమ్మూకశ్మీర్ పోలీసులు సంయుక్తంగా దేసా అటవీ ప్రాంత పరిధిలోని ధారీ గోటే ఉరర్‌బాగీ ప్రాంతంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. 20 నిమిషాల ఎదురుకాల్పుల అనంతరం ఉగ్రవాదులు వెన్నుచూపారు. ప్రతికూల అటవీ ప్రాంతంలోనూ కెప్టెన్ సారథ్యంలో బలగాలు వారిని వెంటాడాయి. దాంతో సోమవారం రాత్రి 9 గంటల అనంతరం మరోసారి చోటుచేసుకున్న ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. కెప్టెన్‌తో పాటు మరో ముగ్గురు అసువులు బాశారని అధికారులు తెలిపారు. ఈ ముష్కరులు అక్రమంగా సరిహద్దు దాటి చొచ్చుకొచ్చి రెండు నెలలుగా అటవీ ప్రాంతంలో నక్కినట్టు భావిస్తున్నారు. వారికోసం అదనపు బలగాలతో సైన్యం, పోలీసులు భారీగా గాలిస్తున్నారు. ఎలైట్ పారా కమెండోలను కూడా రంగంలోకి దించారు.

బాధగా ఉంది: రాజ్‌నాథ్

ముష్కరులను ఏరేసే క్రమంలో నలుగురు వీర జవాన్లు అమరులు కావడం చాలా బాధగా ఉందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. ఆయనతో పాటు ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, సైనిక ఉన్నతాధికారులు వారికి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబాలకు సానుభూతి తెలిపారు.



కెప్టెన్ బ్రిజేశ్ థాపా



బిజేంద్ర సింగ్



అజయ్ నరుకా

నా కొడుకు త్యాగానికి గర్విస్తున్నా..

దేశ రక్షణలో అమరుడైన కొడుకును చూస్తే గర్వంగా ఉందని కెప్టెన్ బ్రిజేశ్ థాపా తల్లిదండ్రులు కల్నల్ (రిటైర్డ్) భువనేశ్ కె.థాపా, నీలిమ అన్నారు. ''నా కుమారుడు చిన్నతనం నుంచీ నన్నే స్ఫూర్తిగా తీసుకున్నాడు. సైన్యంలో చేరాలని ఉవ్విళ్లూరేవాడు. 27 ఏళ్ల వయసులో కల నెరవేర్చుకున్నాడు. రెండు రోజుల క్రితమే నాతో ఫోన్లో మాట్లాడాడు. నిత్యం ప్రాణాపాయం పొంచి ఉండే ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్లో నా కుమారుడు అమరుడైనందుకు గర్విస్తున్నా'' అని భువనేశ్ చెప్పారు.

ఆర్మీ డే రోజు పుట్టాడు

కెప్టెన్ థాపా ఆర్మీ డే అయిన జనవరి 15న జన్మించారని తల్లి తెలిపారు. తనకింకా పెళ్లి కూడా కాలేదని సుళ్లు తిరుగుతున్న బాధను అణచుకుంటూ చెప్పారామె. కుటుంబంలో ఆయన వరుసగా మూడో తరం సైనికుడు! థాపా తండ్రితో పాటు తాత కూడా సైన్యంలో సేవ చేశారు. ఆయన ఇంజనీరింగ్ చేసి కూడా పట్టుబట్టి ఆర్మీలోనే చేరారు. 145, ఎయిర్ డిఫెన్స్ రెజిమెంట్‌కు చెందిన థాపా రాష్ట్రీయ రైఫిల్స్‌కు డిప్యూటేషన్‌పై వెళ్లారు.

బీజేపీ తప్పుడు విధానాల వల్లే...

జవాన్ల మృతిపై రాహుల్ నిప్పులు

సాక్షి, న్యూఢిల్లీ: జమ్మూ కశ్మీర్‌లో 78 రోజుల్లో 11 ఉగ్రదాడులు జరిగినా కేంద్రం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని కాంగ్రెస్ ధ్వజమెత్తింది. బీజేపీ తప్పుడు విధానాల ఫలితాన్ని వీర సైనికులు, వారి కుటుంబాలు అనుభవించాల్సి వస్తోందని లోక్‌సభలో విపక్ష నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. ఈ మేరకు మోదీ ప్రభుత్వానికి లేఖ రాశారు. 11 ఉగ్రదాడుల్లో 13 మంది ఆర్మీ, పోలీసు సిబ్బంది అమరులయ్యారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ అన్నారు. ఈ దాడులను, సైనికుల బలిదానాలను ఆపడానికి ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు. ఆర్టికల్ 370 రద్దుతో ఉగ్రవాదాన్ని నాశనం చేశామనే బూటకపు వాదనకు సైనికులు తమ ప్రాణాలతో మూల్యం చెల్లించుకుంటున్నారన్నారు. సీమాంతర ఉగ్రవాదంపై సమష్టిగా పోరాడాలని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే పిలుపునిచ్చారు.

ఆ అమర సైనికునిది ఏపీ



సంతబొమ్మాళి: దోడాలో ఉగ్రవాదుల కాల్పుల్లో వీరమరణం పొందిన డొక్కరి రాజేశ్ (25)ది ఆంధ్రప్రదేశ్. ఆయన స్వగ్రామం శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం చెట్లతాండ్ర. రాజేశ్ ఐదేళ్ల కింద ఆర్మీలో చేరారు. వారిది నిరుపేద కుటుంబం. తల్లిదండ్రులు చిట్టివాడు, పార్వతి కేవలం ఎకరం పొలం సాగు చేస్తూ రాజేశ్‌ను, ఆయన సోదరున్ని చదివించారు. సోదరుడు మధుసూదనరావు డిగ్రీ పూర్తి చేశాడు. రాజేశ్ మృతితో తల్లిదండ్రులు కంటికో ధారగా విలపిస్తున్నారు. గ్రామంలో కూడా విషాద ఛాయలు అలముకున్నాయి.

2024లో జమ్మూలో ఉగ్ర దాడులు...

ఈ ఏడాదే 12 మంది సైనికుల మృతి

ఏప్రిల్ 22: రాజౌరీ జిల్లాలో ప్రభుత్వోద్యోగిని ఉగ్రవాదులు కాల్చి చంపారు.

ఏప్రిల్ 28: ఉధంపూర్ జిల్లాలో ఉగ్రవాదులతో ఎదురు కాల్పుల్లో విలేజీ రక్షక దళ సభ్యుని మృతి.

మే 4: పూంచ్ జిల్లాలో ఉగ్ర దాడిలో ఐఏఎఫ్ సిబ్బంది మరణించగా ఐదుగురు గాయపడ్డారు.

జూన్ 9: రీసీ జిల్లాలో ఉగ్ర దాడిలో 9 మంది భక్తులు మరణించగా 42 మంది గాయపడ్డారు.

జూన్ 11, 12: కథువా జిల్లాలో ఎన్‌కౌంటర్లో ఇద్దరు విదేశీ ముష్కరులు హతమవగా ఒక సీఆర్పీఎఫ్ జవాను అమరుడయ్యాడు.

జూన్ 12: దోడా జిల్లాలో ఉగ్ర దాడిలో ఓ పోలీసుకు గాయాలు.

జూన్ 26: దోడా జిల్లాలో ముగ్గురు విదేశీ ముష్కరుల కాల్చివేత.

జూలై 7: రాజౌరీ జిల్లాలో ఉగ్ర దాడిలో సైనిక సిబ్బంది గాయపడ్డారు.

జూలై 8: కథువా జిల్లాలో ఉగ్రవాదుల ఉచ్చులో చిక్కి ఐదుగురు సైనికులు బలయ్యారు.

జూలై 15: దోడా ఎన్‌కౌంటర్‌లో కెప్టెన్‌తో పాటు మరో ముగ్గురు సైనికుల వీరమరణం

షెడ్యూల్డ్ కులాల జాబితాను రాష్ట్రాలు మార్చలేవు

సుప్రీంకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ: షెడ్యూల్డ్ కులాల జాబితాలో మార్పుచేర్పులు చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు లేదని సుప్రీంకోర్టు మంగళవారం స్పష్టం చేసింది. తంతి-తంత్వా కులాన్ని అత్యంత వెనుకబడిన కులాల (ఈబీసీ) జాబితా నుంచి తొలగించి, షెడ్యూల్డ్ కులాల జాబితాలోని 'పాన్/సవాసీ' కులంలో కలిపేస్తూ 2015లో బిహార్ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ చెల్లదని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రాల ధర్మాసనం తేల్చిచెప్పింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 341 కింద పేర్కొన్న షెడ్యూల్డ్ కులాల జాబితాను మార్చడానికి రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం లేదని తెలిపింది. క్లాజ్-1 కింద పేర్కొన్న ఎస్సీ కులాల జాబితాను పార్లమెంటు మాత్రమే సవరించగలదని, ఆర్టికల్ 341 ప్రకారం కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రపతికి కూడా ఈ అధికారం లేదని స్పష్టం చేసింది.

మిలిటెంట్ల దాడిలో 72 మంది మృతి

కిన్షాసా(కాంగో): డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో పశ్చిమప్రాంతంలో జరిగిన జాతుల హింసలో 9 మంది సైనికులు సహా 72 మంది ప్రాణాలు కోల్పోయారు. రాజధాని కిన్షాసాకు 100 కిలోమీటర్ల దూరంలోని కిన్సెలెలో శనివారం జరిగిన ఈ దారుణం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. క్వామౌత్ ప్రాంతంలో ఉంటున్న టెకె, యకా తెగల మధ్య భూ హక్కులు, సంప్రదాయాలపై తలెత్తిన వివాదాలు 2022 నుంచి హింసాత్మక రూపం దాల్చాయి. యకా వర్గానికి చెందిన మొబొండొ మిలీషియా సభ్యులు గ్రామంపై మారణాయుధాలతో విరుచుకుపడ్డారు. వీరి దాడిలో 9 మంది సైనికులు, ఒక సైనికుడి భార్య సహా 72 మంది మృతి చెందారని ప్రావెన్షియల్ అధికారులు తెలిపారు.

వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ చీఫ్ తండ్రి దారుణ హత్య

దర్భంగా(బిహార్): వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ (వీఐపీ) చీఫ్, మాజీ మంత్రి ముకేశ్ సాహ్ని తండ్రి జితన్ సాహ్ని(70) దారుణ హత్యకు గురయ్యారు. దర్భంగా జిల్లాలోని బిరౌల్‌లో పూర్వీకుల ఇంట్లో విగతజీవిగా పడి ఉండగా మంగళవారం ఉదయం పొరుగువారు గుర్తించారు. జితన్ ఛాతీ, పొట్టపై లోతైన కత్తిపోట్లు, గాయాలున్నాయని పోలీసులు తెలిపారు. ఘటనపై దర్యాప్తునకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పూజా ఖేడ్కర్‌పై కేంద్రం సీరియస్

- ఐఏఎస్ శిక్షణ నిలిపివేత
- మళ్లీ ముస్సోరీ అకాడమీకి వెళ్లాలని కేంద్రం ఆదేశం

ముంబై: కంటిచూపు లోపాలు, మానసిక, శారీరక వైకల్యం ఉందంటూ యూపీఎస్సీలో తప్పుడు అఫిడవిట్లు సమర్పించడం, నాన్ క్రీమీలేయర్ పత్రాల దుర్వినియోగం, ఎంబీబీఎస్‌లో చేరేందుకు తప్పుడు పత్రాల సృష్టి.. ఇలా పలు వివాదాలకు కేంద్రబిందువైన 2023 బ్యాచ్ ట్రైనీ ఐఏఎస్ అధికారిణి పూజా మనోరమ దిలీప్ ఖేడ్కర్ వ్యవహారంపై ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. తక్షణం మహారాష్ట్రలో ఆమెకు జిల్లా శిక్షణను నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. తిరిగి ముస్సోరీలోని లాల్‌బహదూర్ శాస్త్రి నేషనల్ అడ్మినిస్ట్రేషన్ అకాడమీలో రిపోర్ట్‌చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ మేరకు పూజకు మహారాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి నితిన్ గాద్రే లేఖ రాశారు. '' మహారాష్ట్రలో వాసిం జిల్లా సూపర్‌న్యూమరీ అసిస్టెంట్ కలెక్టర్ హోదాలో ఉన్న మిమ్మల్ని తక్షణం 'జిల్లా శిక్షణ' నుంచి పక్కనపెడుతున్నాం. 23వ తేదీలోపు మళ్లీ ముస్సోరీ ఐఏఎస్ అకాడమీలో రిపోర్ట్‌చేయండి. అకాడమీ తీసుకునే చర్యలకు సిద్ధంగా ఉండండి'' అని ఆమెకు పంపిన లేఖలో నితిన్ పేర్కొన్నారు.

ప్రత్యేక వసతులతో వార్తల్లోకి..

ట్రైనీ అయినాసరే జిల్లా కలెక్టర్ స్థాయిలో తనకూ అధికారిక సదుపాయాలు, వసతులు కల్పించాలని డిమాండ్‌చేయడంతో పూజ వ్యవహార శైలి తొలిసారిగా వార్తల్లోకి ఎక్కింది. ప్రత్యేకంగా ఆఫీస్‌ను కేటాయించాలని, అధికారిక కారు ఇవ్వాలని డిమాండ్‌చేయడంతోపాటు సొంత ఖరీదైన కారుపై ఎర్ర బుగ్గను తగిలించుకుని తిరిగారు. దీంతో పుణెలో అసిస్టెంట్ కలెక్టర్ హోదా నుంచి ఆమెను వాసిమ్ జిల్లాలో సూపర్‌న్యూమరీ అసిస్టెంట్ కలెక్టర్‌గా ప్రభుత్వం బదిలీచేసింది. తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సమర్పించి సివిల్స్‌లో ఆమె ఆలిండియా 821వ ర్యాంక్ సాధించారని మీడియాలో వార్తలొచ్చాయి. దాంతో యూపీఎస్సీకి ఆమె సమర్పించిన వైకల్యం సర్టిఫికెట్లు, అఫిడవిట్ల విశ్వసనీయతపై నీలినీడలు కమ్ముకున్నాయి. దీంతో ఈ విషయంలో నిజానిజాలను నిగ్గుతేల్చాలని కేంద్రప్రభుత్వ ఏకసభ్య కమిటీని నియమించింది. రెండు వారాల్లోగా నివేదించాలని ఆదేశించింది. ఆదివారం పుణె పోలీసులు పూజ లగ్జరీకారును సీజ్‌చేశారు. తప్పుడు పత్రాలతో ఎంబీబీఎస్ సీటు సాధించారని విమర్శలు వెల్లువెత్తాయి.

సోమవారం అర్ధరాత్రి పూజ ఇంటికి మహిళా



పోలీసులు వెళ్లారు. కొంచెం పని ఉందని చెప్పి ఆమే వారిని పిలిపించినట్లు తెలుస్తోంది. అయితే పుణె కలెక్టర్ సుహాస్ దివాసే తనను వేధిస్తున్నారని ఫిర్యాదు చేసేందుకే వారిని ఇంటికి పిలిపించిందని పోలీసు అధికారి ఒకరు మంగళవారం వెల్లడించారు. కాగా 2022 ఆగస్ట్‌లో పుణె జిల్లా పింప్రి ఆస్పత్రిలో ఎడమ మోకాలికి వైకల్యం ఉందని ఆమె వికలాంగ సర్టిఫికెట్ సంపాదించారని యశ్వంత్‌రావ్ చవాన్ స్మారక ప్రభుత్వాసుపత్రి డీన్ రాజేంద్ర వాబ్లే వెల్లడించారు. అయితే అదే నెలలో ఔధ్ ప్రభుత్వాసుపత్రిలో వైకల్య సరిఫికెట్ కోసం పెట్టుకున్న ఆమె దరఖాస్తు తిరస్కరణకు గురైందని తెలుస్తోంది. ''కమిషనర్ ఫర్ పర్సన్స్ విత్ డిజబిలిటీ ఆదేశాల మేరకు పూజ గతంలో సమర్పించిన వైకల్య సర్టిఫికెట్లు అన్నింటినీ పరిశీలిస్తాం. ఆమెకు కంటి, మానసిక, అంగ వైకల్యం ఉందని ధ్రువపరిచిన ఆస్పత్రులు, వైద్యులెవరో తేలుస్తాం' అని పుణె పోలీసు అధికారి వెల్లడించారు.

పరారీలో తల్లిదండ్రులు !

తల్లిదండ్రులకు కోట్ల రూపాయల ఆస్తులున్న విషయాన్ని దాచి పెట్టి నాన్ క్రిమిలేయర్ సర్టిఫికెట్‌ను సంపాదించారనీ పూజపై ఆరోపణలున్నాయి. పూజ తల్లిదండ్రుల వ్యవహార శైలిపైనా మీడియాలో వార్తలొచ్చాయి. గ్రామ సర్పంచ్ అయిన పూజ తల్లి మనోరమ ఒక భూవివాదంలో కొందరిని గన్‌తో బెదిరిస్తున్న వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. క్రిమినల్ కేసులో తల్లిదండ్రుల జాడ కోసం పోలీసులు వెతుకుతున్నారు. వారిద్దరి మొబైల్స్ స్విచ్ఛాఫ్ చేసి ఉన్నాయి. పుణెలోని మెట్రో రైల్ కార్మికులతో గొడవ పడుతున్న వీడియో కూడా సోషల్‌మీడియాలో చక్కర్లు కొడుతోంది.

కొండచరియలు కూలి 9 మంది మరణం!

బనశంకరి: కర్ణాటకలో భారీ వర్షాల నేపథ్యంలో పెను ప్రమాదం సంభవించింది. ఉత్తర కన్నడ జిల్లా అంకోలా తాలూకా శిరూరు గ్రామ సమీపంలోని 66వ జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో కొండచరియలు విరిగిపడి తొమ్మిది మంది గల్లంతయ్యారు. ఈ సంఖ్య మరింత పెరగవచ్చని భావిస్తున్నారు. గత 15 రోజులుగా ఉత్తరకన్నడ జిల్లాలో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. దాంతో ఎన్‌హెచ్ 66ను ఆనుకుని ఉన్న ఎర్రమట్టి కొండ మంగళవారం ఆకస్మాత్తుగా కుప్పకూలింది. పెద్ద మొత్తంలో మన్ను, భారీ బండరాళ్లు విరుచుకుపడ్డాయి. దీంతో రహదారి పక్కనే రెండు ఇళ్లలో ఉన్న ఐదు మంది, వాహనాల్లో వెళ్తున్న నలుగురు మట్టి కింద చిక్కుకున్నారు. ఇళ్లలోని ఐదుగురు సజీవ సమాధి అయ్యారు. రెండు భారీ గ్యాస్ ట్యాంకర్లు గంగావళి నదిలోకి పడ్డాయి. వాటిలోని నలుగురు డ్రైవర్లు, క్లీనర్ల జాడ లేదు. గల్లంతైన వారిలో 7 మంది చనిపోయారని కలెక్టర్ తెలిపారు.

ఇజ్రాయెల్ దాడుల్లో 62 మంది మృతి

డెయిర్ అల్ బలాహ్: గాజాపై ఇజ్రాయెల్ సైన్యం దాడుల్లో మరో 62 మంది చనిపోయారు. ఖాన్ యూనిస్‌లో శరణార్థుల టెంట్లపై జరిగిన దాడుల్లో నలుగురు చిన్నారులు సహా 17 మంది చనిపోయారు. 26 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఇజ్రాయెల్ హమాస్ మిలటరీ విభాగం చీఫ్ మహ్మద్ డెయిఫ్ లక్ష్యంగా శనివారం ఇజ్రాయెల్ దాడుల్లో 90 మందికి పైగా చనిపోయింది ఈ ప్రాంతంలోనే. మంగళవారం వేకువజాము వరకు నుసెయిరత్, జవాయిదాల్లో 40 చోట్ల లక్షిత దాడులు జరిపినట్లు ఇజ్రాయెల్ తెలిపింది. నుసెయిరత్‌లో శరణార్థులు తలదాచుకుంటున్న స్కూల్ భవనం శిథిలాల దిబ్బగా మారింది. ఈ ఘటనలో 10 మంది మహిళలు, నలుగురు చిన్నారులు సహా 33 మంది ప్రాణాలు కోల్పోగా 73 మంది గాయాలపాలయ్యారు. ఖాన్ యూనిస్, రఫాల్లో జరిగిన దాడుల్లో 12 మంది మృతి చెందారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం వేకువజాము వరకు నుసెయిరత్, జవాయిదాల్లోని హమాస్ స్థావరాలు, మౌలిక వనరులే లక్ష్యంగా 40 చోట్ల దాడులు జరిపినట్లు ఇజ్రాయెల్ ఆర్మీ ప్రకటించింది.

రేపు మళ్లీ తెరుచుకోనున్న రత్న భండార్

భువనేశ్వర్: పూరీ జగన్నాథుని రత్న భండార్‌ను గురువారం మళ్లీ తెరుస్తామని అధికార వర్గాలు తెలిపాయి. జూలై 18వ తేదీ ఉదయం 9.51 గంటల నుంచి 12.15 గంటల మధ్యలో రత్న భండార్‌లోని లోపలి గదిని తెరిచి అమూల్యమైన వస్తువులను తాత్కాలిక ట్రెజరీ రూంకు తరలించనున్నారు. భారత పురావస్తు విభాగం(ఏఎస్ఐ) నిపుణులు వీటిని పరిశీలించనున్నారు. 46 ఏళ్ల తర్వాత మొట్టమొదటిసారిగా జూలై 14న రత్న భండార్ తలుపులను తెరవడం తెల్సిందే.

మూడో తాళం తెరుచుకోలేదేం?

14న రత్న భండార్ లోపలి గది మూడు తాళాలను తెరిచేందుకు మూడు డూప్లికేట్ తాళం చెవిలతో ప్రయత్నించారు. రెండు తాళాలు తెరుచుకోగా మూడోది మొరాయించింది. దాన్ని పగలగొట్టాల్సి వచ్చింది. ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం దర్యాప్తునకు ఆదేశించింది. డూప్లికేట్ తాళం చెవులు మాయమైనట్లు గతంలో వార్తలొచ్చాయి.

బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్ల హింస ఆరుగురు మృతి

ఢాకా: ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కోటాను రద్దు చేయాలంటూ బంగ్లాదేశ్‌లో విద్యార్థులు సాగిస్తున్న నిరసనలు హింసాత్మకంగా మారాయి. యూనివర్సిటీల క్యాంపస్‌లలో జరిగిన ఆందోళనల్లో ముగ్గురు విద్యార్థులు సహా ఆరుగురు చనిపోగా 400 మందికి పైగా విద్యార్థులు గాయపడ్డారు. స్కూళ్లు, కాలేజీలు, మదరసాలను మూసివేస్తున్నట్లు ప్రకటించిన ప్రభుత్వం పారా మిలటరీ బలగాలను రంగంలోకి దించింది. రాజధాని ఢాకాకు సమీపంలోని జహంగీర్ నగర్ వర్సిటీ క్యాంపస్‌లో వైస్‌చాన్సెలర్ నివాసం వద్ద విద్యార్థులు గుమికూడారు. ప్రశాంతంగా నిరసన సాగిస్తున్న తమపై అధికార అవామీ లీగ్ అనుబంధ బంగ్లాదేశ్ చాత్ర లీగ్ కార్యకర్తలు పోలీసులతో కలిసి దాడికి పాల్పడినట్లు విద్యార్థులు ఆరోపించారు. ఈ ఘటనలో ఇద్దరు విద్యార్థులు చనిపోయారు. ఆందోళనకారులు రెండు బస్సులకు నిప్పుపెట్టారు. పెట్రోల్ బాంబులు విసిరారు. నగరంలోని పలు ప్రాంతాల్లో పోలీసులు, దేశవ్యాప్తంగా ఆందోళనలు తీవ్రరూపం దాల్చాయి. సోమవారం నుంచి జరుగుతున్న ఆందోళనల్లో 400 మందికి పైగా గాయపడినట్లు చెబుతున్నారు.

సుప్రీంకు మరో ఇద్దరు జడ్జీలు

తొలిసారిగా మణిపూర్ రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం



జస్టిస్ కొటీశ్వర్ జస్టిస్ మహదేవన్

సాక్షి, న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్ హైకోర్టు చీఫ్ జస్టిస్ నాంగ్మేకపామ్ కొటీశ్వర్ సింగ్, మద్రాస్ హైకోర్టు తాత్కాలిక చీఫ్ జస్టిస్ ఆర్. మహదేవన్‌లు సుప్రీం జడ్జీలుగా మంగళవారం నియమితులయ్యారు. వీరిద్దరూ జడ్జీలుగా ప్రమాణం చేశాక సుప్రీంకోర్టులో జడ్జీల సంఖ్య అనుమతించిన గరిష్ట సంఖ్యకు చేరుకోనుంది. రాజ్యాంగం ప్రకారం సుప్రీంకోర్టులో చీఫ్ జస్టిస్‌తో కలుపుకుని గరిష్టంగా 34 మంది జడ్జీలు కొలువుతీరొచ్చు. జస్టిస్ కొటీశ్వర్‌ది మణిపూర్. '' ఈశాన్య రాష్ట్రం మణిపూర్ నుంచి సుప్రీంకోర్టు జడ్జీగా ఎంపికవుతున్న మొట్టమొదటి జడ్జిగా ఆయన పేరు రికార్డుల్లో నిల్చిపోనుంది'' అని ఆయన పేరును జూలై 11న కేంద్రానికి సిఫార్సుచేసిన సందర్భంగా సుప్రీంకోర్టు కొలీజియం వ్యాఖ్యానించడం తెల్సిందే. గతంలో జస్టిస్ కోటీశ్వర్ 2011 అక్టోబర్‌లో గౌహతి హైకోర్టులో జడ్జిగా నియమితులయ్యారు. మణిపూర్ హైకోర్టు ఏర్పడ్డాక అక్కడికి బదిలీ అయ్యారు. 2023 ఫిబ్రవరిలో జమ్మూకశ్మీర్, లద్దాఖ్ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా నియమితులయ్యారు. తమిళనాడులోని వెనకబడిన వర్గాలకు చెందిన జస్టిస్ మహదేవన్ మద్రాస్ హైకోర్టులో మూడో అత్యంత సీనియర్ జడ్జిగా ఉన్నారు. ''సీనియారిటీలో ఈయనకన్నా ముందున్న జడ్జీలు వేరే హైకోర్టుల్లో చీఫ్ జస్టిస్‌లుగా పదోన్నతిపై వెళ్లడంతో సుప్రీంకోర్టు ధర్మాసనంలో వైవిధ్యం తీసుకొచ్చే లక్ష్యంతో ఈయనను సుప్రీం జడ్జిగా సిఫార్సు చేస్తున్నాం'' అని కొలీజియం వ్యాఖ్యానించింది.

21న అఖిలపక్ష సమావేశం

హాజరుకాబోమని సమాచారమిచ్చిన తృణమూల్ కాంగ్రెస్



సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్ వర్షాకాల సమావేశాల ప్రారంభం నేపథ్యంలో ఈ నెల 21వ తేదీన అఖిల పక్ష సమావేశం నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. 21న ఉదయం 11గంటలకు ఢిల్లీలోని పార్లమెంటు అనుబంధ భవనంలోని ప్రధాన కమిటీ రూమ్‌లో ఈ సమావేశం నిర్వహించనున్నట్లు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ మంగళవారం ప్రకటించింది. సోమవారం నుంచి పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. లోక్‌సభలో విపక్షనేత హోదాలో కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ తొలిసారిగా అఖిలపక్షభేటీలో పాల్గొనబోతున్నారు. బెంగాల్లో అదే రోజు అమరుల దినోత్సవం ఉన్నందున తమ పార్టీ రావడం లేదని తృణమూల్ తెలిపింది. ఈమేరకు రిజిజుకు రాజ్యసభలో టీఎంసీ నేత డెరెక్ ఓబ్రియాన్ లేఖ రాశారు.

సెప్టెంబర్‌లో మోదీ 'ఐరాస' ప్రసంగం



ఐక్యరాజ్యసమితి: ఐక్యరాజ్యసమితి 79వ సర్వప్రతినిధి సభ అత్యున్నత స్థాయి సమావేశంలో ప్రధాని మోదీ ప్రసంగించనున్నారు. సెప్టెంబర్ 24 నుంచి 30వ తేదీ వరకు జరిగే ఈ సమావేశాల్లో 26న మోదీ మాట్లాడే అవకాశం ఉందని ప్రసంగించబోయే నేతల జాబితాను మంగళవారం ఐరాస విడుదలచేసింది. జాబితాలో మార్పులుచేర్పులు ఉండొచ్చని తెలిపింది. సెప్టెంబర్ 24న సంప్రదాయం ప్రకారం బ్రెజిల్ నేత తొలిసారిగా ప్రసంగిస్తారు. తర్వాత అమెరికా అధ్యక్షుడు బైడెన్ ప్రసంగిస్తారు. మూడోసారి ప్రధానిగా పగ్గాలు అందుకున్న మోదీ 2021 సెప్టెంబర్ తర్వాత తొలిసారిగా ఐరాసలో ప్రసంగించనున్నారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
బుధవారం : 17 : జూలై : 2024



శృంగేరి జలసిరి మంగళవారం చిక్కమగళూరు జిల్లాలో పవిత్ర క్షేత్రం శృంగేరిని తాకుతూ ప్రవహిస్తున్న తుంగా నది, వర్షాలతో నదీ ప్రవాహం జోరందుకుంది

న్యూస్‌రీల్

హుబ్లీ టు ముంబై విమానం



హుబ్లీ విమానాశ్రయంలో ప్రయాణికుల రాకపోకలు

హుబ్లీ: హుబ్లీ–ముంబై మధ్య విమానయానం సోమవారం నుంచి ప్రారంభం కాగా తొలి రోజే ప్రయాణికుల నుంచి మంచి స్పందన లభించింది. తొలి రోజు ముంబై నుంచి హుబ్లీకి ఈ ఇండిగో విమానంలో 163 మంది ప్రయాణికులు ప్రయాణించారు. అలాగే హుబ్లీ నుంచి ముంబైకి 111 మంది ప్రయాణికులు ప్రయాణించినట్లుగా భారతీయ విమానయాన ప్రాధికార అధికారులు తెలిపారు. గతంలో ముంబై విమానాశ్రయంలో విమానం నిలుపుదలకు చోటు లేకపోవడంతో ఈ సర్వీసును నిలిపి వేశారు. ప్రస్తుతం తిరిగి విమానయానం ప్రారంభంతో హుబ్లీ– ధార్వాడ తదితర చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలకు ఎంతో అనుకూలం అయింది.

అంతర్‌రాష్ట్ర కార్ల దొంగల అరెస్టు

- రూ.2.56 కోట్ల విలువైన 17 కార్లు స్వాధీనం

దొడ్డబళ్లాపురం: చోరీ చేసిన వివిధ కంపెనీల కార్లకు నకిలీ ఎన్‌ఓసీలు తయారు చేసి అమాయక కస్టమర్లకు విక్రయిస్తున్న ఇద్దరు దొంగలను అరెస్టు చేసిన సీసీబీ పోలీసులు వారి నుండి రూ.2.56 కోట్ల విలువైన 17 కార్లను స్వాధీనం చేసుకున్నారు. గోవాకు చెందిన ఆస్టిన్ కరోడ ఆలియాస్ చింటు (37), సయ్యద్ రియాజ్ (34) అరెస్టైన నిందితులు. ఇతర రాష్ట్రాలలో చోరీ చేసిన కార్లను బెంగళూరుకు తీసుకువచ్చి నకిలీ డాక్యుమెంట్లు తయారు చేసి అమాయక కస్టమర్లకు విక్రయించేవారు. బ్యాంకుల్లో లోన్ ఈఎంఐ కట్టకుండా ఉన్న కార్లను తాకట్టు పెట్టుకుని వాటిని కూడా నకిలీ ఎన్‌ఓసీలతో పక్క రాష్ట్రాల్లో విక్రయించేవారు. ఖరీదైన జాగ్వార్, రేంజ్ రోవర్ కార్లను కూడా నిందితులు చోరీ చేసి నకిలీ పత్రాలతో విక్రయించేవారు.

సూరజ్ రేవణ్ణ బెయిల్‌పై తీర్పు రిజర్వు

దొడ్డబళ్లాపురం: యువకుడిపై లైంగికదాడి చేసి బెదిరింపులకు పాల్పడ్డ ఆరోపణలపై అరెస్టై జైలులో ఉన్న జేడీఎస్ ఎమ్మెల్సీ సూరజ్ రేవణ్ణ బెయిలు కోసం పెట్టుకున్న పిటిషన్‌ను పరిశీలించిన కోర్టు తీర్పును రిజర్వులో ఉంచింది. సూరజ్ పీఏ ఎంఎల్ శివకుమార్ హొళేనరసీపుర గ్రామీణ పోలీస్‌స్టేషన్‌లో నమోదు చేసిన కేసులో సూరజ్ మందస్తు బెయిలు కోసం బెంగళూరు ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టులో పిటిషన్ వేశారు. బెయిలు పిటిషన్ పరిశీలించిన కోర్టు ఈనెల 18కి తీర్పు రిజర్వు చేసింది.

మేకెదాటుకు సహకరించండి ప్లీజ్

- తమిళనాడుకు డీసీఎం విజ్ఞప్తి

శివాజీనగర: మేకెదాటు ప్రాజెక్ట్ ద్వారా కర్ణాటక కంటే తమిళనాడుకే ఎక్కువ ప్రయోజనం ఉంటుందని, ఈ ప్రాజెక్ట్ అమలుకు సహకరించాలని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తమిళనాడుకు విజ్ఞప్తి చేశారు. మనం అఖిలపక్ష సమావేశం నిర్వహించినట్లే తమిళనాడు కూడా అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తోందన్నారు. అది వారి హక్కు, వారి సమావేశానికి మాకు ఎటువంటి అభ్యంతరం లేదన్నారు. అయితే తమిళనాడుకు కూడా మేలు జరిగే మేకెదాటు ప్రాజెక్ట్‌కు సహకరించాలని కోరారు. బెంగళూరులో కన్నడిగులు, తమిళులు, ఆంధ్రులు, ఉత్తర భారత రాష్ట్రాల ప్రజలు ఉన్నారు. అందరికీ తాగు నీరు లభించనుంది. అందుచేత మేకెదాటు ప్రాజెక్ట్‌కు సహకరించాలని రాష్ట్రం తరఫున విన్నవిస్తున్నామని తెలిపారు.

భక్తుడు సజీవ దహనం



రాయచూరు జిల్లా మస్కి తాలూకా బొమ్మనహాళ్ గ్రామంలో మొహర్రం ఆచరణలో విషాద సంఘటన జరిగింది. చిత్రంలో కనిపిస్తున్న యమునప్ప నాయక్ (50) అనే భక్తుడు నిప్పుల గుండంలో నడుస్తూ పడిపోయారు. మంటలు ఎక్కువగా ఉండడంతో సజీవ దహనమయ్యాడు. ఆర్తనాదాలు చేసినా ఎవరూ కాపాడే సాహసం చేయలేకపోయారు.

- రాయచూరు రూరల్:

కొండచరియ కన్నీర్ర




కొండచరియ కూలిపోవడంతో బంద్ అయిన హైవే



ప్రమాదం జరిగిన చోటు.. వృత్తంలో ఎర్ర చుక్క

- ఉత్తర కన్నడ జిల్లాలో హైవేపై కూలిన కొండ
- పలు ఇళ్లు, వాహనాలు ధ్వంసం
- ఏడుగురు సజీవ సమాధి

బనశంకరి: ప్రకృతి వికోపానికి బడుగుజీవులు బలయ్యారు. ఉత్తర కన్నడ జిల్లా అంకోలా తాలూకా శిరూరు గ్రామ సమీపంలోని జాతీయ రహదారి–66 (కన్యాకుమారి టు ముంబై)లో ఘోర విషాదం చోటుచేసుకుంది. రహదారి పక్కనున్న పెద్ద కొండ చరియ విరుచుకుపడడంతో ఏడుగురు మృత్యువాత పడ్డారు. మంగళవారం ఉదయం 6, 7 గంటల సమయంలో ఆకస్మికంగా భారీ కొండ పడిపోయి అక్కడే ఉన్న రెండు ఇళ్లు, వాహనాలను తుడిచిపెట్టేసింది. ఆ ఇళ్లలోనే హోటల్ ఉండడంతో గ్యాస్ ట్యాంకర్ల డ్రైవర్లు వాహనాలను నిలిపి టీ తాగుతుండగా ఈ ఘోరం జరిగింది. రెండు ట్యాంకర్లు పక్కనే ఉన్న గంగావళి నదిలోకి పడి కొట్టుకుపోయాయి. రోడ్డును మట్టిదిబ్బలు మూసివేయగా, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు తొలగింపులో నిమగ్నమయ్యాయి. మృతదేహాలు ఇంకా దొరకలేదని సమాచారం. ఇక్కడ రహదారిని అశాస్త్రీయంగా నిర్మించడమే విషాదానికి కారణమని ఆరోపణలున్నాయి. హైవే పనులు సక్రమంగా చేయలేదని, కొండ ప్రమాదకరంగా ఉందని జిల్లా యంత్రాంగానికి అనేకసార్లు ఫిర్యాదుచేసినా ఎవరూ పట్టించుకోలేదని స్థానికులు ఆరోపించారు.



నదిలో కొట్టుకుపోతున్న ఓ గ్యాస్ ట్యాంకర్

ఏడుగురు మరణించారు

- రెవెన్యూ మంత్రి

ఉత్తర కన్నడ జిల్లా శిరూరు వద్ద కొండచరియలు విరిగిపడి ఏడుగురు మరణించారు. మృతుల కుటుంబాలకు తలా రూ.5 లక్షలు చొప్పున పరిహారం ఇస్తామని రెవెన్యూ మంత్రి కృష్ణబైరేగౌడ తెలిపారు. శాసనసభలో ఆయన మాట్లాడుతూ ఆ ప్రాంతంలో అధిక వర్షాలు కురుస్తున్నాయి. నిట్టనిలువగా కొండను తవ్విన చోట కుప్పకూలిపోయిందని తెలిపారు. అక్కడే దాబా హోటల్ ఉంది, అక్కడ మూడు గ్యాస్ లారీ ట్యాంకర్లు నిలిపి డ్రైవర్లు టీ తాగుతున్నారు, ఆ ధాటికి రెండు ట్యాంకర్లు హైవే పక్కనే ఉన్న గంగావళి నదిలోకి పడిపోయాయి, డాబాలో ఉన్న నలుగురు కుటుంబ సభ్యులు, ముగ్గురు ట్యాంకర్ల డ్రైవర్లు మరణించారు అని తెలిపారు.



కూలిపోయిన ఇళ్లలో సహాయక పనులు

15 మంది గల్లంతయ్యారు

- హైవే నిర్మాణంలో లోపాలు
- కార్వార ఎమ్మెల్యే సతీశ్ సైల్ ధ్వజం

బనశంకరి: హైవేపై కొండచరియలు విరిగిపడిన ప్రమాదంలో 10 నుంచి 15 మంది గంగావళి నదిలో గల్లంతయ్యారని కార్వార కాంగ్రెస్ ఎమ్మెల్యే సతీశ్ సైల్ విధానసభలో ఆందోళన వ్యక్తం చేశారు. జీరో అవర్‌లో ఆయన ప్రస్తావిస్తూ, రెండు మూడు ఇళ్లు , రెండు గ్యాస్ ట్యాంకర్లు నదిలోకి కొట్టుకుపోయాయని, అందరూ కలిపి సుమారు 10–15 మంది గంగావళి నదిలో గల్లంతయ్యారని తెలిపారు. జాతీయ రహదారి నిర్మాణం చేపట్టే సమయంలో తాము అనేక సలహాలు ఇచ్చామని, కానీ జాతీయ రహదారి ప్రాధికార అధికారులు తమ మాటలు పట్టించుకోలేదన్నారు. గతంలో అక్కడి కలెక్టర్‌కు అనేక సార్లు ఫిర్యాదు చేశామని, కానీ ఎలాంటి ప్రయోజనం లేదని ఆరోపించారు. రోడ్డు కోసం కొండ ప్రాంతాన్ని కత్తిరించారని, అది ఇప్పుడు కుంగిపోయిందన్నారు. అంకోలా నడిబొడ్డున సీబర్డ్ పథకానికి 415 హెక్టార్లు కేటాయించారని ఈ ప్రాంతంలో 15, 20 అంతస్తులతో ఇళ్లు నిర్మించుకున్నారని, అది కూడా విపత్తుకు ఒక కారణమన్నారు. ఈ దుర్ఘటనపై అసెంబ్లీకి పూర్తి నివేదికను అందిస్తామని మంత్రులు హామీ ఇచ్చారు.

సర్కారీ ఉద్యోగులకు శుభవార్త



వేతన పెంపు కోసం బెంగళూరులో ఉద్యోగుల ధర్నా (ఫైల్)



- భారీగా వేతనాల పెంపు
- ఆగస్టు 1న కొత్త జీతాలు జమ
- సీఎం సిద్ధరామయ్య వెల్లడి

బనశంకరి: వేతన పెంపు కోసం పట్టుబట్టిన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సర్కారు తీపి వార్త వినిపించింది. 7వ వేతన కమిషన్ సిఫార్సులను అమలులోకి తెచ్చినట్లు ముఖ్యమంత్రి సిద్దరామయ్య మంగళవారం విధానసభలో ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల వేతన, పింఛన్ సవరణలపై 2022 నవంబరులో 7వ వేతన కమిషన్ ను ఏర్పాటు చేశామని, ఈ ఏడాది మార్చి 24న నివేదిక వచ్చిందని తెలిపారు. కమిషన్ సిఫార్సుల ప్రకారం జూలై 1 నుంచి అమలు చేస్తామని, ఈ ఆగస్టు 1న కొత్త వేతనాలు లభిస్తాయని కేబినెట్ భేటీలో తీర్మానం చేసినట్లు తెలిపారు.

58 శాతం పెంచాం: సీఎం

- మూల వేతనానికి 31 శాతం డీఏ చేరుస్తామని, అలాగే 27.50 ఫిట్‌మెంట్‌ను చేర్చి వేతనం, పింఛన్‌ని పరిష్కరిస్తామని సీఎం తెలిపారు. దీని వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై ఏడాదికి రూ.20,208 కోట్ల భారం పడుతుందని చెప్పారు.
- ప్రభుత్వ ఉద్యోగుల మూల వేతనం, పింఛన్‌ను 58 శాతం పెంచామని, ఇంటి అద్దె భత్యం 32 శాతం పెంచుతున్నామని తెలిపారు.
- ప్రభుత్వ ఉద్యోగుల కనిష్ట మూల వేతనం రూ.17 వేల నుంచి రూ. 27 వేలు అయ్యిందని చెప్పారు. గరిష్ట మూల వేతనం రూ.1,50,600 నుంచి రూ.2,41,200కు పెరిగిందని తెలిపారు.
- పింఛన్‌దారుల కనీస పెన్షన్ రూ.8500 నుంచి రూ.13,500 కాగా, గరిష్ట పింఛన్ రూ.75,300 నుంచి రూ.1లక్ష 20 వేలకు సవరించినట్లు వివరించారు.
- ఈ వేతన సవరణ అన్ని ప్రభుత్వ ఉద్యోగులు, ఎయిడెడ్ సంస్థలు, స్థానిక సంస్థలు, యూనివర్సిటీల సిబ్బందికి వర్తిస్తుందని తెలిపారు.

కలసి ఉంటే కలదు సుఖం



దంపతులతో జడ్జిలు, ప్లీడర్లు

- ఫ్యామిలీ కోర్టులో ఒక్కటైన జంటలు

తుమకూరు: చిన్నా చితకా కారణాలతో పోట్లాడుకుని విడాకుల కోసం దరఖాస్తు చేసిన జంటలను న్యాయమూర్తులు మళ్లీ ఒక్కటి చేశారు. జిల్లా కుటుంబ కోర్టులో ఇలా 18 జంటలను ఏకం చేయడం విశేషం. మంగళవారం జరిగిన లోక్ అదాలత్‌లో 18 జంటలు విడాకులు కోరుతూ విచారణకు వచ్చాయి. న్యాయమూర్తి బీ జయంత్ కుమార్ విచారణ జరిపారు. విడాకులు తీసుకోవడం పరిష్కారం కాదని, చిన్న చిన్న గొడవలు ఉంటే సర్దుకుపోయి సంతోషంగా జీవించాలని వారికి న్యాయమూర్తి తదితరులు బుజ్జగించారు. అంతే తప్ప ఇలా గొడవలు పడుతూ కోర్టుల వరకూ రాకూడదని సున్నితంగా మందలించారు. అప్పటికప్పుడు పూలదండలు తెప్పించి జంటల చేత దండలు మార్పించి సంతోషం వెల్లివిరిసేలా చేశారు. విడిపోదామని వచ్చిన భార్యాభర్తలు ఒక్కటై ఇంటిదారి పట్టారు.

ప్రతిపక్షాలపై వివక్ష: అశోక్

బనశంకరి: హాసన్ పెన్ డ్రైవ్ కేసు శాసనసభలో ప్రతిధ్వనించింది. అధికార, విపక్షాల మధ్య వాగ్వివాదం కొనసాగింది. వాల్మీకి మండలి నిధుల కుంభకోణంలో సిట్ ఎఫ్ఐఆర్ నమోదుచేసి 40 రోజులైనా మాజీ మంత్రి నాగేంద్ర, మండలి అధ్యక్షుడు బసవనగౌడ దద్దల్‌ను విచారణకు పిలువలేదని, కానీ హెచ్‌డీ రేవణ్ణ కుమారుడు తప్పు చేస్తే రేవణ్ణను జైలులో పెట్టారని బీజేపీ పక్ష నేత ఆర్.అశోక్ సర్కారుపై మండిపడ్డారు. బెంగళూరు, హాసన్, హొళేనరసిపురలో రేవణ్ణ ఇంటి వద్ద 20 మంది చొప్పున పోలీసులను పెట్టారని, రేవణ్ణ భార్య భవాని ని కూడా అరెస్ట్ చేయడానికి ప్రయత్నించారని, తమ పార్టీ మాజీ ఎమ్మెల్యే ప్రీతం గౌడను అరెస్ట్‌చేసే ప్రయత్నాలు జరిగాయని, సిట్ అధికారులు ఎందుకు తారతమ్యం చూపుతున్నారని ఆయన ప్రశ్నించారు. వాల్మీకి మండలి స్కాంకి బాధ్యత వహించి సీఎం సిద్దరామయ్య తక్షణం రాజీనామా చేయాలని కోరారు.

తప్పు చేసింటే ఉరి తీయండి: రేవణ్ణ

ఈ సమయంలో జేడీఎస్ ఎమ్మెల్యే హెచ్‌డీ రేవణ్ణ స్పందిస్తూ తన కుమారుడు ప్రజ్వల్ తప్పు చేసి ఉంటే ఉరితీయాలని, 40 ఏళ్ల రాజకీయాల్లో ఉన్నానని అన్నారు. తనపై ఫిర్యాదు చేయడానికి బాధితులను డీజీపీ కార్యాలయానికి పిలిపించుకున్నారని, ఇలాంటి వ్యక్తి డీజీపీ పదవికి అనర్హుడని, ఇలాంటి ప్రభుత్వానికి సిగ్గుండాలని విమర్శించారు.

వాల్మీకి మండలి సొమ్ముతో విలాస కార్లు

- వర్మ నుంచి లంబోర్గిని, బెంజ్‌లు సీజ్



దొడ్డబళ్లాపురం: వాల్మీకి గిరిజన అభివృద్ధి మండలిలో జరిగిన రూ. 185 కోట్ల నిధుల కుంభకోణంలో సిట్ అధికారులు 13వ నిందితుని నుండి ఖరీదైన కార్లను సీజ్ చేశారు. నిందితుడు సత్యనారాయణ వర్మ వద్ద ఉన్న రూ.8.2 కోట్లు, రూ.3 కోట్ల విలువైన లంబోర్గిని కార్లు, రూ.1.2 కోట్ల ఖరీదైన బెంజ్ కారును హైదరాబాద్‌లో సీజ్ చేశారు. మండలి నిధులతోనే వీటిని కొని ఉంటాడని అనుమానాలున్నాయి. అలాగే వాల్మీకి మండలి ఎండీ పద్మనాబ్ నుంచి రూ.3.92 కోట్లు, మరో నిందితుడు నాగేశ్వరరావ్ నుండి రూ.1.5 కోట్లు, చంద్రమోహన్ నుండి రూ.30లక్షలు, జగదీష్ నుంచి రూ.15 లక్షల నగదును సీజ్ చేసారు.

మరో నిందితుడు అరెస్టు

మండలి కుంభకోణంలో సిట్ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన శ్రీనివాస్‌రావును అరెస్టు చేసింది. బెంగళూరు ఎంజీ రోడ్డు యూనియన్ బ్యాంక్ బ్రాంచి నుండి హైదరాబాద్‌లోని బ్యాంక్‌ల ఖాతాలకు రూ.94 కోట్ల నగదు బదిలీ జరిగింది. మరో నిందితుడు సత్యనారాయణ వర్మ ఈ ఖాతాల బాధ్యత వహించారు. ఆ ఖాతాల నుంచి శ్రీనివాస్‌రావ్ కు రూ.10 కోట్లు బదిలీ కాగా, డ్రా చేసుకున్నాడు. కేసు వెలుగు చూసిన నాటి నుండి పరారీలో ఉన్నాడు. సిట్ అరెస్టు చేసి నగదుపై ఆరా తీస్తోంది.

లూటీదారులు, దగాకోరులు

- కాంగ్రెస్, బీజేపీ పరస్పర ఆరోపణలు
- వాల్మీకి మండలి స్కాంపై విధానసభలో రచ్చ



విధానసభలో మాట్లాడుతున్న డీసీఎం డీకే శివకుమార్, హోంమంత్రి పరమేశ్వర్ తదితరులు

బనశంకరి: లూటీదారులు, దగాకోరులు మీరంటే మీరని మహర్షి వాల్మీకి అభివృద్ధి మండలి స్కాం, ముడా ఇళ్ల స్థలాల గొడవలపై శాసనసభలో అధికార విపక్షాల మధ్య రగడ చోటుచేసుకుంది. మంగళవారం విధానసభ ప్రారంభం కాగానే వాల్మీకి మండలి కుంభకోణం గురించి శాసనసభలో బీజేపీ పక్ష నేత ఆర్.అశోక్ లేవనెత్తారు, ఆ సమయంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య సభలో లేరు, లూటీ ప్రభుత్వం, దందాకోరులు అని విపక్ష ఎమ్మెల్యేలు కేకలు వేయడంతో గలాటా మొదలైంది. దీంతో సభాపతి ఖాదర్ సభను కొద్దిసేపు వాయిదావేశారు.

సీఎంని రప్పించండి

జీరో అవర్ తరువాత అశోక్ మాట్లాడుతుండగా, బీజేపీ ఎమ్మెల్యే అశ్వత్థ నారాయణ స్పందిస్తూ, ముఖ్యమంత్రి సభకు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. ఇది ఆర్థిక శాఖకు చెందినవ్యవహారం కాబట్టి తక్షణం ముఖ్యమంత్రిని సభకు రప్పించాలని డిమాండ్ చేశారు. ఈ మాటలతో కోపోద్రిక్తుడైన డిప్యూటీ సీఎం డీకే.శివకుమార్, మంత్రులు జమీర్ అహ్మద్‌ఖాన్, కేజే.జార్జ్, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు.. ముఖ్యమంత్రిని ఈ రీతిలో మాట్లాడటం తగదు, గౌరవించడం నేర్చుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రికార్డుల నుంచి తీసేయాలి

బీజేపీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ నిలబడి, ప్రభుత్వం దళితుల నిధులను దుర్వినియోగం చేసిందని, మీకు సిగ్గులేదా అని ప్రశ్నించారు. దీంతో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఈ మాటలకు అభ్యంతరం తెలిపారు. బీజేపీ నేతలు ఆపరేషన్ కమల అని, కోవిడ్ సహాయక నిధులను లూటీ చేశారని ఆరోపించారు. పరస్పర ఆరోపణలతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. డీకే.శివకుమార్ మాట్లాడుతూ లూటీచేసింది మీరు, మమ్మల్ని లూటీ దారులు అంటారా అని ధ్వజమెత్తారు. అశ్వత్‌నారాయణ లూటీదారులకు పితామహుడు అని డీకే హేళన చేశారు. ఇలా మాటల యుద్ధం తారాస్థాయికి చేరుకుని సభలో గందరగోళం ఏర్పడింది. అభ్యంతర పదాలను రికార్డుల నుంచి తొలగించాలని బీజేపీ సభ్యులు కోరారు. స్పీకర్ ఖాదర్ అభ్యంతర పదాలను తొలగిస్తామని హామీ ఇచ్చారు. అప్పటికే టీవీల్లో ప్రత్యక్ష ప్రసారమయ్యాయని, తొలగించి ఏం ప్రయోజనమని బీజేపీ ఎమ్మెల్యేలు వాపోయారు.

మత్తు విక్రేతల ఆటకట్టు

- రాజధానిలో పలుచోట్ల అరెస్టులు
- రూ. 26 లక్షల సరుకు స్వాధీనం



దొడ్డబళ్లాపురం: సిలికాన్ సిటీలో చాటుమాటుగా మత్తు పదార్థాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. తరచూ పట్టుబడుతున్న విక్రేతలే ఇందుకు నిదర్శనం. తాజాగా ఇద్దరు విదేశీయులతో కలిపి 5 మంది డ్రగ్స్ అమ్మకందారులను అరెస్టు చేసిన సీసీబీ పోలీసులు వారి వద్ద నుంచి రూ.26 లక్షల విలువైన మత్తు పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు...

పరప్పనలో ఇద్దరు విదేశీయులు..

- కెంగేరి పరిధిలో కేరళకు చెందిన ఇద్దరు పెడ్లర్‌లను అరెస్టు చేసి రూ.3 లక్షల విలువైన 2.75 కేజీల గంజాయి, రెండు మొబైళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీరు కేరళ నుంచి గంజాయిని తీసుకువచ్చి బెంగళూరులో పలు ప్రాంతాల్లో విక్రయించేవారు.
- పరప్పన అగ్రహార పరిధిలో ఇద్దరు విదేశీయులను అరెస్టు చేసి రూ.21లక్షల విలువైన 206 గ్రాముల ఎండీఎంఏ క్రిస్టల్స్, 3 మొబైళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీరు బిజినెస్ వీసాతో భారత్‌కు వచ్చారు. ఢిల్లీ, గోవా, ముంబై ప్రాంతాల నుండి మత్తు పదార్థాలు తీసుకువచ్చి బెంగళూరులో అమ్మేవారు.
- వర్తూరు పరిధిలో స్థానిక పెడ్లర్‌ను అరెస్టు చేసి రూ.2 లక్షల విలువైన 19.9 గ్రాముల ఎండీఎంఏ క్రిస్టల్స్ స్వాధీనం చేసుకున్నారు.
- శేషాద్రిపురం పరిధిలో ఒడిశాకు చెందిన డ్రగ్స్ విక్రేతను పట్టుకుని ఒక కేజీ గంజాయిని సీజ్ చేశారు. ఇతనిపై శివాజీనగరలో ఇదివరకే ఒక హత్యాయత్నం, దోపిడీ, దాడి కేసులు ఉన్నాయి. ఇతడు ఇచ్చిన సమాచారం మేరకు పలువురి ఇళ్ల నుంచి సుమారు 8 కేజీల గంజాయిని పట్టుకున్నారు.

డ్రగ్స్ విక్రేతపై కాల్పులు

కృష్ణరాజపురం: గంజాయి, ఎండిఎంఏ మత్తు మాత్రలను విక్రయిస్తున్న వ్యక్తిపై హొసకోటె పోలీసులు కాల్పులు జరిపి అరెస్టు చేశారు. వివరాలు.. గంజాయి విక్రేత సుహేల్ (35) మంగళవారం తెల్లవారుజామున హొసకోటెలోని టోల్‌గేట్ వద్ద ఉన్నాడని తెలిసి ఇన్‌స్పెక్టర్ అశోక్, పోలీసులు అరెస్టు చేయడానికి వెళ్లారు. పోలీసులను చూసిన నిందితుడు వేట కొడవలితో దాడికి యత్నించాడు. దీంతో ఇన్‌స్పెక్టర్ అతని కాలిపై కాల్పులు జరపడంతో పడిపోయాడు. వెంటనే ఆస్పత్రికి తరలించారు.

రాజధానిలో 2వ ఎయిర్‌పోర్టు తథ్యం

- అసెంబ్లీలో మంత్రి పాటిల్

శివాజీనగర: రాష్ట్ర హితం, భవిష్యత్ బెంగళూరును దృష్టిలో పెట్టుకొని సరైన చోట 2వ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని స్థాపించనున్నట్లు భారీ, మధ్యతరహా పరిశ్రమల మంత్రి ఎంబీ పాటిల్ విధాన పరిషత్‌లో తెలిపారు. ఢిల్లీ, గోవా, ముంబైలలో ఇప్పటికే రెండో భారీ విమానాశ్రయాలను స్థాపించారు. అదే తరహాలో బెంగళూరులో కూడా నిర్మిస్తామని చెప్పారు. బెంగళూరులో చుట్టు ప్రక్కల ఏడెనిమిది చోట్ల స్థలాలను గుర్తించడమైనది. భారతీయ విమానాశ్రయ ప్రాధికార, సంబంధిత సంస్థలతో చర్చలు జరుపుతాము. ఫలానా చోటే నిర్మించాలనే ఎవరి ఒత్తిడికి లొంగకుండా రాష్ట్ర అభివృద్ధిని దృష్టిలో సరైన చోట రెండవ విమానాశ్రయాన్ని స్థాపిస్తామని తెలిపారు. ప్రస్తుతం దేవనహళ్లిలో ఉన్న కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం 2035 నాటికి ఏడాదికి 1.1 కోట్ల మంది ప్రయాణికుల సామర్థ్యానికి చేరుకొంటుంది. 2033లోగా రెండో విమానాశ్రయాన్ని నెలకొల్పాల్సి ఉందన్నారు. తుమకూరు, చిత్రదుర్గ, ఎలక్ట్రానిక్ సిటీ, బెంగళూరు దక్షిణ, బెంగళూరు ఉత్తరలో కొత్త ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేయాలని ఒత్తిళ్లు ఉన్నాయని తెలిపారు.

క్లుప్తంగా

క్రిమినల్ చట్టాలపై సదస్సు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పోలీస్ అధికారులు

హొసపేటె: విజయనగర జిల్లా ఎస్పీ శ్రీహరిబాబు ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నూతన క్రిమినల్ చట్టాలపై సదస్సు నిర్వహించారు. రిసోర్స్ పర్సన్లుగా రిటైర్డ్ డీజీపీ డాక్టర్ డీవీ గురుప్రసాద్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ పోలీసు అధికారులు, సిబ్బందికి ప్రతి ఏటా నూతన క్రిమినల్ చట్టాలపై వర్క్‌షాప్‌ల ఏర్పాటు ఎంతో అవసరమన్నారు. ఈ సందర్భంగా బళ్లారి జోన్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్ లోకేష్ కుమార్, శ్రీమూర్తి, జిల్లా పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఎదుగుదలకు ప్రతిభ సోపానం



విద్యార్థులను సన్మానిస్తున్న అధికారులు

రాయచూరు రూరల్: విద్యార్థుల ఎదుగుదలకు ప్రతిభ సోపానమని విరుపాక్షేశ్వర సహకార బ్యాంక్ సీఈఓ శంకరానంద పేర్కొన్నారు. ఆయన మంగళవారం దేవదుర్గ తాలూకా గబ్బూరు విరుపాక్షేశ్వర సహకార సంఘం ఏర్పాటు దశమానోత్సవాలను ప్రారంభించి మాట్లాడారు. సమాజంలో సేవ చేయాలనే తపన ప్రతి ఒక్కరిలో రావాలన్నారు. స్వార్థం వీడి నిస్వార్థంతో పని చేయాలన్నారు. పంచయ్య స్వామి మఠ, సూగూరేశ్ గౌడ, బసవరాజ్, సదాశివయ్య, అయ్యన గౌడ, జగదీష్, హంపయ్య తదితరులున్నారు.

ప్లేట్ బ్యాంక్ ప్రారంభం



కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

రాయచూరు రూరల్: నగరంలోని ప్రైవేట్ పాఠశాలలో ప్లేట్ బ్యాంక్‌ను బెంగళూరు అదమ్య చేతన సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభించారు. పేదలకు వివాహ, శుభ కార్యాల సమయంలో ఉచితంగా ప్లేట్‌లను అందించడానికి శ్రీకారం చుట్టినట్లు సంస్థ అధ్యక్షురాలు తేజస్విని వెల్లడించారు. ప్రజాదరణ పొందిన ఈ పథకం కింద 10 వేలకు పైగా ప్లేట్‌లను ఉచితంగా సరఫరా చేస్తామని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. పదాధికారులు కృష్ణమూర్తి, రాజేంద్ర, త్రివిక్రం జోషి, రమేష్, లాలాజీ, మీరా, ప్రహ్లాద్‌లున్నారు.

బడా చైన్‌స్నాచర్ అరెస్టు

దొడ్డబళ్లాపురం: వరుసగా గొలుసు చోరీలకు పాల్పడుతున్న బడా చైన్ స్నాచర్‌ను కెంగేరి పోలీసులు అరెస్టు చేశారు. కోడిపాళ్యలోని డీ.ఎక్స్ మ్యాక్స్ అపార్ట్‌మెంట్లో నివసిస్తున్న మహిళ జూన్ 7న కుమార్తెను పాఠశాలకు వదిలి వస్తుండగా బైక్‌పై వచ్చిన దుండగుడు ఆమె మెడలో బంగారు గొలుసు లాక్కెళ్లాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు కెంగేరి దొడ్డబెలె మెట్రో వద్ద ఒక చైన్ స్నాచర్‌ను అరెస్టు చేసి విచారించగా బెంగళూరు సిటీలో జరిగిన అనేక చైన్ స్నాచింగ్‌లు తానే చేసినట్టు ఒప్పుకున్నాడు. నిందితుని నుండి రూ.7 లక్షల విలువైన బంగారు చైన్‌లు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

నాసిరకం పనులు తగదు

రాయచూరు రూరల్: నగరంలోని 28, 5, 30, 31వ వార్డుల్లో అధికారులు నాసిరకంగా పనులు చేపట్టడం తగదని కరవే ఆరోపించింది. మంగళవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనలో అధ్యక్షుడు ఖలీల్ పాషా మాట్లాడారు. వివిధ పథకాల కింద సిమెంట్ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం, ఇతరత్ర అభివృద్ధి పనులు చేపట్టినట్లు రికార్డుల్లో రాసుకొని కాంట్రాక్టర్లు పనులు చేయకున్నా రూ.4 కోట్ల మేర నిధులు డ్రా చేశారన్నారు. దీనిపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు చేపట్టాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

హుబ్లీ: టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న నిరాజ్, దావణగెరెకు చెందిన ఇద్దరితో పాటు మొత్తం 13 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు వారి నుంచి రూ.1.15 లక్షల విలువ చేసే 1.127 కేజీల గంజాయి, బైక్, మొబైల్‌ను సీజ్ చేశారు. కేసుకు సంబంధించి నవాబ్ మకాన్‌దార్, హజరత్ పటేల్, అహ్మద్‌ఖాన్ అలియాస్ ముక్క, పాండు రాయబాగి, శంకరనాగ్ జమక, ఆకాశ్ ఇరకల్, అజరుద్దీన్, వెంకటేష్ హేరూరు, ఎంజీ గౌస్ దరేఖాన్, ఆర్యన్ కోటి, నూర్ అహ్మద్ పటాన్, సర్ఫరాజ్ కొప్పళ, సికిందర్ మిర్జి అరెస్ట్ అయిన నిందితులు. నిందితుల నుంచి గంజాయితో పాటు రూ.6.300 నగదు, రెండు బైక్‌లు, నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విక్రయానికి మీరజ్ నుంచి వచ్చిన, దావణగెరె నుంచి కొనుగోలు కోసం వచ్చిన ఇద్దరు, నగరానికి చెందిన 11 మందిని అరెస్ట్ చేశారు. ఏసీపీ ఉమేష్ చిక్కమఠ తమకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు హుబ్లీ టౌన్ సీఐ ఎంఎం తహసీల్దార్ నేతృత్వంలోని బృందం ఈ కార్యాచరణ జరిపి నిందితులను అరెస్ట్ చేసింది. దాడిలో ఎస్ఐ మారుతీ బృందం పాల్గొంది.

మలెనాడు, కరావళి జిల్లాల్లో వరుణాగ్రహం



గోకర్ణ రామతీర్థ దేవస్థానం వద్ద కూలిన కొండచరియలు



కారవారలో జాతీయ రహదారి జలమయం

- ఉడుపి జిల్లాలో రెడ్అలర్ట్
- జనజీవనం అస్తవ్యస్తం
- నీట మునిగిన పంట పొలాలు

బనశంకరి: కొడగు, ఉడుపి, దక్షిణ కన్నడ, ఉత్తర కన్నడ, చిక్కమగళూరు, శివమొగ్గతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల్లో వర్షం ఉధృతి కొనసాగడంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. భారీ వర్షాలతో పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో చీకట్లో గడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. పలు గ్రామాలు, పంట పొలాలు జలమయం అయ్యాయి. హాసనలో భారీ వర్షానికి ఇంటి గోడ కూలిపోవడంతో అదృష్టవశాత్తూ మహిళ ప్రాణాలతో బయటపడింది. సకలేశపుర తాలూకా కబ్బినగద్దె నివాసి కమలమ్మకు చెందిన ఇంటి గోడ కూలిపోగా ఎలాంటి ప్రాణాప్రాయం సంభవించలేదు. అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. హాసన జిల్లా వ్యాప్తంగా వర్షాలు కొనసాగుతుండగా సకలేశపుర తాలూకా మావినూరు, కాగినెరె గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గడిగ్రామ కంబలగెరెలో వర్షానికి ఇంటి ప్రహరీ కూలిపోయింది. వర్షాల నేపథ్యంలో హాసన జిల్లాలోని సకలేశపుర, ఆలూరు, అరకలగూడు, బేలూరు తాలూకా, దక్షిణ కన్నడ, మైసూరు, చామరాజనగర జిల్లా వ్యాప్తంగా విద్యా సంస్థలకు సెలవు ప్రకటించారు. ఉడుపి జిల్లాలో వాతావరణశాఖ రెడ్అలర్ట్ ప్రకటించింది. కొడగు జిల్లావ్యాప్తంగా పీయూసీ వరకు సెలవు ప్రకటించారు. అదే విధంగా ఉత్తర కన్నడ జిల్లాలో కుంభవృష్టి వర్షాలు పడుతుండటంతో పలుచోట్ల వరదలు తలెత్తగా హొన్నావర-బెంగళూరు జాతీయ రహదారిలో కొండ కుంగిపోయింది. చిక్కమగళూరు, మలెనాడు ప్రాంతంలో వర్షాల ఉధృతి కొనసాగుతుండగా పశ్చిమ కనుమల్లో భద్రావతి ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. కళసా తాలూకాలో హెబ్బాళ వంతెన మునిగిపోయింది. దీంతో హొరనాడు, కళసా మధ్య సంబంధాలు తెగిపోయాయి. ముందు జాగ్రత్త చర్యగా వంతెనకు రెండు చోట్ల బ్యారికేడ్లు వేసి వాహనాల సంచారం నిషేధించారు. వంతెన వద్ద కళసా పోలీసులు మకాం పెట్టారు.



ఉడుపిలో కూలిన ఓ ఇంటి గోడ

పార్కింగ్ సమస్యపై రవాణా శాఖతో చర్చిస్తాం

శివాజీనగర: బెంగళూరులో పార్కింగ్ సమస్య నివారణకు బీబీఎంపీ, రవాణా శాఖతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని హోం మంత్రి జీ.పరమేశ్వర్ అసెంబ్లీలో తెలిపారు. మంగళవారం ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే ఎస్.ఆర్.విశ్వనాథ్ అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చిన ఆయన, బెంగళూరులో ట్రాఫిక్ సమస్య విదేశాల్లో కూడా ప్రస్తావన అవుతోంది. విదేశీ పత్రికల్లో కూడా కథనాలు వచ్చాయని, దీంతో బెంగళూరులో ఉన్న ట్రాఫిక్ సమస్య ఇతర చోట్ల ఎక్కడా లేదు. రోడ్లలో రెండు వైపులా వాహనాలు నిలుపుతారు. రోడ్లలో సంచరించేందుకు ఇబ్బంది అవుతోంది. బీబీఎంపీ, రవాణా శాఖ సహకారం అవసరముంది. ఇంటి నిర్మాణానికి అనుమతి కల్పించేటపుడు పార్కింగ్ స్థలం కల్పించే షరతు విధించాలి. కొన్ని నియమాలను రూపొందించాల్సి వస్తుందన్నారు. బెంగళూరు నగరంలో ప్రజల అనుకూలం కోసం 1194 ప్రధాన రోడ్లను నో పార్కింగ్ రోడ్లుగా గుర్తించామన్నారు. ప్రతిరోజు 50 ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల వ్యాప్తిలో పోలీస్ స్టేషన్ సరిహద్దులను వివిధ సెక్టార్లుగా విభజించి సంబంధించిన సెక్టార్ అధికారులు పబ్లిక్ అడ్రస్ సిస్టమ్‌లో మెసేజ్ ఇవ్వటం ద్వారా పార్కింగ్ లేని స్థలాల్లో పార్కింగ్ చేయరాదని సూచిస్తామన్నారు.

త్వరలో కొత్త పర్యాటక రంగ విధానం

త్వరలో కొత్త పర్యాటక రంగ విధానం అమల్లోకి తీసుకురానున్నట్లు న్యాయ, పార్లమెంటరీ వ్యవహారాలు, పర్యాటక శాఖ మంత్రి హెచ్.కే.పాటిల్ అసెంబ్లీలో తెలిపారు. ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే సురేశ్ అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చిన మంత్రి, పర్యాటకరంగ అభివృద్ధికి అనుకూలంగా పర్యాటకరంగ స్థలాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రాధాన్యత కల్పిస్తామన్నారు.

బీఎంటీసీ ఉద్యోగి ఆత్మహత్య

బనశంకరి: బీఎంటీసీ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శాంతినగర కేంద్ర కార్యాలయంలో చోటుచేసుకుంది. అథణికి చెందిన మహేశ్ (42) బీఎంటీసీ శాంతి నగర కేంద్ర కార్యాలయం సహాయకుడిగా పనిచేస్తూ కెంగేరిలో నివాసం ఉంటున్నాడు. సోమవారం ఉదయం కార్యాలయ భద్రతా సిబ్బందితో మూడో అంతస్తులోని రికార్డ్సు గది తాళం తీసుకుని అక్కడే ఉన్నారు. సాయంత్రం వరకు అక్కడే ఉన్న మహేశ్ ఎవరూ లేని సమయంలో వైర్‌తో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం భద్రతా సిబ్బంది పరిశీలించగా మహేశ్ ఆత్మహత్య చేసుకున్నట్లు వెలుగుచూసింది. విల్సన్‌గార్డెన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.

బెంగళూరులో శాఖల మధ్య సమన్వయ లోపం

- 27న నగర ఎమ్మెల్యేలతో భేటీ: డీసీఎం

శివాజీనగర: బీబీఎంపీ వ్యాప్తిలో మౌలిక సదుపాయాల కల్పనపై బెంగళూరు ఎమ్మెల్యేలతో ఈ నెల 27న సమావేశం జరపనున్నట్లు డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ విధానసభలో తెలిపారు. చెత్త తొలగింపు, ట్రాఫిక్, వీధి దీపాల నిర్వహణ, పన్నుల సేకరణ, పచ్చదనం, తాగునీరు తదితర అంశాలపై చర్చించి తీర్మానం చేస్తామన్నారు. ఎమ్మెల్యేలు చెప్పినట్లుగానే వివిధ శాఖల మధ్య సమన్వయం లేదు. తాను నగర బాధ్యతలను తీసుకున్న తరువాత ఒక స్థాయికి వచ్చిందని తెలిపారు. వైట్ ట్యాపింగ్ పనుల, రోడ్ల నిర్మాణం, విస్తరణ, సొరంగ మార్గం, మెట్రో రోడ్డు, ఫ్లై ఓవర్లతో పాటుగా వివిధ పనులకు రూ.3,450 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందని చెప్పారు. ఏప్రిల్ 1 నుండి జూన్ 30 వరకు కార్పొరేషన్ పరిధిలో 16,202 రోడ్ల గుంతలను గుర్తించి, ఇందులో 15,686 గుంతలను మూసివేసినట్లు తెలిపారు.

ఏమిటో గ్రేటర్ బెంగళూరు

ఎమ్మెల్యే రామమూర్తి మాట్లాడుతూ బ్రాండ్ బెంగళూరు, గ్రేటర్ బెంగళూరు అని చెబుతున్నారు. బెంగళూరును 5 భాగాలుగా చేస్తామని చెబుతున్నారు. ఇదేమిటో అర్థం కావటం లేదన్నారు. ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేల నియోజకవర్గాలకు నిధులు ఇవ్వలేదని ఆరోపించారు. బీజేపీ ఎమ్మెల్యే ఎస్.సురేశ్‌కుమార్ మాట్లాడుతూ, బ్రాండ్ బెంగళూరు అంటారు సరే, నగరంలో వివిధ శాఖల మధ్య సమన్వయం లేదు. దానిని సరిచేయాలని డిమాండ్ చేశారు.

ఆస్పత్రిలో ట్యాబ్‌లు చోరీ

- మాజీ కాంట్రాక్టు ఉద్యోగి దొంగబుద్ధి


దొడ్డబళ్లాపురం: బీబీఎంపీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేసి మానేసిన మాజీ ఉద్యోగి ఇంట్లో సిద్ధాపుర పోలీసులు సోదాలు చేసిన రూ.1.9 లక్షల విలువైన 62 లెనోవా ట్యాబ్‌లు, 2 బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నారు. జయనగర 2వ బ్లాక్‌లోని బీబీఎంపీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసే ఆశా కార్యకర్తలకు ఇవ్వడానికి 62 ట్యాబ్‌లు, రెండు బ్యాటరీలు ఖరీదు చేసి ఆరోగ్య కేంద్రంలో ఉంచగా దొంగలు నకిలీ తాళాలతో తో చోరీ చేశారని వైద్యాధికారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిద్ధాపుర పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇక్కడే పని చేసిన మాజీ కాంట్రాక్టు ఉద్యోగి జయనగర 2వ బ్లాక్‌లో ట్యాబ్‌లు తక్కువ ధరకు విక్రయిస్తుండగా పట్టుబడ్డాడు. విచారించగా, అతడే నకిలీ కీ ఉపయోగించి చోరీ చేసినట్టు తేలింది. ట్యాబ్‌లను సీజ్ చేసి నిందితున్ని అరెస్టు చేశారు.

గౌరి లంకేశ్ హత్య కేసులో ముగ్గురికి బెయిలు

దొడ్డబళ్లాపురం: సంచలనం సృష్టించిన పాత్రికేయురాలు, సామాజిక కార్యకర్త గౌరి లంకేశ్ హత్య కేసులో అరెస్టై జైలులో ఉన్న ముగ్గురు నిందితులకు కర్ణాటక హైకోర్టు బెయిలు మంజూరు చేసింది. అమిత్ దిగ్వేగర్, హెచ్ఎల్ సురేశ్, కేటీ నవీన్‌కుమార్‌లకు బెయిలు వచ్చింది. 11వ నిందితునిగా ఉన్న మోహన్ నాయక్‌కు ఇప్పటికే బెయిలు లభించింది. 2017 సెప్టెంబర్ 5న రాత్రి బెంగళూరులో గౌరిలంకేశ్ కార్యాలయం నుండి రాజ రాజేశ్వరి నగరలోని ఇంటికి వస్తుండగా ఇంటి వద్ద దుండగులు మాటువేసి ఆమెను పిస్టళ్లతో కాల్చిచంపారు. గత ఆరేళ్లుగా నిందితులు జైలులో విచారణా ఖైదీలుగా ఉన్నారు. సుదీర్ఘ కాలం నిందితులను జైలులో ఉంచడం సమంజసం కాదని వారి తరఫున న్యాయవాదులు వాదించారు. ఇరువర్గాల వాదనల తరువాత కోర్టు బెయిలు ఇచ్చింది. ఒక వర్గాన్ని తరచూ విమర్శించడంతో తట్టుకోలేక హత్యకు కుట్ర పన్నినట్లు నిందితులు విచారణలో తెలిపారు.

స్టీరింగ్ రాడ్ విరిగి బస్సు బోల్తా

- 30 మందికి ప్రయాణికులకు గాయాలు



బోల్తా పడిన ఆర్టీసీ బస్సు

రాయచూరు రూరల్: ఆర్టీసీ బస్సు స్టీరింగ్ రాడ్ విరిగి అదుపు తప్పి బోల్తా పడి 30 మంది ప్రయాణికులు గాయపడిన ఘటన మంగళవారం తాలూకాలోని సగమకుంట వద్ద జరిగింది. కొర్విహాళ్ నుంచి బస్సు రాయచూరుకు వస్తుండగా సగమకుంట వద్ద ఎదురుగా వస్తున్న వాహనానికి సైడ్ ఇవ్వబోగా ప్రమాదం చోటు చేసుకుంది. పక్కనే ఉన్న గుంతలోకి బస్సు బోల్తా పడడంతో కొర్విహాళకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని సంగీతకు తీవ్ర గాయాలయ్యాయి. సంగీతను చికిత్స నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

పంజా కుస్తీలో విజేత

మండ్య: కర్ణాటక రాష్ట్ర పంజా కుస్తీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మైసూరులోని నెక్సస్ మాల్‌లో జరిగిన 12వ రాష్ట్రస్థాయి పురుషుల, మహిళల, దివ్యాంగుల కుస్తీ పోటీల్లో ఎం.బాబాకు మొదటి స్థానం దక్కింది. అన్ని జిల్లాల నుంచి సుమారు 400 మందికి పైగా ఆటగాళ్లు పాల్గొన్నారు. ఇందులో బాబా కుడిచేతి, ఎడమ చేతి పంజా కుస్తీలో పోరాటపటిమ చూపి విజేతగా నిలిచాడు. త్వరలో జరిగే జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు.

మాజీ మంత్రి నాగేంద్ర పిటిషన్ వాయిదా

బనశంకరి: వాల్మీకి అభివృద్ధి మండలి కుంభకోణానికి సంబంధించి అరెస్టయిన మాజీ మంత్రి నాగేంద్రకు చికిత్స, న్యాయవాదితో చర్చించడానికి ప్రజాప్రతినిధుల కోర్టులో వేసిన పిటిషన్ విచారణ వాయిదా పడింది. ఇప్పటికే నాగేంద్రకు స్టంట్ వేశారని, సరైనరీతిలో చికిత్స అందించాలని, విచారణ సమయంలో అధికారులు సమాచారం ఇవ్వాలని ఒత్తిడి తీసుకువస్తున్నారని నాగేంద్ర తరఫు న్యాయవాది కోర్టులో వాదనలు వినిపించారు. ఇరువైపు వాదనలు ఆలకించిన జడ్జి విచారణ 18 తేదీకి వాయిదా వేశారు.

డెంగీ, మలేరియాపై జాగృతి జాతా



అభియాన్ నిర్వహిస్తున్న దృశ్యం

కోలారు: డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, ఇతర సీజనల్ వ్యాధుల నియంత్రణ కోసం ముళబాగిలు నగరసభ ఆధ్వర్యంలో ముళబాగిలులో జాగృతి జాతా నిర్వహించారు. నగరసభ సిబ్బంది ప్లకార్డులు, ఫ్లెక్సీలు, బ్యానర్లు పట్టుకుని నగర ప్రజలను సీజనల్ వ్యాధులపై వివిధ వేషధారణలతో ప్రజలను జాగృతం చేశారు. నగరసభ కమిషనర్ శ్రీధర్ మాట్లాడుతూ స్వచ్ఛతాలోపంతో దోమలు ప్రబలే అవకాశం ఉన్నందున నగరంలో స్వచ్ఛతను కాపాడుకోవడం ద్వారా దోమల వ్యాప్తిని నియంత్రించి డెంగీ, మలేరియా వంటి అంటువ్యాధులను అరికట్టాలన్నారు. జాతాలో సీనియర్ హెల్త్ సూపర్‌వైజర్ వి.ప్రతిభ, పౌర కార్మికులు, ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

రైతులకు అవగాహన సదస్సు



సదస్సులో పాల్గొన్న రైతులు

కోలారు: తాలూకాలోని చిక్కనహళ్లి పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం, వ్యవసాయ, ఉద్యాన శాఖల ఆధ్వర్యంలో రైతులకు, పాల ఉత్పత్తిదారులకు ప్రపంచ బ్యాంకు సహాయంతో లభించే రివార్డు పథకంతో పాటు ప్రభుత్వ పలు సౌకర్యాలపై సమాచార సదస్సును నిర్వహించారు. వ్యవసాయ శాఖ అధికారి ఎస్.సునీల్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సౌకర్యాలను, పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు తమ పొలంలో వాన నీటిని నిల్వ చేసుకుంటే వ్యవసాయ అవసరాలకు ఉపయోగించుకోవచ్చన్నారు. వ్యవసాయ, పాడి పరిశ్రమకు అందిస్తున్న యంత్రోపకరణాల లబ్ధిని ప్రతి రైతు పొందాలన్నారు. చిక్కనహళ్లి డెయిరీ అధ్యక్షుడు సి.అమరేష్, కార్యదర్శి ఆర్.గోపాలప్ప, అధికారులు నారాయణస్వామి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దేశ భద్రతకు ప్రాథమిక విద్య పునాది



పదాధికారులను అభినందించిన దృశ్యం

మాలూరు: దేశ భద్రత, సమగ్ర అభివృద్ధికి ప్రాథమిక విద్య పునాది అని, ఈ నేపథ్యంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ప్రామాణికంగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని డీఈఓ కృష్ణమూర్తి తెలిపారు. మంగళవారం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుల సంఘం నూతన పదాధికారులను అభినందించి మాట్లాడారు. పాఠశాల ప్రగతి, విద్యార్థుల విద్యాభ్యాసానికి ఉపాధ్యాయులు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రధానోపాధ్యాయుల సమస్యలపై తక్షణమే స్పందించి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఇదే సమయంలో ప్రధానోపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డీఈఓ కృష్ణమూర్తికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు జీ.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి బీఎం నారాయణస్వామి, కోలారు తాలూకా అధ్యక్షుడు సీవీ నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కుడా అధ్యక్షుడిగా బాధ్యతల స్వీకారం



మాట్లాడుతున్న మహమ్మద్ హనీఫ్

కోలారు: కోలారు నగరాభివృద్ధి ప్రాధికార (కుడా) నూతన అధ్యక్షుడిగా మహమ్మద్ హనీఫ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ తనను కుడా అధ్యక్షుడిగా నియమించినందుకు కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. సీనియర్ల మార్గదర్శనంలో నగరాభివృద్ధికి ప్రయత్నిస్తానన్నారు. నగరం మరింత అభివృద్ధి చెందాల్సి ఉందన్నారు. ఇందుకోసం ప్రత్యేక ప్రణాళికను తయారు చేసి అమలు పరుస్తామన్నారు. ఇళ్ల స్థలాలు లేని వారికి ఇళ్ల స్థలాలు అందిస్తామన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో నగరాన్ని ఆదర్శ నగరంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈసందర్భంగా కుడా కమిషనర్ శ్రీనాథ్, కోచిముల్ మాజీ అధ్యక్షుడు బ్యాటప్ప, ప్రస్తుత డైరెక్టర్ షంషీర్, బంగారుపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సీసంద్ర గోపాలగౌడ తదితరులు పాల్గొన్నారు.

సఫలాంబకు ప్రత్యేక పూజలు



అమ్మవారి విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

మాలూరు: పట్టణంలోని పురాతన సఫలాంబ దేవి ఆలయంలో మంగళవారం అమ్మవారికి విశేషపూజలను నిర్వహించి అనంతరం అమ్మవారి ఉత్సవ మూర్తిని మంగళవాయిద్యాలతో పట్టణంలోని ప్రముఖ వీధుల్లో ఊరేగించారు. తెల్లవారుజాము నుంచే ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు జరిగాయి. మూల విగ్రహానికి పంచామృత అభిషేకం, మహా మంగళారతి, తీర్థ ప్రసాద వినియోగం జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శనం చేసుకున్నారు.

రేపు ఏకపాత్రాభినయ ప్రదర్శన



నాటకం పోస్టర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

కోలారు: బెంగళూరు మల్లేశ్వరంలోని కేశవకల్ప ఆడిటోరియంలో ఈ నెల 18వ తేదీన మాలూరు రంగ విజయ బృందం కళాకారిణి గీతా రాఘవేంద్ర ప్రేమమయి హిడంబి అనే ఏకపాత్రాభినయాన్ని నిర్వహిస్తున్నట్లు నాటక రచయిత, దర్శకుడు డాక్టర్ బేలూరు రఘునందన్ తెలిపారు. మంగళవారం నగరంలోని పాత్రికేయుల భవనంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోలారుకు చెందిన కళాకారిణి గీతా రాఘవేంద్ర పలు సీరియళ్లలో నటించడమేగాక సినిమా రంగంలో కూడా తన ప్రతిభను ప్రదర్శించిందన్నారు. ఇదే సమయంలో నాటకం పోస్టర్‌ను విడుదల చేశారు. కళాకారిణి గీతా రాఘవేంద్ర, రంగ విజయ సంస్థాపకుడు మాలూరు విజి, గౌరవ కార్యదర్శి మాస్తి టీసీ రమేష్, డాక్టర్ ఎస్‌జీ నారాయణస్వామి, టీఎస్ రాఘవేంద్రరావ్ తదితరులు ఉన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన దృశ్యం

శ్రీనివాసపురం: పట్టణంలోని బెస్కాం కార్యాలయ ప్రాంగణంలోని గణపతి ఆలయంలో మంగళవారం ఆలయ 40వ వార్షికోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. మూల విగ్రహానికి అభిషేకం, అర్చన, అలంకారం, నవగ్రహ, గణపతి హోమం తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. జిల్లా బెస్కాం కార్యనిర్వాహక ఇంజినీర్ శుభ, తాలూకా ఏఈఈ రవీంద్రబాబు, జిల్లా కాంట్రాక్టర్ల సంఘం మాజీ ఉపాధ్యక్షుడు కే.మోహనాచారి, తాలూకా కాంట్రాక్టర్ల సంఘం అధ్యక్షుడు దొరస్వామి తదితరులు పాల్గొన్నారు.

హిజ్రాల సంక్షేమానికి సర్కార్ సిద్ధం

కోలారు: రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రథమ ప్రాధాన్యతగా హిజ్రాలకు 3 వేల ఇళ్లు నిర్మించి ఇవ్వనుందని కర్ణాటక మహిళా అభివృద్ధి మండలి అధ్యక్షురాలు జి.పద్మావతి తెలిపారు. ఆమె మంగళవారం నగరంలోని జెడ్పీ సభాంగణంలో రాష్ట్ర మహిళా అభివృద్ధి మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి వివిధ పథకాల ప్రగతి పరిశీలన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గృహలక్ష్మి పథకాన్ని హిజ్రాల(ట్రాన్స్‌జెండర్ల)కు కూడా విస్తరించారన్నారు. పథకం లబ్ధి పొందడానికి గాను హిజ్రాలకు గుర్తింపు కార్డులను అందిస్తామన్నారు. హిజ్రాలను సమాజ జనజీవన స్రవంతిలోకి తేవడానికి ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందన్నారు. వీరు వ్యాపార వ్యవహారాల నిర్వహణ కోసం మండలి నుంచి ఆర్థికసాయం అందిస్తున్నట్లు తెలిపారు. మహిళలు పూల విక్రయం, టైలరింగ్, హోటల్ నిర్వహణ తదితర వ్యాపారాలు చేసుకోవడానికి మండలి అందించే ఆర్థిక సాయం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వం అందించే సహాయ ధనంతో గొర్రెలు, మేకలు, పశువులు, కోళ్లు వంటివి పెంచుకుని ఆర్థికంగా ముందుకు రావాలన్నారు. స్త్రీశిశు అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎన్.నారాయణస్వామి, మండలి అధికారిణి శీలా, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్న వేంకటేశ్వరుని సన్నిధిలో లోకాయుక్త



స్వామివారిని దర్శించుకున్న కర్ణాటక లోకాయుక్త జీఎస్ పాటిల్ కుటుంబ సభ్యులు

మాలూరు: ప్రసిద్ధ యాత్రాస్థలం చిక్కతిరుపతి ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయంలో కర్ణాటక లోకాయుక్త జీఎస్ పాటిల్ కుటుంబ సమేతంగా విచ్చేసి పూజలు నిర్వహించారు. జీఎస్ పాటిల్‌కు ఆలయం నుంచి పూర్ణకుంభ స్వాగతం లభించింది. ప్రధాన అర్చకులు రవిస్వామి, ఎన్.శ్రీధర్, గోపాలకృష్ణ భరద్వాజ్ నేతృత్వంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు ఆలయ చరిత్ర గురించి లోకాయుక్తకు వివరించారు. ఈ సందర్భంగా లోకాయుక్త ఎస్పీ లోకేష్, తహసీల్దార్ కె.రమేష్ తదితరులు ఉన్నారు.

శివమొగ్గ జిల్లాలో కుండపోత

- లింగనమక్కి, భద్ర, తుంగా జలాశయాల్లోకి పెద్ద ఎత్తున వరద నీరు
- పొంగి ప్రవహిస్తున్న వాగులు, వంకలు



తుంగా జలాశయం నుంచి నీరు విడుదల



శివమొగ్గ జిల్లాలో తుంగా నది నిండుగా ప్రవహిస్తున్న దృశ్యం

శివమొగ్గ: శివమొగ్గ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో భారీ వర్షాలు నమోదవుతున్నాయి. పశ్చిమ కనుల్లో ఎడతెరిపిలేని వర్షాలు కొనసాగుతుండటంతో జిల్లాలోని జలాశయాలు, నదులు, చెరువులు, కుంటల్లో భారీగా వరద నీరు చేరుతోంది. జలాశయాలు వరద నీటితో పరవళ్లు తొక్కుతున్నాయి. ఇక జలాశయాల పరిధిలో కూడా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇక ప్రముఖ జల విద్యుత్ కేంద్రం లింగనమక్కి జలాశయంలోకి భారీగా వరద నీరు చేరుతోంది. మంగళవారం అధికారుల వివరాల మేరకు...లింగనమక్కి జలాశయంలోకి దాదాపు 77,911 క్యూసెక్కుల నీరు చేరింది. ప్రస్తుతం జలాశయం నీటిమట్టం 1782.15 అడుగులుగా ఉంది. ఈ జలాశయం గరిష్ట నీటిమట్టం 1819 అడుగులు. గడిచిన 24 గంటల్లో జలాశయంలోకి సుమారు నాలుగు అడుగుల నీరు చేరింది. ఇక భద్రా జలాశయంలోకి సైతం భారీగా వరద నీరు చేరుతోంది. జలాశయంలోకి 27,839 క్యూసెక్కుల నీరు చేరింది. జలాశయం నుంచి 166 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. జలాశయంలో ప్రస్తుతం 144.7 అడుగుల నీరు ఉంది. ఈ జలాశయం గరిష్ట నీటి మట్టం 186 అడుగులు గడిచిన 24 గంటల్లో జలాశయంలోకి భారీగా వరదనీరు చేరింది. తుంగా జలాశయం ఇప్పటికే గరిష్ట స్థాయికి నీరు చేరడంతో తుంగా నది వరదనీటితో పరవళ్లు తొక్కుతోంది. ఈ జలాశయం గరిష్టనీటి మట్టం 588.24 అడుగులకు నీరు చేరింది. జలాశయంలోకి 42,683 క్యూసెక్కుల నీరు చేరగ, జలాశయం నుంచి 41,583 క్యూసెక్కుల నీటిని తుంగభద్రా జలాశయంలోకి విడుదల చేశారు.

తుంగా పరవళ్లు ..

శివమొగ్గ నగరంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షంతో పశ్చిమ కనుల్లో కురుస్తున్న వర్షాలకు శివమొగ్గ నగరంలోని తుంగా నది వరద నీటితో పరవళ్లు తొక్కుతోంది. మంగళవారం కూడా భారీ వర్షాలు పడుతుండటంతో తుంగా నదిలో వరద నీరు ఉప్పొంగుతోంది. ప్రమాదస్థాయిలో జలాశయంలోకి వరద నీరు వచ్చి చేరుతోంది. మరోవైపు ఆగుంబె, తీర్థహళ్లి చుట్టుపక్కల కూడా భారీ వర్షాలు పడుతున్నాయి. అధికారుల వివరాల మేరకు...మాణిలో 240 మి.మీ, యడూరులో 229 మి.మీ, హులికల్లులో 245, మాస్తికట్టెలో 247, సావేహుక్లులో 210 మి.మీ వర్షం పడింది.

క్లుప్తంగా

ఆహార కిట్ల వితరణ



కృష్ణరాజపురం: బెంగళూరు నగరంలోని కృష్ణరాజపురం బసవనపుర మెయిన్ రోడ్డులో ఉన్న వాసవి టిఫిన్ హోటల్‌లో ఆర్యవైశ్య లేడీస్ గ్రూప్ ఇంటర్నేషనల్ సంఘానికి చెందిన మహిళా సభ్యులు పాల్గొని పేద మహిళలకు ఆహార కిట్లను పంపిణీ చేశారు. అధ్యక్షురాలు కవిత ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ... ఆర్యవైశ్య లేడీస్ ఇంటర్నేషనల్ గ్రూప్ అనేక సేవా కార్యక్రమాలు చేపడుతోందని, అందులో భాగంగా నేడు కేఆర్ పురంలో పేదమహిళలను గుర్తించి వారికి ఆహార కిట్లను అందించామన్నారు.

కానిస్టేబుల్ సస్పెండ్

మైసూరు: లారీ డ్రైవర్ వద్ద డబ్బులు వసూలు చేసిన ఆరోపణపై చామరాజనగర పోలీస్ కానిస్టేబుల్‌ను అధికారులు సస్పెండ్ చేశారు. కానిస్టేబుల్ ఉమాశంకర్ నగర పోస్టాఫీస్ ముందు భాగంలో ఓ సరుకు రవాణా చేసే లారీని నిలిపి డబ్బులు తీసుకున్నాడు. అక్కడ ఉన్న వారు వీడియో తీసి పోస్టు చేయడంతో విచారణ చేసిన ఎస్పీ కవిత కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

శివమొగ్గ: శివమొగ్గ, భద్రావతి ప్రాంతాలలో పేకాట ఆడుతున్న కేంద్రాలపై పోలీసులు దాడి 14 మంది అరెస్ట్ చేశారు. శివమొగ్గ గ్రామీణ పరిధిలోని హోన్నవిలే గ్రామంలో అందర్ బాహర్ ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి ఆరుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి 11,250 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అదే విధంగా భద్రావతి గ్రామీణ పరిధిలోని బిళికితండాలో కూడా అందర్ బాహర్ ఆడుతున్న 8 మందిని అరెస్ట్ చేసి వారి నుంచి 6,600 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

హైబీమ్ లైట్ల వినియోగం, పలువురికి జరిమానా

దొడ్డబళ్లాపురం: అనవసరంగా హైబీమ్ లైట్లు వేసుకుని ఎదురుగా వచ్చే వాహనాలకు ఇబ్బంది కలిగిస్తున్న వాహనదారులకు ట్రాఫిక్ పోలీసులు జరిమానా విధించారు. సోమవారం అర్ధరాత్రి ప్రత్యేక కార్యాచరణ జరిపిన బెంగళూరు ట్రాఫిక్ పోలీసులు మొత్తం 234 కేసులు నమోదు చేసుకుని రూ.1.08 లక్షల జరిమానా విధించారు. ఇటీవల రాత్రిపూట చోటుచేసుకుంటున్న ప్రమాదాలకు హైబీమ్ లైట్లు కారణమని పోలీసులు కనుగొన్నారు. అశోక్‌నగర్, సదాశివనగర్, శేషాద్రిపురం, మలసూరుగేట్, విల్సన్ గార్డన్,ఉప్పారపేట, మాగడి రోడ్డు, విజయనగర, కెంగేరి ప్రాంతాల్లో 13 ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో కార్యాచరణ జరిపారు.

డెంగీ నియంత్రణకు ఫాగింగ్ యంత్రాలు



బొమ్మనహళ్లి: ప్రస్తుతం బెంగళూరు నగరంతో పాటు రాష్ట్రంలో డెంగీ కేసులు పెరిగిపోతుండటంతో బొమ్మనహళ్లి వార్డులో బీబీఎంపీ అధికారులు పొగ యంత్రాలతో కార్యచరణ చేపట్టారు. బొమ్మనహళ్లి పరిధిలోని బిళ్ళెకహళ్ళి వార్డులోని త్యాయప్ప గార్డెన్, బసవలింగప్ప లేఔట్, బిళ్ళెకహళ్ళి విలేజ్, గురురాజ్ లేఔట్, రాజన్న లేఔట్‌లో దోమలు అధికంగా ఉండటంతో ఆయా ప్రాంతాల్లో ఫాగింగ్‌కి చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకుడు, సమాజ సేవకుడు బిళ్లెకహళ్లికికి చెందిన బీ.వై.రమేష్,తో పాటు స్థానిక ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బందితోపాటు స్థానికులు, విశ్వసాయి నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

అబద్ధపు ఫిర్యాదు.. కంపెనీపై కేసు

దొడ్డబళ్లాపురం: ఏటీఎంలో జరిగిన చోరీ సంఘటనను అవకాశంగా చేసుకుని అబద్ధపు ఫిర్యాదు చేసిన సెక్యూర్ వ్యాల్యూ ఇండియా లిమిటెడ్ కంపెనీపై కేసు నమోదు చేసి ఐదుగురిని అరెస్టు చేసిన సంఘటన బెళ్లందూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సర్జాపుర రోడ్డులోని కన్నహళ్లి వద్ద ఉన్న ప్రైవేటు కంపెనీ ఏటీఎంలో ఈనెల 6న రాత్రి చోరీ జరిగింది. ఏటీఎంలోని సీసీ కెమెరాకు స్ప్రే చల్లి, మొహాలకు మాస్కులు వేసుకుని గ్యాస్ కట్టర్‌తో మెషిన్‌ను కట్ చేసిన దుండగులు రూ.16.56 లక్షలు చోరీ జరిగినట్టు కంపెనీ బెళ్లందూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేసి ఏటీఎంలో ఉన్నది కేవలం రూ.6,500 మాత్రమే అని తేల్చారు. అసలు కంపెనీ వారు ఏటీఎంలో రూ.16.56లు లోడ్ చేయలేదని తెలుసుకున్నారు. దీంతో కంపెనీపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఇందుకు సంబంధించి ఐదుగురిని అరెస్టు చేసారని బెంగళూరు పోలీస్ కమిషనర్ బీ దయానంద్ తెలిపారు.

జలజీవన్ పథకం గ్రామీణులకు ప్రయోజనకరం



ఎంపీ సుధాకర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

గౌరిబిదనూరు: కేంద్ర ప్రభుత్వ జలజీవన్ మిషన్ ఇంటింటికీ శుద్ధ తాగునీటిని అందించే పథకం గ్రామీణ ప్రజలకు చాలా ఉపయోగకరమని చిక్కబళ్లాపురం పార్లమెంటు సభ్యుడు సుధాకర్ తెలిపారు. మంగళవారం తాలూకాలోని కల్లినాయకనహళ్ళి పరిధిలోని తిప్పగానహళ్ళిలో జలజీవన్ మిషన్ పనులను వీక్షించి, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, గ్రామీణులకు పరిశుద్ధమైన తాగునీటిని సరఫరా చేయాలని నాణ్యతలో లోపం వుండరాదని అధికారులకు సూచించారు. తదుపరి తాలూకా కార్యాలయంలో జాతీయ రహదారి విషయంగా అధికారులతో చర్చించారు. కొన్ని రైళ్లను గౌరిబిదనూరులో స్టాపు ఇవ్వాలని డిమాండు చేస్తూ రైల్వే ప్రయాణికులు పార్లమెంటు సభ్యునికి వినతి పత్రమిచ్చారు. కొన్ని రోడ్ల రిపేరీ విషయంగా గ్రామీణ ప్రజలు సైతం వినతి పత్రమిచ్చారు. మంచేనహళ్లి తాలూకా వరవణి గ్రామంలో జరుగుతున్న అటల్ భూజల్ పథకం అభివృద్ధి పనులను వీక్షించి అధికారులకు తగిన సూచనలిచ్చారు. నేటి పార్లమెంటు సభ్యునితో పాటు జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు రవి నారాయణరెడ్డి, జేడీఎస్ నాయకుడు నరసింహమూర్తి, జయణ్ణ, తహసీల్దారు మహేశ్ పత్రి, ఇంజనీర్ నారాయణప్ప, మునిలక్ష్మమ్మ, రమేశ్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటకలో కాంగ్రెస్ బలోపేతం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

బొమ్మనహళ్లి: రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ రోజు రోజుకు బలోపేతంగా మారుతోందని, దానికి ఎమ్మెల్యే ఎన్నికలతో పాటు పార్లమెంట్ ఎన్నికల ఫలితాలే ఉదాహరణ అని కేపీసీసీ కార్యాధ్యక్షుడు, ప్రజాపనుల శాఖ మంత్రి సతీష్ జారకిహోళి అన్నారు. బెంగళూరు నగరంలోని క్వీన్స్ రోడ్డులో ఉన్న కేపీసీసీ కార్యాలయం ఆవరణంలో మంగళవారం కేపీసీసీ ఎస్సీ విభాగం రాష్ట కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులో బీజేపీకి కాంగ్రెస్ పార్టీని ఢీకొనే సత్తా లేదని, దీంతో వారు జేడీఎస్‌తో పొత్తు పెట్టుకున్నారని అన్నారు. శాసనసభ ఎన్నికల సమయంలో అన్ని విభాగాల కార్యకర్తలు పార్టీ విజయానికి కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో మహారాష్ట్ర మాజీ మంత్రి, అఖిల భారత ఎస్సీ విభాగం జాతీయ అధ్యక్షుడు శివాజీరావు మోగె, మాజీ ఎమ్మెల్యే కృష్ణమూర్తి, ఎస్సీ విభాగం అధ్యక్షుడు ధర్మసేన, ఐఎస్‌బిసిడబ్ల్యు అధ్యక్షుడు జీ.ఆర్.దినేష్ ఇంటెక్ అధ్యక్షుడు లక్ష్మి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

జింకను రక్షించిన అటవీ సిబ్బంది

మైసూరు: ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడిన జింకను అటవీ సిబ్బంది రక్షించిన ఘటన చామరాజనగర జిల్లా మలెమహదేశ్వర వన్య జీవుల విభాగం పరిధి దొడ్డమాలపుర గ్రామంలో చోటుచేసుకుంది. ఆహారం కోసం గ్రామం వైపు వచ్చిన జింక గ్రామానికి చెందిన రైతు శివస్వామికి చెందిన పొలంలోని బావిలో అదుపుతప్పి పడిపోయింది. సమాచారం అందుకున్న అటవీ అధికారులు అక్కడికి చేరుకుని జింకను రక్షించి అడవిలో విడిచిపెట్టారు.

రథయాత్రకు ఘన స్వాగతం



తుమకూరు: ప్రభుత్వం ఆధ్వర్యంలో కర్ణాటక సంభ్రమం–50 పేరుతో కర్ణాటక ఉసిరాయితు కన్నడ, అభియాన్ సందర్భంగా చిత్రదుర్గ జిల్లా నుంచి తుమకూరు జిల్లాలోని చిక్కనాయకనహళ్లి పట్టణానికి చేరుకున్న కన్నడ జ్యోతి రథయాత్రకు ఇక్కడ ఘనస్వాగతం లభించింది. కన్నడ జ్యోతి రథయాత్రకు ముఖ్యమంత్రి 2023న నవంబర్ 2న విజయనగర జిల్లాలోని హంపిలో ప్రారంభించారు. ఈ రథయాత్ర రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పర్యటిస్తూ మంగళవారం తుమకూరు జిల్లాకు చేరుకుంది. జానపద కళాకారుల బృందాలతో చిక్కనాయకనహళ్లి తాలూకా కేంద్రంలో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జీ.ఎన్.కీర్తి, జిల్లా కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు సిద్ధలింగప్ప, కన్నడ సంస్కృతి శాఖ, సహాయక డైరెక్టర్ డి.ఎం.రవికుమార్, కర్ణాటక జానపద ఆకాడమి సభ్యుడు మల్లికార్జున, కన్నడమాత విగ్రహానికి పూలహారం వేసి ఊరేగింపు ప్రారంభించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం



మృతి చెందిన ముగ్గురు స్నేహితులు



నుజ్జయిన కారు

దొడ్డబళ్లాపురం: కెంగేరి సమీపంలోని బన్నేరుఘట్ట నైస్ రోడ్డులో సోమవారం సాయంత్రం చోటుచేసుకున్న రోడ్డుప్రమాదంలో మృతి చెందిన ముగ్గురి వివరాలు పోలీసులు అందించారు. కనకపుర తాలూకా శివనహళ్లి గ్రామపంచాయతీ సభ్యుడు వినోద్, ఇదే గ్రామానికి చెందిన కుమార్, నంజేశ్ మృతి చెందినవారు. వీరు చిన్ననాటి ప్రాణస్నేహితులు. ముగ్గురూ బెంగళూరు నుండి గోవా వెళ్లాలని ఎక్స్‌యూవీ 700 కారులో బయలుదేరారు. నైస్ రోడ్డులో వెళ్తుండగా అదుపుతప్పిన కారు డివైడర్‌ను ఢీకొని పక్క రోడ్డులో వెళ్తున్న స్కార్పియోను ఢీకొంది. ప్రమాదంలో ముగ్గురు స్నేహితులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో వాహనంలో చిక్కుకున్న ప్రయాణికులను స్థానికులు రక్షించారు. కెంగేరి ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చెరువుల నిర్వహణను శ్రద్ధగా చేపట్టాలి



గౌరిబిదనూరు: గ్రామీణ ప్రజలు చెరువుల నిర్వహణను శ్రద్ధగా చేపట్టాలని, దానిని ఉపయోగించడానికి ఆయకట్టుదార్లు సమష్టిగా కృషి చేయాలని ధర్మస్థల సంస్థ జిల్లా డైరెక్టర్ ప్రశాంత్ తెలిపారు. తాలూకా తొండేబావి గ్రామ చెరువులో పూడిక తొలగింపు పనులు అనంతరం మంగళవారం గ్రామ ప్రజలకు హస్తాంతరం చేసి మాట్లాడారు. ఈ చెరువు అభివృద్ధి పనులు పూర్తి చేశామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కొచిముల్ మాజీ అధ్యక్షుడు కాంతరాజు ధర్మస్థల సంస్థ సేవా కార్యక్రమాలను కొనియాడారు. పంచాయతీ అభివృద్ధి అధికారి బసవరాజు చెరువు పూడికతీత పనులకు సంస్థ చేసిన సహాయ సహకారాలను వివరించారు. చెరువు పూడిక తీత పనులకు సహకరించిన ధర్మస్థల సంస్థ అధికారులను గ్రామ ప్రజలు సన్మానించారు. కార్యక్రమంలో జీపీ అధ్యక్షురాలు కామాక్షి రామదాసు, ఉపాధ్యక్షుడు జయచంద్రరెడ్డి, కెహెచ్‌పి ఫౌండేషన్ శ్రీనివాసగౌడ, ధర్మస్థల సంస్థ ప్రాజెక్ట్ అధికారి నాగరాజనాయక్ తదితరులు పాల్గొన్నారు.

శిరాలో పెరుగుతున్న డెంగీ కేసులు

- గ్రామాల్లో పర్యటించిన కలెక్టర్



ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ శుభ కల్యాణ్

తుమకూరు: తుమకూరు నగరంతో పాటు జిల్లాలో డెంగీ కేసుల సంఖ్య పెరుగుతుండటంతో కలెక్టర్ శుభ కల్యాణ్ స్వయంగా వివిధ గ్రామాల్లో పర్యటించారు. మంగళవారం ఉదయం ఆమె శిరా తాలూకా చిక్కనహళ్లి వసతి పాఠశాల, యళియూరు గ్రామంలో, శిరా పట్టణంలో పీయూ కళాశాల, పాఠశాల, తల్లి పిల్లల ఆస్పత్రితో పాటు పశువుల ఆస్పత్రి, వివిధ వార్డుల్లో పర్యటించారు. వర్షం పడుతున్నా ఏమాత్రం లెక్క చేయకుండా కలెక్టర్ స్వయంగా వివిధ వార్డుల్లో మురికి వార్డులో పర్యటించి పరిశీలించారు. రోడ్లు, డ్రైనేజీలను శుభ్రంగా ఉంచాలని, ఎక్కడ కూడా నీటి నిల్వలు లేకుండా చేయాలని అధికారులను ఆదేశించారు.

పొడిచెత్త నిర్వహణ పేరుతో లూటీ



ఎన్ఆర్.రమేశ్

బనశంకరి: చెత్తతో డబ్బు దండుకోవాలని ఓ మంత్రి నగరంలో ఏకీకృత పొడిచెత్త నిర్వహణ వ్యవస్థ అమల్లోకి తీసుకువచ్చి బ్లాక్‌లిస్టులో ఉన్న ఒక సంస్థకు 30 ఏళ్ల పాటు సుమారు రూ.45 వేల కోట్ల కాంట్రాక్ట్ ఇచ్చి తద్వారా కిక్‌బ్యాక్ పొందారని బీజేపీ నేత బీబీఎంపీ మాజీ పాలనా విభాగం నేత ఎన్ఆర్.రమేశ్ ఆరోపించారు. బ్లాక్‌లిస్టులో ఉన్న ప్రైవేటు సంస్థకు చెత్త కాంట్రాక్టు ఇవ్వడాన్ని అడ్డుకోవాలని మంగళవారం ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు ఎన్ఆర్.రమేశ్ లేఖ రాసి డిమాండ్ చేశారు. నగరంలో 225 వార్డుల్లో చెత్త సేకరణకు హైదరాబాద్‌కు చెందిన ప్రైవేటు సంస్థకు 30 ఏళ్ల పాటు సుమారు రూ.45 వేల కోట్లతో కాంట్రాక్ట్ ఇవ్వడానికి బెంగళూరు నగర ఇన్‌చార్జ్‌మంత్రి సిద్ధమయ్యారని, ఈ భారీ మొత్తంలో కిక్‌బ్యాక్ తీసుకున్నారని సీఎంకు రాసిన లేఖలో ఆరోపించారు. నిత్యం ఉత్పత్తి అయ్యే చెత్త నిర్వహణకు ఏడాదికి రూ.450 నుంచి 510 కోట్ల వ్యయం చేస్తున్నారని, ప్రస్తుతం పాలికె ప్రతి టన్ను చెత్త సేకరణ తరలింపు నకు రూ.1,300 ఖర్చు చేస్తుంది. కానీ కొత్తగా పొడిచెత్త నిర్వహణ ఒక టన్ను చెత్త సేకరణ, తరలింపునకు రూ.2,343 ధర నిర్ణయించారని, దీంతో నగర ప్రజలు చెల్లించే ఆస్తిపన్ను లూటీ చేయాలని తీర్మానించారని దుయ్యబట్టారు. కాంట్రాక్టర్‌కు భారీ ప్రమాణంలో ప్రజా డబ్బును ధారాదత్తం చేయడం ద్వారా వేలాది కోట్లు కమీషన్ రూపంలో అందుతాయని ఆరోపించారు. దీంతో పాలికె ఆర్థిక ఇబ్బందులో చిక్కుకుంటుందని ఎన్ఆర్ ఫిర్యాదు చేశారు.

కరెంటు షాక్‌తో ఆవు మృతి

మైసూరు: కరెంట్ షాక్ తగిలి ఆవు మృతి చెందిన ఘటన మైసూరు నగరంలోని హోటెగల్లి ఎస్ఆర్ఎస్ లేఔట్‌లో చోటు చేసుకుంది. లేఔట్‌లో నివాసం ఉంటున్న రవికుమార్ అనే వ్యక్తికి చెందిన ఆవును కరెంట్ స్తంభం వద్ద కట్టి వేయడంతో కరెంట్ షాక్ తగిలి ఆవు మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

గోమాంసం విక్రయిస్తున్న ముగ్గురు అరెస్ట్

చామరాజనగర జిల్లాలో కొళ్లెగాలలో ఉన్న ఆనందజ్యోతి కాలనీ లేఔట్‌లో గోమాంసం విక్రయిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. గోమాంసం విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు కాలనీకి చెందిన సంతోశ్, రసూల్, అల్లాబకాశ్‌లను అరెస్ట్ చేసి 40 కిలోల గోమాంసాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

బాలిక కిడ్నాప్‌పై ఫిర్యాదు

కెలమంగలం: తమ కుమార్తెను కిడ్నాప్ చేశారని బాలిక తల్లిదండ్రులు మహిళా పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు... డెంకణీకోట సమీపంలోని ఓ గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలిక రెండు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకెళ్లి తిరిగి రాలేదు. అవాక్కైన తల్లిదండ్రులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో గాలించారు. స్థానికుల సమాచారం మేరకు డెంకణీకోట సమీపంలోని ఆశేనత్తం గ్రామానికి చెందిన ప్రవీణ్‌కుమార్ (20) బాలికను కిడ్నాప్ చేసినట్లు తెలిసింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు.

గ్రంథాలయం తనిఖీ

హోసూరు: నగరంలోని కామరాజ్ కాలనీలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని మేయర్ ఎస్.ఏ.సత్య మంగళవారం తనిఖీ చేశారు. ప్రతిభా శిక్షణా కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కేంద్రాలను స్థానిక ప్రజలతో పాటు పాఠశాల, కళాశాలల విద్యార్థులు పెద్దఎత్తున వినియోగించుకొంటున్నారు. విద్యార్థులతో మేయర్ మాట్లాడారు. గ్రంథాలయంలో పుస్తక పఠన కోసం వచ్చి వెళ్లే పాఠకులకు సరైన సదుపాయాలను కల్పించాలని మేయర్ సూచించారు.

యాక్సిడెంట్‌లో పసికందు బలి

హోసూరు: ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న ప్రమాదంలో తొమ్మిది నెలల చిన్నారి మృతి చెందిన ఘటన సిఫ్‌కాట్ వద్ద జరిగింది. బెంగళూరుకు చెందిన దినేష్ అక్కడే ప్రైవేట్ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. చిన్నారి కూతురు మనీషాను తీసుకొని బైక్‌లో హోసూరు - బెంగళూరు హైవేలో ఈఎస్ఐ వద్ద వెళుతున్నాడు. ఆ సమయంలో లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలేర్పడిన మనీషా ఘటనా స్థలంలోనే మరణించింది. తండ్రికి స్వల్ప గాయాలయ్యాయి. సిఫ్‌కాట్ పోలీసులు కేసు నమోదు చేశారు.

పిల్లలను బడుల్లో చేర్పించాలి

హోసూరు: మధ్యలో చదువు మానేసిన బాలబాలికలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించేందుకు పాఠశాల యంత్రాంగం చర్యలు చేపట్టాలని మంగళవారం జిల్లా కేంద్రం క్రిష్ణగిరి కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ శరయు సూచించారు. విద్యాభివృద్ధిని మెరుగు పరిచేందుకు పిల్లల తల్లిదండ్రుల ప్రోత్సాహం ముఖ్య అవసరమని, అందుకోసమే గత 2022న ప్రతి పాఠశాలలో పాఠశాల సంక్షేమ కమిటీని ఏర్పాటు చేసిందని తెలిపారు. విద్యాశాఖాధికార్లు సుందరరాజ్, శక్తిసుభాషిణి, వడివేలు, గణేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు వెళ్తే ఇల్లు దోపిడీ

మైసూరు: తల్లి అంత్యక్రియలు నిర్వహించడానికి వెళ్లిన సమయంలో ఇంటిలో లక్షకు పైగా విలువైన నగలు, నగదు లూటీ చేసిన ఘటన మైసూరు నగరంలోని మేటిగళ్లి పరిధిలోని బీఎం శ్రీనగరలో చోటుచేసుకుంది. వృత్తి రీత్యా కాంట్రాక్టర్ అయిన బసవరాజు ఇంటిలో దోపిడీ జరిగింది. బసవరాజు తల్లి అంత్యక్రియలు నిర్వహించడానికి కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి వెళ్లాడు. ఆ సమయంలో దొంగలు ఇంటిలో లక్ష నగదు, రూ. 1.30 లక్షల విలువైన నగలు ఎత్తుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

హోసూరు వార్తలు..

రైతు సమస్యలను పరిష్కరించాలని వినతి



వినతిపత్రాన్ని స్వీకరిస్తున్న ఎం.పి. కే.గోపినాథ్

హోసూరు: రైతుల సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరుతూ మంగళవారం కమ్యూనిస్ట్ పార్టీ అనుబంధ రైతు సంఘాల నాయకులు క్రిష్ణగిరి ఎం.పి. కే.గోపినాథ్‌కు వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ సంఘ రాష్ట్ర అధ్యక్షులు ఎం. లగుమయ్య అధ్యక్షతన స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని వినతిపత్రాన్ని స్వీకరించారు. గతంలో కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన వ్యవసాయ వ్యతిరేక చట్టాలని ఎన్నికలకు ముందే వాపసు తీసుకొంటానని హామీనిచ్చిన ప్రధాని ఇంతవరకు ఈ చట్టాలను వాపసు తీసుకోలేదని, క్రిష్ణగిరి జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఆ వినతిపత్రంలో కోరారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ.. త్వరలో జరగబోయే పార్లమెంట్ సమావేశంలో రైతుల సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకొంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు చిన్నగుట్టప్ప, తిమ్మారెడ్డి, మాదయ్యన్, సీపీఐ, సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గోడ కూలి ఇద్దరు కూలీల దుర్మరణం

క్రిష్ణగిరి: శిథిలావస్థకు చేరుకొన్న ప్రహరీగోడను తొలగించే సమయంలో ఆకస్మాత్తుగా కూలిపడి ఇద్దరు కూలీలు మృతి చెందారు, ఈ దుర్ఘటన మహారాజగడ పరిధిలో చోటుచేసుకొంది. వివరాల మేరకు క్రిష్ణగిరి సమీపంలోని ఎం.సి పల్లి గ్రామంలో పబ్లిక్ స్థలంలో ఏర్పాటు చేసిన ప్రహరీ గోడ శిథిలావస్థకు చేరుకోవడంతో అధికారులు తొలగింపు పనులు చేపట్టారు. కూలీలు రవి (51), అన్నామలై (65) ప్రహరీ కూలుస్తుండగా ఆకస్మాత్తుగా వారి మీద పడిపోయింది. రాళ్ల కింద చిక్కి ఇరువురూ ఘటనా స్థలంలోనే మృతి చెందారు. మహారాజగడ పోలీసులు చేరుకొని మృతదేహాలను స్థానిక ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని విచారణ జరుపుతున్నారు.

వంటపాత్రల పంపిణీ



వంటపాత్రలను అందజేస్తున్న చైర్మన్ తదితరులు

కెలమంగలం: కెలమంగలం యూనియన్‌లో మధ్యాహ్న భోజన పథకం కోసం పాఠశాలలకు వంటపాత్రలను పంపిణీ చేశారు. బీడీవో కార్యాలయంలో బీడీవో సతీష్‌బాబు, యూనియన్ చైర్మన్ కేశవమూర్తి పాల్గొని భోజన పథకం సిబ్బందికి 178 కేంద్రాలకు కుక్కర్, తదితర వంట పాత్రలను అందజేశారు.

పాఠశాలకు ఒక్క బస్సేనా?



ఆందోళన నిర్వహిస్తున్న దృశ్యం

- విద్యార్థుల ధర్నా

క్రిష్ణగిరి: సూళగిరి తాలూకా రామన్‌దొడ్డిలో నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సౌకర్యార్థం అదనపు బస్సు వసతులను కల్పించాలని మగళవారం ఉదయం ఆర్టీసీ బస్సును అడ్డగించి ధర్నా చేశారు. ఈ పాఠశాలకు బేరికె, వేపనపల్లి చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దఎత్తున విద్యార్థులు వస్తారు. బేరికె నుంచి వేపనపల్లి మార్గంలో ఒకే బస్సు నడుస్తుంది, ఇది ఏమాత్రం సరిపోదని, మరిన్ని బస్సులు నడపాలని విద్యార్థులు, తల్లిదండ్రులు రోడ్డుపై బైఠాయించారు. సాయంత్రం బడి వదిలాక రాత్రి 8 గంటల వరకు బస్సు కోసం వేచి ఉండాల్సి వస్తుందని వాపోయారు. ధర్నా విషయం తెలిసి బేరికె, వేపనపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విద్యార్థులతో చర్చించారు. సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించుకొన్నారు.

క్లుప్తంగా...

'ఇంజాద్రి'పై గ్రానైట్ క్వారీ పనులను నిలిపివేయండి

ఉపముఖ్యమంత్రి పవన్‌కు జనసేన స్థానిక నేత విజ్ఞప్తి



క్వారీ వద్ద మాట్లాడుతున్న జనసేన నాయకుడు బాలరాజు

మెళియాపుట్టి: శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టి మండలంలోని జలకలింగుపురం గ్రామానికి ఆనుకుని ఉన్న ఇంజాద్రి కొండపై నిర్వహిస్తోన్న గ్రానైట్ క్వారీ పనులను నిలిపివేసి చుట్టు పక్కల గ్రామాలను కాపాడాలని మండల జనసేన నాయకుడు బాలరాజు సోషల్‌మీడియా ద్వారా పవన్ కల్యాణ్‌ను కోరారు. ఇంజాద్రి కొండను ఆయన మంగళవారం సందర్శించి మీడియాతో మాట్లాడారు. ఇంజాద్రి కొండలో ఇంజాద్రి అమ్మవారు వెలసి ఉందని, తమ ప్రాంత వాసులు నిత్యం ముడుపులు సమర్పించి మొక్కులు చెల్లిస్తుంటామని, ఈ కొండలో గ్రానైట్ తవ్వకాలు చేపట్టడం ద్వారా పూజలు చేసుకునే అవకాశం లేదని, అనేక సమస్యలు వస్తున్నాయని తెలిపారు. పర్యావరణ, అటవీ శాఖ మంత్రి పవన్‌కళ్యాణ్ దీనిపై పరిశీలించి తమకు న్యాయం చేయాలని బాలరాజు కోరారు.

ఆర్బీకే శిలాఫలకం ధ్వంసం

నూజివీడు మండలం సుంకొల్లులో ఘటన



నూజివీడు: ఏలూరు జిల్లా నూజివీడు మండలం సుంకొల్లులోని రైతు భరోసా కేంద్రం శిలాఫలకాన్ని టీడీపీ కార్యకర్తలు మంగళవారం ధ్వంసం చేశారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు రైతు భరోసా కేంద్రానికి చేరుకుని శిలాఫలకంపై ఉన్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఏలూరు మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్, మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు చిత్రాలను ధ్వంసం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులకు సమాచారం అందడంతో వారు అక్కడకు చేరుకుని ఎందుకు ధ్వంసం చేస్తున్నారని నిలదీయగా.. 'మీ అంతు చూస్తాం' అని బెదిరిస్తూ టీడీపీ నేతలు వెళ్లిపోయారు.

ప్రజారోగ్యం గాలికి..

- రాష్ట్రంలో రోజురోజుకూ విజృంభిస్తున్న డయేరియా
- మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహన్‌రావు

సాక్షి, అమరావతి: టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని గాలికొదిలేసిందని మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహన్‌రావు మండిపడ్డారు. రాష్ట్రంలో డయేరియా విజృంభిస్తున్నా, కనీస నివారణ చర్యలు చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. రక్షిత మంచినీరు కూడా సరఫరా చేయలేని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం కొట్టుమిట్టాడుతోందన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే.. గుంటూరులో మొదలైన డయేరియా క్రమంగా అన్ని జిల్లాల్లో విజృంభిస్తోంది. కర్నూలు జిల్లా సుంకేశ్వరిలో జ్యోతి అనే నాలుగేళ్ల పాప ఈనెల 15న, అంతకుముందు.. మరోచోట రెండేళ్ల చిన్నారి చనిపోయింది. వాస్తవానికి.. మృత్యువాత పడుతున్న వారి సంఖ్య ఇంకా ఎక్కువే. ఎన్నికల ఫలితాలు వెలువడిన నాటి నుంచే కక్షసాధిస్తూ, నిత్యం దాడులు చేయడమే పనిగా పెట్టుకున్నారు. విద్య, వైద్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చిన నాటి సీఎం వైఎస్ జగన్ ఐదేళ్లలో ఆ రంగాల్లో విప్లవాత్మక మార్పులతో సంస్కరణలు తీసుకొచ్చారు. గత ఏడాది ఐదు కాలేజీలు ప్రారంభిస్తే కూటమి ప్రభుత్వ నిర్వాకంవల్ల కొత్తగా 500 మెడికల్ సీట్లు కోల్పోయాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 152 స్పెషలిస్టు వైద్యులను నియమిస్తే ఇప్పుడు వారిని తొలగించడం దుర్మార్గం. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సెల్ఫ్ ఫైనాన్స్ విధానం ఎత్తేస్తామని, ప్రతిపక్షంలో ఉండగా హామీ ఇచ్చిన చంద్రబాబు ప్లేట్ ఫిరాయించి ఆ విధానాన్ని కొనసాగిస్తామని హైకోర్టుకు తెలిపారు.

తమ్ముళ్లే ఇసుకాసురులై..!



కీసర స్టాక్ పాయింట్ వద్ద ఇసుక కోసం వాహనాల బారులు

స్టాక్ యార్డుల్లో టీడీపీ శ్రేణులదే పెత్తనం ● ఒకే బిల్లుపై రెండు, మూడు ట్రిప్పులు



కంచికచర్ల మండలం కీసర డంపింగ్ యార్డు వద్ద లారీలో ఇసుక లోడింగ్




అనుమంచిపల్లి వద్ద ఇసుక టోకెన్ల కోసం ఎగబడుతున్న మహిళలు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: టీడీపీ పెద్దలే ఇసుకాసురుల అవతారమెత్తారు. ఎన్టీఆర్ జిల్లాలోని స్టాక్ యార్డుల్లో ఇసుక నిల్వలను యథేచ్ఛగా తోడేస్తున్నారు. టీడీపీ శ్రేణుల వాహనాల్లో మాత్రమే ఇసుక లోడ్ చేస్తూ కాసులు దండుకుంటున్నారు. క్యూఆర్ కోడ్ స్కానర్ వద్ద తిష్టవేసి భవన నిర్మాణదారులకు ఇసుక దొరకనివ్వడం లేదు. స్టాక్ పాయింట్లలో స్కానర్లు పని చేయడం లేదని బుకాయిస్తూ సామాన్యులకు ఇసుక దొరక్కుండా చేస్తున్నారు. ఇదేమని ఉద్యోగులు ప్రశ్నిస్తే.. ఉద్యోగం చేయాలంటే తాము చెప్పింది వినాలని, లేకపోతే ఉద్యోగం ఉండదని బెదిరిస్తున్నారు. దీంతో అక్కడ పనిచేస్తున్న రెవెన్యూ, మైనింగ్ శాఖల కిందిస్థాయి ఉద్యోగులు ఇక్కడ విధులు నిర్వహించలేమని వాపోతున్నారు.

రవాణా వాహనాలూ వారివే

నందిగామ సమీపంలోని కీసర స్టాక్ యార్డు పూర్తిగా నందిగామ మండల టీడీపీ నేత చేతుల్లో ఉంది. అక్కడ ఇసుక లోడుచేసే జేసీబీలు మొదలు ఇసుక రవాణాచేసే వాహనాలన్నీ టీడీపీ నేతలవే ఉండేలా పెత్తనం చేస్తున్నారు. వాస్తవానికి కూపన్ తీసుకున్నా.. అనధికారికంగా ప్రొక్లెయిన్ ఉపయోగించి రూ.700 వసూలు చేస్తున్నారు. విజయవాడ చుట్టుపక్కల నుంచి వచ్చే వారికి చుక్కలు చూపిస్తున్నారు. తాము చెప్పిన వారికే ఇసుకపోయాలని అక్కడి సిబ్బందిపై ఒత్తిడి తెస్తున్నారు. ఇలాంటి పరిస్థితే అనుమంచిపల్లి స్టాకు యార్డు వద్ద నెలకొంది. గ్రామస్తులు కొందరు మహిళలకు కూలీ ఇచ్చి క్యూలో నిలబెట్టి కూపన్లు పొందుతున్నారు. దీంతో దూరప్రాంతాల నుంచి వచ్చిన వాహనదారులు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. కీసర స్టాక్ యార్డు నుంచి భారీ ఎత్తున ఇసుకను లోడ్ చేసి తెలంగాణ రాష్ట్రానికి అక్రమంగా తరలిస్తున్నారు.

ఈనెల 7వ తేదీ నాటికి ఎన్టీఆర్ జిల్లాలో ఇసుక నిల్వలు ఇలా.. (టన్నుల్లో)



ఒకే బిల్లుపై మూడు ట్రిప్పులు

టీడీపీ నేతలు స్టాక్ పాయింట్ల వద్ద తిష్టవేసి ఉదయం 20 వేల టన్నులకు ఒక బిల్లు తీసుకుంటున్నారు. ఆ బిల్లుతో ఇసుకను లోడ్ చేయించుకుని విజయవాడ పరిసర ప్రాంతాలకు మూడుసార్లు రవాణా చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. 20 టన్నులకు బదులు 36 టన్నుల వరకు లోడ్ చేసుకుని ఇసుకను లూటీ చేస్తున్నారు. టీడీపీ నేతలు, ప్రొక్లెయిన్ యజమాని కలసి ఒక్కో లారీ టిప్పర్‌కు అదనంగా ఇసుకను లోడ్ చేస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని సమాచారం. గత ప్రభుత్వ హయాంలో డంపింగ్ యార్డుల వద్ద నిల్వ ఉంచిన ఇసుకను టీడీపీ నేతలు ఆదాయ వనరుగా మార్చేసుకున్నారు.

47 వేల టన్నులకు పైగా విక్రయం

ఎన్టీఆర్ జిల్లాలో ఈ నెల 7న ఉచిత ఇసుక ప్రారంభం కాగా.. అప్పటికి 5,54,361 టన్నుల ఇసుక నిల్వలు ఉండేవి. ఇప్పటికే దాదాపు 47 వేల టన్నులకు పైగా స్టాక్ యార్డుల నుంచి తరలించేశారు. రోజుకు 8 వేల నుంచి 9 వేల టన్నుల ఇసుక జిల్లాలోని యార్డుల నుంచి తరలిపోతోంది. ప్రస్తుత ఇసుక నిల్వలు కేవలం 30 నుంచి 40 రోజుల మాత్రమే సరిపోతాయి. వర్షాకాలంలో నది నుంచి ఇసుక తీసేందుకు ఇబ్బంది ఏర్పడుతుంది. ఈ లోపు సిల్ట్ లేదా ఓపెన్ రీచ్‌లను గుర్తించకపోతే ఇసుక కొరత ఏర్పడుతుంది. ఈ నేపథ్యంలో కొంతమంది టీడీపీ నేతలు ముందస్తుగానే యార్డుల నుంచి ఇసుకను డంప్ చేస్తున్నట్లు సమాచారం. ఎన్టీఆర్ జిల్లాలో 8 స్టాకు యార్డులున్నాయి. కృష్ణా జిల్లా స్టాకు యార్డులో ఇసుక నిల్వలు లేవు. ఎన్టీఆర్ జిల్లా నుంచే కృష్ణా జిల్లాకు ఇసుక తీసుకెళ్లాల్సి వస్తోంది.

ప్రభుత్వ ఆఫీసులకు 'పసుపు'





పసుపు రంగు అద్దుకున్న ఇరుకుపాలెం పంచాయతీ కార్యాలయం, ముప్పాళ్ల గ్రామ సచివాలయం

పల్నాడు జిల్లా ముప్పాళ్లలోని గ్రామ సచివాలయానికి, ఇరుకుపాలెంలోని గ్రామ పంచాయతీ కార్యాలయానికి టీడీపీ కార్యకర్తలు పసుపు రంగు వేశారు. ఆ గ్రామాల్లో పంచాయతీ నిధులతో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్‌లను పసుపు రంగులతో నింపారు. ఇంత జరుగుతున్నా పంచాయతీ సిబ్బంది, అధికారులు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం.

- ముప్పాళ్ల

ఈ రాక్షసుల నుంచి కాపాడండి

- మా ఇంటిస్థలాన్ని ఆక్రమించేందుకు టీడీపీ నేత ప్రయత్నిస్తున్నారు
- అధికారులను ఉసిగొల్పుతున్నారు
- తిరుపతిలో నడిరోడ్డుపై ఓ కుటుంబం ఆందోళన
- రోడ్డుపైనే రెండురోజులుగా కూర్చున్న బాధితులు



రోడ్డు పక్కనే టెంటు వేసుకుని ఆందోళన చేస్తున్న వెంకటసుబ్బమ్మ, లక్ష్మీదేవి కుటుంబాలు

సాక్షి ప్రతినిధి, తిరుపతి: ఈ రాక్షసుల నుంచి మమ్మల్ని కాపాడండి.. మాకు న్యాయం చేయండి.. అంటూ తిరుపతి నగరంలో ఒక కుటుంబం రెండురోజులుగా నడిరోడ్డుపై బైఠాయించింది. తమ ఇంటిని ఆక్రమించుకునేందుకు తెలుగుదేశం నాయకుడు ప్రయత్నిస్తున్నాడని, ఆయన అధికారుల్ని ఉసిగొల్పుతున్నారని తెలిపింది. తాము నివాసం ఉంటున్న రూ.5 కోట్ల విలువైన ఏడుసెంట్ల (90 అంకణాల) స్థలాన్ని ఆక్రమించుకునేందుకు టీడీపీ నేత కంకణాల రజనీకాంత్‌నాయుడు దౌర్జన్యం చేస్తున్నాడంటూ వెంకటసుబ్బమ్మ, ఆమె కుటుంబసభ్యులు సోమవారం రోడ్డుపై టెంటు వేసుకుని ఆందోళన చేపట్టారు. వారి ఆందోళన మంగళవారం కూడా కొనసాగింది. బాధితుల కథనం మేరకు.. తిరుపతి అర్బన్ పరిధిలోని సర్వే నంబర్ 12లో ఏడుసెంట్ల స్థలం బండి వెంకటసుబ్బమ్మ, లక్ష్మీదేవి పేరున ఉంది. 50 ఏళ్లుగా ఈ స్థలం వీరి ఆధీనంలోనే ఉంది. ఎన్టీఆర్ సీఎంగా ఉన్న సమయంలో వీరికి పట్టా ఇచ్చారు. ఆ సమయంలో వీరు పూరిగుడిసెలో నివాసం ఉండేవారు. 2011లో రేకుల షెడ్డు వేసుకునేందుకు ప్రయత్నించిన సమయంలో స్థానికులు రాజేశ్వరమ్మ, మునికమలమ్మ వచ్చి అడ్డుచెప్పారు. స్థలంపై న్యాయస్థానాన్ని ఆశ్రయించగా వెంకటసుబ్బమ్మ, లక్ష్మీదేవిదే స్థలం అని తీర్పు ఇచ్చింది. అదే సమయంలో రెవెన్యూ వారు పొజిషన్ సర్టిఫికెట్ కూడా ఇచ్చారు. నగరం నడిబొడ్డున ఉన్న విలువైన ఈ స్థలంపై కన్నేసిన టీడీపీ నేత కంకణాల రజనీకాంత్‌నాయుడు అధికారాన్ని ఉపయోగించి రెవెన్యూ, విద్యుత్, మున్సిపల్‌శాఖల అధికారులను ఉసిగొల్పారు. ఏడుసెంట్ల స్థలం మీది కాదని, వెంటనే స్థలం ఖాళీచేసి వెళ్లాలని అధికారులు సర్వే నంబర్ 12/1 పత్రాలను తీసుకొచ్చి హెచ్చరించారు. ఏడుసెంట్ల స్థలం సర్వే నంబర్ 12 లోదని, అందుకు సంబంధించి అన్ని పత్రాలు, విద్యుత్ బిల్లులు, 40 ఏళ్లుగా చెల్లిస్తున్న ఇంటిపన్ను రసీదులు చూపించినా వినిపించుకోలేదు. స్థలం గురించి అన్నీ తెలిసిన రెవెన్యూ అధికారులే వచ్చి ఖాళీ చేయమంటే ఎవరికి చెప్పుకోవాలో అర్థం గావడంలేదని వారు ఆవేదన చెందుతున్నారు. దిక్కుతోచక నగరంలోని తిరుమల రహదారి మార్గంలో టెంటు వేసుకుని బైఠాయించారు.

సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి లోకేశ్ న్యాయం చేయాలి

ఈ రాక్షసుల నుంచి సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి లోకేశ్ తమను కాపాడాలని వారు వేడుకుంటున్నారు. ఈ స్థలానికి సంబంధించి అన్ని పత్రాలు ఉన్నా టీడీపీ నాయకుడు కంకణాల రజనీకాంత్‌నాయుడు దౌర్జన్యం చేస్తున్నాడని చెప్పారు. ఈ స్థలం తమదేనని తహశీల్దారుకు తెలుసన్నారు. తమకేదైనా అయితే తమ చావుకు కారణం ఎవరంటూ ఆవేదనతో ప్రశ్నిస్తున్నారు.

'అక్రమ ఇసుక'లో మా వాటా ఏదీ?



తవ్వకాలు జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్



తరలించడానికి నిల్వ చేసిన ఇసుక గుట్టలు

- శ్రీకాకుళం జిల్లా పెద్దసవళాపురంలో టీడీపీ సీనియర్ల ఆక్రోశం
- వంశధార నదిలో కొనసాగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలు
- అక్రమ ఇసుక రవాణా అవకాశం చోటామోటా కార్యకర్తలకు అప్పగింత
- తమకూ వాటా ఇవ్వాలంటూ నాయకులపై సీనియర్ల ఒత్తిళ్లు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: అక్రమ ఇసుక తవ్వకాలు, వసూళ్లు, రవాణాలో తమకు వాటా ఇవ్వడం లేదంటూ టీడీపీ సీనియర్ కార్యకర్తలు ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి టీడీపీకి సేవ చేసిన తమను పక్కనపెట్టి.. ఎన్నికలకు నెల రోజుల ముందు పార్టీలో చేరిన చోటామోటా కార్యకర్తలకు అవినీతిలో భాగస్వామ్యం కల్పించారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ ఇసుక దందాలో తమకూ వాటా ఇవ్వాలంటూ నాయకులపై ఒత్తిడి చేస్తున్నారు. వివరాలు.. శ్రీకాకుళం జిల్లా సరుబుజ్జిలి మండలంలోని పెద్దసవళాపురం వద్ద ఉన్న వంశధార నదిలో నుంచి ఎలాంటి అనుమతి లేకుండా టీడీపీ నాయకులు అక్రమంగా ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. ఈ ఇసుకను ప్రతి రోజూ దాదాపు 20 ట్రాక్టర్ల ద్వారా.. వెన్నెలవలస వద్ద గల ఆశ్రమ పాఠశాల సమీప ప్రదేశానికి తరలించి నిల్వ చేస్తున్నారు. రాత్రి వేళల్లో ఆ ఇసుకను ఇష్టారీతిన అమ్మేస్తున్నారు. ఇసుక కోసం వచ్చే ప్రతి ట్రాక్టర్ నుంచి రూ.100, టైరు బండ్ల నుంచి రూ.50 చొప్పున టీడీపీ కార్యకర్తలు వసూలు చేస్తున్నారు. ఈ అక్రమ ఇసుక దందా, రవాణాను నెల రోజుల కిందట పార్టీలో చేరిన వారికి అప్పగించారంటూ స్థానిక టీడీపీ సీనియర్ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో రెండు వర్గాల మధ్య లుకలుకలు వచ్చి.. ఈ వ్యవహారం బయటపడింది. దీనిపై వైఎస్సార్‌సీపీ నాయకులు సమాచారం ఇవ్వడంతో ఆమదాలవలస, బూర్జ, సరుబుజ్జిలి పోలీసులు మంగళవారం ఉదయం ఇసుక ర్యాంపు వద్దకు చేరుకున్నారు. కానీ అప్పటికే సమాచారం లీక్ అవ్వడంతో తెలుగు తమ్ముళ్లు ఇసుక రవాణా నిలిపేశారు. ఈ వ్యవహారంపై తహసీల్దార్ రమేశ్‌బాబును ప్రశ్నించగా.. ప్రతి రోజు తనిఖీలు చేపడుతున్నట్లు చెప్పారు. మండలంలో ఇసుక ర్యాంపుల నిర్వహణకు ఇప్పటివరకు అనుమతులు ఇవ్వలేదని తెలిపారు. అక్రమ రవాణా చేస్తూ పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

పెనుమూడి రేవులో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు



పెనుమూడి కృష్ణానదిలో అక్రమంగా ఇసుకను తవ్వుతున్న దృశ్యం

- రెవెన్యూ మంత్రి అండతో రెచ్చిపోతున్న కూటమి నేతలు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు



రేపల్లె రూరల్: బాపట్ల జిల్లా రేపల్లె మండలం పెనుమూడి రేవులో రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అండదండలతో కూటమి నేతలు అక్రమార్జనకు తెగబడుతున్నారు. అనుమతి లేకుండా రేవు లోపలకు చొరబడి పడవల ద్వారా ఇసుకను తీసుకొచ్చి ట్రాక్టర్లలో లోడ్ చేసి పరిసర ప్రాంతాల్లో యథేచ్ఛగా అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. మూడు రోజులుగా అక్రమ తవ్వకాలు కొనసాగుతున్నాయి. రేవు వద్ద ట్రాక్టర్లలో లోడ్ చేసినందుకు రూ.1500 నగదు, రేవు వద్ద నుంచి రేపల్లె పట్టణానికి చేరవేస్తే రూ.2500 నుంచి రూ.3000 వరకు, ఇతర ప్రాంతాలకు తరలిస్తే దూరాన్ని బట్టి మరింత నగదు వసూలు చేస్తున్నారు. ఒక పక్క ఉచిత ఇసుక విధానం అంటూనే మరో వైపు పెనుమూడి రీచ్‌లో నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తవ్వి అమ్ముకుంటున్నారని ప్రజాసంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. వీటిని అరికట్టాల్సిన రెవెన్యూ అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడటంలేదని తీవ్రస్థాయిలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై తహసీల్దార్ రవీంద్ర వివరణ ఇస్తూ పెనుమూడి ఇసుక రీచ్‌లో అక్రమంగా ఇసుక తవ్వుతున్నట్లు సమాచారం అందిందని చెప్పారు. రీచ్ వద్ద తనిఖీలు నిర్వహించాలని ఇప్పటికే గ్రామ రెవెన్యూ అధికారిని ఆదేశించామని తెలిపారు. తవ్వకాలను అడ్డుకోవటంతోపాటు బాధ్యులపై చర్యలు తీసుకుంటామని వివరించారు.

ఎమ్మెల్సీ కవితకు అస్వస్థత

- తీహార్ జైలు నుంచి దీన్‌దయాల్ ఆస్పత్రికి తరలించిన అధికారులు

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కేసులో అరెస్టై తీహార్ జైల్లో ఉన్న ఎమ్మెల్సీ కవిత అస్వస్థతకు గురయ్యారు. మంగళవారం ఆమెకు తీవ్ర జ్వరం రావడంతో జైలు అధికారులు ఢిల్లీలోని హరినగర్‌లో ఉన్న దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందించారు. రక్త పరీక్షలు, గైనిక్ సంబంధ టెస్టులు చేయించి తిరిగి జైలుకు తరలించారు. నిజానికి కవితకు మూడు రోజుల క్రితం జ్వరం రావడంతో ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఇప్పుడు మళ్లీ అస్వస్థతకు గురయ్యారు. ఢిల్లీ లిక్కర్ కేసులో ఈడీ అధికారులు మార్చి 15న కవితను అరెస్టు చేశారు. అప్పటినుంచి ఆమె జ్యుడీషియల్ కస్టడీపై జైలులో ఉన్నారు. ఇటీవల ఆమె పలుమార్లు అనారోగ్యానికి గురయ్యారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్ తదితరులు కవితను పరామర్శించారు. ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. తనకు గైనిక్ సమస్య ఉందని, బెయిల్ ఇవ్వాలని కవిత గతంలోనే పిటిషన్లు వేసినా.. కోర్టుల నుంచి సానుకూల తీర్పురాలేదు.

ఇంటి ఫుడ్ తినట్లేదంటున్న బీఆర్ఎస్ వర్గాలు

తీహార్ జైలులో ఉన్న కవితకు ఇంటి భోజనం అందించేందుకు న్యాయస్థానం అనుమతి ఇచ్చింది. నాలుగైదు రోజుల పాటు ఇంటి భోజనం చేసిన కవిత.. తర్వాత భోజనం తీసుకురావొద్దని చెప్పారు. జైలులో ఖైదీలకు పెట్టే ఆహారాన్నే కవిత తీసుకుంటున్నారు. ఆమె కోసం ఇంటినుంచి తీసుకొస్తున్న భోజనాన్ని తనిఖీ పేరుతో నలుగురైదుగురు చేతులు పెట్టి పరిశీలిస్తున్నారని.. అలా చేస్తే రోగాల బారినపడే ప్రమాదం ఉండటంతోనే ఆమె ఇంటి భోజనం వద్దన్నారని కవిత తరఫు న్యాయవాది మోహిత్‌రావు తెలిపారు.

పవన్ శాఖలో చీలిక పీలికలెందుకో!

- గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో ఉండే సెర్ప్ కొండపల్లికి కేటాయింపు
- నిధులూ సెర్ప్‌కే ఎక్కువ ఉండే అవకాశం
- దీనిద్వారానే పింఛన్ల పంపిణీ, పొదుపు సంఘాల సంక్షేమం
- ఇంతటి కీలక విభాగాన్ని పవన్ శాఖల నుంచి వేరు చేయడంపై జనసేనలో చర్చ
- రెండు శాఖలకూ ముఖ్య కార్యదర్శి ఒక్కరే



సాక్షి, అమరావతి: జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు కేటాయించిన మంత్రిత్వ శాఖలనూ చీలిక పీలికలు చేసి వేరే మంత్రికి అప్పగించడంపై ఆ పార్టీ శ్రేణులు, రాజకీయ వర్గాల్లోనూ కొత్త చర్చ మొదలైంది. ఒకే శాఖ పరిధిలో ఉండే విభాగాలను వేర్వేరు శాఖలుగా విభజించి ఇద్దరు మంత్రులకు కేటాయించడం హాట్ టాపిక్‌గా మారింది. పవన్ కళ్యాణ్ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో ఉండే గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)ను వేరు చేసి కొండపల్లి శ్రీనివాస్‌కు అప్పగించడం చర్చకు దారితీసింది. ఈ రెండింటికి ఇద్దరు మంత్రులు ఉన్నా రెండు శాఖలకు ముఖ్య కార్యదర్శిగా ఒకరే ఉండటం గమనార్హం. ఇటీవల పవన్ కళ్యాణ్ వరుసగా తన శాఖలపై సమీక్షలు నిర్వహిస్తున్నారు. తన శాఖల్లో ఏ కార్యక్రమం చేపట్టాలన్నా నిధుల కొరత వేధిస్తోందని ఆయన చెబుతుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. వాస్తవానికి సంక్షేమ కార్యక్రమాల్లో అత్యంత కీలకమైన ప్రభుత్వ కార్యక్రమాలు సెర్ప్ ఆధ్వర్యంలోనే కొనసాగుతుంటాయి. దాదాపు 65 లక్షల మంది వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ప్రతి నెలా పింఛన్ల పంపిణీ సెర్ప్ నేతృత్వంలోనే సాగుతోంది. దీనికి డ్వాక్రా గ్రూపులు, వాటికనుగుణంగా వివిధ సంక్షేమ పథకాల అమలు కూడా సెర్ప్ పరిధిలోనే కొనసాగుతుంటాయి. అలాంటిది సెర్ప్ విభాగాన్ని పవన్ కళ్యాణ్‌కు కాకుండా మరో మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు అప్పగించడానికి ఏమైనా రాజకీయ కారణాలు ఉన్నాయా అనే కోణంలో ఇప్పుడు చర్చ జరుగుతోంది.

సెర్ప్‌కే అధికంగా నిధులు

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మొత్తం బడ్జెట్‌పరంగా చూసినా నిధుల కేటాయింపు సెర్ప్‌కే ఎక్కువగా ఉంటుంది. సెర్ప్ ద్వారా జరిగే పింఛన్ల పంపిణీకి ఏటా ప్రభుత్వం దాదాపు రూ.27 వేల కోట్లకు పైబడే నిధులు కేటాయిస్తోంది. ఇతర కార్యక్రమాలకు మరికొన్ని నిధులు ఎటూ తప్పనిసరి. ఇక పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో ఇతర అన్ని విభాగాలకు దాదాపు అంత బడ్జెట్ కేటాయింపులకు అవకాశం ఉన్నప్పటికీ.. వాటిలో ఎక్కువ భాగం కేంద్ర ప్రభుత్వం గ్రాంట్ రూపంలో నేరుగా గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌లకు కేటాయించే నిధులే. అందులో రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపుల వాటా తక్కువే. ఓవైపు నిధుల కేటాయింపులోనూ అధిక వాటా కలిగి ఉండి, మరోవైపు ప్రభుత్వ పథకాల అమలులో ప్రత్యక్షంగా ప్రజల నుంచి మంచి పేరును తెచ్చిపెట్టేందుకు ఎక్కువ అవకాశం ఉన్న సెర్ప్‌ను పవన్ కళ్యాణ్‌కు కేటాయించకపోవడం ఏమిటని జనసేన నేతలు ప్రశ్నిస్తున్నారు.

నారాయణకు ప్రత్యేకం

గ్రామాల్లో పేదరిక నిర్మూలన కార్యక్రమాల కోసం గ్రామీణాభివృద్ధి శాఖలో సెర్ప్ ఉన్నట్టే.. పట్టణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన కార్యక్రమాల కోసం పట్టణాభివృద్ధి శాఖ పరిధిలో మెప్మా పేరుతో ఒక విభాగం ఉంది. అయితే, పట్టణాభివృద్ధి శాఖలో ఉన్న మెప్మాను ఆ శాఖ మంత్రి నారాయణ పరిధిలోనే ఉంచడం గమనార్హం.

రచ్చ కోసం రెచ్చగొట్టిన టీడీపీ

- తంబళ్లపల్లెలో ఉద్రిక్తత
- ఎమ్మెల్యే ఇంటివైపు వెళ్తుండగా టీడీపీ శ్రేణుల్ని అడ్డుకున్న పోలీసులు



తంబళ్లపల్లె పోలీస్ స్టేషన్ ఎదుట టీడీపీ నాయకుల రాస్తారోకో

సాక్షి, టాస్క్‌ఫోర్స్: అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లెలో టీడీపీ శ్రేణులు కవ్వింపు చర్యలకు దిగటంతో ఉద్రిక్తత తలెత్తింది. పోలీసులు వారించి పలుసార్లు అడ్డుకున్నా ఖాతరు చేయకుండా నాలుగు గంటలపాటు ఉద్రిక్త పరిస్థితుల్ని సృష్టించారు. వివరాల్లోకి వెళితే.. మంగళవారం మధ్యాహ్నం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు తంబళ్లపల్లె ఎంపీడీవో కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అక్కడినుంచి వీరంతా ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి నివాసం వద్దకు వెళుతున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. సోమవారం నుంచి ఎమ్మెల్యే ఇంటివద్దే ఉన్నారు. దీంతో టీడీపీ శ్రేణులు మంగళవారం అక్కడికి వెళ్లి శాంతిభద్రతల సమస్య సృష్టించాలని భావించారు. ఈ సమాచారం తెలిసి డీఎస్పీ ప్రసాదరెడ్డి పలువురు సీఐలు, ఎస్సైలను రప్పించారు. పోలీసు అధికారులు టీడీపీ శ్రేణులను నిలువరించి వెనక్కి వెళ్లాలని సూచించినా.. పట్టించుకోకుండా మమ్మల్లే అడ్డుకుంటారా అంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పోలీస్ స్టేషన్ ఎదుట రాస్తారోకో చేపట్టి ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించారు. కొద్దిసేపటి తర్వాత పోలీసులు ఎమ్మెల్యే నివాసానికి సమీపంలోని మదనపల్లి రోడ్డులోని లేఅవుట్ ఆర్చ్ వద్దకు చేరుకున్నారు. టీడీపీ శ్రేణులను మళ్లీ అక్కడ పోలీసులు నిలువరించారు. రెండు గంటలకు పైగా వారికి నచ్చజెప్పేందుకు పోలీసు అధికారులు తీవ్రస్థాయిలో ప్రయత్నించినా లెక్కచేయలేదు. సాయంత్రం 6 గంటల సమయంలో టీడీపీ శ్రేణులు ఈలలు, సవాళ్లతో బిగ్గరగా కేకలు వేశారు. దీంతో ఎమ్మెల్యే ఇంటి వద్ద ఉన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు అప్రమత్తమయ్యాయి. టీడీపీ శ్రేణులు కవ్వింపు చర్యలతో గొడవలు సృష్టించేందుకు రెచ్చగొడుతున్నారన్న విషయం వారికి అర్థమైంది. దీంతో ఘర్షణ వాతావరణం తలెత్తకుండా చూసేందుకు ములకలచెరువు సీఐ మధు ఎమ్మెల్యే ఇంటి వద్దకు చేరుకున్నారు. పరిస్థితిని వివరించి సంయమనం పాటించాలని కోరారు. తాము ఎమ్మెల్యేని కలిసేందుకు వచ్చామని, టీడీపీ శ్రేణుల వ్యవహారం తమకు తెలియదని వైఎస్సార్‌సీపీ శ్రేణులు తెలిపాయి. ఇంతలో టీడీపీ శ్రేణుల కవ్వింపు చర్యలు శృతిమించడంతో పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. పోలీసులు రాత్రి 9 గంటలకు కూడా తంబళ్లపల్లెలో పోలీసు పహారా కొనసాగుతోంది.

న్యూస్‌మేకర్



ధీనిధి దేశింఘు

ఒలింపిక్స్‌లో 14 ఏళ్ల చేపపిల్ల

1952లో జరిగిన ఒలింపిక్స్‌లో భారతదేశం తరఫున 11 ఏళ్ల ఆర్తి సాహా పాల్గొని చరిత్ర సృష్టించింది. ఇన్నాళ్ల తర్వాత బెంగళూరు స్విమ్మర్ ధీనిధి దేశింఘు పారిస్ ఒలింపిక్స్‌లో ఈత పోటీలో పాల్గొనే అవకాశం పొందింది. 9వ తరగతి చదువుతున్న ధీనిధి ఈతలో దేశీయ రికార్డులు సొంతం చేసుకుంది. కాని పారిస్ కల కోసం ఆమె చేసిన కృషి ఎట్టకేలకు ఆమె కోరుకున్నది సాధించి పెట్టింది

‘నేను ఎనిమిదేళ్ల వయసులో ఉన్నప్పుడు క్లాసులో చాలా బిడియంగా ఉండేదాన్ని. చురుగ్గా లేనని మా అమ్మానాన్నలు ఈతలో చేర్పించారు. ముందు ఈతకు భయపడ్డాను. తర్వాత స్విమింగ్ పూల్ నా ఫ్రెండ్ అయ్యింది. ఆ తర్వాత ఈత నా ప్యాషన్ అయ్యింది’ అంటుంది 14 ఏళ్ల ధీనిధి దెశింఘు.

తొమ్మిదవ తరగతి చదువుతున్న ఈ అమ్మాయి మరికొద్ది రోజుల్లో పారిస్‌లో మొదలు కానున్న ఒలింపిక్స్‌లో మన దేశ ప్రతినిధిగా పాల్గొననుంది. దాదాపు 70 ఏళ్ల తర్వాత ఇంత చిన్న వయసు అమ్మాయి మన దేశం నుంచి ఒలింపిక్స్‌లో పాల్గొననుండటం ఒక విశేషం. 1952 ఒలింపిక్స్‌లో 11 ఏళ్ల బాలిక ఆర్తి సాహా మన దేశం నుంచి పాల్గొంది.



ధీనిధి దేశింఘు

యూనివర్సాలిటీ కోటా

ఈసారి మన దేశం నుంచి ఎవరూ ఒలింపిక్స్‌లో ఈత పోటీలకు నేరుగా అర్హత పొందలేదు. ‘ఒలింపిక్ సెలక్షన్ టైమ్’ ప్రదర్శించి ‘ఇంటర్నేషనల్ స్విమింగ్ ఫెడరేషన్’ ద్వారా అయినా ఆహ్వానాన్ని పొందలేదు. ఇలాంటి సమయంలో ఒలింపిక్స్ వారు ఆయా దేశాలకు ‘యూనివర్సాలిటీ ప్లేసెస్’ కింద ఇద్దరిని పంపమని అనుమతి ఇస్తారు. జాతీయంగా ఉత్తమ ప్రతిభ ఉన్న ఇద్దరిని అలా పంపవచ్చు. ఈ ‘కోటా’ను ఉపయోగించుకుని మన దేశం ఉంచి పురుషుల ఈత కోసం శ్రీహరి నటరాజ్‌ను, స్త్రీల ఈత కోసం ధీనిధిని ఎంపిక చేసి పంపుతున్నారు. ఒలింపిక్స్ కమిటీ వీరు పాల్గొనడాన్ని అనుమతించింది. యూనివర్సాలిటీ ప్లేసెస్ కింద ధీనిధి ఎంపిక సాగినా అంత చిన్న వయసులో ఆ అవకాశం పొందడం కూడా ఘనతే.

స్ట్రయిట్ ఆర్మ్ టెక్నిక్

బెంగళూరుకు చెందిన ధీనిధి అక్కడి డాల్ఫిన్ ఆక్వాటిక్స్‌లో ఈత కోసం చేరినప్పుడు పూల్‌లో చేపపిల్లలా ఈదుతున్న ఆ అమ్మాయిని చూసి కోచ్ మధుకుమార్ ఈ పిట్ట కొంచెం కూత ఘనం అని కనిపెట్టాడు. ఆమెకు ప్రత్యేక శిక్షణ ఇచ్చాడు. స్ట్రయిట్ ఆర్మ్ టెక్నిక్‌తో ఈత కొట్టే కొద్దిమంది భారతీయ స్విమ్మర్‌లలో ధీనిధి నిలిచింది. 12 ఏట నుంచే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంది. ‘నా కంటే వయసులో రెండింతలు ఎక్కువ ఉన్నవారు నా పక్కన ఉంటే భయం వేసేది. కాని పూల్‌లో దిగాక ఈత మీదే నా దృష్టి’ అంటుంది ధీనిధి. గోవాలో జరిగిన 2023 నేషనల్ గేమ్స్‌లో ఈతలో కర్నాటక 7 స్వర్ణాలు సాధించడంలో ధినిధి కీలకంగా నిలిచింది. అదే డాల్ఫిన్ ఆక్వాటిక్స్‌లో ద్రోణాచార్య అవార్డీ నిహార్ అమీన్ శిక్షణ మొదలయ్యాక 200 మీటర్ల ఫ్రీ స్టయిల్‌లో ఆమె మరింత ప్రతిభ కనబరిచి 02:04-24 సెకన్ల రికార్డు సొంతం చేసుకుంది.

కఠోర శ్రమ

‘ఈ అవకాశం నాకు ఊరికే రాలేదు. ఫ్రెండ్స్, సినిమా, ఫోన్, వేరే ఆటలు అన్నీ పక్కన పెట్టి రోజుకు ఆరు గంటలు సాధన చేశాను. ఇందులో జిమ్ ఉంటుంది, ఈత కూడా ఉంటుంది. అప్పుడప్పుడు బాగా ఒంటరిగా అనిపించేది. కాని ఒలింపిక్స్‌లో పాల్గొనే నా కల కోసం ముందుకు సాగేదాన్ని. ఒలింపిక్స్‌లో 7సార్లు గోల్డ్ సాధించిన లెజెండ్ స్విమ్మర్ కేటీ లెడెకి నాకు స్ఫూర్తి. ఆమెను పారిస్ ఒలింపిక్స్‌లో కలవబోతున్నానన్న ఊహే నాకు చాలా ఎక్సయిటింగ్‌గా ఉంది. ఆమె కోసం కొన్ని కానుకలు కూడా తీసుకెళుతున్నాను’ అంది ధీనిధి.

పారిస్ ఒలింపిక్స్‌లో ధీనిధి ఏ మెడల్ సాధించినా ఆమె పొందబోయే ప్రశంసలు ఒక సముద్రాన్నే తలపించకమానవు. వాటిని ఈదుకుంటూ ఆమె మరింత ముందుకు పోవాల్సి ఉంటుంది.



నేడు తొలి ఏకాదశి

ఆషాఢమాసంలో వచ్చే ముఖ్య పర్వదినాలలో తొలి ఏకాదశి ఒకటి. ఈ రోజునుంచీ శ్రీ మహావిష్ణువు పాలసముద్రంలో శయనిస్తాడు కనుక దీన్ని ‘శయన ఏకాదశి’ అని కూడా అంటారు. సూర్యుడు నేటినుంచి దక్షిణం వైపుకు మరలడం వల్ల ఈరోజు నుంచి దక్షిణాయనం ఆరంభం అవుతుంది. దీనిని ప్రకృతిలో జరిగే మార్పులకు సంకేతంగా చెప్పుకోవచ్చు. ఏకాదశి రోజున కర్షకులు పొలానికి వెళ్ళి కొత్త కూలీలను మాట్లాడటం, కొత్త ఒప్పందాలు కుదుర్చుకోవడం చేస్తారు. మొక్కజొన్న పేలాలను దంచి, అందులో నూరిన బెల్లం కలిపి విష్ణుమూర్తికి నివేదిస్తారు. ఈ వేళ ఉపవాసం కనుక పండ్లు మాత్రమే సేవిస్తారు. నేతితో పాయసం వండి ప్రసాదంగా పంచుతారు. ఏకాదశి నాడు ఉపవసించి, విష్ణు సహస్ర నామ పారాయణం చేస్తే అనుకున్న కార్యాలు దిగ్విజయం కావడంతో పాటు మోక్ష ప్రాప్తి కలుగుతుందని, ‘సత్యనారాయణ స్వామి వ్రతాన్ని ఆచరిస్తే కోరుకున్నవి నెరవేరుతాయనీ నమ్మకం.

జగన్నాథుడికి స్వర్ణాలంకారం



జగన్నాథుడి తిరుగు రథయాత్ర మొదలైన మరునాడు- అంటే, తొలి ఏకాదశి రోజున జగన్నాథుని స్వర్ణాలంకృతుని చేస్తారు. దీనినే స్థానికంగా ‘సునా బేషా’ అంటారు. జగన్నాథుడి స్వర్ణాలంకార వేషాన్నే ‘రాజ వేషం’, ‘రాజాధిరాజ వేషం’ అని కూడా అంటారు. జగన్నాథ, బలభద్ర, సుభద్ర విగ్రహాలకు బంగారు కాళ్లు, చేతులను, ముఖాలకు బంగారు ఊర్ధ్వపుండ్రాలను అలంకరిస్తారు. జగన్నాథుడి ఊర్ధ్వపుండ్రానికి వజ్రం, బలభద్రునికి కెంపు, సుభద్ర ఊర్ధ్వపుండ్రానికి పచ్చ పొదిగి ఉంటాయి. జగన్నాథుడి చేతుల్లో బంగారు శంఖు చక్రాలను, బలభద్రుడి చేతుల్లో బంగారు గద, హలాయుధాలను అలంకరిస్తారు. జగన్నాథ, బలభద్ర, సుభద్రలకు వజ్రాలు సహా రత్న కిరీటాలు, కర్ణకుండలాలు, నాసాభరణాలు, కంఠహారాలు, బంగారు పుష్పమాలలు, వడ్డాణాలు, రాహురేఖలను అలంకరిస్తారు. జగన్నాథుడి కిరీటంపై ప్రత్యేకంగా బంగారు నెమలి పింఛాన్ని కూడా అలంకరిస్తారు.



సౌమ్యారావు

● ఫిట్‌నెస్

30 మినిట్స్... మీ కోసం

వాకింగ్ లాంజెస్, బర్పీస్, జంప్ స్క్వాట్స్, సైడ్ కిక్స్, హై నీస్, స్టెయిర్స్, జంపింగ్ జాక్స్, మౌంటెయిన్ క్లైంబర్స్... మొత్తం ఎనిమిది ఎక్సర్‌సైజ్‌లు. ఒక్కో ఎక్సర్‌సైజ్‌కి ఒక్క నిమిషం. ‘రోజుకో అరగంట కేటాయించండి చాలు. దేహం ఫిట్‌గా ఉంటుంది’ అమెరికన్ హార్ట్ అసోసియేషన్ మాట. ఫిట్‌నెస్ అనేది మగవాళ్లకు మాత్రమే కాదు మహిళలకు కూడా అవసరమే. మచిలీపట్నంలో మహిళలకు ఫిట్‌నెస్ పట్ల అవగాహన కల్పిస్తున్నారు సౌమ్యారావు.

“మహిళ కుటుంబం కోసం అహర్నిశలూ శ్రమిస్తుంది. కానీ తన ఆరోగ్యం గురించి పట్టించుకోవాలనే ధ్యాస ఉండదు. దేహాన్ని ఫిట్‌గా ఉంచుకోవడానికి రోజుకో అరగంట తన కోసం తాను కేటాయించుకునే వెసులుబాటు కూడా ఉండడం లేదు. ఈ విషయంలో నగరాలు ఒక అడుగు ముందున్నాయి. పట్టణాలు, గ్రామాలు మాత్రం మహిళ ఫిట్‌నెస్ గురించి మాట్లాడడానికి అయిష్టత వ్యక్తం చేస్తున్నాయి. ఆ అయిష్టతను తొలగించానికి సౌమ్యారావు చేస్తున్న ప్రయత్నమిది.

బందరమ్మాయి!

మాది మచిలీపట్నం. పూణేలో ఇంజినీరింగ్ చేసేటప్పుడు ఏరోబిక్స్ మీద ఆసక్తి కలిగింది. ఇంజినీరింగ్ చేస్తూనే ఏరోబిక్స్‌లో కోర్స్ చేసి, ట్రైనర్‌గా పార్ట్‌టైమ్ జాబ్ చేశాను. అమ్మాయిలు ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉండాలని చెప్పేవారు నాన్న. ఇంజినీరింగ్ పూర్తి చేసుకుని మచిలీపట్నం రావడం, అదే ఏడాది మా ఊరి అబ్బాయితోనే పెళ్లి జరిగిపోయాయి. మనం ఎక్కడున్నామో అక్కడి నుంచే మన పని ప్రారంభించాలనుకున్నాను. అలా 2007లో మూడు లక్షల పెట్టుబడితో మచిలీపట్నంలో ఏరోబిక్స్ సెంటర్ ప్రారంభించాను. అప్పుడు నా దగ్గర నేర్చుకోవడానికి ఇద్దరు మాత్రమే పేరు నమోదు చేసుకున్నారు. నెల తిరిగే సరికి యాభై మంది ఎన్‌రోల్ అయ్యారు.

రెండు నుంచి యాభైకి... మధ్య

మచిలీపట్నంలో ఉన్న ప్రతి డాక్టర్‌నీ సంప్రదించాను. ఏరోబిక్స్‌ని ఫిట్‌నెస్ అనే ఒక్కకోణంలో చూడకుండా, దేహం అవసరాన్ని బట్టి ప్రతి పేషెంట్‌కీ అవసరమైనట్లు కస్టమైజ్‌డ్‌గా డిజైన్ చేయాల్సిన అవసరాన్ని సూచించారు. సిజేరియన్ తర్వాత దేహం తిరిగి పటుత్వాన్ని సంతరించుకోవడం, ఒబేసిటీ, పీసీఓడీ వంటి సమస్యలను దృష్టిలో పెట్టుకుని వ్యాయామాలు డిజైన్ చేశాను.

పిల్లల డైలీ రొటీన్

పిల్లలకు బ్రష్ చేయడం దగ్గర్నుంచి తగినన్ని నీళ్లు తాగడం వరకు ఆరోగ్యకరమైన అలవాట్లను నేర్పిస్తాం. కానీ ఫిట్‌నెస్ కోసం సమయం కేటాయించడం మన ఇండియన్ పేరెంటింగ్ డిక్షనరీలో కనిపించదు. స్కూళ్లలో ఏరోబిక్స్ ఎక్సర్‌సైజ్ లేదా జుంబా డాన్స్ వంటి ఏదో ఒక వ్యాయామ ప్రక్రియ ప్రవేశపెడితే పిల్లలకు డైలీ రొటీన్‌లో ఎక్సర్‌సైజ్ ఒక భాగంగా మారుతుంది. ఇప్పుడున్న విద్యావిధానం విద్యార్థుల్లో ఒత్తిడిని పెంచుతోంది. ఆ ఒత్తిడిని తొలగించే మార్గం ఫిజికల్ ఎక్సర్‌సైజ్. కనీసం మూడు నిమిషాల ప్రాక్టీస్ చాలు. నేనే స్వయంగా స్కూళ్లకు వెళ్లి ఉచితంగా నేర్పిస్తానని ప్రభుత్వ స్కూళ్లు, ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలకు తెలియచేశాను.



– సౌమ్యారావు, ఫిట్‌నెస్ ఎక్స్‌పర్ట్, మచిలీపట్నం

మన సమాజం నిర్లక్ష్యం చేసే మరో సమస్య మెనోపాజ్. ఈ దశ తర్వాత మహిళల దేహం చాలా వేగంగా శక్తిని కోల్పోతుంది. ఈ దశలో ఫిట్‌నెస్‌ని పరిరక్షించుకోవడం ఎంత అవసరమో తెలియచేస్తున్నాను. అలాంటి వాళ్లకు సెల్ఫ్‌కేర్ గురించి కౌన్సెలింగ్‌తోపాటు ఉచితంగా ఫిట్‌నెస్ శిక్షణనిస్తున్నాను. ఈ సమయంలో నిర్లక్ష్యం వహిస్తే యాభై దాటినప్పటి నుంచి అనారోగ్య సమస్యలు వెంటాడుతుంటాయి. ఈ దశను ఆరోగ్యకరంగా దాటగలిగితే మహిళలు అరవై, డెబ్బైలలో నాణ్యమైన జీవితాన్ని సాగించగలుగుతారు. అలాగే మిడిల్ ఏజ్‌లో మహిళలకు ఎదురయ్యే డిప్రెషన్, మెంటల్ ట్రామాలకు కూడా ఫిట్‌నెస్ యాక్టివిటీ మంచి పరిష్కారం. ఏరోబిక్స్ శిక్షణ కోసం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లోనూ క్లాసులు తీసుకుంటున్నాను. యూఎస్, యూకే, కెనడా, ఆస్ట్రేలియా, కువైట్, సౌదీ అరేబియాల్లో ఉన్న మా మచిలీపట్నం వాళ్లే ఎక్కువ మంది.

ఆవేదన తప్పడం లేదు

కొంతమంది భర్తలు ‘నీకిప్పుడు ఫిట్‌నెస్ అవసరమా, డబ్బు తగలేస్తావా’ ఇలా రకరకాలుగా అంటారట. ఆ మాటలకు భయపడి ముందడుగు వేయని వాళ్లు కొందరైతే, రహస్యంగా నేర్చుకోవాలనుకునే వాళ్లు కొందరు. ఇరవై ఒకటో శతాబ్దం కూడా మహిళల విషయంలో ఇలా ఉండడం ఏమిటో అని ఆవేదన కలుగుతుంటుంది. చైతన్యవంతం కావాల్సింది మహిళలు మాత్రమే కాదు మగవాళ్లు కూడా” అన్నారు సౌమ్యారావు.

- వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

అంబానీ ఇంట అందగాడు

అందమైన కాలర్‌తో పింక్, గోల్డెన్ జాకెట్ ధరించి అనంత్ అంబానీ కుటుంబ వస్త్రధారణతో పోటీ పడుతూ వివాహ కార్యక్రమాల్లో తనూ విశేషంగా ఆహూతులను ఆకట్టుకుంది ‘హ్యాపీ’ అనే డాగ్.

అహ్మదాబాద్‌కు చెందిన ఖ్యాతి అండ్ కరణ్ షా పంఖ్ డిజైనర్ పెట్ వేర్ దుస్తులను డిజైన్ చేసింది. స్వచ్ఛమైన సిల్క్ జాక్వర్డ్ ఫ్యాబ్రిక్‌తో ఆమె అంబానీల కోసం తయారు చేసిన పెంపుడు జంతువుల దుస్తుల్లో ఇది ఇరవై తొమ్మిదవది.

వివాహ వేడుకలు జరుగుతున్నంతసేపూ హ్యాపీ హాయిగా మండపంపై తన స్థానాన్ని ఆక్రమించుకుని, చుట్టూ పరిశీలిస్తూ, చిత్ర విచిత్ర విన్యాసాలతో వీడియోల్లో సందడి చేసింది. ఇషా అంబానీ కూతురు బేబీ ఆదియశక్తి ప్రేమతో హ్యాపీని ఆలింగనం చేసుకుంటుండగా, ఆమె తండ్రి ఆనంద్ పిరమల్ కూతురును అనుసరిస్తూ కనిపిస్తాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియోని ‘అత్యంత అందగాడు’ అంటూ అభివర్ణించారు వ్యూవర్స్. అంబానీ కుటుంబం పెంపుడు జంతువు హ్యాపీ ఈ యేడాది జనవరిలో అనంత్–రాధికల నిశ్చితార్థంలో ఉంగరం మోసే పాత్రను పోషించింది. అప్పుడే అంబానీ కుటుంబ ఫోటోలో ఇది ప్రధాన స్థానం పొందింది.



యూత్ ప్లస్

ఫ్యూచర్ రెడీ



యువతులకు సంబంధించి ‘ఏఐ’ని ఉపాధి కోణంలో మాత్రమే చూడనక్కర్లేదు. ఆత్మవిశ్వాసం నుంచి ఆర్థిక స్వావలంబన వరకు ఎన్నో అంశాలలో ‘ఏఐ’ యువతరం నేస్తం అయింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), జెనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(జెన్‌ఏఐ) ద్వారా గ్లాస్ సీలింగ్‌ను ఛేదించే అవకాశం ఉందని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు.

‘ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, జనరేటివ్ ఏఐ కోర్సులలో చేరడానికి మహిళలు ఆసక్తి చూపుతున్నారు’ అంటున్నారు ఆన్‌లైన్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్ ‘కోర్సెరా’ స్ట్రాటజిక్ అడ్వైజర్ శ్రావణ్ గోలి.

యువతులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడానికి సవిట్ (సౌత్ ఏషియా ఉమెన్ ఇన్ టెక్) జెనరేటివ్ ఏఐ లెర్నింగ్ ఛాలెంజ్‌ను ప్రకటించింది. సుమారు అయిదు లక్షల మందికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)లో శిక్షణ ఇవ్వాలనేది ‘సవిట్’ లక్ష్యంగా పెట్టుకొంది.

‘కెరీర్ పరంగా సరికొత్త అవకాశాలకు, ఆర్థిక స్వావలంబనకు, ఉద్యోగాలలో లింగ అంతరాన్ని పూడ్చడానికి, ఏఐ రంగంలో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచడానికి ఈ శిక్షణ ఉపయోగపడుతుంది’ అంటుంది సవిట్.

> ‘కోడ్ విత్ ఔట్ బ్యారియర్స్’ ప్రోగ్రామ్ క్రింద 75,000 మహిళలకు ఏఐలో శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించుకుంది మైక్రోసాఫ్ట్. టెక్‌సాక్ష్యం, సైబర్‌శిక్షణ, మైక్రోసాఫ్ట్ డైవర్సిటీ స్కిల్లింగ్ ప్రోగ్రామ్ (ఎండీఎస్‌పీ)... మొదలైన కార్యక్రమాల ద్వారా నిరుపేద యువతులకు సాంకేతికరంగంలో ఉద్యోగావకాశాలు కల్పించడానికి అవసరమైన శిక్షణ ఇస్తోంది మైక్రోసాఫ్ట్.

టెక్నాలజీ సెక్టార్‌లో కెరీర్ కోసం కలలు కంటున్న యువతులకు అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేయడంతో పాటు సాంకేతిక శిక్షణ ఇవ్వనుంది సవిట్. నెట్‌వర్కింగ్, మెంటార్‌షిప్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, స్కిల్ గ్రోత్, రిక్రూట్‌మెంట్‌కు సంబంధించి మహిళలకు ఎన్నో రకాలుగా సహాయ సహకారాలు అందించబోతుంది.

టెక్ మహీంద్రాలో ఏఐ ప్రాజెక్ట్‌లకు సంబంధించి మహిళలు గణనీయమైన సంఖ్యలో నాయకత్వ స్థానంలో ఉన్నారు. టార్గెట్ రిక్రూట్‌మెంట్, మెంటార్‌షిప్ ప్రోగ్రామ్స్, కెరీర్ రిక్రూట్‌మెంట్ కార్యక్రమాల ద్వారా భవిష్యత్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉద్యోగాలలో మహిళల సంఖ్యను గణనీయంగా పెంచాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది.

గ్రామీణ భారతంలో కూడా యువతులను ఆర్థిక స్వావలంబన దిశగా నడిపిస్తోంది ఏఐ. దీనికి ఉదాహరణ... బిహార్‌లోని ‘ఐ–సాక్ష్యం’ అనే సంస్థ. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఉపయోగించి రూపొందించిన ఫెలోషిప్ ప్రోగ్రామ్‌ల ద్వారా గ్రామీణ ప్రాంత యువతులను ఛేంజ్‌మేకర్స్‌గా మారుస్తోంది ఐ–సాక్ష్యం. లైఫ్ స్కిల్స్, డిజిటల్, ఫైనాన్షియల్ లిటరసీ... మొదలైన వాటికి సంబంధించి ‘ఐ–సాక్ష్యం’ శిక్షణ ఇస్తోంది.

ఇన్‌స్పిరేషన్

ఒకేరోజు 85 వేల పండ్ల మొక్కలు!

ఛత్తీస్‌ఘడ్‌లోని గరియాబంద్ జిల్లాలో 17,000 మంది మహిళలు ఒకేరోజులో 85,000 పండ్ల మొక్కలను నాటడం ద్వారా రికార్డ్ సృష్టించారు. ‘అమ్మ పేరు మీద ఒక చెట్టు’ పేరుతో చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమంలో గ్రామ పంచాయతీ స్థాయి నుంచి జిల్లా కేంద్రం వరకు కొత్తగా పెళ్లయిన వారు, గర్భిణులు, తల్లులు పాల్గొన్నారు. మామిడి, జామ, నిమ్మ, పనస... మొదలైన మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణకు, పౌష్టికాహార మెరుగుదలకు దోహదపడే ఈ మొక్కలను నాటి సంరక్షించే బాధ్యతను మహిళలకు అప్పగించారు. వీరి ఘనతను ‘గోల్డెన్



బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్’ గుర్తించింది. ‘మొక్క నాటాను. ఇక నా పని పూర్తయిపోయింది అనుకోడం లేదు. నేను నాటిన మొక్క మా అమ్మ, నా బిడ్డతో సమానం. కంటికి రెప్పలా చూసుకుంటాను’ అంటుంది దస్పూర్ గ్రామానికి చెందిన సునీత అనే గృహిణి. ఇది ఆమె మాటే కాదు ‘అమ్మ పేరు మీద ఒక చెట్టు’ కార్యక్రమంలో పాల్గొన్న పదిహేడు వేల మంది మహిళలది.

లీగల్

సహజీవనంలో ఆమెకు ఆ హక్కుందా?



ప్రియ, భార్గవ్.. మూడేళ్లుగా లివ్ ఇన్ టుగెదర్ రిలేషన్‌లో ఉంటున్నారు. ఇద్దరూ ఒకే కంపెనీలో పనిచేసేవాళ్లు. ఆరు నెలల కిందట ప్రియకు ఉద్యోగం పోయింది. దాంతో ఇంటి బాధ్యత అంతా భార్గవ్‌దే. అయితే ప్రియ ఇటీవల భార్గవ్ ఏం చేసినా తప్పు పడుతోంది. ఎవరితో మాట్లాడనివ్వకుండా.. తనతో తప్ప ఎవరితో ఎక్కడికీ వెళ్లనివ్వకుండా కట్టడి చేస్తోంది. ఆఫీస్ అవసరాల రీత్యా భార్గవ్ కొలీగ్స్‌కి ఫోన్ చేసినా, ఫోన్‌ని అతను అటెండ్ అయినా పెద్ద యుద్ధమే! గొడవలే! భరించలేక భార్గవ్ ఒకరోజు ‘ఈ టార్చర్ తట్టుకోవడం నా వల్ల కాదు.. నీతో కలసి ఉండలేను’ అన్నాడు. దాంతో ప్రియ ‘నాతో బ్రేకప్ చేసుకుంటే నీ మీద రేప్ కేసు పెడతా’ అని బెదిరించింది. హడలిపోయాడు భార్గవ్. నిజంగానే ప్రియకు ఆ హక్కు ఉందా?

కొత్తగా అమల్లోకి వచ్చిన భారతీయ న్యాయ సంహిత, సెక్షన్ 69 ప్రకారం.. ఏ వ్యక్తి అయినా పెళ్లి చేసుకునే ఉద్దేశం లేకపోయినా.. మోసపూరితంగా, ఓ పథకం ప్రకారం.. పెళ్లి చేసుకుంటానని చెప్పి ఆ స్త్రీతో శారీరక సంబంధం నెరపితే.. సదరు పురుషుడికి పదేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంది. రేప్ అయితే యావజ్జీవం కూడా పడవచ్చు. జూన్ 30 వరకు అమల్లో ఉన్న పాత శిక్షాస్మృతి ప్రకారం కూడా పెళ్లి చేసుకుంటానని చెప్పి, మోసపూరితంగా స్త్రీతో శారీరకసంబంధం నెరపిన పురుషుడిపై ఐపీసీ 376, ఐపీసీ 420 సెక్షన్లను కలిపి కేసు నమోదు చేసేవారు. అయితే, ఆ పురుషుడు మొదటినుంచీ మోసం చేసే ఉద్దేశంతోనే ఉన్నాడు అని రుజువుకాకపోతే మాత్రం దాన్ని రేప్‌గా పరిగణించలేమని హైకోర్ట్, సుప్రీంకోర్టు పేర్కొన్న సందర్భాలు, తీర్పులూ ఉన్నాయి. ఇలాంటి కేసుల్లో ముఖ్యంగా చూడాల్సినదేంటంటే.. పెళ్లి చేసుకునే ఉద్దేశం లేకపోయినా చేసుకుంటానని నమ్మించి కేవలం శారీరక సంబంధం కోసమే అతను లివ్ ఇన్‌లో ఉన్నాడా అనే అంశం. మొదట బాగానే ఉన్నాడు.. పెళ్లి చేసుకోవాలనే అనుకున్నాడు.. కానీ తర్వాత మనస్పర్థలు, భేదాభిప్రాయాలు వచ్చి విడిపోవాలనుకుంటున్నాడు అని రుజువైతే శిక్ష పడదు. భారతీయ న్యాయ సంహిత, సెక్షన్ 69 ప్రకారం కూడా లివ్ ఇన్ రిలేషన్‌లోని పురుషుడు ‘మోసపూరితమైన ఆలోచనతోనే రిలేషన్ మొదలు పెట్టాడు’ అని రుజువు చేయాలి. అయితే ఈ కేస్ స్టడీలో భార్గవ్ మీద ప్రియ కేసు పెట్టే అవకాశం కచ్చితంగా ఉంది. అతను పెళ్లి చేసుకుంటానని చెప్పి ఇన్నాళ్లు లివ్ ఇన్‌లో ఉండి ఇప్పుడు వద్దు అంటున్నాడని ప్రియ రుజువు చేయగలిగితే భార్గవ్‌కి పదేళ్లవరకు శిక్ష పడే అవకాశం ఉంది. అయితే సెక్షన్ 69 వలన సహజీవనం, ప్రేమ అనే అంశాలు ఆది నుంచీ అనుమానంతో మొదలయ్యే ప్రమాదం ఉంది. సహజీవనానికి ముందు లేదా కలసి ఉంటున్న క్రమంలో ఒకరిపై ఒకరు స్పష్టత తెచ్చుకోవడం అవసరం. ఇలాంటి రిలేషన్స్ వ్యక్తిగతమైనప్పటికీ, వీలైనంత మేర అందరికీ తెలిసేలా ఉండడం లేదా కనీసం సన్నిహితులకైనా తెలిసుండటం వల్ల కొంతవరకు రక్షణ కలగవచ్చు.



– శ్రీకాంత్ చింతల, హైకోర్ట్ అడ్వొకేట్



స్మృతి మంధాన ఐదో ర్యాంక్ యథాతథం

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ మహిళల టి20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్ విడుదలయ్యాయి. తాజా ర్యాంకింగ్స్‌లో భారత జట్టు వైస్ కెప్టెన్ స్మృతి మంధాన 729 రేటింగ్ పాయింట్లతో ఐదో ర్యాంక్‌లో కొనసాగుతోంది. భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ మూడు స్థానాలు ఎగబాకి 12వ ర్యాంక్‌లో.. షఫాలీ వర్మ రెండు స్థానాలు పురోగతి సాధించి 15వ ర్యాంక్‌లో ఉన్నారు. బౌలర్ల ర్యాంకింగ్స్‌లో దీప్తి శర్మ 738 పాయింట్లతో మూడో స్థానాన్ని నిలబెట్టుకుంది. రాధా యాదవ్ ఎనిమిది స్థానాలు ఎగబాకి 15వ ర్యాంక్‌కు చేరుకుంది.

ఇంగ్లండ్ కోచ్ పదవికి సౌత్‌గేట్ రాజీనామా



గత ఎనిమిదేళ్లుగా ఇంగ్లండ్ ఫుట్‌బాల్ జట్టుకు కోచ్‌గా ఉన్న గ్యారెత్ సౌత్‌గేట్ తన పదవికి రాజీనామా చేశారు. బెర్లిన్‌లో జరిగిన యూరో కప్ ఫైనల్లో ఇంగ్లండ్ 1-2 గోల్స్ తేడాతో స్పెయిన్ జట్టు చేతిలో ఓడిపోయింది. 2016 నుంచి సౌత్‌గేట్ శిక్షణలో ఇంగ్లండ్ రాటు దేలింది. 2018 'ఫిఫా' ప్రపంచకప్‌లో సెమీఫైనల్ చేరుకోవడంతోపాటు 2021, 2024 యూరో టోర్నీల్లో రన్నరప్‌గా నిలిచింది. 'మార్పు కోసం సమయం ఆసన్నమైంది. కొత్త అధ్యాయానికి తెర లేవనుంది' అని సౌత్‌గేట్ వ్యాఖ్యానించారు.

ఒలింపిక్ పతకాల వేటలో...

క్రీడాకారులకు భారత ప్రభుత్వం అండదండ | పారిస్ ఒలింపిక్స్ సన్నాహాలకు భారీగా నిధులు | రూ. 470 కోట్లు ఖర్చు చేసిన కేంద్రం

2012 లండన్ ఒలింపిక్స్‌లో గ్రేట్ బ్రిటన్ 29 స్వర్ణాలు, 18 రజతాలు, 18 కాంస్యాలతో (మొత్తం 65 పతకాలు) మూడో స్థానంలో నిలిచింది. సొంతగడ్డపై పెద్ద సంఖ్యలో పతకాలు గెలిచే లక్ష్యంతో అక్కడి ప్రభుత్వం చాలా ఏళ్ల క్రితమే ప్రణాళికలు రూపొందించి పెద్ద సంఖ్యలో నిధులు కేటాయించింది. వచ్చిన ఫలితాలను బట్టి చూస్తే తాము గెలిచిన ఒక్కో పతకం కోసం 45 లక్షల పౌండ్లు (సుమారు రూ.38 కోట్లు) ఖర్చు చేసినట్లు ఒలింపిక్స్ తర్వాత అధికారులు వెల్లడించారు. ఆధునిక సౌకర్యాలు, శిక్షణ, టోర్నీలు వంటి సన్నాహాల్లో దీనిని ఖర్చు చేశారు. ఇది పుష్కరకాలం క్రితం నాటి మాట. ఇదే విషయాన్ని భారత్ కోణంలో చూస్తే ఇలాంటిది గతంలో ఎప్పుడూ జరగలేదు. ఆటగాళ్లు వ్యక్తిగత కష్టం, పట్టుదలను నమ్ముకొనే బరిలోకి దిగుతూ వచ్చారు. ఒలింపిక్స్‌కు చేరువైన సమయంలో అక్కడక్కడా కొంత ఆర్థిక సహకారం లభించినా... అందులో ప్రభుత్వ పాత్ర పెద్దగా లేదు. 1956 నుంచి 1992 వరకు భారత్‌కు ఒలింపిక్స్‌లో ఒక్క వ్యక్తిగత పతకం కూడా రాలేదు. ఆ తర్వాతి ఒలింపిక్స్‌లలో పతకం సాధించినవారు కూడా సొంతంగా సన్నద్ధమైనవారే తప్ప ఒక్కరిని కూడా వ్యవస్థ తీర్చిదిద్దినవారుగా చెప్పలేం. కానీ గత కొన్నేళ్లలో పరిస్థితి మారింది. కేంద్ర ప్రభుత్వం ఒలింపిక్ క్రీడలను, ఒలింపిక్స్‌కు అర్హత సాధించే ఆటగాళ్లను ప్రోత్సహించేందుకు సిద్ధమైంది. గెలిచి వచ్చిన తర్వాత అందించే నజరానాల కంటే గెలిచేందుకు కావాల్సిన వాతావరణం సృష్టించడం కీలకమని నమ్మింది. అందుకే మిషన్ ఒలింపిక్ సెల్ (ఎంఓసీ) పేరుతో ప్రత్యేకంగా ఆర్థిక వనరులను చేకూర్చింది. టార్గెట్ ఒలింపిక్ పోడియం (టాప్స్) పథకం పేరుతో ఎంపిక చేసిన ఆటగాళ్లకు సహాయం అందించడం ఈ ఎంఓసీలోనే భాగంగా ఉంది. విదేశాల్లో శిక్షణ, పోటీల కోసం ప్రత్యేక క్యాలెండర్ (ఏసీటీసీ)తో ఈ ప్రణాళిక రూపొందించగా... వివిధ వర్గాల నుంచి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) ద్వారా కూడా నిధులు సేకరించింది.

– సాక్షి క్రీడా విభాగం

PARIS 2024

మరో 9 రోజుల్లో...

టోక్యో ఒలింపిక్స్‌లో భారత్ గరిష్టంగా 7 పతకాలు సాధించింది. ఇవి ముగిసిన తర్వాత పారిస్ ఒలింపిక్స్ కోసం సన్నాహాలు షురూ అయ్యాయి. ఈ సారి పతకాల సంఖ్యను పెంచడమే ఏకైక లక్ష్యంగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) తమ వంతు పని చేసింది. 16 క్రీడాంశాల్లో ఆయా జాతీయ క్రీడా సమాఖ్యల సూచనలు, ప్రతిపాదనలతో ప్రణాళిక సిద్ధమైంది. కేవలం నిధులు అందించడం మాత్రమే కాగా టోక్యో–పారిస్ మధ్య కాలంలో ఆటగాళ్ల ప్రదర్శనను కూడా 'సాయ్' పర్యవేక్షిస్తూ వచ్చింది. అధికారిక లెక్కల ప్రకారం పారిస్ ఒలింపిక్స్ సన్నాహాల కోసం కేంద్ర ప్రభుత్వం మొత్తం రూ. 470 కోట్లు ఖర్చు చేసింది. మన దేశం నుంచి ఈసారి 117 మంది ఆటగాళ్లు బరిలోకి దిగుతున్నారు. పతకావకాశాలు ఉన్న వివిధ క్రీడలు, క్రీడాకారుల కోసం చేసిన ఖర్చు వివరాలను చూస్తే...



అథ్లెటిక్స్: ప్రభుత్వం నుంచి ఎక్కువ ఆర్థిక సహాయం అందుకున్న క్రీడాంశం అథ్లెటిక్స్. ఒలింపిక్స్‌లో భారత్ నుంచి 29 మంది పాల్గొంటున్నారు. అథ్లెటిక్స్‌కు కేంద్రం రూ.96.08 కోట్లు ఖర్చు చేసింది. గత టోక్యో ఒలింపిక్స్‌లో నీరజ్ చోప్రా జావెలిన్ త్రోలో స్వర్ణం సాధించడంతో ఈ సారి అంచనాలు మరింత పెరిగాయి. మొత్తం 36 జాతీయ శిక్షణా శిబిరాలు నిర్వహించారు. విదేశీ కోచ్ క్లాజ్ బార్టొనెట్ వద్ద శిక్షణ తీసుకోవడంతో పాటు విదేశాల్లో టోర్నీలు, శిక్షణ కోసం నీరజ్ చోప్రాకే ప్రభుత్వం రూ.5.72 కోట్లు ఇచ్చింది.

బ్యాడ్మింటన్: ప్రభుత్వం ఈ క్రీడ కోసం మొత్తం రూ. 72.02 కోట్లు ఖర్చు చేసింది. భారత్ నుంచి సింగిల్స్ విభాగంలో ముగ్గురు... పురుషుల, మహిళల డబుల్స్‌లో కలిపి నలుగురు షట్లర్లు బరిలోకి దిగుతున్నారు. విదేశాల్లో శిక్షణ, టోర్నీలకు గరిష్టంగా బ్యాడ్మింటన్ ఆటగాళ్ల 81 ట్రిప్‌లకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించింది. డబుల్స్ స్పెషలిస్ట్ కోచ్ మథియాస్ బో వద్ద శిక్షణ, వీడియో అనలిస్ట్, ఇతర సౌకర్యాల కోసం డబుల్స్ ద్వయం సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టిలకు ప్రభుత్వం రూ. 5.62 కోట్లు ఇవ్వగా... పీవీ సింధుకు రూ.3.13 కోట్లు అందించింది. దీంతో పాటు 17 విదేశీ పర్యటనలు, వ్యక్తిగత కోచ్‌లు, సిబ్బంది నియామకం కోసం కూడా 'టాప్స్' ద్వారా సింధుకు సహకారం లభించింది.

బాక్సింగ్: రూ.60.93 కోట్లు

షూటింగ్: రూ.60.42 కోట్లు (ఆటగాళ్ల మొత్తం 45 విదేశీ ట్రిప్‌లకు ప్రభుత్వ సహకారం లభించింది. మొత్తం 41 జాతీయ క్యాంప్‌లు జరిగాయి)

హాకీ: రూ.41.29 కోట్లు (టోక్యోలో కాంస్యం సాధించడంతో ఈ సారి మన జట్టునుంచి మరింత మెరుగైన ప్రదర్శనను ఆశిస్తూ 76 జాతీయ శిక్షణా శిబిరాలు నిర్వహించడంతో పాటు 19 విదేశీ పర్యటనలకు అవకాశం కల్పించింది)

ఆర్చరీ: రూ.39.18 కోట్లు (41 జాతీయ క్యాంప్‌లు నిర్వహించారు)

రెజ్లింగ్: రూ.37.80 కోట్లు

వెయిట్‌లిఫ్టింగ్: రూ.26.98 కోట్లు (టోక్యో రజత పతక విజేత మీరాబాయి చానుకు శిక్షణ నిమిత్తం ప్రభుత్వం రూ. 2.74 కోట్లు అందించింది)

టేబుల్ టెన్నిస్: రూ. 12.92 కోట్లు

జూడో: రూ. 6.30 కోట్లు

స్విమ్మింగ్: రూ.3.90 కోట్లు

రోయింగ్: రూ.3.89 కోట్లు

సెయిలింగ్: రూ.3.78 కోట్లు

గోల్ఫ్: రూ.1.74 కోట్లు

టెన్నిస్: రూ.1.67 కోట్లు

ఈక్వెస్ట్రియన్: రూ.95 లక్షలు

శౌర్య సంచలనం

ప్రపంచ జూనియర్ స్క్వాష్ చాంపియన్‌షిప్‌లో పతకం ఖరారు



హ్యూస్టన్ (అమెరికా): ప్రపంచ జూనియర్ స్క్వాష్ చాంపియన్‌షిప్‌లో భారత కుర్రాడు శౌర్య బావా సంచలనం సృష్టించాడు. ఈ మెగా టోర్నీలో బాలుర సింగిల్స్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లి కనీసం కాంస్య పతకాన్ని ఖాయం చేసుకున్నాడు. 2014లో కుష్ కుమార్ తర్వాత ఈ టోర్నీలో భారత్‌కు పతకం రావడం ఇదే ప్రథమం. ఢిల్లీకి చెందిన 18 ఏళ్ల శౌర్య క్వార్టర్ ఫైనల్లో 2–11, 11–4, 10–12, 11–8, 12–10తో లో వా సెర్న్ (మలేసియా)పై గెలుపొందాడు. 80 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో శౌర్య మూడు మ్యాచ్ పాయింట్లను కాపాడుకోవడం విశేషం. నిర్ణాయక ఐదో గేమ్‌లో శౌర్య 7–10తో ఓటమి అంచుల్లో నిలిచాడు. అయితే శౌర్య ఆందోళన చెందకుండా సంయమనంతో ఆడి వరుసగా ఐదు పాయింట్లు గెలిచి గేమ్‌తోపాటు మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. బాలికల సింగిల్స్ విభాగంలో జాతీయ చాంపియన్ అనాహత్ సింగ్ పోరాటం ముగిసింది. క్వార్టర్ ఫైనల్లో 16 ఏళ్ల అనాహత్ 8–11, 9–11, 11–5, 12–10, 11–13తో నదీన్ ఎల్‌హమీ (ఈజిప్ట్) చేతిలో పోరాడి ఓడిపోయింది.

సుమిత్ శుభారంభం



బస్టాడ్ (స్వీడన్): నోర్డియా ఓపెన్ ఏటీపీ–250 టెన్నిస్ టోర్నీలో భారత నంబర్ వన్ సుమిత్ నగాల్ శుభారంభం చేశాడు. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 68వ ర్యాంకర్ సుమిత్ 6–4, 6–3తో ఇలియాస్ యామెర్ (స్వీడన్)పై గెలుపొందాడు. 98 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సుమిత్ రెండు ఏస్‌లు సంధించి, తన ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేశాడు. రెండో రౌండ్‌లో ప్రపంచ 36వ ర్యాంకర్ మరియానో నవోన్ (అర్జెంటీనా)తో సుమిత్ తలపడతాడు.

సినిమా

బ్రహ్మరాక్షసుడిలా వస్తాడు!

ధనుష్ టైటిల్ రోల్‌లో నటించి, దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'రాయన్'. సందీప్ కిషన్, కాళిదాసు జయరామ్ ఇతర లీడ్ రోల్స్‌లో నటించిన ఈ సినిమాలో సెల్వరాఘవన్, ప్రకాశ్ రాజ్, ఎస్‌జే సూర్య, అపర్ణ బాలమురళి, దుషారా విజయన్, వరలక్ష్మి శరత్‌కుమార్ కీలక పాత్రల్లో నటించారు. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ ఎల్ఎల్‌పి తెలుగు వెర్షన్‌ను రిలీజ్ చేయనుంది. ఈ సందర్భంగా



● కాళిదాసు, ధనుష్, దుషారా విజయన్, సందీప్ కిషన్

తమిళ, తెలుగు, హిందీ భాషల్లో మంగళవారం 'రాయన్' సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. 'రాయన్... అడవిలో ప్రమాదమైన జంతువు ఏదో తెలుసా', 'సింహం,' 'అడవిలో బలమైన జంతువులు పులి, సింహమే. కానీ ప్రమాదమైన జంతువు తోడేలు. రెండూ ఎదురుగా నిలబడితే సింహమే గెలుస్తుంది. కానీ తోడేలు చాలా జిత్తులమారిది. గుంపుగా చుట్టి ముట్టి, ఓ పథకం వేసి సింహాన్ని ఓడిస్తాయి', 'వస్తాడు... బ్రహ్మరాక్షసుడిలా వస్తాడు... దహనం చేస్తాడు', 'రావయ్యా... రాయన్... వెళ్లి ఏం చెప్పావ్... టక్కున కేసు వెనక్కు తీసుకున్నాడు' అనే డైలాగ్స్ తెలుగు ట్రైలర్‌లో ఉన్నాయి. ఈ సినిమాకు ఏఆర్ రెహమాన్ స్వరకర్త.

కాటుక కళ్లతో సైగే చేసే చిన్నది



● అమృతా అయ్యర్, 'అల్లరి' నరేశ్

'మా ఊరి జాతరలో కాటుక కళ్లతో చాటుగా రమ్మని సైగే చేసే చిన్నది...' అంటూ మొదలయ్యే ఫోక్ మెలోడీ సాంగ్ 'బచ్చల మల్లి' సినిమాలోనిది. 'అల్లరి' నరేశ్ టైటిల్ రోల్ చేస్తున్న ఈ సినిమాలో అమృతా అయ్యర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. సుబ్బు మంగదేవి దర్శకత్వంలో రాజేశ్ దండా, బాలాజీ గుత్తా నిర్మిస్తున్న ఈ చిత్రం సెప్టెంబరులో విడుదల కానుంది. ఈ సినిమాలోని 'మా ఊరి జాతరలో..' పాట లిరికల్ వీడియోను చిత్రయూనిట్ మంగళవారం విడుదల చేసింది. 'రాములోరు పేర్చిన రాళ్లు ఏరి తీయనా... ఏటి నీటి పైనే నీకు కోటే కట్టెయ్యనా...' అంటూ ఈ పాట సాగుతుంది. చిత్రసంగీత దర్శకుడు విశాల్ చంద్రశేఖర్ స్వరపరచిన ఈ పాటకు శ్రీమణి సాహిత్యం అందించారు. సింధూరీ విశాల్‌తో కలిసి 'హను–మాన్' ఫేమ్ కంపోజర్ గౌరా హరి ఈ పాటను పాడారు. ''హీరో హీరోయిన్లు ఒకరినొకరు ఎంత ప్రేమించుకుంటారో తెలియజేసే పాట ఇది. హీరో తన భార్యకు ఏదో ఒక ప్రత్యేకమైన బహుమతిని ఇస్తానంటుండగా, అవేవీ వద్దు తనతో ఉంటే చాలు అన్నట్లుగా హీరోయిన్ చెప్పే క్రమంలో ఈ పాట వస్తుంది'' అని యూనిట్ పేర్కొంది.

ట్రైబల్ కథల్



● ప్రభాస్



● ఎన్టీఆర్



● సూర్య

ఒక సింహాసనం కోసం రెండు తెగలు పోటీ పడతాయి... సముద్ర తీరంలో ఉండే ఆదివాసీల కోసం ఓ వ్యక్తి పోరాటం చేస్తాడు... తమ హక్కుల కోసం పోరాటం చేస్తాడు ఓ గిరిజన తెగ నాయకుడు... ఓ తెగకు చెందిన వ్యక్తి శివభక్తుడిగా మారతాడు... సినిమా పాయింట్ ఏదైనా ఈ సినిమాలన్నింటిలోనూ కామన్ పాయింట్ 'ట్రైబల్' నేటివిటీ. ఇలా ట్రైబల్ కథల్‌తో రానున్న చిత్రాల గురించి తెలుసుకుందాం.

● 'కాన్సార్ ఎరుపెక్కాలా...' అంటూ 'సలార్: సీజ్‌ఫైర్' చిత్రంలో ప్రభాస్ చెప్పిన డైలాగ్స్‌కి అటు అభిమానులు ఇటు ప్రేక్షకుల కేకలు, అరుపులతో థియేటర్లు దద్దరిల్లాయి. ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహించిన చిత్రం 'సలార్'. విజయ్ కిరగందూర్ నిర్మించిన ఈ సినిమా మొదటి భాగం 'సలార్: సీజ్‌ఫైర్' గత ఏడాది విడుదలై బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. కాన్సార్ సింహాసనం కోసం శౌర్యాంగ, ఘనియార్ తెగలు పోటీపడటం, వారికి దక్కకుండా తన సింహాసనాన్ని కాపాడుకోవడం కోసం మన్నార్ తెగకు చెందిన రాజ మన్నార్ చేసే ప్రయత్నం... ఈ మూడు తెగలు ఎవరికి వారు ప్రత్యేక వ్యూహాలు రచించడం మొదటి భాగంలో చూశాం. చివరికి ఏ తెగవారు కాన్సార్ సింహాసనం చేజిక్కించుకున్నారనేది తెలియాలంటే మలి భాగం 'సలార్: శౌర్యాంగపర్వం' విడుదల వరకూ ఆగాల్సిందే. ఇంకా సెకండ్ పార్ట్ షూటింగ్ ఆరంభం కాలేదు.


● 'ఈ సముద్రం సేపల్ని కంటే కత్తుల్ని, నెత్తుర్ని ఎక్కువ సూసుండాది.. అందుకేనేమో దీన్ని ఎర్ర సముద్రం అంటారు' అంటూ 'దేవర' కోసం ఎన్టీఆర్ చెప్పిన పవర్‌ఫుల్ డైలాగ్ సినిమా బ్యాక్‌డ్రాప్ ఏంటో చెప్పింది. 'జనతా గ్యారేజ్' వంటి హిట్ మూవీ తర్వాత హీరో ఎన్టీఆర్, డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందుతోన్న చిత్రం 'దేవర'. ఈ చిత్రం ద్వారా హీరోయిన్‌గా జాన్వీ కపూర్ టాలీవుడ్‌లో ఎంట్రీ ఇస్తున్నారు. నందమూరి కల్యాణ్‌రామ్ సమర్పణలో మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ .కె నిర్మిస్తున్న ఈ సినిమా రెండు భాగాలుగా విడుదల కానుంది. భారత దేశంలో విస్మరణకు గురైన సముద్ర తీర ప్రాంతాలకు చెందిన ఆదివాసీల కోసం దేవర చేసే పోరాటమే ఈ సినిమా అని సమాచారం. ఈ చిత్రం మొదటి భాగం తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో సెప్టెంబర్ 27న విడుదల కానుంది.

● 'చావుని ఎదిరించే వాళ్లకు మాత్రమే ఇక్కడ జీవితం' అంటూ 'తంగలాన్' మూవీ ట్రైలర్‌లో హీరో విక్రమ్ చెప్పిన డైలాగ్ పవర్‌ఫుల్‌గా ఉంది. పా. రంజిత్ దర్శకత్వంలో విక్రమ్ హీరోగా నటించిన పీరియాడిక్ యాక్షన్ మూవీ 'తంగలాన్'. కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించిన ఈ సినిమా త్వరలో రిలీజ్ కానుంది. కర్ణాటకలోని కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ కార్మికుల జీవితాలతో ఈ చిత్రం రూపొందింది. బంగారు గనుల తవ్వకాన్ని వ్యతిరేకించే గిరిజన తెగ నేపథ్యంలో ఈ చిత్రం ఉంటుంది. ఆ తెగ నాయకుడి పాత్రలో విక్రమ్ నటించారట. ఈ సినిమా తమిళంతో పాటు తెలుగు, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లోనూ రిలీజ్ కానుంది.



● మంచు విష్ణు

● సూర్య హీరోగా నటించిన పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'కంగువ'. శివ దర్శకత్వంలో కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ సినిమాలో సూర్య ఆటవిక జాతికి చెందిన ఓ తెగ నాయకుడిగా నటించారు. ఓ దట్టమైన అడవిలో రెండు ఆటవిక జాతుల మధ్య పోరాటం నేపథ్యంలో ఈ సినిమా రూపొందినట్లు గ్లింప్స్ చూస్తే అర్థం అవుతుంది. అలాగే ఈ సినిమా టైమ్ ట్రావెల్ కాన్సెప్ట్‌తో తెరకెక్కినట్లు తెలుస్తోంది. ఓ గిరిజన యోధుడైన కంగువ 1678 నుంచి ప్రస్తుత కాలానికి వస్తాడు. ఓ మహిళా సైంటిస్ట్ సాయంతో తన మిషన్‌ని పూర్తి చేయాలనుకుంటాడు. ఆ మిషన్ ఏంటి? ఆ కాలం నుంచి ఇప్పటి కాలానికి అతను టైమ్ ట్రావెల్ ఎలా చేశాడు? అనే నేపథ్యంలో భూత, భవిష్యత్తు, వర్తమాన కాలాలతో ఈ సినిమా కథ సాగుతుందని టాక్. ఈ సినిమా అక్టోబర్ 10న విడుదల కానుంది.



● విక్రమ్

● మంచు విష్ణు నటిస్తున్న చిత్రం 'కన్నప్ప'. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని మంచు మోహన్ బాబు నిర్మిస్తున్నారు. ప్రభాస్, మోహన్ బాబు, అక్షయ్ కుమార్, బ్రహ్మానందం వంటి వారు ముఖ్య పాత్రధారులు. ఈ సినిమాలో ఓ తెగకు చెందిన తిన్నడు (ఆ తర్వాత శివ భక్తుడు కన్నప్పగా మారారు) పాత్ర చేస్తున్నారు మంచు విష్ణు. ఈ చిత్రంలో తిన్నడు వాడిన విల్లు విశిష్టత గురించి ఇటీవల మేకర్స్ తెలిపారు. తన బిడ్డ తిన్నడు ధైర్యసాహసాలకు ముగ్ధుడైన నాద నాథుడు ప్రత్యేకమైన విల్లును తయారు చేస్తాడు. ఆ విల్లును ఉపయోగిస్తూ తన తెగను, అడవిలో సమతుల్యతను తిన్నడు ఎలా కాపాడాడు? అనే నేపథ్యంలో సాగే సీన్స్ ఆసక్తిగా ఉంటాయట. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో ఈ సినిమా ఈ ఏడాదే రిలీజ్ కానుందట.

మస్తుగున్నవ్ పోరీ...



● రామ్, కావ్యా థాపర్

'కలకత్తా మీఠా పాను లెక్క మస్తు గున్నవ్ గాని పోరీ... మే బగరుకర్తా బాబా జర్దా తట్టుకుంటవ చోరీ...' అంటూ 'మార్ ముంత చోడ్ చింత' పాటకు ఫుల్ ఎనర్జీతో చిందేశారు రామ్. అంతే ఎనర్జిటిక్‌గా ఈ హీరోతో కాలు కదిపారు హీరోయిన్ కావ్యా థాపర్. పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రామ్ హీరోగా నటించిన 'డబుల్ ఇస్మార్ట్'లోని పాట ఇది. పూరి జగన్నాథ్, చార్మీ కౌర్ నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 15న రిలీజ్ కానుంది. మంగళవారం 'డబుల్ ఇస్మార్ట్'లోని 'మార్ ముంత చోడ్ చింత...' పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. 'సిన లెక్క ఉన్న షేపు చూస్తే మల్లా... పిస్స పిస్స అయితాందే నా దిల్లులా... ఏమ్ జేద్దామంటావ్ మరి... మార్ ముంత...' అనే లిరిక్స్‌తో ఈ పాట సాగుతుంది. మణిశర్మ సంగీత సారథ్యంలో కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించిన ఈ పాటను రాహుల్ సిప్లిగంజ్, ధనుంజన్ సీపాన, కీర్తన శర్మ పాడారు. రామ్–పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో వచ్చిన 'ఇస్మార్ట్ శంకర్'కు సీక్వెల్‌గా 'డబుల్ ఇస్మార్ట్' తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే.

ఆ సినిమా రోజులు గుర్తొస్తున్నాయి

– విశ్వక్ సేన్



● సందీప్, హర్ష, విశ్వక్ సేన్, సుప్రజ్, తరుణ్

హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, నువ్వేక్ష, మేఘలేఖ, ఖుష్బూ చౌదరి హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'రోటి కపడా రొమాన్స్'. విక్రమ్ రెడ్డి దర్శకత్వంలో బెక్కెం వేణుగోపాల్, సృజన్ కుమార్ బొజ్జం నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాలోని 'గలీజ్..' సాంగ్ రిలీజ్ ఈవెంట్‌కు అతిథిగా హాజరైన విశ్వక్ సేన్ మాట్లాడుతూ– ''రోటి కపడా రొమాన్స్' టీమ్‌ను చూస్తుంటే నాకు మా 'ఈ నగరానికి ఏమైంది?' సినిమా రోజులు గుర్తొస్తున్నాయి. నిర్మాత బెక్కెం వేణుగోపాల్‌కు ప్రేమకథలపై మంచి జడ్జిమెంట్ ఉంది. ఈ సినిమా విజయం సాధించి, మంచి వసూళ్లను రాబట్టాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ''మంచి ఎమోషనల్ రైడ్ ఫిల్మ్ ఇది'' అన్నారు విక్రమ్ రెడ్డి. ''ఓ కొత్త పాయింట్‌ను యువతకు చెప్పాలని 'రోటి కపడా రొమాన్స్'లాంటి యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ మూవీని తీశాం'' అన్నారు బెక్కెం వేణుగోపాల్. ''ప్రేక్షకులందర్నీ అలరించే సినిమా ఇది'' అన్నారు నిర్మాత సృజన్‌కుమార్. కృష్ణకాంత్ లిరిక్స్ అందించిన ఈ 'గలీజ్' పాటను రాహుల్ సిప్లిగంజ్, పీవీఎన్ఎస్ రోహిత్ పాడారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	52	80,717
నిఫ్టీ ▲	26	24,613

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	18,433	▲	40
డోజోన్స్	40,819	▼	607
ఎఫ్‌టీఎస్ఈ 100	8,165	▼	18
డాక్స్	18,518	▼	73
షాంఘై (శుక్రవారం ముగింపు)	2,976	▲	2
నికాయ్	41,275	▲	84

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	72,932	▲	407
బంగారం (99.5 స్వచ్ఛత)	72,640	▲	405
వెండి (కిలో)	91,835	▲	107

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		83.14	84.16
£	బ్రిటన్ పౌండ్		107.22	109.81
€	యూరో		89.94	92.32
¥	జపాన్ ఎన్ (100)		52.38	53.53
AUS	ఆస్ట్రేలియా డాలర్		55.72	57.67
S$	సింగపూర్ డాలర్		59.50	64.16
SAR	సౌదీ రియాల్		21.40	22.95
UAE D	యూఏఈ దిర్హామ్		21.87	23.66
¥	చైనా యువాన్		10.39	12.46

హల్వా రుచులతో బడ్జెట్ సందడి షురూ..

ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ 'సాంప్రదాయక హల్వా రుచుల' వడ్డింపుతో 2024–25 బడ్జెట్ రూపకల్పన తుదిదశకు చేరింది. లోక్‌సభలో ఆర్థికమంత్రి ఈ నెల 23వ తేదీన మోదీ 3.0 ప్రభుత్వ మొదటి పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న సంగతి తెలిసిందే. నార్త్‌బ్లాక్ బేస్‌మెంట్‌లో బడ్జెట్ పత్రాల రహస్య ముద్రణ ప్రారంభాన్ని పురస్కరించుకుని సాంప్రదాయంగా వస్తున్న హల్వా రుచుల ఆరగింపు కార్యక్రమంలో ఆర్థికమంత్రి పాల్గొని సీనియర్ అధికారులకు స్వీట్స్‌ను అందజేస్తూ ఈ ప్రక్రియలో పాలుపంచుకుంటున్న అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. బడ్జెట్ ముద్రణా ప్రక్రియలో పాల్గొనే అధికారులు అందరూ ఈ హల్వా రుచుల కార్యక్రమం అనంతరం జూలై 23వ తేదీ పార్లమెంట్‌లో ఆర్థికమంత్రి ప్రసంగం పూర్తయ్యే వరకూ బాహ్య ప్రపంచానికి దూరంగా ఉండాల్సి ఉంటుంది. సీతారామన్‌తో పాటు ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి, ఆర్థిక శాఖ కార్యదర్శి టీవీ సోమనాథన్, ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి అజయ్ సేథ్ సహా ఇతర సీనియర్ అధికారులు ఈ వేడుకలో పాల్గొన్నారు.



మార్కెట్ రికార్డుల హ్యాట్రిక్

ఐటీ, ఎఫ్ఎంసీజీ షేర్ల దన్ను ● 24,600 స్థాయిపైకి నిఫ్టీ ● మొహర్రం సందర్భంగా నేడు మార్కెట్లకు సెలవు


ముంబై: స్టాక్ సూచీల రికార్డుల జోరు మూడో రోజూ కొనసాగింది. ఐటీ, ఎఫ్ఎంసీజీ, టెలికం షేర్లు రాణించడంతో పాటు విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్ల అంశాలు కలిసొచ్చాయి. సెన్సెక్స్ 52 పాయింట్లు పెరిగి 80,717 వద్ద ముగిసింది. నిఫ్టీ 26 పాయింట్ల లాభంతో 24,613 వద్ద స్థిరపడింది. ముగింపు స్థాయిలు సూచీలకు సరికొత్త రికార్డు. ఉదయం లాభాలతో మొదలైన సూచీలు..., అధిక వాల్యుయేషన్ల ఆందోళనల తో పరిమిత శ్రేణిలో కదలాడాయి. అయినప్పటికీ..., ఒక దశలో సెన్సెక్స్ 233 పాయింట్లు బలపడి 80,862 వద్ద, నిఫ్టీ 133 పాయింట్లు ఎగసి 24,635 వద్ద జీవితకాల గరిష్టాలు నమోదు చేశాయి. ఫైనాన్షియల్ సర్వీసెస్, యుటిలిటీ, బ్యాంకులు, క్యాపిటల్ గూడ్స్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. వడ్డీరేట్ల తగ్గింపు అంచనాలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు లాభాల బాటపట్టాయి.

- మొహర్రం సందర్భంగా బీఎస్ఈ, ఎన్ఎస్ఈలకు నేడు సెలవు. ట్రేడింగ్ జరగదు. అయితే కమోడిటీ, ఫారెక్స్ మార్కెట్లలో మాత్రం సాయంత్రంసెషన్‌లో ట్రేడింగ్ జరుగుతుంది.

వేదాంతా క్విప్ ధర రూ. 461

వేదాంతా అర్హతగల సంస్థాగత ఇన్వెస్టర్లకు షేర్ల జారీ (క్విప్)కి తెరతీసింది. షేరుకి రూ. 461.26 ఫ్లోర్ ధరలో రూ. 8,500 కోట్లు సమీకరించనుంది. నిధులను రుణ చెల్లింపులు, పెట్టుబడి వ్యయాలకు వినియోగించనుంది. సోమవారం ముగింపు ధర రూ. 459.4తో పోలిస్తే ఫ్లోర్ ధర స్వల్ప ప్రీమియం.

వేదాంతా షేరు బీఎస్ఈలో 1% నీరసించి రూ. 456 వద్ద ముగిసింది.



బజాజ్ ఆటో స్పీడ్

క్యూ1లో రూ. 1,942 కోట్ల లాభం

న్యూఢిల్లీ: ద్విచక్ర, త్రిచక్ర వాహన రంగ దిగ్గజం బజాజ్ ఆటో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) తొలి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 18 శాతం ఎగసి రూ. 1,942 కోట్లను తాకింది. దేశీ విక్రయాలతోపాటు.. ఎగుమతులు ఇందుకు సహకరించాయి. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 1,644 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 10,312 కోట్ల నుంచి రూ. 11,932 కోట్లకు బలపడింది. ఇక స్టాండెలోన్ నికర లాభం 19 శాతం వృద్ధితో రూ. 1,988 కోట్లకు చేరింది. ఈ కాలంలో మొత్తం వాహన విక్రయాలు 7 శాతం అధికమై 11,02,056 యూనిట్లను తాకాయి. వీటిలో దేశీయంగా 8 శాతం వృద్ధితో 6,90,621 వాహనాలు అమ్ముడుపోయాయి. ఎగుమతులు సైతం 7 శాతం మెరుగుపడి 4,11,435 యూనిట్లకు చేరాయి.



సరైన ధరలు: వాహనాలకు ఉత్తమ ధరలు, వ్యయ నియంత్రణలు లాభాల్లో వృద్ధికి దోహదపడినట్లు బజాజ్ ఆటో పేర్కొంది. దీంతో ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన విభాగానికి పెరుగుతున్న డిమాండ్ కారణంగా ఎదురైన ఒత్తిడిని అధిగమించినట్లు తెలియజేసింది. కాగా, అదనపు డైరెక్టర్‌గా సంగీతా రెడ్డిని బోర్డు నియమించినట్లు పేర్కొంది. ఈ నెల 16 నుంచి ఐదేళ్లపాటు బాధ్యతలు నిర్వహిస్తారని వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో బజాజ్ ఆటో షేరు బీఎస్ఈలో 1.3 శాతం బలపడి రూ. 9,805 వద్ద ముగిసింది.

కొత్త యూజర్లలో జియో, ఎయిర్‌టెల్ జోరు

మేలో 34.4 లక్షల కనెక్షన్లు

న్యూఢిల్లీ: కొత్త యూజర్ల విషయంలో రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్ జోరు కొనసాగుతోంది. మే నెలలో రెండు సంస్థలకు కలిపి 34.4 లక్షల కనెక్షన్లు జతయ్యాయి. టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్ మంగళవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం మే నెలలో జియోకి కొత్తగా 21.9 లక్షల మంది యూజర్లు, ఎయిర్‌టెల్‌కి 12.5 లక్షల మంది మొబైల్ కస్టమర్లు జతయ్యారు. జియో మొత్తం సబ్‌స్క్రయిబర్స్ సంఖ్య 47.46 కోట్లకు చేరింది. మరోవైపు, వొడాఫోన్ ఐడియా మరో 9.24 లక్షల మంది యూజర్లను కోల్పోయింది. మేలో 1.2 కోట్ల మంది మొబైల్ నంబర్ పోర్టబిలిటీ (ఎంఎన్‌పీ) కోసం దరఖాస్తు చేసుకున్నట్లు ట్రాయ్ ఒక ప్రకటనలో తెలిపింది. దీంతో ఎంఎన్‌పీని అమల్లోకి తెచ్చినప్పటి నుంచి మే నెలాఖరు వరకు వచ్చిన మొత్తం ఎంఎన్‌పీ అభ్యర్థనల సంఖ్య 98.56 కోట్లకు చేరినట్లు వివరించింది. అటు బ్రాడ్‌బ్యాండ్ సబ్‌స్క్రయిబర్స్ సంఖ్య నెలవారీగా 0.72 శాతం వృద్ధితో 93.5 కోట్లకు చేరింది.

గృహ రుణ వడ్డీపై మినహాయింపు పెంచాలి

హౌసింగ్‌కు దన్నుగా చర్యలు తీసుకోవాలి ● బడ్జెట్‌పై నారెడ్కో వినతులు



అఫోర్డబుల్ గృహాల కొనుగోళ్లు, నిర్మాణానికి ఊతం లభించేలా బడ్జెట్‌లో పన్నులపరమైన మినహాయింపులు ప్రకటించాలని కేంద్రాన్ని బిల్డర్లు కోరుతున్నారు. సొంతంగా ఇంటికోసం తీసుకున్న గృహ రుణాల మీద కట్టే వడ్డీపై పన్ను మినహాయింపు పరిమితిని పెంచాలని రియల్టర్ల సమాఖ్య నారెడ్కో విజ్ఞప్తి చేసింది. ప్రాపర్టీ ధరలు, వడ్డీ రేట్లు పెరిగిపోయిన నేపథ్యంలో ప్రస్తుతం రూ. 2 లక్షలుగా ఉన్న ఈ పరిమితిని రూ. 5 లక్షలకు పెంచాలని కోరింది. స్టాక్ ఇన్ ట్రేడ్‌గా వ్యవహరించే ప్రాపర్టీపై నామమాత్ర ఆదాయాన్ని లెక్కగట్టే వ్యవధిని ప్రస్తుతమున్న రెండేళ్ల నుంచి అయిదేళ్లకు పెంచాలని కోరింది. మార్కెట్‌లో పరిస్థితులు బాగాలేనప్పుడు రియల్ ఎస్టేట్ డెవలపర్లు సాధారణంగానే నిల్వలను అట్టే పెట్టుకుని ఉంచుకోవాల్సి వస్తుంది కాబట్టి, వారికి ఈ విషయంలో వెసులుబాటు ఇవ్వాలని పేర్కొంది. ఈ సిఫార్సులను అమలు చేస్తే డెవలపర్లకు ఊరట లభించడంతో పాటు హౌసింగ్ రంగంలో డిమాండ్‌కి కూడా ఊతం లభించగలదని నారెడ్కో ప్రెసిడెంట్ జి. హరిబాబు తెలిపారు. ఇటు కొనుగోలుదారులకు అటు ఇన్వెస్టర్లకు కూడా పన్నులపరంగా సత్వరం మరిన్ని ప్రయోజనాలను కల్పించాల్సిన అవసరం ఉందని స్టెర్లింగ్ డెవలపర్స్ సీఎండీ రమణి శాస్త్రి తెలిపారు. 'పన్ను రేట్లను తగ్గించడం రూపంలోనో లేక ట్యాక్స్ శ్లాబ్‌లను సర్దుబాటు చేయడం ద్వారానో వ్యక్తిగత పన్నులపరంగా బడ్జెట్‌లో కొంత ఉపశమనం కలిగించాల్సిన అవసరం ఉంది' అని వివరించారు.

వడ్డీ సబ్సిడీ పథకాలతో ప్రోత్సాహం..

రూ. 15–75 లక్షల శ్రేణిలోని ఇళ్లకి డిమాండ్, సరఫరా పెరిగేందుకు ప్రభుత్వం బడ్జెట్‌లో తగు చర్యలు ప్రతిపాదించాలని హౌసింగ్‌డాట్‌కామ్ గ్రూప్ సీఈవో ధ్రువ్ అగర్వాలా తెలిపారు. వడ్డీ సబ్సిడీ పథకాల్లాంటివి ఇస్తే భావి గృహ కొనుగోలుదారులకు ప్రోత్సాహకంగా ఉండగలదని పేర్కొన్నారు. సరఫరాను ప్రభుత్వం దగ్గర విస్తృతంగా ఉన్న స్థలాలను ప్రైవేట్ డెవలపర్లకు కొంత తక్కువ ధరకు ఇవ్వడంతో పాటు తక్కువ వడ్డీ రేట్లపై రుణాలు లభించేలా చర్యలు తీసుకోవడం ద్వారా సరఫరా పుంజుకునేందుకు కేంద్రం తోడ్పడగలదని వివరించారు. ఇలాంటి వాటితో రియల్ ఎస్టేట్ రంగంతో పాటు 200 అనుబంధ పరిశ్రమలు, ఉపాధి కల్పనకు తోడ్పాటు లభించగలదని అగర్వాలా చెప్పారు.



– సాక్షి, బిజినెస్ డెస్క్

పసిడి వెలుగులు

అంతర్జాతీయంగా రికార్డు

న్యూఢిల్లీ/న్యూయార్క్: అంతర్జాతీయ మార్కెట్‌లో పసిడి పరుగులు పెడుతోంది. ఫ్యూచర్స్ మార్కెట్ న్యూయార్క్ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో చురుగ్గా ట్రేడవుతున్న ఆగస్టు కాంట్రాక్ట్ ధర ఈ వార్త రాస్తున్న రాత్రి 9 గంటల సమయంలో ఔన్స్‌కు (31.1గ్రా) ఆల్‌టైమ్ హై 2,469 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. అమెరికా సెంట్రల్ బ్యాంక్ వడ్డీరేట్ల కోత అంచనా, ఈటీఎఫ్‌ల డిమాండ్, డాలర్ స్థిరత్వం వంటి అంశాలు దీనికి కారణం.

ఢిల్లీలో ఐదురోజుల్లో రూ.1,300 అప్

ఇక అంతర్జాతీయ ట్రెండ్‌కు తోడు ఆభరణ వర్తకుల డిమాండ్ నేపథ్యంలో బంగారం ధర దేశ రాజధాని న్యూఢిల్లీలో వరుసగా ఐదవ రోజూ పెరిగింది. పూర్తి స్వచ్ఛత 10 గ్రాముల ధర మంగళవారం రూ.550 పెరిగి రూ.75,700కు చేరింది. గడచిన ఐదు సెషన్లలో రేటు రూ.1,300 పెరిగింది.



హృతిక్ రోషన్‌తో 'జీప్' ప్రచార కార్యక్రమం

హైదరాబాద్: కార్ల తయారీ సంస్థ 'జీప్ ఇండియా' బాలీవుడ్ నటుడు హృతిక్ రోషన్‌తో కలిసి నూతన ప్రచార కార్యక్రమాన్ని చేపట్టింది. దీని ద్వారా జీప్ రాంగ్లర్ అత్యుత్తమ ప్రదర్శన, ఆకర్షణీయ ఫీచర్లను కస్టమర్లకు తెలియజేయనుంది. 'వన్‌అండ్‌ఓన్లీ' ట్యాగ్‌లైన్‌కు తగ్గట్లు సాటిలేని ప్రమాణాలతో వాహనాలను రూపొందిస్తున్నట్లు కంపెనీ తెలిపింది. అత్యుత్తమ స్థాయిని చేరుకోవడమే కాకుండా, ఈ స్థాయిని నిలుపుకునేందుకు నిరంతరం శ్రమిస్తామని జీప్ ఇండియా ప్రకటించింది.



'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

జీవికే పవర్ అండ్ ఇన్‌ఫ్రాపై దివాలా చర్యలు	ఈవీ రంగంలో భారీ ఉపాధి

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

16-7-2024	
విశాఖ	575–00
చిత్తూరు	573–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	555–00
విజయవాడ	555–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	540–00
వరంగల్	542–00
రిటైల్ ధర	6.00

భవిత

ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ — ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ సర్వీసెస్‌లో 450 మెడికల్ ఆఫీసర్ పోస్టులు

ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ సర్వీసెస్ (ఏఎఫ్ఎంఎస్).. షార్ట్ సర్వీస్ కమిషన్ మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 450 (పురుషులు–338, మహిళలు–112).
» అర్హత: ఎంబీబీఎస్, పీజీ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
» వయసు: 31.12.2024 నాటికి ఎంబీబీఎస్ డిగ్రీ అభ్యర్థులకు 30 ఏళ్లు, పీజీ డిగ్రీ అభ్యర్థులకు 35 ఏళ్లు మించకూడదు.
» ఎంపిక విధానం: ఇంటర్వ్యూ, ఫిజికల్, మెడికల్ స్టాండర్డ్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేది: 16.07.2024
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:04.08.2024
» ఇంటర్వ్యూ తేదీ: 28.08.2024 నుంచి ప్రారంభం
» ఇంటర్వ్యూ వేదిక: ఆర్మీ హాస్పిటల్ (ఆర్అర్), ఢిల్లీ కంటోన్మెంట్.
» వెబ్‌సైట్: https://amcsscentry.org

ఐటీబీపీలో 112 హెడ్ కానిస్టేబుల్ పోస్టులు

ఇండో–టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్(ఐటీబీపీ)..గ్రూప్–సి నాన్ గెజిటెడ్(నాన్ మినిస్టీరియల్) విభాగంలో.. హెడ్ కానిస్టేబుల్(ఎడ్యుకేషన్ అండ్ స్ట్రెస్ కౌన్సిలర్) పోస్టుల భర్తీకి పురుషులు, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 112 (పురుషులు–96, మహిళలు–16).
» అర్హత: డిగ్రీ (సైకాలజీ) లేదా ఏదైనా డిగ్రీ, బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఉత్తీర్ణులవ్వాలి.
» వయసు: 05.08.2024 నాటికి 20 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
» వేతనం:నెలకు రూ.25,500 నుంచి రూ.81,100
» ఎంపిక విధానం: ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, రాతపరీక్ష, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్, రివ్యూ మెడికల్ ఎగ్జామ్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 07.07.2024.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 05.08.2024.
» వెబ్‌సైట్: https://itbpolice.nic.in

ఐటీబీపీలో 29 ఎస్ఐ, స్టాఫ్ నర్స్ పోస్టులు

ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్ (ఐటీబీపీ).. దేశవ్యాప్తంగా ఐటీబీపీ కేంద్రాల్లో ఎస్ఐ, ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 29.
» పోస్టుల వివరాలు:సబ్ ఇన్‌స్పెక్టర్(స్టాఫ్ నర్స్)–10,అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఫార్మసిస్ట్)–05, హెడ్ కానిస్టేబుల్ (మిడ్ వైఫ్–మహిళలు)–14.
» అర్హత: పదో తరగతి, 10+2, జీఎన్ఎం, ఏఎన్ఎం, డీఫార్మసీ ఉత్తీర్ణులై ఉండాలి.
» వేతనం: సబ్ ఇన్‌స్పెక్టర్ (స్టాఫ్‌నర్స్)–రూ.35,400 నుంచి రూ.1,12,400; అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్(ఫార్మసిస్ట్)–రూ.29,200 నుంచి రూ.92,300; హెడ్ కానిస్టేబుల్ (మిడ్‌వైఫ్–మహిళలు)–రూ.25,500 నుంచి 81,100.
» వయసు: ఎస్ఐ పోస్టులకు 21 నుంచి 30 ఏళ్లు, ఏఎస్ఐ పోస్టులకు 20 నుంచి 28 ఏళ్లు, హెచ్‌సీ పోస్టులకు 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
» ఎంపిక విధానం: రిక్రూట్‌మెంట్ టెస్ట్, ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్,ప్రాక్టికల్ ఎగ్జామినేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 28.07.2024
» వెబ్‌సైట్: https://itbpolice.nic.in

సెయిల్-బిలాయ్ స్టీల్ ప్లాంట్‌లో 45 పోస్టులు

స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సెయిల్).. బిలాయ్ స్టీల్ ప్లాంట్ (బీఎస్‌పీ)లో ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 45.
» ఎగ్జిక్యూటివ్ పోస్టులు: సీనియర్ మెడికల్ ఆఫీసర్/కన్సల్టెంట్–19.
» విభాగాలు: జనరల్ మెడిసిన్,డెర్మటాలజీ, ఆర్థోపెడిక్స్, ఈఎన్‌టీ, ఆప్తాల్మాలజీ తదితరాలు.
» నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు: మైన్స్ ఫోర్‌మెన్–03, జూనియర్ ఇంజనీరింగ్ అసోసియేట్ (ఎలక్ట్రికల్)–14, టెక్నికల్ అసోసియేట్ (బాయిలర్ ఆపరేషన్)–05.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, బీటెక్ (మైనింగ్/సివిల్), ఎంబీబీఎస్, పీజీ(ఎండీ/ఎంఎస్/డీఎన్‌బీ) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» ఎంపిక విధానం: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 09.07.2024.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 03.08.2024
» వెబ్‌సైట్: https://www.sail.co.in

పీఎన్‌బీలో అప్రెంటీస్‌లకు ఆహ్వానం

» పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో అప్రెంటీస్ నియామకాలు
» మొత్తం 2,700 ఖాళీల భర్తీకి ఈ నెల 28న పరీక్ష
» నెలకు రూ.10 వేలు–15 వేలు స్టయిఫండ్

బ్యాంకింగ్ రంగం.. కొలువులు, నియామకాల పరంగా కళకళలాడే రంగం. ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకులు నిత్యం నియామకాలు చేపడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో బ్యాంకింగ్ రంగంలో కెరీర్ కోరుకునే వారికి అప్రెంటిస్ చక్కటి మార్గం చూపుతోంది. తాజాగా ప్రముఖ ప్రభుత్వ రంగ బ్యాంక్.. పంజాబ్ నేషనల్ బ్యాంక్.. మొత్తం 2,700 అప్రెంటీస్‌ల నియామకానికి త్వరలో ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో.. పీఎన్‌బీ అప్రెంటీస్ ఖాళీలు, ఎంపిక ప్రక్రియ, పరీక్షలో విజయానికి ప్రిపరేషన్ తదితర వివరాలు..



బ్యాంకింగ్ కెరీర్

బ్యాంకింగ్ రంగంలో.. ముఖ్యంగా ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో పని అనుభవం తప్పనిసరిగా మారుతోంది. ఇలాంటి కొలువులు సొంతం చేసుకోవడానికి అప్రెంటీస్‌షిప్ ద్వారా పొందిన అనుభవం ఉపయోగపడుతుంది. కాబట్టి బ్యాంకింగ్ కెరీర్ కోరుకునే వారు అప్రెంటీస్‌షిప్ శిక్షణ పొందడమేలంటున్నారు నిపుణులు.

అప్రెంటీస్ యాక్ట్ మేరకు

పంజాబ్ నేషనల్ బ్యాంకు బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసుకున్న యువతకు శిక్షణ ఇచ్చేందుకు ముందుకొచ్చింది. నేషనల్ అప్రెంటీస్ యాక్ట్–1961కు అనుగుణంగా అప్రెంటీస్‌ల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందుకోసం అభ్యర్థుల ఎంపికకు రాత పరీక్ష నిర్వహించనుంది. ఇందులో విజయం సాధించిన వారికి అప్రెంటీస్‌గా అవకాశం కల్పించి స్టయిపండ్ కూడా అందించనుంది.

మొత్తం 2,700 ఖాళీలు

పీఎన్‌బీ తాజా నోటిఫికేషన్ ప్రకారం–జాతీయ స్థాయిలో మొత్తం 2,700 అప్రెంటీస్‌ల నియామకం చేపట్టనుంది. రాష్ట్రాల వారీగా, ఆయా రాష్ట్రాల్లో జిల్లాల వారీగా అప్రెంటీస్ ఖాళీల సంఖ్యను ప్రకటించింది. తెలుగు రాష్ట్రాల్లో.. ఏపీలో 27, తెలంగాణలో 34 అప్రెంటీస్ ట్రైనీ ఖాళీలు అందుబాటులో ఉన్నాయి.

అర్హతలు

- 2024, జూన్ 30 నాటికి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి.
- వయసు: 2024, జూన్ 30 నాటికి 20–28 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు చొప్పున గరిష్ఠ వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

ఆన్‌లైన్ రాత పరీక్ష

పీఎన్‌బీ అప్రెంటీస్ ట్రైనీ నియామకాలను రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగా ఖరారు చేస్తారు. ఆన్‌లైన్‌లో రాత పరీక్ష ఉంటుంది. రాత పరీక్షలో నాలుగు విభాగాలు (జనరల్/ఫైనాన్షియల్ అవేర్‌నెస్, జనరల్ ఇంగ్లిష్, క్వాంటిటేటివ్ అండ్ రీజనింగ్ ఆప్టిట్యూడ్, కంప్యూటర్ నాలెడ్జ్) ఉంటాయి. ఒక్కో విభాగం నుంచి 25 ప్రశ్నలు చొప్పున అడుగుతారు. మొత్తం నాలుగు విభాగాల నుంచి 100 ప్రశ్నలతో 100 మార్కులకు రాత పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష సమయం ఒక గంట.

ప్రాంతీయ భాష పరీక్ష

పీఎన్‌బీ అప్రెంటీస్ నియామక ప్రక్రియలో భాగంగా అభ్యర్థులు తాము ఎంచుకున్న ప్రాంతీయ భాష పరీక్షలోనూ ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ రాత పరీక్షలో పొందిన మార్కులు, నిర్దేశిత కటాఫ్ ఆధారంగా మెరిట్ జాబితాలో నిలిచిన అభ్యర్థులకు ప్రాంతీయ భాషలో పరీక్ష నిర్వహిస్తారు. ఇందుకోసం అభ్యర్థులు దరఖాస్తు సమయంలోనే తమకు ఆసక్తి ఉన్న ప్రాంతీయ భాషను ఎంచుకోవాలి. నిర్దిష్టంగా ఒక రాష్ట్రంలోని పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఆ రాష్ట్ర భాషలో పరీక్ష రాయాల్సి ఉంటుంది. ప్రాంతీయ భాష పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తేనే.. అప్రెంటీస్ ట్రైనీగా నియామకం ఖరారవుతుంది. నిర్దిష్టంగా ఒక ప్రాంతీయ భాషను ఎంచుకున్న అభ్యర్థులు.. పదో తరగతి, ఇంటర్మీడియెట్ తత్సమాన కోర్సులో సదరు భాషను అభ్యసించి ఉంటే వారికి ప్రాంతీయ భాష పరీక్ష నుంచి మినహాయింపు లభిస్తుంది.

మెడికల్ ఎగ్జామినేషన్

ఆన్‌లైన్ పరీక్ష, అదేవిధంగా ప్రాంతీయ భాష పరీక్షలోనూ ఉత్తీర్ణత సాధించి.. ఫైనల్ మెరిట్ లిస్ట్‌లో నిలిచిన అభ్యర్థులకు మెడికల్ టెస్ట్ నిర్వహించి అప్రెంటీస్ ట్రైనీగా నియామక పత్రం అందిస్తారు.

అప్రెంటీస్ ట్రైనీగా విధులు

అప్రెంటీస్ ట్రైనీగా నియమితులైన అభ్యర్థులు వారికి కేటాయించిన బ్రాంచ్‌లలో ఏడాది పాటు ట్రైనీగా విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. సీనియర్ సిబ్బందికి సహకరించడం, అదేవిధంగా బ్యాంకింగ్ రంగంలో జరిగే కార్యకలాపాలకు సంబంధించిన బాధ్యతలు చేపట్టాల్సి ఉంటుంది. ఏడాది వ్యవధిలో రెండు వారాలు ప్రాథమిక శిక్షణ, 52 వారాలు ఆన్–జాబ్ ట్రైనింగ్ ఉంటుంది.

స్టయిఫండ్

అప్రెంటీస్‌గా నియమితులైన వారికి పీఎన్‌బీ స్టయిఫండ్ అందిస్తుంది. గ్రామీణ/సెమీ అర్బన్ బ్రాంచ్‌లలో నియమితులైన వారికి నెలకు రూ.10 వేలు; అర్బన్ బ్రాంచ్‌లలో నియమితులైన వారికి నెలకు రూ.12 వేలు; మెట్రో బ్రాంచ్‌లలో నియమితులైన వారికి నెలకు రూ.15 వేలు చొప్పున స్టయిఫండ్ ఇస్తారు.

భవిష్యత్ అవకాశాలు

ప్రస్తుతం బ్యాంకులు నియామకాల్లో అనుభవం ఉన్న వారికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి. ప్రధానంగా కోర్ బ్యాంకింగ్ విధుల విషయంలో అనుభవమే ప్రధాన ప్రాతిపదికగా నిలుస్తోంది. ప్రముఖ బ్యాంకులలో అప్రెంటీస్ ట్రైనింగ్‌ను విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి బ్యాంకింగ్ సెక్టార్‌లో కొలువు అందుకోవడం సులభమని చెప్పొచ్చు. కాబట్టి పీఎన్‌బీలో అప్రెంటీస్ ట్రైనీలు భవిష్యత్తులో బ్యాంకింగ్ రంగంలో ఉజ్వల కెరీర్ అవకాశాలు సొంతం చేసుకునే వీలుంది.

ముఖ్య సమాచారం

- ఆన్‌లైన్ రాత పరీక్ష తేదీ: 2024, జూలై 28
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.pnbindia.in/Recruitments.aspx

రాత పరీక్షలో రాణించే మార్గం

అప్రెంటీస్ నియామకాల్లో భాగంగా నాలుగు విభాగాల్లో గంట వ్యవధిలో నిర్వహించే ఆన్‌లైన్ పరీక్షలో విజయానికి అభ్యర్థులు సిలబస్‌కు అనుగుణంగా ప్రిపరేషన్ సాగించాలి.

జనరల్/ఫైనాన్షియల్ అవేర్‌నెస్

ఈ విభాగంలో రాణించాలంటే.. తాజా బ్యాంకింగ్ రంగం పరిణామాలు, విధానాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. బ్యాంకింగ్ రంగంలోని అబ్రివేషన్లు, పదజాలం, విధులు, బ్యాంకులకు సంబంధించిన కొత్త విధానాలు, కోర్ బ్యాంకింగ్‌కు సంబంధించిన చట్టాలు,విధానాలు,రిజర్వ్ బ్యాంకు విధులు వంటి వాటిపై అవగాహన పెంచుకోవాలి. జనరల్ అవేర్‌నెస్‌లో..కరెంట్ అఫైర్స్,స్టాక్ జనరల్ నాలెడ్జ్ కోణంలోనూ..ఆర్థిక సంబంధ వ్యవహారాల(ఎకానమీ, ప్రభుత్వ పథకాలు)కు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్

ఈ విభాగంలో.. ఇడియమ్స్, సెంటెన్స్ కరెక్షన్, వొకాబ్యులరీ, సెంటెన్స్ రీ అరేంజ్‌మెంట్, వన్‌వర్డ్ సబ్‌స్టిట్యూట్స్‌పై పట్టు సాధించాలి. గ్రామర్‌కే పరిమితం కాకుండా.. జనరల్ ఇంగ్లిష్ నైపుణ్యం పెంచుకోవాలి. ఇందుకోసం ఇంగ్లిష్ దినపత్రికలు చదవడం, వాటిలో వినియోగిస్తున్న పదజాలం, వాక్య నిర్మాణం వంటి వాటిపై దృష్టి పెట్టాలి.

రీజనింగ్/క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

ఇందులో అర్థమెటిక్ అంశాల(పర్సంటేజెస్, నిష్పత్తులు,లాభ–నష్టాలు, నంబర్ సిరీస్,బాడ్‌మాస్ నియమాలు)పై పూర్తిగా అవగాహన పొందేలా ప్రాక్టీస్ చేయాలి. వీటితోపాటు డేటా ఇంటర్‌ప్రిటేషన్, డేటా అనాలిసిస్‌లపై ప్రత్యేకంగా దృష్టిపెట్టాలి.

కంప్యూటర్ నాలెడ్జ్

ఈ విభాగంలో రాణించాలంటే.. కంప్యూటర్ ఆపరేషన్ సిస్టమ్స్, కంప్యూటర్ స్ట్రక్చర్, ఇంటర్నెట్ సంబంధిత అంశాలు, పదజాలంపై ఫోకస్ చేయాలి. కీ బోర్డ్ షార్ట్ కట్స్, కంప్యూటర్ హార్డ్‌వేర్ సంబంధిత అంశాల(సీపీయూ, మానిటర్, హార్డ్ డిస్క్ తదితర) గురించి తెలుసుకోవాలి.

కాన్సెప్ట్స్, ప్రాక్టీస్

ఆయా సబ్జెక్ట్‌లలోని కాన్సెప్ట్‌లపై అవగాహన ఏర్పరచుకోవాలి. అదే విధంగా ఐబీపీఎస్ గత ప్రశ్న పత్రాలను సాధన చేయడం ఉపయుక్తంగా ఉంటుంది. దీనివల్ల ప్రశ్నలు అడిగే తీరుపై అవగాహన లభిస్తుంది. ప్రిపరేషన్ సమయంలోనే అభ్యసనంతోపాటు ప్రాక్టీస్‌కు కూడా ప్రాధాన్యం ఇవ్వాలి. దీంతో పరీక్షలో మెరుగైన ప్రతిభ కనబరిచి మెరిట్ లిస్ట్‌లో నిలిచే అవకాశాలు మెరుగవుతాయి.

క్లుప్తంగా...

భారతీయ సాహిత్యంపై అవగాహన పెంచుకోవాలి

సంస్కృత వర్సిటీ వీసీ కృష్ణమూర్తి

తిరుపతి సిటీ: ప్రాచీన భారతీయ సాహిత్యంపై అందరూ అవగాహన పెంచుకోవాలని తిరుపతి జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ జి.ఎస్.ఆర్. కృష్ణమూర్తి సూచించారు. మంగళవారం బెంగళూరు కేంద్రంగా నాక్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ప్యానల్ డిస్కషన్ ఇన్ బైనరీ అక్రిడిటేషన్ రీజనల్ కన్సల్టేటివ్' అనే అంశంపై జరిగిన జాతీయ వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ సంస్కృతం ద్వారా భారతీయ సంస్కృతి, దేశాభివృద్ధి సాధ్యమన్నారు. సంస్కృతం ద్వారా తీసుకురావల్సిన ఆవిష్కరణలపై ఆయన ప్రసంగం కొనసాగింది.

ఏయూ వీసీ రాజీనామా ఆమోదం

సాక్షి, విశాఖపట్నం: ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొ.పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి రాజీనామాను గవర్నర్ ఆమోదించారు. మూడేళ్ల పదవి కాలం ఉన్నా.. టీడీపీ నేతలు రాజకీయ ఒత్తిళ్లు తీసుకురావడంతో ఇటీవలే రాజీనామా చేశారు. దీన్ని తక్షణమే ఆమోదించాలని సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు పంపించారు. పరిశీలన అనంతరం గవర్నర్ అబ్దుల్ నజీర్ మంగళవారం ప్రసాదరెడ్డి రాజీనామాను ఆమోదించారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా వివిధ విశ్వవిద్యాలయాల్లో వీసీలు మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. వీరందరి రాజీనామాల్ని గవర్నర్ ఆమోదించారు.

ఆరోగ్య వర్సిటీ వీసీగా నరసింహం

సాక్షి, అమరావతి: ఆరోగ్య విశ్వవిద్యాలయం వీసీగా డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) డీవీఎస్ఎల్ నరసింహానికి పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) అప్పగించారు. వీసీ పదవికి బాబ్జీ రాజీనామా చేయడంతో డీఎంఈకి ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగించాలని గవర్నర్ ఆదేశించారు. దీంతో ఎఫ్ఏసీ బాధ్యతల్ని ఆయనకు అప్పగిస్తూ మంగళవారం వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు.

ముగిసిన పాలిసెట్ కౌన్సెలింగ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పాలిసెట్-2024 తుది దశ కౌన్సెలింగ్ మంగళవారంతో ముగిసినట్లు సాంకేతిక విద్యా శాఖ డైరెక్టర్ బి.నవ్య తెలిపారు. ప్రభుత్వ,ప్రైవేట్ కళాశాలల్లో 46 శాతం కన్వీనర్ కోటా సీట్లు భర్తీ చేసినట్లు పేర్కొన్నారు. 262 విద్యాసంస్థల్లో 81,420 సీట్లు ఉండగా, 37,036 సీట్లను విద్యార్థులకు కేటాయించామన్నారు. 88 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో 17,943 సీట్లు ఉండగా 11,042 సీట్లు (62%), 174 ప్రైవేట్ కళాశాలల్లో 63,477 సీట్లు ఉండగా 25,994 సీట్లు (41%) భర్తీ చేసినట్లు వివరించారు. జూలై 20లోగా కళాశాలల్లో రిపోర్ట్ చేయాలని సూచించారు.

నవోదయ ప్రవేశాలకు నోటిఫికేషన్

సాక్షి, అమరావతి: జవహర్ నవోదయ విద్యాలయాల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ తరగతిలో ప్రవేశాల కోసం నిర్వహించే ప్రవేశ పరీక్షకు సెప్టెంబర్ 16వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. 2024-25 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాసేందుకు అర్హులు. పూర్తి వివరాలకు https:// navodaya.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

సమగ్ర శిక్షా ఉద్యోగులకు వేతనాల విడుదల

సాక్షి, అమరావతి: సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో పనిచేస్తోన్న కేజీబీవీ టీచర్లు, సీఆర్పీలు, కంప్యూటర్ ఆపరేటర్లు తదితర ఉద్యోగులకు మే, జూన్ నెలల వేతనాలు రూ.122.23 కోట్లు విడుదల చేసినట్లు సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. జిల్లాల్లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది జీతాల కోసం రూ.105.20 కోట్లు విడుదల చేయగా, రూ.17.02 కోట్లు కేజీబీవీల్లో విద్యార్థినుల భోజన నిర్వహణ ఖర్చుల నిమిత్తం కేటాయించినట్లు పేర్కొన్నారు.

అంబేడ్కర్ వర్సిటీ ఫీజు ఆగస్టు 18లోపు చెల్లించాలి

సాక్షి, అమరావతి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో డిగ్రీ, పీజీ కోర్సులను అభ్యసిస్తున్న ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు ఆగస్టు 18లోగా ట్యూషన్ ఫీజు చెల్లించాలని వర్సిటీ అభ్యాసక సహాయ సేవ విభాగం డైరెక్టర్ ఎల్.విజయకృష్ణారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వర్సిటీ పోర్టల్ www.braouonlin.in, వెబ్‌సైట్ www.braou.ac.inలోని అడ్మిషన్ లింక్‌పై క్లిక్ చేసి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసిన అనంతరం ఆ పత్రాన్ని ప్రింట్ తీసుకుని దానిపై తొమ్మిది అంకెల సంఖ్య ఆధారంగా ఫీజులు చెల్లించాలని పేర్కొన్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిన వెంటనే డిగ్రీ, పీజీ ప్రవేశాలకు వారంలోగా నోటిఫికేషన్ విడుదల చేస్తామని తెలిపారు.

ఆంధ్రా టు పారిస్.. ఆడుదాం ఒలింపిక్స్



- విశ్వ క్రీడల్లో సత్తా చాటేందుకు సిద్ధమైన రాష్ట్ర క్రీడాకారులు
- ఈ ఏడాది వివిధ అంశాల్లో ఏపీ నుంచి ఏడుగురు ప్రాతినిధ్యం
- కొత్తగా ఐదుగురికి దక్కిన అవకాశం
- గడిచిన ఐదేళ్లలో రాష్ట్రంలో పెరిగిన క్రీడా ప్రమాణాలు

విజయవాడ స్పోర్ట్స్: ప్రతిష్టాత్మకమైన ఒలింపిక్స్‌లో సత్తాచాటేందుకు ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులు సమాయత్తమవుతున్నారు. ఈ నెల 26 నుంచి పారిస్‌లో ప్రారంభమయ్యే ఈ క్రీడల్లో పాల్గొనే భారత జట్లను భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) ఇటీవలే ప్రకటించింది. ఒలింపిక్స్‌లో జరిగే 32 క్రీడా పోటీలకుగానూ భారత్ నుంచి 16 క్రీడలకు ప్రాతినిధ్యం వహించే 113 మంది సభ్యుల జాబితాను ఐఓఏ ఇటీవల వెల్లడించింది. వీరిలో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులు ఏడుగురు చోటు దక్కించుకుని రాష్ట్ర క్రీడా ప్రతిష్టను దేశానికి చాటారు. రియో, టోక్యో ఒలింపిక్ క్రీడల్లో సత్తా చాటి పతకాలు సాధించిన స్టార్ షట్లర్ పీవీ సింధు ఈ ఏడాది ఒలింపిక్స్ క్రీడల్లోనూ సత్తా చాటనుంది. పతాకధారిగా భారత జట్లను ముందుండి నడిపించే బాధ్యతను సింధుకు భారత ప్రభుత్వం అప్పగించింది. సింధుతో పాటు బ్యాడ్మింటన్ క్రీడాకారుడు రంకిరెడ్డి సాత్విక్ సాయిమహారాజ్, రికర్వ్ ఆర్చర్ బొమ్మదేవర ధీరజ్, అథ్లెట్లు యర్రాజి జ్యోతి, దండి జ్యోతికశ్రీ, పారా రోవర్ కె.నారాయణ, పారా సైక్లింగ్ చాంపియన్ షేక్ అర్షద్ ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. పారిస్ వాతావరణాన్ని అలవాటు చేసుకునేందుకు ఇప్పటికే కొందరు క్రీడాకారులు ఆ దేశానికి చేరుకున్నారు.

రాష్ట్రంలో పెరిగిన క్రీడా ప్రమాణాలు

గడిచిన ఐదేళ్లలో రాష్ట్ర యువతలో క్రీడా ప్రమాణాలు పెరిగాయనడానికి ప్రపంచ అత్యున్నత క్రీడా సంబరం ఒలింపిక్స్‌కు గతం కంటే రెట్టింపు సంఖ్యలో ఎంపికైన క్రీడాకారులే ప్రత్యక్ష సాక్షిగా నిలుస్తున్నారు. 2016లో జరిగిన రియో ఒలింపిక్స్‌కు ఆంధ్రప్రదేశ్ నుంచి సింధు (బ్యాడ్మింటన్), శ్రీకాంత్ (బ్యాడ్మింటన్), రజిని (హాకీ) ఎంపికయ్యారు. 2020 టోక్యో ఒలింపిక్స్‌కు సింధు (బ్యాడ్మింటన్), సాత్విక్ సాయిరాజ్ (బ్యాడ్మింటన్), రజిని (హాకీ) ఎంపికయ్యారు. అయితే ఈ దఫా జరిగే ఒలింపిక్స్‌కు ఎంపికైన ఏడుగురు క్రీడాకారుల్లో ఐదుగురు కొత్త వారు ఉన్నారు. ఒలింపిక్స్ క్రీడల్లో ఎలాగైనా పతకం సాధించాలనే కసితో అథ్లెట్‌లు జ్యోతికశ్రీ, జ్యోతి, ఆర్చర్ ధీరజ్, పారా ఒలింపిక్స్ క్రీడాకారులు నారాయణ, అర్షద్ గత నాలుగేళ్లుగా కఠోర శిక్షణ తీసుకున్నారు. 2019 నుంచి 2024 మధ్య కాలంలో రాష్ట్రానికి చెందిన ప్రపంచ స్థాయి క్రీడాకారులు సింధు, ఆర్చరీ క్రీడాకారిణి జ్యోతి సురేఖ, హాకీ క్రీడాకారిణి రజిని, సాత్విక్ సాయిరాజ్‌తో పాటు పలువురిని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా సన్మానించి, నగదు ప్రోత్సాహకాలు ఇచ్చారు. అంతేగాక అకాడమీ ఏర్పాటుకు భూములను కేటాయించారు. దీంతో జ్యోతి సురేఖకు ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చారు. అప్పటి రాష్ట్ర ప్రభుత్వ చొరవ, క్రీడాకారులకు లభిస్తున్న భరోసాతో క్రీడల పట్ల ఆసక్తి పెంచుకున్న యువత ఇప్పుడు ఏకంగా ఒలింపిక్స్ తలుపులు తడుతున్నారు.

స్టార్ షట్లర్ పూసర్ల వెంకట సింధు

అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి, స్టార్ షట్లర్ పూసర్ల వెంకట సింధు విజయవాడ వాసి. ఇప్పటి వరకు రెండు ఒలింపిక్ మెడల్స్ (రియో, టోక్యో)ను కైవసం చేసుకుంది. 2017లో ప్రపంచంలో రెండో ర్యాంక్ సాధించిన ఆమె ప్రస్తుతం 11వ ర్యాంక్‌లో కొనసాగుతోంది. ఏషియన్ గేమ్స్‌లో రెండు, కామన్వెల్త్‌లో మూడు, బ్యాడ్మింటన్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఐదు పతకాలు సాధించింది. ఇప్పటి వరకు మొత్తం 454 మ్యాచ్‌లు ఆడింది. 2020లో పద్మభూషణ్, 2016లో మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న, 2015లో పద్మశ్రీ, 2013లో అర్జున అవార్డులతో భారత ప్రభుత్వం ఆమెను సత్కరించింది.

దండి జ్యోతికశ్రీ

పశ్చిమ గోదావరి జిల్లా తణుకుకు చెందిన దండి జ్యోతికశ్రీ ఈ ఏడాది అథ్లెటిక్స్ 4(X)400 రిలే ఈవెంట్‌కు ప్రాతినిధ్యం వహించనుంది. ఇప్పటి వరకు ఆమె రెండు అంతర్జాతీయ పతకాలు, ఆరు జాతీయ పతకాలు సాధించింది. ఒలింపిక్స్ భారత జట్టుకు జరిగిన పోటీల్లో విశేష క్రీడా నైపుణ్యం ప్రదర్శించి పారిస్‌కు పయనమైంది.

షేక్ అర్షద్



నంద్యాల జిల్లాకు చెందిన షేక్ అర్షద్ పారా సైక్లింగ్ చాంపియన్‌గా అవతరించాడు. ఇప్పటి వరకు జరిగిన పారా సైక్లింగ్ ఆసియా కప్ పోటీల్లో ఒక పతకం, అంతర్జాతీయ పోటీల్లో రెండు పతకాలు కైవసం చేసుకున్నాడు. మరి కొన్ని రోజుల్లో జరిగే ఒలింపిక్స్‌లో తన సత్తా చాటేందుకు పారిస్‌కు పయనమవుతున్నాడు.

రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్



ఉమ్మడి తూర్పుగోదావరికి చెందిన సాత్విక్ బ్యాడ్మింటన్ పురుషుల డబుల్స్‌కు ఎంపికయ్యాడు. ఇప్పటి వరకు ఆసియా కప్ పోటీల్లో మూడు, కామన్వెల్త్‌లో రెండు, బ్యాడ్మింటన్ ప్రపంచ పోటీల్లో ఒకటి, థామస్ కప్ పోటీల్లో ఒక పతకం సాధించాడు. 2015 నుంచి 2019 వరకు జరిగిన 10 అంతర్జాతీయ బ్యాడ్మింటన్ సిరీస్‌లలో తలపడి టైటిల్స్ సాధించాడు. భారత ప్రభుత్వం అతన్ని మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న, అర్జున అవార్డ్‌లతో సత్కరించింది.

బొమ్మదేవర ధీరజ్



విజయవాడకు చెందిన బొమ్మదేవర ధీరజ్ తన ఆరో ఏట నుంచే రికర్వ్ ఆర్చరీలో శిక్షణ పొందుతున్నాడు. ప్రస్తుతం ప్రపంచ 15వ ర్యాంక్, ఆసియాలో నాలుగో ర్యాంక్, ఇండియాలో నంబర్-1 ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. త్వరలో జరిగే ఒలింపిక్స్ పోటీల్లో రికర్వ్ ఆర్చరీ పురుషుల వ్యక్తిగత విభాగంలో, టీం విభాగంలో పోటీపడేందుకు సిద్ధమవుతున్నాడు. ఇప్పటి వరకు ఆసియా కప్ పోటీల్లో ఒక పతకం, అంతర్జాతీయ పోటీల్లో నాలుగు, జాతీయ పోటీల్లో నాలుగు పతకాలు సాధించాడు.

యర్రాజి జ్యోతి



విశాఖపట్నానికి చెందిన యర్రాజి జ్యోతి అథ్లెటిక్స్ 100 మీటర్ల హర్డిల్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించనుంది. ఇప్పటి వరకు ఆమె ఆసియా, అంతర్జాతీయ పోటీల్లో 10 పతకాలు, రెండు కామన్వెల్త్ పతకాలు, ప్రపంచ విశ్వవిద్యాలయాల పోటీల్లో ఒక పతకం, జాతీయ పోటీల్లో పది పతకాలు సాధించింది.

కె.నారాయణ



కర్నూలుకు చెందిన కె.నారాయణ పారా ఒలింపిక్స్‌లో పారా రోవర్‌గా క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించేందుకు సిద్ధమయ్యాడు. ఇప్పటి వరకు అనేక జాతీయ, అంతర్జాతీయ పారా రోయింగ్ పోటీల్లో అద్భుతమైన క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించాడు. ఇప్పటి వరకు ఆరు అంతర్జాతీయ పతకాలు, నాలుగు జాతీయ పతకాలు సాధించాడు.

కేసు మెరిట్స్‌లోకి ఎలా వెళ్తారు?

▶ మొదటి పేజీ తరువాయి

న్యాయమూర్తిని (ఛైర్మన్‌గా) భర్తీ చేయడానికి అవకాశం ఇస్తున్నాం. న్యాయం జరిగేలా చూడాలి. ఇది విచారణ కమిషన్' అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వంలో 'విద్యుత్' అంశాలపై విచారణ కోసం ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు నియమించిన కమిషన్‌ను రద్దు చేయాలంటూ సుప్రీంకోర్టులో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. మంగళవారం దీనిపై చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పార్డీ వాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. తొలుత కేసీఆర్ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి వాదనలు వినిపిస్తూ.. కమిషన్‌పై హైకోర్టులో కేసీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌ను తొలిరోజే కనీసం వాదనలు కూడా వినకుండా ఎలా కొట్టివేసిందని ప్రశ్నించారు. ఇందులో రాజకీయ కక్ష సాధింపు స్పష్టంగా కనిపిస్తోందని ఆరోపించారు. ఈ సమయంలో చీఫ్ జస్టిస్ స్పందిస్తూ.. 'అది ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఓ పద్ధతి ప్రకారం జరుగుతున్న విచారణ మాత్రమేనని, దానికి న్యాయపరమైన అధికారం లేదు కదా' అని పేర్కొన్నారు. దీనికి ముకుల్ రోహత్గి సమాధానమిస్తూ.. 'రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణలో తీవ్ర విద్యుత్ కొరత ఏర్పడింది. దాంతో ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర కమిషన్‌తో తెలంగాణ రాష్ట్ర కమిషన్‌కు విద్యుత్ కొనుగోలు ఒప్పందం జరిగింది. బీఆర్ఎస్ హయాంలో తక్కువ ధరకే విద్యుత్ కొనుగోళ్లు చేసినట్టు నిరూపిస్తాం. అయినా విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలోని కమిషన్ దోషిగా నిర్ధారించినప్పటికీ అది పరిగణనలోకి రాదు' అని పేర్కొన్నారు. దీనిపై చీఫ్ జస్టిస్ స్పందిస్తూ.. కమిషన్ విషయంలో పలు అభ్యంతరాలు ఉన్నాయని అన్నారు.

నోటీసులపై మాజీ సీఎం సవాల్ చేయలేదు

ప్రభుత్వం తరఫు న్యాయవాది సింఘ్వి వివరణ ఇస్తూ.. "కమిషన్ నియామక డాక్యుమెంటులో.. విశ్రాంత న్యాయమూర్తి నియామకం నేపథ్యంలో జ్యుడీషియల్ అనే పదం పొరపాటుగా వాడారు. కానీ కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ చట్టం పరిధిలోకి వస్తుంది" అని తెలిపారు. దీనిపై కేసీఆర్ తరఫు న్యాయవాది రోహత్గీ స్పందిస్తూ.. "పవర్ పర్చేజీ అంశాన్ని ఇప్పటికే ట్రిబ్యునళ్లు పరిశీలిస్తున్నాయి. అక్కడ పెండింగ్‌లో ఉన్న అంశాలపై కమిషన్ ఎలా నియమిస్తారు. ట్రిబ్యునళ్ల కన్నా ఓ విశ్రాంత న్యాయమూర్తికి ఎక్కువ అధికారాలు ఎలా ఉంటాయి?" అని ప్రశ్నించారు. ఈ సమయంలో చీఫ్ జస్టిస్ కల్పించుకుంటూ.. "కమిషన్ చైర్మన్ మీడియా సమావేశంలో కేసు మెరిట్స్‌పై అభిప్రాయాలు వెల్లడించినట్టు ఉంది కదా?" అని ప్రభుత్వం తరఫు న్యాయవాదులను ప్రశ్నించారు. దీంతో సింఘ్వి స్పందిస్తూ.. "ప్రభుత్వం మార్చి 14న కమిషన్‌ను నియమించింది. తమ విచారణ సందర్భంగా ఏం జరిగిందనేది తెలుపుతూ.. పలువురితోపాటు మాజీ సీఎం కేసీఆర్‌కు కమిషన్ ఏప్రిల్‌లో నోటీసులు జారీ చేసింది. అయితే మాజీ సీఎం వాటిని సవాల్ చేయకుండా, ఎన్నికల్లో బిజీగా ఉన్నానంటూ జూన్ చివరి వరకూ సమయం అడిగారు" అని వివరించారు.



జస్టిస్ నరసింహారెడ్డి

బాధ్యతల నుంచి తప్పుకుంటున్నా..

విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు చేసిన సూచనల విషయం తెలిసిన జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి.. 'విద్యుత్' కమిషన్ బాధ్యతల నుంచి తప్పుకొంటున్నట్టుగా కోర్టుకు లేఖ రాశారు. భోజన విరామం అనంతరం సీనియర్ న్యాయవాది గోపాల్ శంకర్‌నారాయణ్ ఈ విషయాన్ని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. దీంతో కమిషన్ నూతన న్యాయమూర్తిగా ఎవరిని నియమిస్తున్నారని ధర్మాసనం ప్రశ్నించగా.. సోమవారం నాటికి కోర్టుకు చెబుతామని ప్రభుత్వం తరఫు న్యాయవాది సింఘ్వి తెలిపారు. దీనితో పిటిషన్‌పై విచారణ ముగిస్తున్నట్టు సీజేఐ ప్రకటించారు. కాగా, 'ఒక న్యాయమూర్తి లేదా విశ్రాంత న్యాయమూర్తి పక్షపాతంగా వ్యవహరించబోరని స్పష్టంగా చెప్పొచ్చు. ఆరోపణల నేపథ్యంలో న్యాయ వ్యవస్థ ప్రతిష్టను నిలబెట్టడానికి కమిషన్ నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నా' అని జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి సుప్రీంకోర్టుకు రాసిన లేఖలో పేర్కొన్నారు.

అటల్ టింకరింగ్ ల్యాబ్స్ బాగున్నాయ్

కశ్మీర్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల విద్యాశాఖ ప్రతినిధుల కితాబు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో అటల్ టింకరింగ్ ల్యాబ్స్, వాటి నిర్వహణ, విద్యార్థులకు నేర్పించే తీరు బాగున్నాయని జమ్మూ కశ్మీర్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల విద్యాశాఖ, సమగ్ర శిక్షా, యూనిసెఫ్ ప్రతినిధులు కితాబిచ్చారు. రెండు రోజుల ఏపీ పర్యటన కోసం సోమవారం కృష్ణాజిల్లా, పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సందర్శించగా, మంగళవారం మొవ్వ ఎస్ఎంకే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హబ్ అటల్ టింకరింగ్ ల్యాబ్, రెడ్డిగూడెంలోని ఏపీ మోడల్ స్కూల్‌ను సందర్శించారు. ల్యాబ్ పనితీరు, విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు పరిశీలించి మెచ్చుకున్నారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. అటల్ ల్యాబ్స్ ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం అలవర్చడమే కాకుండా జీవన నైపుణ్యాలను కూడా నేర్పిస్తున్నామని తెలిపారు. పర్యటన ముగింపు సందర్భంగా కశ్మీర్, ఛత్తీస్‌గఢ్ విద్యాశాఖ అధికారులను ఎస్పీడీ సత్కరించారు.



కశ్మీర్, ఛత్తీస్‌గఢ్ ప్రతినిధులను సత్కరిస్తున్న ఎస్పీడీ శ్రీనివాసరావు

భారతీయ భాషల్లో యూజీ పుస్తకాలు

- వచ్చే ఐదేళ్లలో 22 భాషల్లో 22 వేల పుస్తకాలు అందుబాటులోకి..
- యూజీసీ 'అస్మిత' వర్క్‌షాప్‌ను ప్రారంభించిన కేంద్రం

సాక్షి, అమరావతి: ఉన్నత విద్యలో భారతీయ భాషలను ప్రోత్సహించేందుకు కేంద్ర విద్యా శాఖ, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ), భారతీయ భాషా సమితి సంయుక్త ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టాయి. భారతీయ భాషల్లో అండర్ గ్రాడ్యుయేషన్(యూజీ) పాఠ్య పుస్తకాల రూపకల్పన కోసం ఏర్పాటు చేసిన వైస్ చాన్సలర్ల వర్క్‌షాప్‌ను మంగళవారం ఢిల్లీలో కేంద్ర విద్యా శాఖ మంత్రి డాక్టర్ సుకాంత మజుందార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి, యూజీసీ చైర్మన్ ఎం.జగదీష్‌కుమార్ మాట్లాడుతూ.. 'ఆగ్మెంటింగ్ స్టడీ మెటీరియల్స్ ఇన్ ఇండియన్ లాంగ్వేజెస్ త్రూ ట్రాన్స్‌లేషన్ అండ్ అకడమిక్ రైటింగ్(అస్మిత)' ప్రాజెక్టులో భాగంగా వచ్చే ఐదేళ్లలో 22 భారతీయ భాషల్లో 22 వేల అండర్ గ్రాడ్యుయేషన్(యూజీ) పాఠ్య పుస్తకాలను తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. దేశంలోని 13 నోడల్ విశ్వవిద్యాలయాల సహకారంతో వచ్చే జూన్ నాటికి 12 భాషల్లో 1,800 పాఠ్యపుస్తకాలను అందుబాటులోకి తెస్తామన్నారు. అన్ని భారతీయ భాషల్లోని పదాలకు అర్థాలను తెలిపే 'బహుభాషా శబ్దకోశ్'ను కూడా అందుబాటులోకి తెచ్చామన్నారు. కాగా, 13 నోడల్ విశ్వవిద్యాలయాలు తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ, అస్సామీ, బెంగాలీ, గుజరాతీ, మరాఠీ, ఒడియా, పంజాబీ, ఉర్దూ భాషలపై దృష్టి సారించి పుస్తకాల రూపకల్పనకు సహరించనున్నాయి.

'గురుకులం' అస్వస్థత ఘటనపై జేసీ విచారణ



అధికారులతో మాట్లాడుతున్న జేసీ ధ్యానచంద్ర

నాయుడుపేట టౌన్ (తిరుపతి జిల్లా): నాయుడుపేట పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకులంలో కలుషిత ఆహారం తిని విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురైన ఘటనలో బాధ్యులెవరనేది తేల్చనున్నారు. ఈ మేరకు తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర మంగళవారం విచారణ చేపట్టారు. జేసీతో పాటు గురుకులాల జిల్లా కో-ఆర్డినేటర్ పద్మజ, సూళ్లూరుపేట ఆర్డీఓ చంద్రముని తదితర అధికారులతో కలసి గురుకులంలో విద్యార్థులు నిద్రపోయే గదులు, వంట గది, తదితర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు.ప్రిన్సిపాల్ దాదాపీర్, వార్డెన్ విజయభాస్కర్, ఉపాధ్యాయులు, వంట చేసే మహిళలతో మాట్లాడి ఘటనకు గల కారణాలపై విశ్లేషించారు. కొంతమంది విద్యార్థుల తల్లిదండ్రులు చెప్పిన సమస్యలను విన్నారు. నాయుడుపేట గురుకులంలో తిరిగి యథావిధిగా విద్యార్థులకు తరగతులను నిర్వహించడంతో పాటు అన్ని వసతులను కల్పించేలా చర్యలు చేపడుతున్నామని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనలు చెందాల్సిన అవసరం లేదని జేసీ భరోసా కల్పించారు.


చిల్లకూరు గురుకుల విద్యార్థికి అస్వస్థత

గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలింపు

చిల్లకూరు(తిరుపతి జిల్లా): తిరుపతి జిల్లా చిల్లకూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థి తీవ్ర అస్వస్థతకు గురైన సంఘటన మంగళవారం జరిగింది. వివరాల్లోకి వెళితే... డక్కిలి మండలం నడింపల్లికి చెందిన విశాల్ చిల్లకూరులోని గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఉదయం కడుపు నొప్పి, విరేచనాలతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన గురుకుల సిబ్బంది విద్యార్థి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి.. వెంటనే గూడూరు ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స అనంతరం విద్యార్థి పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు స్పష్టం చేశారు. కాగా, గురుకుల పాఠశాలల విద్యార్థులు ఇటీవల పలు చోట్ల తీవ్ర అస్వస్థతతో ఆస్పత్రుల పాలుకావడంపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

టెట్ దరఖాస్తులో తప్పులు చేయొద్దు

పాఠశాల విద్య డైరెక్టర్ విజయరామరాజు



సాక్షి, అమరావతి: ఏపీ టెట్ (జూలై)-2024కు దరఖాస్తు చేసే ప్రక్రియలో అభ్యర్థులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పాఠశాల విద్య డైరెక్టర్ విజయరామరాజు మంగళవారం ఓ ప్రకటనలో సూచించారు. దరఖాస్తు చేసేందుకు https:// aptet.apcfss.inలో మాత్రమే లాగిన్ అవ్వాలని, సమాచార బుక్‌లెట్‌ను పూర్తిగా చదివాలన్నారు. అభ్యర్థికి కేటాయించిన ఐడీతో క్యాండిడేట్ లాగిన్‌లోకి వెళ్లి దరఖాస్తులోని అన్ని వివరాలను నమోదు చేయాలని, దరఖాస్తు ప్రివ్యూ మరోసారి పరిశీలించిన తరువాతే సబ్మిట్ చేయాలని సూచించారు. అభ్యర్థులకు ఏమైనా సందేహాలు ఉంటే 9505619127, 8121947387, 8125046997, 9398822554, 7995649286, 7995789286, 9963069286, 9398810958, 9398822618 నంబర్లలో సంప్రదించాలని, లేదా grivances.tet.@apschooledu.inకి మెయిల్ చేసి కూడా సమాచారం తెలుసుకోవచ్చన్నారు. ఒకవేళ దరఖాస్తు నింపే క్రమంలో తప్పులు ఉంటే అభ్యర్థులు లాగిన్‌లో డిలీట్ ఆప్షన్ ఉపయోగించుకుని తిరిగి దరఖాస్తు చేయాలని విజ్ఞప్తి చేశారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

టిప్పర్ల వేగానికి కళ్లెం ఏదీ?

- ఏటా పెరుగుతున్న ప్రమాదాల సంఖ్య
- వందలాది మంది మరణిస్తున్న వైనం
- ఎక్కువ రోడ్డు ప్రమాదాల జిల్లాగా పేరు


బారులు తీరిన ఇనుప ఖనిజ యమకింకర టిప్పర్లు


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మూగజీవాలు

సాక్షి, బళ్లారి: అపారమైన ఇనుప ఖనిజ నిల్వలు, దేశంలోనే పేరొందిన అతి పెద్ద జిందాల్ స్టీల్ ఇండస్ట్రీ తదితరాలతో బళ్లారి జిల్లా ప్రముఖ వ్యాపార కేంద్రమే కాకుండా జిల్లాలో రోజురోజుకు వాహనాల సంచారం పెరుగుతోంది. ఈక్రమంలో జిల్లాలో ఏటేటా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందుతున్న వారి సంఖ్య పెరుగుతుండటం ఆందోళన కల్గిస్తోంది. ఉమ్మడి జిల్లాలో పెద్ద ఎత్తున ఇనుప ఖనిజ నిల్వలుండటం వల్ల సహజంగానే బళ్లారి జిల్లా మీదుగా టిప్పర్లు, లారీల ద్వారా భారీగా ఇనుప ఖనిజ రవాణా సాగుతోంది. ప్రతి రోజు అతి వేగంతో వెళ్లే సుమారు రెండు వేల టిప్పర్లు, లారీలు, ఇతర వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు ఇప్పటికే బళ్లారి నగరంతో పాటు సండూరు, తోరణగల్లు, సిరుగుప్పలలో ఇటీవల జిల్లా పోలీసులు అత్యాధునిక పరిజ్ఞానంతో కూడిన లేజర్ స్పీడ్ డిటెక్టర్ యంత్రాలను ఏర్పాటు చేశారు.

గత రెండేళ్లలో 340 మంది మృతి

ఇనుప ఖనిజ వాహనాలతో పాటు నగరంలో రోజురోజుకు పెరుగుతున్న వాహనాల వల్ల రోడ్డు ప్రమాదాల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. గత రెండేళ్లుగా పోలీసు అధికారుల లెక్కల ప్రకారమే దాదాపు 340 మంది రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందడం గమనార్హం. రాష్ట్ర, జాతీయ రహదారుల్లో కూడా డ్రైవర్లు అతివేగంతో వాహనాలను నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయి. జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు పోలీసులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నా మద్యం తాగి వాహనాలను నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. జిల్లాలో జాతీయ రహదారి పనులు ఎన్నో ఏళ్లుగా పూర్తి చేయకపోవడం కూడా రోడ్డు ప్రమాదాలకు ఒక కారణంగా భావిస్తున్నారు.

ప్రజలతో పాటు మూగజీవాలూ బలి

కుడితిని నుంచి బళ్లారి మధ్యన, తోరణగల్లు నుంచి హొసపేటె మధ్యన, సండూరు నుంచి తోరణగల్లు మధ్య రహదారుల్లో పెద్ద సంఖ్యల్లో రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందుతున్నారు. బళ్లారి నగరంలో కూడా వాహనాలు విపరీతమైన వేగంతో సంచరిస్తుండటం వల్ల మూగజీవాలు కూడా రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందుతున్నాయి. ఇటీవల జిందాల్ కంపెనీకి చెందిన బస్సు బసవేశ్వర నగర్ మార్కెట్ వద్ద జనం అందరూ చూస్తుండగానే వేగంగా వచ్చి మూగజీవాలపైకి దూసుకెళ్లడంతో అక్కడికక్కడే ఆవు దూడ తీవ్రంగా గాయపడి మృతి చెందింది. ఇక పశువులతో పాటు పెద్ద సంఖ్యలో కుక్కలు రోడ్లలో ప్రమాదాలకు గురై మృతి చెందుతున్నాయి.

ట్రాఫిక్ కట్టడికి గట్టి చర్యలు శూన్యం

జిల్లా వ్యాప్తంగా రోజు రోజుకు పెరుగుతున్న వాహన రాకపోకల వల్ల వందలాది మంది మృతి చెందుతుండటంతో పాటు రోడ్డు ప్రమాదాల్లో గాయపడి దివ్యాంగులుగా మారిన వారి సంఖ్య కోకొల్లలు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నియంత్రిస్తామని పోలీసు అధికారులు, జిల్లా యంత్రాంగం గట్టి హామీలను ఇస్తున్నారే కానీ పూర్తి స్థాయిలో ప్రమాదాలను అరికట్టే దిశగా చొరవ తీసుకోవడం లేదని జనం విమర్శిస్తున్నారు. ట్రాఫిక్ నియమాలపై జనంలో మరింత అవగాహన కల్పించాలని, మద్యం తాగి వాహనాలను నడిపితే కఠిన చర్యలు తీసుకోవాలని, ఇనుప ఖనిజ నిల్వలను తరలిస్తున్న తరుణంలో జాగ్రత్తలు పాటించాలని రోడ్డు అభివృద్ధి పనులు జరిగే చోట వాహనదారులకు మార్గ సూచికలు ఏర్పాటు చేయాలని, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

క్రిమినల్ చట్టాలపై సదస్సు


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పోలీస్ అధికారులు

హొసపేటె: విజయనగర జిల్లా ఎస్పీ శ్రీహరిబాబు ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నూతన క్రిమినల్ చట్టాలపై సదస్సు నిర్వహించారు. రిసోర్స్ పర్సన్లుగా రిటైర్డ్ డీజీపీ డాక్టర్ డీవీ గురుప్రసాద్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ పోలీసు అధికారులు, సిబ్బందికి ప్రతి ఏటా నూతన క్రిమినల్ చట్టాలపై వర్క్‌షాప్‌ల ఏర్పాటు ఎంతో అవసరమన్నారు. ఈ సందర్భంగా బళ్లారి జోన్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్ లోకేష్ కుమార్, శ్రీమూర్తి, జిల్లా పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఎదుగుదలకు ప్రతిభ సోపానం


విద్యార్థులను సన్మానిస్తున్న అధికారులు

రాయచూరు రూరల్: విద్యార్థుల ఎదుగుదలకు ప్రతిభ సోపానమని విరుపాక్షేశ్వర సహకార బ్యాంక్ సీఈఓ శంకరానంద పేర్కొన్నారు. ఆయన మంగళవారం దేవదుర్గ తాలూకా గబ్బూరు విరుపాక్షేశ్వర సహకార సంఘం ఏర్పాటు దశమానోత్సవాలను ప్రారంభించి మాట్లాడారు. సమాజంలో సేవ చేయాలనే తపన ప్రతి ఒక్కరిలో రావాలన్నారు. స్వార్థం వీడి నిస్వార్థంతో పని చేయాలన్నారు. పంచయ్య స్వామి మఠ, సూగూరేశ్ గౌడ, బసవరాజ్, సదాశివయ్య, అయ్యన గౌడ, జగదీష్, హంపయ్యలున్నారు.

ప్లేట్ బ్యాంక్ ప్రారంభం


కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

రాయచూరు రూరల్: నగరంలోని ప్రైవేట్ పాఠశాలలో ప్లేట్ బ్యాంక్‌ను బెంగళూరు అదమ్య చేతన సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభించారు. పేదలకు వివాహ, శుభ కార్యాల సమయంలో ఉచితంగా ప్లేట్‌లను అందించడానికి శ్రీకారం చుట్టినట్లు సంస్థ అధ్యక్షురాలు తేజస్విని వెల్లడించారు. ప్రజాదరణ పొందిన ఈ పథకం కింద 10 వేలకు పైగా ప్లేట్‌లను ఉచితంగా సరఫరా చేస్తామని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. పదాధికారులు కృష్ణమూర్తి, రాజేంద్ర, త్రివిక్రం జోషి, రమేష్, లాలాజీ, మీరా, ప్రహ్లాద్‌లున్నారు.

నాసిరకం పనులు తగదు


వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: నగరంలోని 28, 5, 30, 31వ వార్డుల్లో అధికారులు నాసిరకంగా పనులు చేపట్టడం తగదని కరవే ఆరోపించింది. మంగళవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనలో అధ్యక్షుడు ఖలీల్ పాషా మాట్లాడారు. వివిధ పథకాల కింద సిమెంట్ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం, ఇతరత్ర అభివృద్ధి పనులు చేపట్టినట్లు రికార్డుల్లో రాసుకొని కాంట్రాక్టర్లు పనులు చేయకున్నా రూ.4 కోట్ల మేర నిధులు డ్రా చేశారన్నారు. దీనిపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు చేపట్టాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

గంజాయి విక్రేతల అరెస్ట్


పట్టుబడిన నిందితులతో పోలీసులు

హుబ్లీ: టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న నిరాజ్, దావణగెరెకు చెందిన ఇద్దరితో పాటు మొత్తం 13 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు వారి నుంచి రూ.1.15 లక్షల విలువ చేసే 1.127 కేజీల గంజాయి, బైక్, మొబైల్‌ను సీజ్ చేశారు. కేసుకు సంబంధించి నవాబ్ మకాన్‌దార్, హజరత్ పటేల్, అహ్మద్‌ఖాన్ అలియాస్ ముక్క, పాండు రాయబాగి, శంకరనాగ్ జమక, ఆకాశ్ ఇరకల్, అజరుద్దీన్, వెంకటేష్ హేరూరు, ఎంజీ గౌస్ దరేఖాన్, ఆర్యన్ కోటి, నూర్ అహ్మద్ పటాన్, సర్ఫరాజ్ కొప్పళ, సికిందర్ మిర్జి అరెస్ట్ అయిన నిందితులు. నిందితుల నుంచి గంజాయితో పాటు రూ.6.300 నగదు, రెండు బైక్‌లు, నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విక్రయానికి మీరజ్ నుంచి వచ్చిన, దావణగెరె నుంచి కొనుగోలు కోసం వచ్చిన ఇద్దరు, నగరానికి చెందిన 11 మందిని అరెస్ట్ చేశారు. ఏసీపీ ఉమేష్ చిక్కమఠ తమకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు హుబ్లీ టౌన్ సీఐ ఎంఎం తహసీల్దార్ నేతృత్వంలోని బృందం ఈ కార్యాచరణ జరిపి నిందితులను అరెస్ట్ చేసింది. దాడిలో ఎస్‌ఐ మారుతీ బృందం పాల్గొంది.

అకాడమి చైర్‌పర్సన్‌కు సన్మానం


అయేషా ఖానంను అభినందించిన దృశ్యం

రాయచూరు రూరల్: కళ్యాణ కర్ణాటక ప్రాంతంలో పత్రికలకు ప్రాధాన్యత కల్పించాలని కర్ణాటక పత్రికా సంపాదకుల సంఘం అధ్యక్షుడు చెన్నబసవ డిమాండ్ చేశారు. సోమవారం రాత్రి బెంగళూరులో కర్ణాటక మాధ్యమ అకాడమి అధ్యక్షురాలు అయేషా ఖానంను మీరు కూడా కలబుర్గిలో పాత్రికేయురాలిగా పని చేసిన అనుభవంతో ఆ ప్రాంతంలో పత్రికలు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు, సలహాదారుడు ప్రభాకర్‌కు వివరించాలన్నారు. అనంతరం ఆమెను శాలువా కప్పి అభినందించారు. ఈ సందర్భంగా పద్మ, అనూప్ కుమార్, సుమితా దేశ్‌ముఖ్, ఖాన్ సాబ్‌లున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

రాయచూరు రూరల్: నగరంలోని టిప్పుసుల్తాన్ సర్కిల్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం చెందగా, ఓ వ్యక్తి గాయపడిన ఘటన సోమవారం జరిగింది. కోర్టు రోడ్డు నుంచి గంజ్ సర్కిల్ వైపు ద్విచక్ర వాహనంలో తండ్రి, కూతురు వెళుతుండగా గంజ్ సర్కిల్ నుంచి మాన్వికి వస్తున్న రేషన్ బియ్యం లారీ ఢీకొనడంతో అజాద్‌నగర్ చెన్నమ్మ(45) అక్కడికక్కడే మరణించింది. సతీష్ ప్రమాదం నుంచి గాయాలతో బయట పడ్డాడు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

స్టీరింగ్ రాడ్ విరిగి బస్సు బోల్తా



బోల్తా పడిన ఆర్టీసీ బస్సు, చికిత్స పొందుతున్న విద్యార్థిని, ఘటనాస్థలి వద్ద గుమికూడిన ప్రజలు

- 30 మందికి ప్రయాణికులకు గాయాలు

రాయచూరు రూరల్: ఆర్టీసీ బస్సు స్టీరింగ్ రాడ్ విరిగి అదుపు తప్పి బోల్తా పడి 30 మంది ప్రయాణికులు గాయపడిన ఘటన మంగళవారం తాలూకాలోని సగమకుంట వద్ద జరిగింది. కొర్విహాళ్ నుంచి బస్సు రాయచూరుకు వస్తుండగా సగమకుంట వద్ద ఎదురుగా వస్తున్న వాహనానికి సైడ్ ఇవ్వబోగా ప్రమాదం చోటు చేసుకుంది. పక్కనే ఉన్న గుంతలోకి బస్సు బోల్తా పడడంతో కొర్విహాళకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని సంగీతకు తీవ్ర గాయాలయ్యాయి. సంగీతను చికిత్స నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

భ్రూణ హత్యల కేసులో ఆస్పత్రిపై అధికారుల దాడి


ఆస్పత్రిపై దాడి చేసిన అధికారులు

హుబ్లీ: భ్రూణ హత్యలకు పాల్పడుతున్న ఆస్పత్రిపై ఆరోగ్య శాఖ అధికారులు దాడి చేసిన ఘటన మంగళవారం బెళగావి జిల్లా గోకాక్‌లో చోటు చేసుకుంది. గోకాక్‌లోని ఇక్రా ఆస్పత్రిపై కేపీఎంఈ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వివేక్ దొరె నేతృత్వంలో దాడి చేశారు. బెంగళూరు నుంచి వచ్చిన అధికారులు, బెళగావి జిల్లా డీహెచ్‌ఓ డాక్టర్ మహేష్ కోణితో పాటు తాలూకా ఆరోగ్య అధికారి దాడిలో పాల్గొన్నారు. ఏజెంట్ల ద్వారా డబ్బులు తీసుకొని వైద్యులు భ్రూణ హత్యలకు పాల్పడే వారు. ఏజెంట్ నుంచి డబ్బులు తీసుకొనే సమయంలో అధికారుల చేతికి ఓ వైద్యుడు చిక్కాడు. రూ.80 వేలు నగదు తీసుకుంటుండగా వైద్యుడు డాక్టర్ కుతేజ దండరిగి అధికారుల వలలో చిక్కారు. ఈ సందర్భంగా డాక్టర్ వివేక్ దొరె మాట్లాడుతూ తాము రహస్యంగా ఆకస్మికంగా దాడి జరిపామన్నారు. కనీసం బెంగళూరు నుంచి బయలుదేరేటప్పుడు డ్రైవర్‌కు కూడా ఫలానా చోటకు వెళుతున్నట్లు తెలియజేయలేదన్నారు. తొలుత ధార్వాడకు వెళదాం, ఆ పై దావణగెరె, తుమకూరుకు అంటూ మార్చి బెళగావికంటూ సమాచారం రట్టు కాకుండా ఈ దాడి పూర్తి చేశామన్నారు.

ఏడాదిన్నరగా 70 భ్రూణ హత్యలు

గత ఏడాదిన్నరగా ఈ ఇక్రా ఆస్పత్రిలో సుమారు 70 భ్రూణ హత్యలు చేసినట్లుగా తెలుస్తోందన్నారు. ఇది చట్టరీత్యా మహా నేరం అని తెలిసినా ఈ తప్పులకు పాల్పడ్డారన్నారు. ప్రస్తుతం స్కానింగ్ మిషన్ సీజ్ చేశామన్నారు. ఆ తర్వాత ఆస్పత్రిని కూడా సీజ్ చేస్తామని డీహెచ్‌ఓ డాక్టర్ మహేష్ కోణి తెలిపారు. ఇటీవల కిత్తూరులో నకిలీ వైద్యుడి తోట మీద దాడి చేసి మూడు భ్రూణాలను వెలికి తీశామన్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి జైలుకు పంపామన్నారు. తాజాగా గోకాక్ ఇక్రా ఆస్పత్రిపై దాడి చేశామన్నారు. ఇలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే అన్ని ఆస్పత్రులు, క్లినిక్‌లపై దాడి కొనసాగుతుందన్నారు. ముందు పథకం ప్రకారం ఏజెంట్ల ద్వారా వైద్యులు డబ్బులను డిమాండ్ చేసేవారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఆరోగ్య శాఖ అధికారులు దాడి చేయగా ఈ అక్రమాలు వెలుగు చూశాయన్నారు. ఇక్రా ఆస్పత్రిలో ముమ్మరంగా దాడులు జరిపి ఉన్నతాధికారుల సూచనల మేరకు సదరు ఆస్పత్రిని సీజ్ చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లుగా తెలిసింది.

అధికారులు బాధ్యతగా వ్యవహరించాలి

- జిల్లాధికారి దివాకర్ సూచన


మాట్లాడుతున్న జిల్లాధికారి దివాకర్

హొసపేటె: ప్రభుత్వ ప్రతి పథకాన్ని అమలు చేయాల్సిన కీలక బాధ్యత కలిగిన అధికారులు నిర్లక్ష్యం వీడి బాధ్యతగా వ్యవహరించాలని జిల్లాధికారి ఎంఎస్ దివాకర్ సూచించారు. జిల్లా పాలనా భవనంలోని ఆడిటోరియం హాలులో మంగళవారం జిల్లా స్థాయిలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య గతవారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల అధికారులు, జెడ్పీ సీఈఓతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రతి శాఖాధికారుల సహకారం, సమన్వయం ఎంతో అవసరమన్నారు. అధికారులను కూడా ప్రజాప్రతినిధుల మాదిరిగానే ప్రజాసేవకులుగా అర్థం చేసుకోవాలన్నారు. ఎగ్జిక్యూటివ్, లెజిస్లేచర్ ఇప్పుడు మరింత గుణాత్మకంగా పని చేయాలన్నారు. సమావేశంలో జిల్లా కమిషనర్లు, జెడ్పీ సీఈఓల పని తీరు గురించి సీఎం తెలియజేశారు. అందుకు అనుగుణంగా అధికారులంతా వ్యవహరించి జిల్లా యంత్రాంగానికి మరింత బలం చేకూర్చాలన్నారు. ప్రభుత్వ ఆదేశాన్ని పాటించడం లేదని, చేసే పనిపైన ఉదాసీనంగా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తేలితే వారిపై నిర్దాక్షిణ్యంగా క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జెడ్పీ సీఈఓ నోంగ్‌జోయ్ మహమ్మద్ అక్రమ్ షా, ఏడీసీ అనురాధ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గవాయి స్మారకం ఏర్పాటుకు వినతి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

రాయచూరు రూరల్: కర్ణాటక సంగీతాన్ని దక్షిణాది రాష్ట్రాలకు వ్యాపింప చేసిన పండిత్ పంచాక్షరి గవాయి స్మారకాన్ని ధార్వాడలో ఏర్పాటు చేయాలని డాక్టర్ పండిత్ పుట్టరాజ్ సేవా సమితి సంస్థాపక సంచాలకుడు చెన్నవీరస్వామి హిరేమఠ్ పేర్కొన్నారు. సోమవారం రాత్రి ధార్వాడ రంగాయణ భవనంలో గానయోగి పంచాక్షరి 80వ పుణ్యారాధన, గురుగానం, కవిగోష్ఠిలను ప్రారంభించి ఆయన మాట్లాడారు. సంగీతానికి మారు పేరు గవాయి అని కొనియాడారు. సమావేశంలో మృణాల్ జోషి, ప్రకాష్, దేశాయి సుమ, దేవిక, సురేష్, జయశ్రీలున్నారు.

సీనియర్ నాటక దర్శకుడు సదానంద సువర్ణ ఇకలేరు


సదానంద సువర్ణ(ఫైల్)

హుబ్లీ: సీనియర్ నాటక దర్శకులు, జాతీయ అవార్డు విజేత, చలనచిత్ర నిర్మాత, డైరెక్టర్ సదానంద సువర్ణ(93) మంగళూరులోని ప్రైవేట్ ఆస్పత్రిలో మంగళవారం పరమపదించారు. సదానంద మృతికి సీఎం సిద్ధరామయ్య తదితర ప్రముఖులు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. సదానంద కోరిక మేరకు ఆయన భౌతిక కాయాన్ని ఆస్పత్రికి దానం చేయడానికి కుటుంబ సభ్యులు అంగీకరించారు. కన్నడలో అత్యంత విజయవంతమైన నాటక దర్శకులుగా పోస్టుమార్టల్, ఉరుళు, గుడ్డదభూత, మళె నిల్లువ వరెగె తదితర ప్రసిద్ధ నాటకాలతో పాటు ఎన్నో సామాజిక అభిరుచి కలిగిన నాటకాలకు ముఖ్యంగా గిరీష్ కాసరవల్లి సమర్పణలో వచ్చిన గతశ్రద్ధ అనే కన్నడ సినిమాకు నిర్మాతగా ఈయన చిత్రరంగంలో ప్రవేశించారు. ఆ సినిమాకు అత్యుత్తమ సినిమాగా స్వర్ణకమల అవార్డు లభించింది. సదానంద లోటు భర్తీ చేయడం ఎవరివల్ల కాదని పలువురు ప్రముఖ కళాకారులు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

బాల గర్భిణి కేసులో యువకుడి అరెస్ట్

హుబ్లీ: మైనర్ బాలికతో లైంగిక సంబంధం పెట్టుకొని గర్భవతి కావడానికి కారకుడైన యువకుడిని నవనగర పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు.. హుబ్లీ తాలూకా రెవడిహాళ గ్రామానికి చెందిన శ్రీధర్ అనే యువకుడు సదరు బాలికతో స్నేహాన్ని పెంచుకొని లైంగిక సంబంధం ఏర్పరుచుకున్నాడు. బాలిక అస్వస్థతకు గురికావడంతో ఆమె తల్లిదండ్రులు డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లగా బాలిక నిండు గర్భిణి అని తేలింది. ఈరోజు ఉదయమే బాలిక మగ బిడ్డను ప్రసవించింది. ఈ విషయమై వైద్యులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు రంగంలోకి దిగి నిందితుడిని అరెస్ట్ చేశారు. ఘటనపై నవనగర పోలీసు స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదైంది.

ఆర్టికల్-371జే అమలుకు ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ప్రముఖులు, పోరాట సమితి కార్యకర్తలు

బళ్లారిఅర్బన్: కళ్యాణ కర్ణాటకలో విద్యా, ఉద్యోగాల పరంగా రిజర్వేషన్లు తదితర సౌకర్యాలు కల్పించే ఆర్టికల్-371జే సమర్థవంతంగా అమలు చేయాలని 13 ఏళ్లు గడిచినా ఈ కళ్యాణ కర్ణాటక ప్రాంత నిరుద్యోగులకు ఎటువంటి ప్రయోజనం కలగలేదని ఆ సంస్థ పోరాట సమితి నేత సిరిగేరి పన్నారాజ్ తెలిపారు. నగరంలో మంగళవారం ఆర్టికల్-371జే సమర్థవంతంగా అమలుకు పోరాట సమితి ప్రముఖులు చేపట్టిన ఆందోళన, ర్యాలీలో ఆయన మాట్లాడారు. ఆర్టికల్ అమలుకు ఇంకా ఎన్నేళ్లు కావాలని పాలకులను నిలదీశారు. వెనుకబడిన బళ్లారి, కొప్పళ, రాయచూరు, యాదగిరి, కలబుర్గి, బీదర్ జిల్లాల నిరుద్యోగులు, నిరుద్యోగులు, విద్యార్థులు సంక్షేమం కోసం ఆర్టికల్-371 జే ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత ప్రజలకు పూర్తి స్థాయి ప్రయోజనం చేకూరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఈ ఆర్టికల్‌ను లబ్ధిదారులకు మేలు కలిగేలా అన్ని పార్టీలు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా ఆర్టికల్ అమలుకు శ్రీకారం చుట్టిన కాంగ్రెస్ ఆధ్వర్యంలో సిద్దరామయ్య సర్కారు తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంగనకల్లు హేమంత్‌రాజ్, విజయ్‌కుమార్, ఆమ్ ఆద్మీ ప్రముఖులు మంజునాథ్, మీనళ్లి చంద్రశేఖర్, పద్మావతి, బసవరాజ్, యువరాజ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులతో పాటు పలు కాలేజీల విద్యార్థులు ఆందోళనలో పాల్గొన్నారు.

పశువులకు టీకాలు తప్పనిసరి


పశువులకు టీకాలు వేస్తున్న దృశ్యం

హొసపేటె: తాలూకాలోని నల్లాపురంలోని పశువైద్యశాలలో మంగళవారం పశువులకు చర్మ సంబంధ వ్యాధులు ప్రబలకుండా వైద్యులు ముందస్తు జాగ్రత్త చర్యగా టీకాలు వేశారు. పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ తాలూకాలో మొత్తం 2839 ఆవులకు వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు. ఈ నెల 25 వరకు నిర్వహించనున్న పశువులకు టీకాలు వేసే కార్యక్రమాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కళ్లెదుటే మట్టి దిబ్బ కూలి భర్త మృతి

హుబ్లీ: భారీ వర్షాల వల్ల కార్వార జిల్లా కిన్నారలో మట్టి దిబ్బ కూలడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. మృతుడిని కిన్నార గ్రామానికి చెందిన గురు(60)గా గుర్తించారు. ఉదయం 7 గంటల వేళ ఇంట్లో ఉండగా వెనుక ఉన్న గుట్ట ఉన్నఫళంగా కూలింది. ఈక్రమంలో విద్యుత్ లైన్‌తో పాటు భారీ వృక్షాలు ఇంటి మీద కూలాయి. భార్యతో పాటు చుట్టు పక్కల ఇళ్ల వారు గట్టిగా కేకలు వేస్తుండగానే భారీ వృక్షాలు కూలి ఇంటిపై పడ్డాయి. దీంతో ఇల్లు పూర్తిగా మట్టిలో కూరుకుపోయింది. అదృష్టవశాత్తు మృతుడి భార్య ఇంటి బయట ఉన్నందు వల్ల సురక్షితంగా బయట పడ్డారు. కాగా ఘటన విషయం తెలుసుకున్న స్థానికులు సదరు వ్యక్తి రక్షణ కోసం ఎంత ప్రయత్నించినా ఫలించలేదు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది స్థానికుల సహాయంతో రెండు గంటల పాటు శ్రమించి మృతదేహాన్ని వెలికి తీశారు. ఘటన స్థలాన్ని సంబంధిత తహసీల్దార్, కార్వార డీఎస్పీ పరిశీలించారు.

భారీ వర్షం.. రోడ్లు జలమయం


వాన నీటిలో వెళుతున్న వాహనాలు

రాయచూరు రూరల్: నగరంలో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఎక్కడ చూసినా రోడ్లు జలమయం అయ్యాయి. మున్నూరు వాడి, గాంధీ చౌక్, బసవన బావి చౌక్‌లో వర్షపు నీరు చొరబడ్డాయి. అంద్రూన్ కిల్లాలో వర్షపు నీరు నిలవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. నగరంలోని టిప్పుసుల్తాన్ రహదారిలోని దుకాణాల్లోకి నీరు చేరాయి. ఏ వీధిలో చూసినా మురుగు కాలువల నుంచి వస్తున్న నీరు దుర్వాసన వెదజల్లింది. మోకాలి లోతున నీరు ప్రవహించాయి. మురుగు కాలువల్లో చెత్తా చెదారాలు పేరుకొని వర్షపు నీరు ముందుకెళ్లక ప్రజలను పలు ఇబ్బందులకు గురి చేశాయి.


తొలగించిన డ్రైనేజీ చెత్త రోడ్డుపై వేసిన దృశ్యం

సామరస్యతకు ప్రతీక ముదుగల్ మొహర్రం


ముదుగల్‌లో పీర్లను ప్రతిష్ఠించిన దృశ్యం


పీర్లదేవుళ్లను దర్శించుకుంటున్న భక్తులు

రాయచూరు రూరల్: హిందూ ముస్లింల సామరస్యతకు ప్రతీకగా ముదుగల్ మొహర్రం వేడుకలు జరుగుతాయి. దేశ విదేశాల నుంచి భక్తులు తరలి వస్తారు. జిల్లాలో ఐదు రోజుల పాటు జరిగే మొహర్రం పండుగ వేడుకలో భాగంగా లింగసూగూరు తాలూకా ముదుగల్‌లో వెలిసిన ఆలంలను 300 ఏళ్ల క్రితం ఇరాన్ దేశం నుంచి ముదుగల్‌కు తీసుకొచ్చి పెట్టారనే ప్రతీతి ఉంది. మంగళవారం రాత్రి ఆలంల వద్ద అగ్నిగుండంలో దిగి భక్తులు మొక్కులను తీర్చుంటారు. మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల నుంచి భక్తులు పాల్గొంటారు. ఐదు రోజులు ప్రతి గ్రామంలో పిల్లల నుంచి పెద్దల వరకు ఇంటింటికెళ్లి భిక్షాటన చేసి ఆలంలకు కానుకలు ఇస్తారు. మరో వైపు హిందువులు ప్రత్యేకంగా నృత్యం చేస్తూ అందరి మనస్సులను చూరగొంటారు.

కోనాపురపేట పీర్లు ప్రత్యేకం

మాన్విలోని కోనాపురపేటలో వెలసిన పీర్లను హిందువులకు లభించిన హసేన్, హుసేన్‌లు పెద్ద ఎత్తున ఆచరిస్తారు. ముదుగల్, మాన్విలో రాజపుత్రులు ఎర్ర చక్కెరను చదివిస్తారు. హరిజన మహిళలు అగ్ని కాగడాలు పట్టుకోవడం, హూగార్‌లు పూలు ఇవ్వడం, కమ్మరులు మద్దు గుండ్లు తయారు చేయడం వంటి పనులు చేసి తమ భక్తిని చాటుకుంటారు. మొహర్రం పండుగను శాంతియుతంగా ఆచరించాలని జిల్లా ఎస్పీ పుట్టమాదయ్య పేర్కొన్నారు. లింగసూగూరు తాలూకా హట్టి, ముదుగల్, సింధనూరు తాలూకా క్యాంప్ సిరవారలో జరిగే పెద్ద పండుగ అని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులతో సహకరించాలన్నారు. హిందూ ముస్లింలు సోదరులుగా మెలిగి శాంతిని కాపాడాలని కోరారు.

బాగల్‌కోటె జిల్లాలో ఘోరం

- షెడ్డుకు దుండగుల నిప్పు
- తల్లీకూతురు సజీవ దహనం


మంటల్లో కాలిపోయిన షెడ్డు

సాక్షి బళ్లారి: బాగల్‌కోటె జిల్లాలో ఘోరం జరిగింది. మంగళవారం జిల్లాలోని ముధోళ తాలూకా బెళగలి గ్రామంలో తల్లీకూతురు రాత్రి నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని దుండగులు షెడ్డుపై పెట్రోల్ పోసి నిప్పంటించడంతో మంటలు దట్టంగా వ్యాపించి ఇద్దరు షెడ్డులోనే సజీవ దహనమయ్యారు. ఈ ఘటనలో జయిబాన బండారి(60), శబానా బండారి(20) అనే ఇద్దరు అక్కడికక్కడే మరణించగా, దస్తగిరి సాబ్ బండారి తీవ్రంగా గాయపడ్డారు. తల్లీకూతురు సజీవ దహనం కావడం ఆ ప్రాంతవాసులను కలిచివేసింది. విషయం తెలిసిన వెంటనే ఎస్పీ అమరనాసరెడ్డి ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అక్కడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై బాగల్‌కోటె పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.